اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 4 సంచికలు 5 & 6 డిశంబర్ 2012 & జనవరి 2013 రూ. 34/- (17 + 17)

special issue



చరిత్రలో వక్రీకరించి చెప్పబడిన

## జిజ్‌యా

కపట విశ్వాసుల మస్‌జిద్

అనేక గాయాలతో చేతిని కోల్పోయినా
60 సంవత్సరాల వయస్సులో పోరాడిన ధీరవనిత

హదీస్ విద్వాంసుడు కావడానికి
బుఖారీ(ర)వారు చెప్పిన
4 విషయాలు

మానవ జాతులు 70

జాగ్రత్త! తప్పుదారి పట్టిన జ్ఞాని పట్ల

ముహమ్మద్(స) వారిచే మార్చబడిన పేర్లు

هُوَ اللّٰهُ الَّذِی لَآ اِلٰهَ اِلَّا هُوَ اَلْمَلِکُ الْقُدُّوسُ السَّلٰمُ الْمُؤْمِنُ الْمُهَیْمِنُ
الْعَزِیْزُ الْجَبَّارُ الْمُتَکَبِّرُ سُبْحٰنَ اللّٰهِ عَمَّا یُشْرِکُونَ

సృష్టికర్త

الله

అల్లాహ్

అల్-ఖుద్దూసు

اَلْقُدُّوسُ

పరమ పవిత్రుడు

*The Pure*

అల్-మలికు

اَلْمَلِکُ

విశ్వసార్వభౌముడు

*The Sovereign*

ఆయనే అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన విశ్వ సార్వభౌముడు,
పరమ పవిత్రుడు, బలహీనతలకు అతీతుడు, శాంతిప్రదాత, సంరక్షకుడు,
సర్వశక్తివంతుడు, గొప్ప ప్రాబల్యం గలవాడు, సర్వాధికుడు,
వారు కల్పించే భాగస్వాములకు అల్లాహ్ అతీతుడు. (ఖుర్‌ఆన్ 59:23)

**He is ALLAH, other than whom there is no deity, the Sovereign, the Pure, the Perfect, the Bestower of Faith, the Overseer, the Exalted in Might, the Compeller, the Superior, Exalted is ALLAH above whatever they associate with Him (Qur'an 59:23)**

సాంకేతిక కారణాల దృష్ట్యా అక్టోబర్ మరియు నవంబర్, 2012 సంచికలు రద్దు చేయబడినవి. సంవత్సర చందా కట్టిన వారు నష్టపోకుండా వారి చందా డ్యూరేషన్ రెండు నెలలు పొడిగించ బడును.



# శాంతిబాట

మాసపత్రిక రూ.34/- (17+17)

సంపుటి 4 సంచికలు 5 & 6 డిశంబర్,12-జనవరి,13

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

www.saanthibaata.net

www.saanthibaata.com

Email:velugubaata@gmail.com

Cell : 9491103017



**ఎడిటర్:**

ఎమ్.డి. అతహరుల్లా

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్.డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**Editor**

Md. Athaharullah

**Advisory Board**

Dr. Salim Pasha

Dr. Nagireddi Srinivasa Rao

Md. Affan Omri



**Printed by**

Md. Athaharullah

**Published by**

Md. Athaharullah

**Owned by**

Velugubaata Educational Society

(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**

Saanthibaata Printing House,

19-1-447, Hanuman Statue Center

Samalkot - 533440

and

**Published at**

2-8-31, Kota Bazar,

Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,

Email: velugubaata@gmail.com

RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**

T. Srinivasa Rao

(Zakir)


## డిశంబర్ 2012 - జనవరి 2013

**ముహర్రమ్ - రబీ ఉల్ అవ్వల్** హి. 1434


3 **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 45 - 49 ఆయత్‌లు ...

12 **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం - ఉత్తమ లక్షణాలు - 3 ...

17 **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం- **ఉమ్మె అమ్మారహ్**(రజి)

23 **హదీస్ విజ్ఞానం :** బుఖారీ(ర)వారు ఓ యువకునికి ఇచ్చిన సలహా ...

27 **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర :** తబూక్ దండయాత్ర ...

32 **జిజ్‌యహ్ పన్ను గురించి వాస్తవాలు**

37 **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

39 **ముస్లిమ్ మహిళ :** వలీమా ...

47 **జిన్నులు మరియు చేతబడి :** కీడు కలిగించే కన్ను ...

53 **మస్‌జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు - 3 :** కపట విశ్వాసుల మస్‌జిద్ (మస్‌జిదె దిరార్)

57 **పరిపూర్ణమైన ధర్మం**



**సంవత్సర చందా : రూ. 200/-**

(వివరాలకు పేజీ నెం. 16 చూడండి)

పోస్టాఫీసు నుండి M.O. ద్వారా సంవత్సర చందా చెల్లించవచ్చు లేదా SBI ఎకౌంట్‌లో డిపాజిట్ చేయడం ద్వారా చందా చెల్లించవచ్చు

M.O. (మనీయార్డర్) పంపినా లేక బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేసినా, వెంటనే ఫోన్ చేసి తెలియజేయ వలసిందిగా కోరుతున్నాము. సెల్ నెం. 9491103017 మరియు మీ పూర్తి ఎడ్రస్‌ను ఇదే నంబర్‌కి SMS చేయండి

మీ ఎడ్రస్ మారినా లేక ఫోన్ నంబర్ మారినా మీరు కాల్ చేయవలసిన నంబర్ :

Cell : 9491103017 (డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు, *M.Sc.,Ph.D.* / ముహమ్మద్ అబ్దుల్ కరీమ్ )

ప్రతీరోజూ మధ్యాహ్నం 3 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు

ప్రచురించిన విషయాలపై సద్విమర్శలు గాని, అభిప్రాయాలు గాని ఫోన్‌లో తెలియజేయవద్దని మనవి చేస్తున్నాము. వాటిని మీ పూర్తి ఎడ్రస్‌తో సహా లెటర్‌లో వ్రాసి పంపండి. (పేజీ 63 చూడండి)

Velugubaata Educational Society, D.No. 2-8-31, Kota Bazar, Samalkot - 533440, East Godavari District

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# ప్రజలు భయపడటం లేదు

ఓ కథ ముగిసింది. ప్రళయం 2012 అంటూ ప్రజలను భయాందోళనకు గురి చేయాలని చేసిన ఓ ప్రయత్నం ఘోరంగా విఫలమైంది. ప్రళయం డేట్ ఎక్స్‌పైర్ అయిపోయింది. **ప్రళయ భయం! ప్రాణ భయం!** ప్రాణాలు కేవలం ప్రళయం వల్లనే పోవడం లేదు కదా! ఇప్పుడు ఈ క్షణంలో ప్రపంచంలో అనారోగ్యాల వలన మరియు ప్రమాదాల వలన కొన్ని వేల మంది చనిపోయి ఉండవచ్చు. ప్రతీరోజూ ఎందరో పుడతారు. మరెందరో చనిపోతారు. ఏ క్షణంలోనైనా చావు ముంచుకు రావచ్చు. ఈ విషయం అందరికీ తెలుసు. అయినా సరే ప్రతీ క్షణం భయంభయంగా ఎవరూ బ్రతకడం లేదు కదా! ప్రత్యేకంగా ఒక మీడియా అని చెప్పనవసరం లేదు, **ప్రతీవారికి సంచలనం కావాలి.** ఈ ప్రళయం విషయంలో ఎన్నో కథనాలు వెలువడ్డాయి. అంతా వ్యాపారమయిపోయింది. కొందరు కరపత్రాలు ప్రింట్ చేయిస్తే, మరికొందరు స్టేజ్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేశారు. ప్రసంగీకులు మైకులను దడదడలాడించేసారు. ఈ ప్రళయం పేరు చెప్పి కాసులతో జేబులు నింపుకున్నవారు ఎందరో!

**నిజానికి ఎవరూ భయపడలేదనే చెప్పవచ్చు**. భయాన్ని కూడా ఒక ఫ్యాషన్‌గా నటించేవారున్నారు. ఇటువంటి సందర్భాలలో నిజంగా భయాన్ని అనుభూతి చెందే వారెవరైనా ఉండి ఉంటే వారే పాపభీతిగలవారు. కొంతైనా పాపపరిహారం అవుతుందని పేదలకు దానాలు విరివిగా ఇచ్చి ఉండేవారు. అయితే అటువంటివి జరిగినట్లు సమాచారం లేదు. హెచ్చరికలకు ప్రజలు భయపడటం లేదు. ఏదైనా అనుభవం లోకి వచ్చాకనో లేదా తన వరకూ వచ్చాక మాత్రమే భయపడుతున్నారు.

"లంగ్ కాన్సర్ వస్తుందిరా బాబూ! చచ్చిపోతావురా నాయనా!" అని శ్రేయోభిలాషులు ఏడుస్తూ ఎంత ప్రాధేయపడినా సరే, కేన్సర్ వలన చనిపోయినవారి వృత్తాంతాలను సాక్ష్యాలుగా చూపినా సరే, ఉఫ్‌ఉఫ్‌మంటూ పొగలు వదిలే ధూమపాన ప్రియులు ఎందరో ఉన్నారు. ఆ కాన్సర్ వచ్చాక చూద్దాంలే అని నిర్లక్ష్యంగా స్పందిస్తారు. నిజంగా ఆ కాన్సర్ వచ్చి, వ్యాధి నిర్ధారణ రిపోర్ట్‌లు చూసిన తరువాత భోరుమంటారు. తమని ఎలాగైనా బ్రతికించమని విలవిలలాడతారు. తమ సృష్టికర్త ఆదేశాలను నిర్లక్ష్యం చేసి, అహంకారం వహించిన ఎన్నో జాతులు నాశనమై కాలగర్భంలో కలిసిపోయాయి. వారు ఊహించని విధంగా వారిపై అమాంతంగా అల్లాహ్ ఆగ్రహం విరుచుకు పడింది. ఎలా ఉన్నవారు అలాగే మిగిలిపోయారు నిర్జీవంగా. అల్లాహ్ తన ప్రవక్తల ద్వారా ముందుగానే వారిని హెచ్చరించారు. సన్మార్గంలో ఉన్నవారు అల్లాహ్ కారుణ్యంచే తప్పించబడ్డారు. మిగిలిన వారు నాశనం అయ్యారు.

ప్రళయం పర్యవసానం ఏమిటి? ఏదీ మిగలదు అంతా శూన్యమైపోతుంది. సృష్టి అంతమౌతుంది. పరలోక జీవితం మరియు శాశ్వత జీవితం ప్రారంభమౌతుంది. శాశ్వత స్వర్గం లేదా శాశ్వత నరకం అనే రెండింటిలో ఏదో ఒకటి ప్రతి మనిషికీ లభిస్తుంది. ఈ రెండింటిలో ఏ జీవితం కేటాయించబడేది పునరుత్థాన దినము నాడు అల్లాహ్ ఇచ్చే తీర్పుపై ఆధారపడి ఉంటుంది. ఈ తీర్పుదినం కోసం ఖుర్ఆన్‌లో ప్రారంభపు సూరహ్ నుండి దాదాపు చివరి వరకూ ప్రస్తావించబడుతూనే ఉంటుంది. ఇహలోక జీవితంలో పరీక్షకు ఫలితం ఆ రోజున తెలియపరచ బడుతుంది.

ఖుర్ఆన్ యొక్క మొట్టమొదటి సూరహ్‌లోని 7 ఆయత్‌లలో ఒక ఆయత్ - **'మాలికి యౌమిద్దీన్'** (తీర్పు దినానికి యజమాని)

ముందుగా చెప్పుకున్నట్లు తీర్పు దినం అనేది ప్రళయం సంభవించాక వస్తుంది. ప్రళయం గురించి ఖుర్ఆన్ చాలా స్పష్టంగా చెప్పింది. ప్రళయం సమీపించినప్పుడు ప్రపంచంలో సంభవించే ఎన్నో సంఘటనల గురించి ముహమ్మద్(స)వారు 1400 సంవత్సరాల క్రితమే తెలియజేశారు. ఇవన్నీ చాలా స్పష్టంగా హదీస్ గ్రంథాలలో ఉన్నాయి. కాబట్టి ఖుర్ఆన్ మరియు హదీస్‌ల పట్ల అవగాహన కలిగినవారికి **ఈ 2012 ప్రళయం బూటకమని స్పష్టంగా అర్థమౌతుంది.** వీటికోసం ప్రత్యేకంగా ప్రసంగాలు కూడా అవసరం లేదు.

సాధారణంగా మనిషి స్వయంగా తన చావు గురించి ఆలోచన వచ్చినప్పుడు ఆందోళనకు గురి అవుతాడు. కాని ఒక మోమిన్ (విశ్వాసి)కి చావు ఎల్లప్పుడూ జ్ఞాపకం ఉంటుంది. అయినా సరే అతడు ఆందోళనకు గురికాడు. బదులుగా చావును జ్ఞాపకం చేసుకున్న ప్రతీసారి అతని ఆలోచన మంచిపనుల వైపు మరలుతుంది. మంచి జీవితాన్ని, సంతోషమయమైన జీవితాన్ని గడిపే అవకాశం కల్పిస్తుంది.

ఇప్పటి ప్రజలు ప్రళయం గురించి భయపడకపోవచ్చు. కాని 1400 సంవత్సరాల క్రితం సన్మార్గంలో జీవితాన్ని గడిపిన మోమిన్లు ఎందరో భయపడ్డారు. వారి జీవిత కాలంలో ప్రళయం రాదని వారికి స్పష్టంగా తెలుసు. అయినా సరే వారు భయపడ్డారు. తీర్పుదినం నాడు మంచి ఫలితం లభిస్తుందో లేదోననే భయం వారిది. తఖ్వా గలవారు సాఫల్యం పొందుతారు. 'తఖ్వా' అంటే అల్లాహ్ పట్ల భయం కలిగి ఉండటం. ఈ భయం ఎందుకంటే తనపై అల్లాహ్ చూపే కారుణ్యం కోల్పోవలసి వస్తుందేమోననే భయం. కాబట్టి అల్లాహ్ పట్ల భయం గలవాడు ఇక దేనికీ భయపడడు. అయితే జ్ఞానం గలవారు మాత్రమే అల్లాహ్‌కు భయపడతారని అల్లాహుతాలా ఖుర్ఆన్‌లో తెలియజేస్తున్నారు. కాబట్టి ఖుర్ఆన్ మరియు హదీస్‌లను బాగా అధ్యయనం చేసి జ్ఞానాన్ని పొందాలి. ఐశ్వర్యం మరియు సంతానం పట్ల ప్రేమ ఒక మనిషిని భయపెడుతుంది, వాటిని కోల్పోవలసి వస్తుందేమోనని.

**"నా జాతి ప్రజలారా! నిశ్చయంగా, ఈ ఇహలోక జీవిత సుఖం తాత్కాలికమైనదే మరియు నిశ్చయంగా, పరలోకమే శాశ్వతమైన నివాస స్థలము.**
(ఖుర్ఆన్ 40:39)

అల్లాహ్ పట్ల భయం అన్ని భయాలను దూరం చేస్తుంది. ఇహలోకంలో ఏది కోల్పోయినా ఏమీ కాదు. కాని అల్లాహ్ కారుణ్యం మాత్రం కోల్పోకూడదు. మనందరినీ ఆయన కారుణ్య ఛాయలోకి తీసుకోమని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము (ఆమీన్)

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

26

## ఖుర్'ఆన్ తఫ్సీర్

البقرة

**2. సూరహ్ అల్-బఖరా**

( గత సంచిక తరువాయి )

### 45వ ఆయత్ నుండి 49వ ఆయత్ వరకూ

**మరియు సహనం మరియు సలాత్ ద్వారా (అల్లాహ్) సహాయాన్ని అర్థించండి. మరియు నిశ్చయంగా, అది వినమ్రులైన వారికి తప్ప, (ఇతరులకు) ఎంతో కష్టతరమైనది. అలాంటివారు తాము, తమ ప్రభువును నిశ్చయంగా, కలుసు కోవలసి ఉందనీ మరియు ఆయన వైపునకే మరలి పోవలసి ఉందనీ నమ్ముతారు. (ఖుర్'ఆన్ 2:45-46)**

సహనాన్ని మరియు సలాత్‌ను ఉపయోగించి ఈ లోకంలో మరియు పరలోకంలో మంచిని సంపాదించుకోమని తన దాసులను అల్లాహుతాలా ఆదేశించారు.

ముఖాతిల్ బిన్ హయ్యాన్ చెప్పారు. ఈ ఆయత్‌కి అర్థం:

> "**ఉపయోగించుకోండి సహనాన్ని మరియు విధిగా చేసే సలాత్‌ని పరలోకాన్ని అర్థించడంలో.** (ఇక్కడ) సహనం అంటే, వారు చెప్పారు దాని అర్థం ఉపవాసం (సౌమ్)." ఇటువంటివే ముజాహిద్ తెలియజేశారు. ఖుర్తుబీ మరియు ఇతర విద్వాంసులు వ్యాఖ్యానించారు, "**అందుకే 'రమదాన్'ను సహనం యొక్క మాసం అంటారు, హదీస్‌లలో ప్రస్తావించబడినట్లుగా.**"

ఇబ్నె అబీ హాతిమ్ ఉల్లేఖించారు, ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) చెప్పారు, 'రెండు రకాల సహనాలు ఉన్నాయి. **మంచి సహనం** - విపత్తు పడినప్పుడు (వహించే సహనం) మరియు **ఉత్తమ సహనం** - అల్లాహ్ నిషేధించిన వాటిని తప్పించుకోవడంలో (వహించే సహనం) (తఫ్సీర్ ఇబ్నె కసీర్). హసన్ అల్-బస్రీ ఇదే విధంగా చెప్పారని ఇబ్నె అబీహాతిమ్ చెప్పారు.

సలాత్ అనేది సహాయం కోరడానికి ఉత్తమ సాధనం మరియు స్థిరంగా అల్లాహ్ ఆదేశాలకు అంటిపెట్టుకుని ఉండడం, అల్లాహ్ క్రింది ఆయత్‌లో చెప్పినట్లుగా :

**(ఓ ప్రవక్తా!) నీపై వహీ** (దివ్యజ్ఞానం) **ద్వారా అవతరింప జేయబడిన గ్రంథాన్ని చదివి వినిపించు మరియు సలాత్‌ను స్థాపించు. నిశ్చయంగా, సలాత్ అసహ్యకరమైన పనుల నుండి మరియు అధర్మమైన పనుల నుండి నిషేధిస్తుంది. మరియు అల్లాహ్ ధ్యానమే** (అన్నిటికంటే) **గొప్పది. మరియు మీరు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు.** (ఖుర్'ఆన్ 29:45)

మనం ఇప్పుడు వివరణ చెప్పుకుంటున్న ఆయత్ (2:45)లో రెండు ముఖ్యాంశాలున్నాయి. 1. సహనం 2. వినమ్రులైనవారికి తప్ప

సబ్ర్ అనగా 'సహనం'గా తెలుగులో అనువదించారు. ఈ అనువాదం తప్పు కాదు. కాని ఈ అనువాదం చాలా బలహీనమైనది. తఫ్సీర్ గ్రంథాలలో ఇవ్వబడిన వివరణను బట్టి 'సబ్ర్' అనే అరబీ పదం మూడు అర్థాలను సూచిస్తుంది :

సబ్ర్

***1. బాధను మరియు దురదృష్టాన్ని సహనంతో భరించడం.***

***2. పాపం చేయడం నుండి స్వయంగా నిగ్రహించుకోవడం.***

***3. అల్లాహ్‌కు స్థిరంగా విధేయత చూపడం.***

అర్థాలు

ఇక రెండవ అంశం - 'వినమ్రులైన వారికి తప్ప' - అంటే ఈ వినమ్రత హృదయానికి సంబంధించినది (దానినే అరబీలో **ఖుషూ** అంటారు). ఈ వినమ్రత కలిగియున్న వారినే **'ఖాషిఈన్'** అంటారు.

ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల ప్రకారం ఈ వినమ్రత (ఖుషూ) అది హృదయం యొక్క ప్రశాంతత మరియు అణుకువలను సూచిస్తుంది. ఈ అణుకువ ఏ విధంగా కలుగుతుందంటే అల్లాహ్ యొక్క సార్వభౌమాధికారాన్ని తెలుసుకోవడం ద్వారా మాత్రమే కాకుండా మనిషి తన అల్పస్థాయిని కూడా తెలుసు కోవడం ద్వారా ఏర్పడుతుంది.

ఎప్పుడైతే ఈ లక్షణం ఒక వ్యక్తికి అలవడిందో, అప్పుడు ఆ లక్షణం

ఆ వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక సాఫల్యతను సూచిస్తుంది. అల్లాహ్‌కు విధేయత చూపడం మరియు ఆయనకు స్వయం సమర్పణ చేసుకోవడం ఆ లక్షణం ద్వారా అప్పుడు అతనికి సులభమౌతుంది. మరియు అది అతనికి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. హృదయంలో వినమ్రత కలిగియున్న వారికి, వారి బాహ్యాతీరులో కూడా ఆ వినమ్రత సాధారణంగా ప్రతిబింబిస్తుంది. అటువంటి వ్యక్తి ఎల్లప్పుడూ క్రమశిక్షణ కలిగిన వాడుగా మరియు సౌమ్యుడిగా ప్రవర్తిస్తాడు.

అయితే ఒక వ్యక్తికి, హృదయంలో నిజమైన వినమ్రత లేకపోయి నప్పటికీ, అది తనలో ఉన్నట్లుగా బాహ్యంగా దానిని వ్యక్తపరిస్తే అది 'ఖుషూ' అవ్వదు. ఒక యువకుడు తన తలను క్రిందికి వాల్చి కూర్చోవడాన్ని చూసి రెండవ ఖలీఫాయైన ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు అన్నారు : **"నీ తలపైకెత్తు! హృదయం యొక్క వినమ్రత హృదయంలో ఉంటుంది."**

ఇబ్రాహీమ్ నఖా'ఈ గారు చెప్పారు: హృదయపు వినమ్రత అంటే ముతక బట్టలు ధరించడం, నాసిరకపు ఆహారం తినడం మరియు తలను క్రిందికి వాల్చడం కాదు. వినమ్రత అనేది **సత్యానికి సంబంధించిన వ్యవహారాలలో పై స్థాయి వాళ్ళ పట్ల మరియు క్రింది స్థాయి వారిపట్ల ఒకే విధంగా వ్యవహరించడం.** మరియు హృదయాన్ని ఫ్రీగా ఉంచడం, దానిని పూర్తిగా అల్లాహ్‌కు మరియు అల్లాహ్ ఏదైతే విధిగా చేశారో దాని ఆచరణకు అంకితం కావించడం.

పైన వివరించిన ఇబ్రాహీమ్ నఖా'ఈ గారి మాటలను సరిగ్గా అర్థం చేసుకోవాలి. ముతకబట్టలు, నాసిరకపు ఆహారం నిరాడంబరతను సూచిస్తాయి. కేవలం అవి మాత్రమే హృదయంలోని వినమ్రతను సూచించవు అని చెప్పారు. ఆ నిరాడంబరతగల వారిని చూసి వారు వినమ్రతను బాహ్యంగా వ్యక్తపరచడానికే ఆ విధంగా చేస్తున్నారని భావించ కూడదు.

హసన్ అల్-బస్రీ గారు ఇలా చెప్పారు : **"ఖలీఫా ఉమర్(రజి) ఎప్పుడైనా ఆయన మాట్లాడినపుడు వినబడేటంత గట్టిగా మాట్లాడేవారు, ఎప్పుడైనా ఆయన నడిచినప్పుడు వేగంగా నడిచేవారు మరియు ఎప్పుడైనా ఆయన ఒక వ్యక్తిని కొట్టినప్పుడు బలంగా కొట్టేవారు. అయినప్పటికీ ఆయన నిస్సందేహంగా నిజమైన వినమ్రత కలిగిన వ్యక్తి."**

సలాత్ గురించి ముహమ్మద్(స)వారు చేసిన బోధనలు అనేకం ఉన్నాయి. సందర్భానికి సరిపోయేవాటిని ఇక్కడ క్లుప్తంగా జ్ఞాపకం చేసుకుందాము. సలాత్ (నమాజ్)కు సులభమైన అర్థం స్వీయ అణుకువ మరియు వినయం. ఒక వ్యక్తి చేసే సలాత్ (నమాజ్)లు ఆ వ్యక్తిని అనైతికత నుండి, చెడునుండి నిగ్రహించకపోతే, అతడు అల్లాహ్ నుండి చాలా చాలా దూరమై పోతాడు. అశ్రద్ధగా చేసే సలాత్ (నమాజ్) స్పష్టంగా మనిషిని చెడు కార్యాల నుండి నిగ్రహింప జేయదు మరియు దాని పర్యవసానంగా అటువంటి వ్యక్తి అల్లాహ్ నుండి బహు దూరంగా వెళ్ళిపోతాడు.

ము'ఆజ్ బిన్ జబల్ మరియు సుఫ్యాన్ శౌరి మరియు హసన్ అల్-బస్రీ ప్రకారం, ఖుషూ లేకుండా చేసిన సలాత్ (నమాజ్)కు విలువ లేదు (not valid). అయితే 'సలాత్'కు 'ఖుషూ' **షరతు కాదని** మరికొందరు ఇమామ్‌లు అభిప్రాయపడ్డారు. అయితే వీరు 'ఖుషూ' (హృదయపూర్వక వినమ్రత)ను సారంగా పరిగణించారు.

ఇంతవరకూ సహనం మరియు సలాత్(నమాజ్)ల గురించి చెప్పు కున్నాము. సలాత్ చేసే వారు తమ హృదయాలలో వినమ్రత కలిగి ఉండాలి. అల్లాహ్ యొక్క మహోన్నత గుణాలను మరియు సృష్టిపై ఆయనకున్న సార్వభౌమాధికారాన్ని మనం తెలుసుకోవడం ద్వారా మనలో వినమ్రత కలుగుతుంది. ఒక పెద్ద అధికారి ముందుగాని, రాజు ముందుగాని ఓ నిరుపేద ఎంతో వినయంగా నిలుచుంటాడు. ఆ రాజు యొక్క అధికారం కొంత కాలమే ఉంటుంది. అంతేకాకుండా అతని అధికారం కూడా కొంత ప్రాంతానికే పరిమితం.

కాని అల్లాహ్‌యే ఈ విశ్వాన్ని సృష్టించాడు. మరియు ఈ విశ్వంపై సర్వహక్కులు మరియు సర్వాధికారాలు ఆయనకే ఉన్నాయి. అంతే కాకుండా అనుక్షణం ఆయన నుండి అందే కారుణ్యం వలనే మనం జీవించగలుగు తున్నాము. కాబట్టి ఈ విషయాలపై అవగాహన కలిగినవారు సృష్టిలో ఎవ్వరికీ ఇవ్వనటు వంటి గౌరవం ఆయనకే ఇవ్వగలరు. ఆయన అనుమతి లేకుండా ఏదీ జరుగదు. ఆయన అనుగ్రహం లేకుండా మనం ఏమీ చేయలేము. మనం చాలా అల్పులం. కాబట్టి ఈ వాస్తవాలు మనల్ని ఆయన ముందు వినమ్రతతో తలవంచేలా చేస్తాయి. **అంతేకాకుండా వినమ్రతతో కూడిన సలాత్ మనల్ని చెడునుండి కాపాడుతుంది.**

దాని ఫలితంగా త్రాసులో మన పుణ్యఫలం పెరుగుతుంది. అంటే ఇహపరలోకాల్లో మనకు సలాత్ ఎంతో మేలు చేస్తుంది. **మనకు అనుక్షణం సహాయం అవసరం.** సహాయాన్ని అర్థించడానికి మనకు సలాత్ ఒక సాధనం. ఈ సలాత్‌కి తోడుగా **సహనం** జత అయినప్పుడు, అల్లాహ్ నుండి సహాయాన్ని అర్థిస్తే ఇన్షా అల్లాహ్ అది మనకు ఎంతో మేలు అవుతుంది. సహనం (సబ్ర్) అంటే ఏమిటో వ్యాసం ప్రారంభంలో చెప్పుకున్నాం.

**మనకు కష్టం కలిగినప్పుడు వెనువెంటనే అల్లాహ్ సహాయాన్ని అర్థిద్దాము. ఉపవాసం ఉండి వినమ్రతతో సలాత్ చేస్తూ అల్లాహ్‌ను సహాయానికై వేడుకుందాం.**

మనిషి తనకు అల్లాహ్ నుండి పొందిన అనుగ్రహాలను అర్థం చేసుకో గలిగితే, ఎల్లవేళలా అల్లాహ్‌కు కృతజ్ఞుడుగానే ఉంటాడు. అయితే పొందిన అనుగ్రహాలను మరచిపోయే కృతఘ్నులు కూడా ఉంటారు.

**ఓ ఇస్రాయీల్ సంతతివారలారా! నేను మీకు చేసిన మహోపకారాన్ని జ్ఞాపకం చేసుకోండి మరియు నేను నిశ్చయంగా, మిమ్మల్ని (మీ కాలంలో) సర్వలోకాలవారి కంటే అధికంగా ఆదరించాను.**
**(ఖుర్'ఆన్ 2:47)**

మహోపకారాన్ని జ్ఞాపకం చేసుకుంటే అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుని మరియు తద్వారా ఆయనకు విధేయత చూపుతారు. పై ఆయత్ ప్రవక్త(స)వారి కాలంలోని యూదుల నుద్దేశించి చెప్పబడింది. ఆ అనుగ్రహాన్ని వాస్తవానికి వారి పూర్వీకులు స్వీకరించినప్పటికీ, ఖుర్‌ఆన్ అవతరణ కాలంలోనున్న యూదుల నుద్దేశించి ఈ ఆయత్‌లో చెప్పబడింది. ఇక్కడ విషయం ఏమిటంటే ఒక వ్యక్తి ఓ ప్రత్యేక అనుగ్రహం పొందినప్పుడు, అతని సంతానం మరియు అతని సంతానానికి వారసులు కూడా దాని నుండి లభించిన ఉపకారాలను పంచుకుంటారు. ఆ భావంతోనే ఈ ఆయత్ యూదుల నుద్దేశించి చెప్పబడింది.

ఇస్రాయీలీయులకు 'సర్వలోకాలపై' అంటే వారికి కొన్ని నిర్దేశిత విషయాలలో ప్రాధాన్యత ఇవ్వబడింది లేక ఆ కాలంలోని మానవులలో అధిక శాతం వారి కంటే - ఉదాహరణకు, పూర్వపు ఇస్రాయీలీయుల సమకాలీనుల కంటే వారికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది.

**"మరియు వాస్తవానికి మాకు తెలిసి ఉండి కూడా మేము వారిని లోకంలో సర్వజనులపై ఎన్నుకున్నాము."** (ఖుర్‌ఆన్ 44:32)

**మరియు మూసా తన జాతి ప్రజలతో అన్నారు : "నా జాతి ప్రజలారా! అల్లాహ్ మీకు చేసిన అనుగ్రహాలను జ్ఞాపకం చేసుకోండి, ఆయన మీలో నుండి ప్రవక్తలను ఆవిర్భవింప జేశాడు మరియు మిమ్మల్ని సార్వభౌములుగా చేశాడు. మరియు ప్రపంచంలో ఎవరికీ ప్రసాదించని వాటిని మీకు ప్రసాదించాడు"** (ఖుర్‌ఆన్ 5:20)

అబూ జాఫర్ అర్-రాజి ఉల్లేఖించారు. రబీ బిన్ అనస్ చెప్పారు. అబూ అల్-'ఆలియహ్ చెప్పారు, అల్లాహ్ ప్రకటించిన ''**మరియు నేను మిమ్మల్ని సర్వలోకాల కంటే అధికంగా ఆదరించాను**'' అంటే రాజ్యాధికారం, సందేశహరులు మరియు వారికి అనుగ్రహించబడిన గ్రంథాలు ఆ కాలంలో ఉనికిలో ఉన్న ఇతర సామ్రాజ్యాలకి కాకుండా ఇస్రాయీలీయులకే ఇవ్వబడ్డాయి. ప్రతీ యుగం కొరకు ఒక జాతి ఉంటుంది. ఇదే విధంగా ముజాహిద్, రబీ బిన్ అనస్, ఖతాదహ్ మరియు ఇస్మా'ఈల్ బిన్ అబీ ఖాలిద్ చెప్పారు.

ఇస్రాయీలీయుల సంతతివారి కంటే ముహమ్మద్(స)వారి ఉమ్మత్ ఉత్తమమైనది. ఈ విషయం అల్లాహుతాలా ఖుర్‌ఆన్‌లో ఇలా చెప్పారు:

**"మీరే మానవజాతి కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించేవారు మరియు చెడును నిరోధించేవారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు. మరియు ఒకవేళ గ్రంథప్రజలు విశ్వసిస్తే, వారికే మేలై ఉండేది ....."** (ఖుర్‌ఆన్ 3:110)

ఎందుకు ముహమ్మద్(స)వారి ఉమ్మత్ ఉత్తమమైనదో, వారు ఏ పనులు చేయడం వలన ఉత్తములయ్యారో పై ఆయత్‌లో తెలుపబడింది. అయితే పై ఆయత్‌లో తెలిపిన పనులు ఏమీ చేయకపోయినా కేవలం ముస్లిమ్ కుటుంబంలో పుట్టినంత మాత్రాన వారు ముస్లిమ్ ఉమ్మత్‌లో చేరిపోరు. మరియు ఉత్తమ సమాజంలో సభ్యులయిపోరు.

ముస్‌నద్ మరియు సునన్ గ్రంథాలలో ఓ ఉల్లేఖనాన్ని తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో ప్రస్తావించారు. దాని ప్రకారం ముస్లిమ్ ఉమ్మత్ 70వ జాతి అవుతుంది. మరియు ఇదే చివరి జాతి. ఈ విషయానికి సంబంధించి కొన్ని హదీస్‌లను ఈ వ్యాసం చివరిలో అందించాము.

**మరియు ఆ దినమునకు భయపడండి, అప్పుడు ఒక వ్యక్తి మరొక వ్యక్తికి ఏ విధంగానూ ఉపయోగపడడు, మరియు అతని నుండి ఎట్టి సిఫారసూ అంగీకరించబడదు మరియు ఎలాంటి పరిహారం కూడా తీసుకోబడదు మరియు వారికెలాంటి సహాయం కూడా చేయబడదు. (ఖుర్‌ఆన్ 2:48)**

పై ఆయత్‌లో చెప్పబడిన 'దినం' అంటే తీర్పు దినం.

ఉదాహరణకు ఒకని ఆరాధనల పుణ్యఫలితం తగ్గితే, ఆ వెలితిని పూడ్చడానికి మరొకడు తన పుణ్యాన్ని ఇచ్చి అతనికి ఆ రోజు సహాయపడలేడు. అటువంటి అవకాశం ఎవరికీ ఉండదు. అల్లాహ్ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుని పుణ్యాన్ని పెంచుకునే అవకాశం ఇహలోకంలో ఉన్నంత వరకే ఉంటుంది.

ఆ తీర్పుదినం నాడు ఎవరికీ మరొకరి గురించి ఆలోచించే పరిస్థితి ఉండదు. క్రింది ఆయత్‌లలో చూడండి :

**"ఆ రోజు వారిలో ప్రతి మానవునికి తనను గురించి మాత్రమే చాలినంత చింత ఉంటుంది."** (ఖుర్‌ఆన్ 80:37)

**"మరియు బరువు మోసే వాడెవ్వడూ మరొకని బరువును మోయడు. మరియు ఒకవేళ బరువు మోసేవాడు, దానిని ఎత్తుకోవడానికి ఎవరినైనా పిలిచినా, దగ్గరి బంధువైనా దాని నుండి కొంతైనా ఎత్తుకోడు ..."** (ఖుర్‌ఆన్ 35:18)

**"ఓ మానవులారా! మీ ప్రభువునందే భయభక్తులు కలిగి ఉండండి మరియు ఆ దినానికి భయపడండి. ఏ తండ్రీ తన కుమారునికి నష్టపరిహారం చెల్లించలేడో మరియు ఏ కుమారుడు కూడా తన తండ్రికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేడో! ..."** (ఖుర్‌ఆన్ 31:33)

అవిశ్వాసుల పట్ల ఎటువంటి సిఫారసుగాని, పరిహారంగాని తీసుకోబడదని (2:48)లో చెప్పబడింది.

ఇదే విషయం ఖుర్‌ఆన్‌లో మరో చోట కూడా చెప్పబడింది :

**"అప్పుడు సిఫారసు చేసేవారి సిఫారసు, వారికే మాత్రం ఉపయోగపడదు"** (ఖుర్‌ఆన్ 74:48)

మరో ఆయత్‌లో కూడా ఈ విషయం వివరించబడింది.

**"మాకిప్పుడు సిఫారసు చేసేవారు ఎవ్వరూ లేరు. మరియు ఏ ప్రాణ స్నేహితుడు కూడా లేడు."** (ఖుర్‌ఆన్ 26:100-101)

ఇక శిక్షను తప్పించే పరిహారం విషయానికొస్తే, ఎలాంటి పరిహారం తీసుకోబడదని అల్లాహుతాలా స్పష్టంగా చెప్పారు. ఇదే విషయం ఖుర్‌ఆన్‌లో మరికొన్ని ఆయత్‌లలో కూడా చెప్పబడింది. ఉదాహరణకు క్రింది ఆయత్‌లు చూడండి :

నిశ్చయంగా, ఎవరైతే సత్య తిరస్కారులై, ఆ సత్య తిరస్కార స్థితిలోనే మృతి చెందుతారో! వారు **భూమి అంత బంగారం పాపపరిహారంగా ఇవ్వదలచినా అది అంగీకరించబడదు.** అలాంటి వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది. మరియు వారికి సహాయం చేసేవారు ఎవ్వరూ ఉండరు. (ఖుర్‌ఆన్ 3:91)

నిశ్చయంగా సత్యతిరస్కారులైనవారు తీర్పుదినాన గల శిక్ష నుండి తప్పించు కోవడానికి - **వారి వద్ద ఉంటే** - భూమిలో ఉన్న సమస్తాన్ని దానితోపాటు మరి అంత (ధనాన్ని) కూడా, విమోచన ధనంగా ఇవ్వగోరుతారు కాని అది స్వీకరించబడదు. మరియు వారికి అతి బాధాకరమైన శిక్ష ఉంటుంది. (ఖుర్‌ఆన్ 5:36)

కావున ఈ రోజు మీ నుండి ఏ విధమైన పరిహారం తీసుకోబడదు మరియు సత్య తిరస్కారుల నుండి కూడా తీసుకోబడదు. **మీ నివాసం నరకమే,** అదే మీ ఆశ్రయం. ఎంత చెడ్డ గమ్యస్థానం!" (ఖుర్‌ఆన్ 57:15)

అల్లాహ్ యొక్క సందేశహరుడు(స)ని విశ్వసించకుండా మరియు దేనితో అయితే ఆయన(స) పంపబడ్డారో దానిని అనుసరించని ప్రజలు, అవిశ్వాస మార్గంపైననే ఉండగా మరణం సంభవిస్తే, పునరుత్థాన దినమున వారు అల్లాహ్‌ను కలిసినప్పుడు, వారి కుటుంబ వంశావళి మరియు/లేక వారి గురువుల సిఫారసు వారికి ఎంతమాత్రం సహాయపడవు. పరిహారంగా భూమి అంత బంగారాన్ని ఇచ్చినా స్వీకరించబడదని అల్లాహ్ చెప్పారు. **ఆ విధంగా పరిహారం చెల్లించడం ఎవరికీ సాధ్యం కాదు.** మరణించిన తరువాత తమతో పాటు ఏ ఐశ్వర్యాన్ని ఎవరూ తీసుకెళ్ళ లేరు. అంటే వారికి సహాయం అసంభవమని అర్థమౌతుంది.

భూమి అంత బంగారం అని చెప్పడం ద్వారా ఆ పని అసంభవం అని తెలియజేయడాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ఇహలోక జీవితంలో మనిషి ఐశ్వర్యం కోసం ఎంత తహతహలాడుతున్నాడో అందరికీ తెలిసిన విషయమే! దానికి ఒక హద్దు అంటూ లేకుండా పోయింది. వందల కోట్ల ఆస్తి సంపాదించిన వ్యక్తి వేలకోట్ల కోసం, వేల కోట్లు సంపాదించిన వ్యక్తి లక్షల కోట్ల కోసం పరితపిస్తున్నాడు. ఒక మనిషి లేదా ఒక కుటుంబం సుఖంగా బ్రతకడానికి ఇంత అవసరమా? ఒక కుటుంబం మోసాల ద్వారా గాని, మరే విధమైన రూపంలోనైనా జీవితాంతం విశ్రాంతి లేకుండా సంపాదించినా, వారు అంతా కలిసి భూమి అంత బంగారానికి విలువ చేసేటంత సంపాదించ లేరు. అది సంపాదించు కోలేకపోయినా సరే, కనీసం విశ్రాంతి లేకుండా సంపాదించిన ఐశ్వర్యాన్ని పూర్తిగా ఇచ్చివేసి నరకం నుండి తప్పించుకోవాలని అనుకున్నప్పటికీ, అది వారికి ఎంత మాత్రం సాధ్యం కాదు. అంటే **వారి కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరు ఐపోయింది.** శాశ్వత స్వర్గానికి బదులు శాశ్వత నరకాన్ని పొందవలసి వస్తుంది. మరో ఆయత్‌లో అల్లాహుతాలా ఇలా తెలియజేశారు :

**"ఓ విశ్వాసులారా! ఏ బేరంగానీ, స్నేహంగానీ, సిఫారసుగానీ పనికిరాని దినం రాకముందే, మేము మీకు ప్రసాదించిన జీవనోపాధి నుండి ఖర్చు పెట్టండి ..."** (ఖుర్‌ఆన్ 2:254)

ఇబ్రాహీమ్(అ)వారు విగ్రహారాధకుడైన తన తండ్రిని క్షమించమని అల్లాహుతాలాకు చేసుకున్న వేడుకోలు తిరస్కరించబడింది. క్రిందటి సంచికలో 30వ పేజీలో ఓ హదీస్ ద్వారా ఈ విషయాన్ని ప్రచురించాము. ఆయన తండ్రి నరకంలోకి విసిరివేయబడ్డాడు.

ముహమ్మద్(స)వారు తన తండ్రిగారి గురించి ఇలా చెప్పారు :

అనస్(రజి)వారి ఉల్లేఖనం. ఒక వ్యక్తి అడిగాడు : "ఓ రసూలల్లాహ్ (స)! నా తండ్రి ఎక్కడున్నారు?" ఆయన(స) చెప్పారు: "నీ తండ్రి నరకాగ్నిలో ఉన్నాడు." అతడు మరలినప్పుడు ఆయన(స) చెప్పారు: **"నా తండ్రి మరియు నీ తండ్రి నరకాగ్నిలో ఉన్నారు."** (అబూదావూద్, సహీహ్, 4718, పుస్తకం 39, అధ్యా.17, స. 5)

ఇప్పటికైనా మనం గ్రహించాలి. అల్లాహ్ తప్ప మనకు ఎవరూ సహాయం చేయలేరని. మన గురించి రికమెండ్ చేసి నరకం నుండి తప్పించ లేరని, అల్లాహ్ తప్ప మరొకరు రక్షించగలరనుకోవడం మన భ్రమ తప్ప మరేమీ కాదు. **విశ్వసించి ముహమ్మద్(స)వారి ఉమ్మత్‌లో ఉంటే అంతిమ ప్రవక్తయైన ముహమ్మద్(స)వారి సిఫారసు మనకు ఉంటుంది, ఇన్షా అల్లాహ్ అదేమనకు మేలు చేస్తుంది.**

**మరియు ఫిర్‌ఔన్ జాతివారి (బానిసత్వం) నుండి మేము మీకు విముక్తి కలిగించిన సందర్భాన్ని (జ్ఞాపకం చేసుకోండి). వారు మిమ్మల్ని ఘోరహింసకు గురిచేస్తూ ఉండేవారు. మీ కుమారులను వధించి, మీ స్త్రీలను సజీవులుగా విడిచి పెట్టేవారు. మరియు ఇందులో మీ ప్రభువు తరపునుండి మీకు గొప్ప పరీక్ష ఉండింది. (ఖుర్‌ఆన్ 2:49)**

ఈ ఆయత్ కూడా యూదుల నుద్దేశించి చెప్పబడినదే. శపించబడిన ఫిర్‌ఔన్‌కు కలవచ్చిన తరువాత లభించిన అనుగ్రహం గురించి పై ఆయత్‌లో ప్రస్తావించ బడింది. ఆ కలలో అతడు బైతుల్ మఖ్దిస్ నుండి వెలువడుతున్న అగ్నిని చూసాడు మరియు ఆ అగ్ని ఈజిప్టులోని కోప్టిక్స్ ఇండ్లలోకి ప్రవేశించింది. కాని ఆ అగ్ని ఇస్రా'ఈల్ సంతానాన్ని మినహాయించింది. ఇది కూడా చెప్పబడింది, ఫిర్‌ఔన్ పరివారంలో కొందరు చెప్పారని, అదేమిటంటే ఇస్రా'ఈల్ సంతతి వారిలోనుండి ఓ వ్యక్తి ఉద్భవిస్తాడని, ఆయన వారి కొరకు ఓ రాజ్యాన్ని స్థాపిస్తాడని. ఆ

**50 ఆయత్ నుండి 59 ఆయత్ వరకూ**

50. మరియు మేము మీ కొరకు సముద్రాన్ని చీల్చి మిమ్మల్ని రక్షించినపుడు మీరు చూస్తూ ఉండగనే ఫిర్'ఔన్ జాతివారిని ముంచివేశాము.

51. మరియు మేము మూసాను నలభై రాత్రుల వాగ్దానం చేసి (పిలిచినపుడు), మీరు అతను లేకపోవడం చూసి, ఆవుదూడను (ఆరాధ్య దైవంగా) చేసుకున్నారు. మరియు మీరు దుర్మార్గులయ్యారు.

52.అయినప్పటికీ మీరు కృతజ్ఞులు అవుతారేమోనని మేము మిమ్మల్ని మన్నించాము.

53.మరియు (జ్ఞాపకం చేసుకోండి!) మీరు సన్మార్గులు అవుతారేమో నని మేము మూసాకు గ్రంథాన్ని మరియు ఫుర్ఖాన్ (సత్యాన్ని అసత్యం నుండి వేరుచేసేదానిని) ప్రసాదించాము.

54.మరియు (జ్ఞాపకం చేసుకోండి!) మూసా తన జాతివారితో ఇలా అన్న విషయాన్ని : "ఓ నా జాతి ప్రజలారా! నిశ్చయంగా, ఆవుదూడను (ఆరాధ్య దైవంగా) చేసుకుని మీకు మీరే అన్యాయం చేసుకున్నారు. కనుక పశ్చాత్తాపంతో క్షమాభిక్ష కొరకు మీ నిర్మాతను (సృష్టికర్తను) వేడుకోండి. మీలోని (ఘోర పాతకులను) సంహరించండి. ఇదే మీ కొరకు - మీ సృష్టికర్త దృష్టిలో - శ్రేష్ఠమైనది." ఆ తరువాత ఆయన (అల్లాహ్) మీ పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, అపార కరుణాప్రదాత.

| وَاَغْرَقْنَآ | فَاَنْجَيْنٰكُمْ | الْبَحْرَ | بِكُمُ | فَرَقْنَا | وَاِذْ |
|---|---|---|---|---|---|
| మరియు మేము ముంచివేశాము | మరియు మేము మిమ్మల్ని రక్షించాము | సముద్రం | మీ కొరకు | మరియు మేము చీల్చాము | మరియు అప్పుడు |

| وٰعَدْنَا | وَاِذْ | ٥٠ | تَنْظُرُوْنَ | وَاَنْتُمْ | اٰلَ فِرْعَوْنَ |
|---|---|---|---|---|---|
| మేము వాగ్దానం చేశాము | మరియు అప్పుడు | 50 | చూస్తున్నారు (మరియు మీరు చూస్తుండగా) | మరియు మీరుండగా | ఫిర్'ఔన్ ప్రజలు |

| وَاَنْتُمْ | مِنْۢ بَعْدِهٖ | الْعِجْلَ | اتَّخَذْتُمُ | ثُمَّ | لَيْلَةً | اَرْبَعِيْنَ | مُوْسٰى |
|---|---|---|---|---|---|---|---|
| మరియు మీరు ఉండగా | అతని తరువాత | ఆవుదూడ | మీరు తీసుకున్నారు | తరువాత | రాత్రులు | నలభై | మూసా |

| ذٰلِكَ | مِّنْۢ بَعْدِ | عَنْكُمْ | عَفَوْنَا | ثُمَّ | ٥١ | ظٰلِمُوْنَ |
|---|---|---|---|---|---|---|
| అది | తరువాత | మిమ్మల్ని | మేము క్షమించాము | తరువాత | 51 | దుర్మార్గులు |

| الْكِتٰبَ | مُوْسَى | اٰتَيْنَا | وَاِذْ | ٥٢ | تَشْكُرُوْنَ | لَعَلَّكُمْ |
|---|---|---|---|---|---|---|
| గ్రంథాన్ని | మూసా | మేము ఇచ్చాము | మరియు అప్పుడు | 52 | కృతజ్ఞులు | మీరు ఆ విధంగా కావచ్చు |

| قَالَ | وَاِذْ | ٥٣ | تَهْتَدُوْنَ | لَعَلَّكُمْ | وَالْفُرْقَانَ |
|---|---|---|---|---|---|
| చెప్పాడు | మరియు అప్పుడు | 53 | సన్మార్గులు అవుతారు | బహుశా మీరు | (సత్యాన్ని అసత్యం నుండి) వేరు చేసేదానిని |

| اَنْفُسَكُمْ | ظَلَمْتُمْ | اِنَّكُمْ | يٰقَوْمِ | لِقَوْمِهٖ | مُوْسٰى |
|---|---|---|---|---|---|
| మీకు మీరే స్వయంగా | మీరు అన్యాయం చేశారు | నిశ్చయంగా మీరు | ఓ నా జాతి ప్రజలారా! | తన జాతివారికి | మూసా |

| فَاقْتُلُوْٓا | بَارِئِكُمْ | اِلٰى | فَتُوْبُوْٓا | الْعِجْلَ | بِاتِّخَاذِكُمُ |
|---|---|---|---|---|---|
| మరియు చంపండి | మీ సృష్టికర్త | కు | కావున క్షమాభిక్షను వేడుకోండి | ఆవుదూడ | మీరు చేసుకోవడం ద్వారా |

| فَتَابَ | بَارِئِكُمْ | عِنْدَ | لَّكُمْ | خَيْرٌ | ذٰلِكُمْ | اَنْفُسَكُمْ |
|---|---|---|---|---|---|---|
| తరువాత ఆయన మరలాడు | మీ సృష్టికర్త | తో | మీ కొరకు | ఉత్తమం | మీకది | స్వయంగా మీలో మీరు |

55. మరియు అప్పుడు మీరు అతని (మూసా)తో అన్న మాటలు (జ్ఞప్తికి తెచ్చుకోండి): "ఓ మూసా! మేము అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూడనంత వరకు నిన్ను ఏమాత్రం విశ్వసించము." అదే సమయంలో మీరు చూస్తూ ఉండగానే ఒక భయంకరమైన పిడుగు మీపై విరుచుకుపడింది (మీరు చనిపోయారు).

56. ఆ తరువాత, మీరు కృతజ్ఞులై ఉంటారేమోనని - మీరు మరణించిన తరువాత - మిమ్మల్ని తిరిగి బ్రతికించాము.

57.మరియు మేము మీపై మేఘాల నీడను కల్పించాము మరియు మన్న మరియు సల్వాలను మీ కొరకు ఆహారంగా దింపాము. "మేము మీకు ప్రసాదించిన శుద్ధమైన వస్తువులను తినండి" అని అన్నాము. (కాని వారు మా ఆజ్ఞలను ఉల్లంఘించారు), అయినా వారు మాకు అపకారమేమీ చేయలేదు, పైగా వారు తమకు తామే అపకారం చేసుకున్నారు.

58.మరియు మేము మీతో : "ఈ నగరంలో ప్రవేశించండి. మరియు అక్కడున్న వస్తువులను మీ ఇష్టానుసారంగా, కావలిసినంత తినండి మరియు నగర ద్వారంలోకి వినమ్రులై తలవంచుతూ : "మమ్మల్ని క్షమించు" (హిత్తతున్) అంటూ ప్రవేశించండి, మేము మీ పాపాలను క్షమిస్తాము. మరియు మేము సజ్జనులను అత్యధికంగా కరుణిస్తాము." అని చెప్పిన (మాటలను జ్ఞప్తికి తెచ్చుకోండి)!

మీపై | నిశ్చయంగా ఆయన! | ఆయన | పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు | అపార కరుణా ప్రదాత | (54)

وَإِذْ قُلْتُمْ يَٰمُوسَىٰ لَن نُّؤْمِنَ لَكَ حَتَّىٰ نَرَى

మరియు అప్పుడు | మీరు అన్నారు | ఓ మూసా! | ఎన్నటికీ మేము నిన్ను విశ్వసించము | వరకు / మేము చూసేంత వరకూ

ٱللَّهَ جَهْرَةً فَأَخَذَتْكُمُ ٱلصَّٰعِقَةُ وَأَنتُمْ تَنظُرُونَ ﴿٥٥﴾

అల్లాహ్ | ప్రత్యక్షంగా | కావున మిమ్మల్ని తీసుకుంది | ఓ భయంకర పిడుగు | మరియు మీరు ఉండగా / చూస్తున్నారు / మరియు మీరు చూస్తూ ఉండగా | (55)

ثُمَّ بَعَثْنَٰكُم مِّنۢ بَعْدِ مَوْتِكُمْ لَعَلَّكُمْ تَشْكُرُونَ

తరువాత | మేము మిమ్మల్ని బ్రతికించాము | తరువాత | మీ మరణం | మీరు ఆ విధంగా కావచ్చు | కృతజ్ఞులు అవుతారు

﴿٥٦﴾ وَظَلَّلْنَا عَلَيْكُمُ ٱلْغَمَامَ وَأَنزَلْنَا عَلَيْكُمُ

(56) | మరియు మేము నీడ నిచ్చాము | మీపై | మేఘాలు | మరియు మేము క్రిందికి దింపాము | మీపై

ٱلْمَنَّ وَٱلسَّلْوَىٰ كُلُوا۟ مِن طَيِّبَٰتِ مَا

మన్న్ | మరియు సల్వా | తినండి | నుండి | మంచి వస్తువులు | ఏది

رَزَقْنَٰكُمْ وَمَا ظَلَمُونَا وَلَٰكِن كَانُوٓا۟ أَنفُسَهُمْ

మేము మీకు ప్రసాదించాము | మరియు కాదు | అన్యాయం చేసినవారు | కాని | వారే | స్వయంగా వారికి

يَظْلِمُونَ ﴿٥٧﴾ وَإِذْ قُلْنَا ٱدْخُلُوا۟ هَٰذِهِ ٱلْقَرْيَةَ فَكُلُوا۟

అన్యాయం చేసుకున్నారు | (57) | మరియు అప్పుడు | మేము చెప్పాము | ప్రవేశించండి | ఈ | పట్టణం | తరువాత తినండి

مِنْهَا حَيْثُ شِئْتُمْ رَغَدًا وَٱدْخُلُوا۟ ٱلْبَابَ سُجَّدًا

దాని నుండి | ఎక్కడైతే | మీరు కోరతారో | కావలిసినంత | మరియు ప్రవేశించండి | ద్వారం | సజ్దా చేస్తూ

| | | | | | |
|---|---|---|---|---|---|
| وَسَنَزِيْدُ | خَطٰيٰكُمْ ط | لَكُمْ | نَّغْفِرْ | حِطَّةٌ | وَّقُوْلُوْا |
| మరియు మేము అధికం చేస్తాము | మీ పాపాలను | మీ కొరకు | మేము క్షమిస్తాము | మమ్మల్ని క్షమించు | మరియు చెప్పండి |

| | | | | | |
|---|---|---|---|---|---|
| قَوْلًا | ظَلَمُوْا | الَّذِيْنَ | فَبَدَّلَ | ٥٨ | الْمُحْسِنِيْنَ |
| మాట | దుర్మార్గం వహించారో | ఎవరైతే | కాని మార్చారు | (58) | మంచివారు |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| الَّذِيْنَ | عَلَى | فَاَنْزَلْنَا | لَهُمْ | قِيْلَ | الَّذِىْ | غَيْرَ |
| ఎవరైతే | పై | కావున మేము దింపాము | వారికి | చెప్ప బడింది | ఏది | వేరే |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| يَفْسُقُوْنَ | كَانُوْا | بِمَا | السَّمَآءِ | مِّنَ | رِجْزًا | ظَلَمُوْا |
| (59) దుర్మార్గం చేసేవారు | వారు | ఎందుకంటే | ఆకాశం | నుండి | శిక్ష | దుర్మార్గం వహించారో |

**59. కాని దుర్మార్గులైనవారు, వారికి చెప్పిన మాటను మరొక మాటతో మార్చారు. కనుక, మేము దుర్మార్గం చేసిన వారిపై, వారి దుర్మార్గాల ఫలితంగా, ఆకాశం నుండి శిక్షను దింపాము.**

ఆయత్‌లకు పదాల వారీగా అర్థాలను అందించిన తరువాత, మరలా ప్రతీ పదానికి విడివిడిగా అర్థాన్ని ప్రారంభం నుండి ఇస్తూ వస్తున్నాము. ఆ అర్థాలను ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో అందించి, పైన అందించిన 50 నుండి 59 ఆయత్ వరకూ, ప్రతీ ఆయత్‌కు తఫ్సీర్‌ను ఇన్షా అల్లాహ్ ప్రచురిస్తాము.

కల వచ్చిన తరువాత, ఇస్రా‘ఈల్ సంతతిలో కొత్తగా పుట్టిన ప్రతీ మగబిడ్డ చంపబడాలని మరియు బాలికలు వదిలివేయబడాలని ఫిర్‘ఔన్ ఆదేశించాడు. ఇస్రా‘ఈల్ సంతతికి కఠినమైన పనులు అప్పగించాలని మరియు వారికి చాలా అల్పమైన పనులనే కేటాయించమని కూడా ఆదేశించాడు.

పై ఆయత్‌లో చెప్పబడిన **ఘోరహింస**కు అర్థం ఏమిటంటే **మగబిడ్డలను చంపడం.** సూరహ్ ఇబ్రాహీమ్‌లో ఈ అర్థమే స్పష్టంగా చెప్పబడింది.

**"... వారు మిమ్మల్ని తీవ్రమైన శిక్షలకు గురి చేస్తూ ఉండేవారు, మీ కుమారులను వధించి, మీ కుమార్తెలను బ్రతకనిచ్చేవారు. మరియు అందులో మీకు, మీ ప్రభువు తరఫునుండి ఒక గొప్ప పరీక్ష ఉండింది."** (ఖుర్‘ఆన్ 14:6)

అల్లాహ్ చెబుతున్నారు, 14వ సూరహ్ 5వ ఆయత్‌లో, '**వారికి అల్లాహ్ దినాలను జ్ఞాపకం చేయించు**' అంటే ఆయన నుండి ఉపకారాలు మరియు అనుగ్రహాలను పొందినప్పటి ఆ రోజులను వారికి జ్ఞాపకం చేయించు అని.

**ఫిర్‘ఔన్** అనే పదం ఈజిప్టు దేశాన్ని పాలించే రాజు యొక్క టైటిల్. అంటే ఆ రోజుల్లో ఈజిప్టును ఏ రాజైతే పరిపాలిస్తాడో, అతడిని ఫిర్‘ఔన్ అని పిలిచేవారు. అదే విధంగా రోమ్ రాజును **ఖైసర్** అని, పర్షియా దేశ రాజుని **కిస్రా** అని పిలిచేవారు. అబిసీనియా (ఇథియోపియా) దేశంలో రాజును **అన్-నజాషి** అని పిలిచేవారు.

అయితే అన్ని కాలాలలోనూ ఈజిప్టు రాజుని ఫిర్‘ఔన్ అని పిలువ లేదని ఖుర్‘ఆన్ ద్వారా స్పష్టం అవుతుంది. యూసుఫ్(అ)వారు ప్రవక్తగా ఈజిప్టులో ఉన్న కాలంలో అక్కడి రాజు 'ఫిర్‘ఔన్'గా పిలువబడలేదు. ఈ ఫిర్‘ఔన్ అనే పదం తరువాయి కాలంలో ఎప్పుడో ప్రారంభమైంది. (ఇంగ్లీష్‌లో ఫారో అంటారు)

బఖరహ్ సూరహ్‌లో ప్రస్తుతం మనం వివరణ చెప్పుకుంటున్న 49వ ఆయత్‌లో **"మరియు అందులో మీకు మీ ప్రభువు తరఫునుండి ఒక గొప్ప పరీక్ష ఉండింది"** అనే ఆయత్ భాగంపై ఇబ్నె జరీర్‌గారు ఇలా వ్యాఖ్యానించారు: 'ఫిర్‘ఔన్‌చే బాధించబడిన మీ తల్లిదండ్రులను ఘోర శిక్షల నుండి కాపాడటం మీ ప్రభువు నుండి గొప్ప అనుగ్రహం'. **అనుగ్రహంలో పరీక్ష ఉందని, అదే విధంగా కష్టంలో కూడా పరీక్ష ఉందని మనం ఇక్కడ తప్పనిసరిగా ప్రస్తావించాలి.**

అల్లాహ్ చెబుతున్నారు :

**"ప్రతి ప్రాణి మృత్యువును చవి చూస్తుంది. మరియు మేము మీ అందరినీ, మంచి మరియు చెడు స్థితులకు గురి చేసి పరీక్షిస్తాము. మరియు మీరందరూ మా వైపునకే మరలింపబడతారు."** (ఖుర్‘ఆన్ 21:35)

"... మేము వారిని మంచీ చెడు స్థితుల ద్వారా పరీక్షించాము."
(ఖుర్'ఆన్ 7:168)

ఈ సత్యం తెలిసినా కూడా మనుషులలో మార్పు రావడం లేదు. ఇహలోకంలో సంతోషంగా బ్రతుకుతూ, పరలోకంలో శాశ్వత స్వర్గాన్ని పొందే అవకాశం ఇప్పటికీ ఉంది. అది ఎలా పొందాలో ఖుర్'ఆన్ ద్వారా అల్లాహుతాలా తెలియజేశారు.

మన సంతోషం కోసం అల్లాహ్ చేసిన ప్రసంగమైన ఖుర్'ఆన్‌ను చదవకుండా అశ్రద్ధ చేస్తున్నాము. ఖుర్'ఆన్‌ని అర్థం చేసుకుని అల్లాహ్ ఆదేశాలను పాటిస్తే, పునరుత్థాన దినమున ఇన్షా అల్లాహ్ శుభవార్త వినే అవకాశం ఉంది. ఆలోచించండి!

అల్లాహ్ గురించి, ముహమ్మద్(స)వారి గురించి మరియు ఖుర్'ఆన్ గురించి స్పష్టంగా వివరించబడిన వ్యాసం నవంబర్-డిశంబర్, 2011 శాంతిబాట సంచికలో అందించబడింది. చూడండి.

www.saanthibaata.net

తఫ్సీర్‌లోని మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...

## ఖుర్'ఆన్ కంఠస్థం వలన లభించే గొప్ప మేలు

**అబూ స'ఈద్ ఖుద్రీ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "ఖుర్'ఆన్ సహచరుడితో చెప్పబడుతుంది, అతడు స్వర్గంలో ప్రవేశించినప్పుడు : 'పఠించు, పైకి వెళ్ళు. పఠిస్తాడు మరియు ప్రతీ ఆయత్ (పఠనానికి) ఒక స్థాయి పైకి వెళతాడు' అతడు తనకు తెలిసిన చివరి విషయం (ఆయత్) పఠించేవరకూ."**

(ఇబ్నెమాజా, హసన్, 3780, పుస్తకం 33, అధ్యా. 52, సంపుటి 5)

ఒక్కొక్క ఆయత్‌కి ఒక్కొక్క స్థాయిని పెంచుతుంటే, విశ్వాసంతో ఖుర్'ఆన్‌లోని మొత్తం 6,236 ఆయత్‌లు పఠిస్తే ఎంత పెద్ద స్థాయికి చేరుకుంటారో ఆలోచించండి. కాబట్టి ఇప్పటి నుండి అయినా ఖుర్'ఆన్ ఆయత్‌లను కంఠస్థం చేయడం ప్రారంభించండి. ఒక్కొక్క ఆయత్‌కి ఒక్కొక్క స్థాయి పెరగడమంటే ఎంత గొప్ప అవకాశం!

గమనిక : **స్వర్గంలో ప్రవేశించాడు అంటే అతడు విశ్వాసి (మోమిన్) అని అర్థం చేసుకోవాలి. ఒకవేళ అన్ని ఆయత్‌లు కంఠస్థం చేసినా సరే విశ్వాసం లేకపోతే అతనికి స్వర్గం లేదు. విశ్వాసి (మోమిన్) మరియు విశ్వాసం (ఈమాన్) గురించి శాంతిబాట అక్టోబర్ 2010 సంచికలో చదవండి)**

## ఖుర్'ఆన్ అల్లాహ్ యొక్క ప్రసంగం

حَدَّثَنا أَحْمَدُ بنُ أَبي سُرَيْجٍ الرَّازِيُّ وَعَلِيُّ بنُ الحُسَيْنِ بنِ
إِبْراهِيمَ وَعَلِيُّ ابنُ مُسْلِمٍ قالُوا : حَدَّثَنا أَبُو مُعاوِيَةَ :
أخبرنا الأعمَشُ عن مُسْلِمٍ، عن مَسْرُوقٍ عن عَبْدِ الله
قال : قال رَسُولُ الله ﷺ : ((إِذا تَكَلَّمَ الله تعالَى بالوَحْيِ
سَمِعَ أَهْلُ السَّماءِ لِلسَّماءِ صَلْصَلَةً كَجَرِّ السِّلْسِلَةِ عَلَى
الصَّفَا فَيُصْعَقُونَ فَلا يَزالُونَ كَذلِكَ حَتَّى يَأْتِيَهُمْ جِبْرِيلُ
حَتَّى إِذا جَاءَهُم جِبْرِيلُ فُزِّعَ عن قُلُوبِهِمْ، قال :
فَيَقُولُونَ: يَا جِبْرِيلُ! مَاذا قالَ رَبُّكَ فَيَقُولُ : الحَقَّ،
فَيَقُولُونَ : الحَقَّ الحَقَّ)).

**అబ్దుల్లాహ్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : అల్లాహ్ వహీ ప్రసంగించినప్పుడు ఆకాశాలలోని నివాసులు ఆకాశాల నుండి పెద్ద ధ్వని వినేవారు, గొలుసును రాతిపై ఈడుస్తున్నట్లుగా. మరియు వారు మూర్ఛపోయేవారు. తరువాత వారు అదే విధంగా ఉండిపోయేవారు జిబ్రీల్(అ)వారి దగ్గరకు వచ్చేవరకూ. ఆయన వారి దగ్గరకు వచ్చినప్పుడు వారు మామూలు స్థితికి వచ్చేవారు మరియు అనేవారు : "ఓ జిబ్రీల్! నీ ప్రభువు ఏమి చెప్పారు? ఆయన అనేవారు: "సత్యం". మరియు వారు అనేవారు: "సత్యం, సత్యం".**

(అబూదావూద్, సహీహ్, 4738, పుస్తకం 39, అధ్యా. 20, సంపుటి 5)

**సత్యగ్రంథమైన ఖుర్'ఆన్ సర్వసత్యమైన అల్లాహుతాలా యొక్క ప్రసంగం. అల్లాహ్ ప్రసంగం ఆయన యొక్క మహోన్నత లక్షణాలలో ఒకటి కాబట్టి ఖుర్'ఆన్ సృష్టించబడలేదు.**

## ముహమ్మద్(స)వారి ఉమ్మత్ 70వది మరియు చిట్ట చివరిది

ఈ భూమిపై తొలి మానవుడు అడుగిడినప్పటి నుండి ప్రళయం వరకూ ఉండే జాతులు 70. ఈ 70 జాతులలో చిట్టచివరిది ముహమ్మద్(స)వారి ఉమ్మత్. అంతేకాకుండా తీర్పుదినం నాడు మొట్టమొదట విచారించబడే జాతి కూడా ఈ ఉమ్మతే! ఈ వాస్తవాలు మాత్రమే కాకుండా మరికొన్ని విషయాలను ప్రామాణిక హదీస్‌ల ద్వారా దిగువున అందిస్తున్నాము.

బహ్జ్ బిన్ హకీమ్ తన తండ్రి నుండి, తన తాతగారి నుండి ఉల్లేఖించారు: "**అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : పునరుత్థాన దినమున, మనం 70 జాతులను పూర్తి చేస్తాము వారిలో మనం చివరివారము మరియు ఉత్తమ(జాతి)వారము.**" (ఇబ్నెమాజా, హసన్, 4287, పుస్తకం 37, అధ్యా. 34, సంపుటి 5)

బహ్జ్ బిన్ హకీమ్ తన తండ్రి నుండి తన తాతగారి నుండి ఉల్లేఖించారు: నేను రసూలుల్లాహ్(స)వారు చెప్పగా విన్నాను : "**మీరు 70 జాతులను పూర్తి చేస్తారు. వారిలో మీరు ఉత్తమమైనవారు మరియు అల్లాహ్‌కు ప్రియమైనవారు.**" (ఇబ్నెమాజా, 4288, పుస్తకం 37, అధ్యా. 34, సంపుటి 5)

### 3 వంతుల రెండు వంతులు పూర్తిగా ముహమ్మద్(స) వారి ఉమ్మత్‌కే చెందుతాయి

సులైమాన్ బిన్ బురైదహ్ తన తండ్రి నుండి ఉల్లేఖించారు. ప్రవక్త(స) వారు చెప్పారు : "స్వర్గ ప్రజలవి: 120 వరుసలు, 80 ఈ జాతి నుండి మరియు 40 మిగతా అన్ని జాతుల నుండి." (ఇబ్నెమాజా, హసన్, 4289, పుస్తకం 37, అధ్యా. 34, సంపుటి 5)

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు: "మనం జాతులలో చివరివారము మరియు మొదటివారము లెక్క తీసుకోవడంలో. ఇది అడగబడుతుంది: **'ఎక్కడ ఉమ్మీ యొక్క జాతి మరియు దాని ప్రవక్తా?'** కాబట్టి మనం చివరివారము మొదటి వారము." (ఇబ్నెమాజా, హసన్, 4290, పు. 37, అధ్యా. 34, సం.5)

### ముహమ్మద్(స)వారు తీర్పుదినాన తన ఉమ్మత్‌ని ఎలా గుర్తు పడతారు?

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : **"మీరు నా దగ్గరికి వస్తారు ప్రకాశిస్తున్న ముఖాలతో, చేతులతో మరియు కాళ్ళతో వుజూ ఆనవాల నుండి. ఇదే నా ఉమ్మత్ యొక్క విలక్షణమైన సూచిక. అది ఇతరులెవరికీ చెందదు."** (ఇబ్నెమాజా, సహీహ్, 4282, పు. 37, అధ్యా. 34, సం.5)

ముస్లిమ్ కుటుంబంలో పుట్టినప్పటికీ, ఇస్లామ్ గురించి కాస్త కూడా తెలియకుండా, సలాత్ (నమాజ్)లు చేయకుండా ఎందరో ఉన్నారు. సలాత్ చేయనివీరు ఇక వుజూ ఏమి చేస్తారు? బిద్'అత్ చేసేవారు కూడా ప్రవక్త(స)వారి దగ్గరకు చేరలేరు.

అబ్దుల్లాహ్(రజి)వారి ఉల్లేఖనం. "మేము రసూలుల్లాహ్(స)వారితో గుడారంలో ఉన్నాము. మరియు ఆయన(స) అడిగారు : "ఇది మీకు సంతోషం కలిగించదా స్వర్గంలోని నాలుగవ వంతు ప్రజలుగా మీరుండటం?" మేము అన్నాము, "ఎందుకు కాదు" ఆయన(స) అడిగారు : "ఇది మీకు సంతోషం కలిగించదా స్వర్గ ప్రజలలో 3వ వంతు కావడం?" మేము అన్నాము, "ఔను". ఆయన(స) చెప్పారు : "ఆయన సాక్షి ఎవరి చేతులలో నా ఆత్మ ఉందో, నిస్సందేహంగా నేను ఆశిస్తున్నది ఏమిటంటే మీరు స్వర్గ ప్రజలలో సగంగా ఉంటారని. ఎందుకంటే ఎవరూ ప్రవేశించ లేరు స్వర్గంలో ముస్లిమ్ (అంటే అల్లాహ్‌కు విధేయత చూపిన) ఆత్మ తప్ప. మరియు మీరు షిర్క్ చేసే వారి మధ్య, నల్లటి ఎద్దు చర్మంపై తెల్లటి వెంట్రుకలా ఉంటారు లేక ఎర్రటి ఎద్దు చర్మంపై నల్లటి వెంట్రుకలా ఉంటారు. **(ఇబ్నెమాజా, సహీహ్, 4283)**

ముహమ్మద్(స)వారి ఉమ్మత్ స్పష్టంగా గుర్తించబడుతుంది. స్వర్గ ప్రజలలో అన్ని ఉమ్మత్‌ల వారున్నప్పటికీ, ముహమ్మద్(స)వారి ఉమ్మత్ స్వర్గప్రజలలో సగం ఉంటుంది. మిగిలిన సగంలో 69 ఉమ్మత్‌లకు చెందిన విశ్వాసులుంటారు.

అబూ స'ఈద్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు. ఒక ప్రవక్త వస్తారు ఇద్దరు వ్యక్తుల తోడుగా మరియు ఒక ప్రవక్త వస్తారు ముగ్గురు తోడుగా మరియు (మరికొందరు వస్తారు) ఎక్కువ లేదా దాని కంటే తక్కువ. ఆయనకు చెప్పబడుతుంది: **"నీవు సందేశాన్ని నీ ప్రజలకు చేరవేశావా?"** మరియు ఆయన చెబుతారు, "ఔను". తరువాత అతని జాతి ప్రజలు పిలువబడతారు మరియు ఇది అడగబడుతుంది: "ఈయన మీకు సందేశాన్నిచ్చారా?" వారు అంటారు, "లేదు". తరువాత ఇది అడగబడుతుంది : "ఎవరు నీ కొరకు సాక్ష్యం ఇస్తారు?" ఆయన చెబుతారు: ముహమ్మద్(స) మరియు అతని ఉమ్మత్". కాబట్టి ముహమ్మద్(స)వారి ఉమ్మత్ పిలువబడుతుంది మరియు అడుగబడుతుంది : "ఈ వ్యక్తి సందేశాన్నిచ్చారా?" వారు చెబుతారు, "ఔను". ఆయన (అల్లాహ్) అడుగుతారు : "మీకు అది ఎలా తెలుసు?" వారు చెబుతారు: "మా ప్రవక్త మాకు చెప్పారు, సందేశహరులు సందేశాన్నిచ్చారని మరియు మేము ఆయనను విశ్వసించాము." ఇదే అల్లాహ్ చెబుతారు : "మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశ హరుడు(ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము, మిమ్మల్ని ఒక మధ్యస్థ సమాజంగా చేశాము (ఖుర్'ఆన్, 2:143)" **(ఇబ్నెమాజా, సహీహ్, 4284, పుస్తకం 37, అధ్యా. 34, సంపుటి 5)**

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

ప్రపంచ శాంతి దూత

# ముహమ్మద్ (స) వారి

**బోధనలు ఆచరణలు**

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్ధిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్'ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

## ఉత్తమ సమాజం 21

**ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ లక్షణాలు** (Best Character)

**"మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము ....." (ఖుర్'ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....." (Qur'an 2:143)

**"మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిరోధించే వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ..." (ఖుర్'ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for mankind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....." (Qur'an 3:110)



ఒక సమాజం ఉత్తమ సమాజం కావాలంటే జీవనోపాధి గురించి ఇతరులపై ఆధారపడకుండా, ఏ రిజర్వేషన్లు లేకుండానే ఏ విధంగా సాధించవచ్చో జూన్-జూలై'10 సంచికలోనూ, ఆర్థికంగా స్థిరపడిన తరువాత మనపై నున్న బాధ్యతలను తెలుసుకుని మసలుకోవాలని చెబుతూ, ముఖ్య బాధ్యతలను హదీస్‌ల ద్వారా క్లుప్తంగా తరువాయి సంచికలో వివరించడం జరిగింది. వ్యాపారం మరియు వ్యవసాయ ఉత్పత్తులు వాటికి సంబంధించిన విషయాలను, సంపాదన గురించి ఈ శీర్షికలోని గత మూడు వ్యాసాలలో అందించడం జరిగింది. హరామ్(నిషిద్ధ) వ్యాపారాలు చేయకూడదు. హలాల్ (ధర్మసమ్మతమైన) వ్యాపారంలో కూడా ఏ ఏ విషయాలు ప్రవక్త(స)వారిచే నిషేధించేబడ్డాయో, ఏవి అనుమతించబడ్డాయో చెప్పడం జరిగింది.

వ్యాపారం గురించి, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల గురించి, సంపాదన గురించి ముఖ్య విషయాలను ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా తెలుసుకున్నాము. కేవలం బోధనలు వినడం వలన ఉత్తమ సమాజం ఏర్పడదు. వాటిని ఆచరణలో పెట్టాలి. వాటిలో కొన్నింటిని ఆచరణలో పెట్టడానికి నాయకుడు కఠినంగా వ్యవహరించాలి కూడా.

ఇదే శీర్షికలో వెనుకటి వ్యాసంలో జ్ఞానాన్ని 'ప్రాపంచిక జ్ఞానం మరియు ధార్మిక జ్ఞానం' అని వేర్వేరుగా జ్ఞానాలుగా విభజించ నవసరం లేదని, ఇస్లామీయ జ్ఞానమున్నవానికి ప్రాపంచిక జ్ఞానం బాగా ఉంటుందని చెప్పడం జరిగింది. ఇస్లామ్ అంటే కేవలం బోధించబడే ధర్మం కాదు. దానితోపాటు ఆచరణ కూడా ఉండాలి. ఇస్లామీయ జ్ఞానమున్న వ్యక్తి ఏదైతే ప్రజలకు బోధిస్తాడో అతడు కూడా దానిని ఆచరిస్తాడు.

ముస్లిములు అలవరచు కోవలసిన
BEST CHARACTER

## ఉత్తమ లక్షణాలు 3

ఉత్తములుంటేనే ఆ సమాజం ఉత్తమ సమాజం అవుతుంది. అసలు ఉత్తముడంటే ఎవరు? అల్లాహ్ యొక్క సందేశహరుడైన ముహమ్మద్(స)వారు మానవోత్తముడు. **ఈయన మనకు రోల్ మోడల్.** ఉత్తముడు అంటే మంచి అలవాట్లు మరియు మంచి లక్షణాలు కలవాడని ముహమ్మద్(స)వారు చెప్పారు. **ప్రతీ ముస్లిమ్ ఉత్తముడు కావాలి.** అంటే అతడు విశ్వాసి కావాలి.

ముందరి సంచికలలో ఓర్పు మరియు సహనం, కోపాన్ని నిగ్రహించు కోవడం, అహంకారం గురించి, పుకార్లను వ్యాపింప జేయడం వలన సంభవించే స్వర్గ నిషేధం గురించి, నీడనిచ్చే చెట్లను అకారణంగా నరకడం వలన కోల్పేయే మేలు గురించి మరియు ఇంటిలో ప్రవేశించడానికి అనుమతి ఏ విధంగా తీసుకోవాలో చెప్పుకున్నాం.

## పేర్లు

ఉత్తమ సమాజంలో సంస్కారవంతంగా మాట్లాడటమే కాకుండా, సంస్కారవంతమైన పేర్లతో పిలుచుకోవడం సహజం. తల్లిదండ్రులు తమ పిల్లలకు సహజంగా మంచి పేర్లు పెట్టాలని తలుస్తారు. అయితే కొన్నింటిని మార్చవలసిన అవసరం ఉంది. కొన్ని పేర్లు విశ్వాసులకు ఉండకూడదు. **రసూలుల్లాహ్(స)వారు ఎటువంటి పేర్లు మార్చారో మరియు ఏయే పేర్లను ఉత్తమమని తెలియ జేశారో** ఈ వ్యాసంలో ప్రామాణిక హదీస్‌ల ద్వారా అందిస్తున్నాము.

- **అల్లాహ్‌కు ఇష్టమైన పేర్లు**

సృష్టికర్తయైన అల్లాహ్‌కు ఇష్టమైన పేర్లు **అబ్దుల్లాహ్** (అల్లాహ్‌కు దాసుడు) మరియు **అబ్దుర్-రహ్మాన్** (ఆ కరుణామయుని దాసుడు).

ఇబ్నె ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: అల్లాహుతాలాకు బాగా ప్రియమైన పేర్లు 'అబ్దుల్లాహ్' మరియు 'అబ్దుర్-రహ్మాన్' **(అబూదావూద్, సహీహ్, 4949, పుస్తకం 40, అధ్యా.61, సంపుటి 5)**

- **అల్లాహ్‌కు ఇష్టంకాని పేరు**

అల్లాహ్‌కు ఇష్టంకాని పేరు **మలికల్ అమ్‌లాక్** (రాజులకు రాజు - రారాజు)

సుఫ్యాన్ బిన్ 'ఉయైనహ్ నుండి అబీ జినాద్ నుండి, అల్-అ'రజ్ నుండి, అబూహురైరా నుండి (ఈయన) ప్రవక్త(స)వారి నుండి అంద జేశారు. ఆయన(స) చెప్పారు : "పునరుత్థాన దినమున అల్లాహ్ ఎక్కువగా ఈసడించుకునే పేర్లు ఒక వ్యక్తి పిలువబడటం - మలిక్ అల్-అమ్‌లాక్ (రాజాధిరాజు, కింగ్ ఆఫ్ కింగ్స్) **(అబూదావూద్, 4961, పుస్తకం 40, అధ్యా.62, సంపుటి 5)**

## కున్యా

హదీస్‌లను మరియు ప్రవక్త(స)వారి జీవిత చరిత్ర చదివేటప్పుడు, ఎన్నో పేర్లు ప్రస్తావనకు వస్తాయి. ఉదాహరణకు అవి ఈ విధంగా ఉంటాయి: అబ్దుల్లాహ్ బిన్ ఉమర్, ఉమర్ బిన్ ఖత్తాబ్, ఉమ్మె అయ్‌మన్, అబూ అబ్దుల్లాహ్, ఇబ్నె ఉమర్ (రజి) .....

**పురుషుని పేరుకుగాని, స్త్రీ పేరుకుగాని చివర తండ్రిపేరు కలిపి చెబుతారు. భార్య పేరుకు చివరన భర్తపేరును జతచేసి చెప్పడం చాలా సమాజాలలో ఆనవాయితీగా ఉంది. కాని ఇస్లామ్‌లో ఆ ఆనవాయితీ లేదు.**

ఉదాహరణకు ముహమ్మద్(స)వారి పేరు : **ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్(స)** - అంటే అబ్దుల్లాహ్ గారి కుమారుడైన ముహమ్మద్(స). ముహమ్మద్(స)వారి సతీమణి మరియు విశ్వాసుల మాతృమూర్తియైన ఖదీజా(రజి)వారి పేరు : **ఖదీజా బిన్త్ ఖువైలిద్(రజి)** - అంటే ఖువైలిద్ కుమార్తెయైన ఖదీజా(రజి)వారు.

కాబట్టి **బిన్** అంటే son of (S/o) మరియు **బిన్త్** అంటే daughter of (D/o).

మరియు తండ్రి పేరుతోగాని, తల్లి పేరుతోగాని కొడుకుని పిలువ వచ్చు. అప్పుడు తండ్రి పేరుకు ముందు 'ఇబ్నె' అనే పదాన్ని ఉంచాలి. ఇబ్నె ఉమర్ అంటే 'ఉమర్(రజి) వారి కుమారుడు' అని అర్థం. ఇబ్నె మర్యమ్ అంటే 'మర్యమ్ కుమారుడు' అని అర్థం.

కుమారుడు, కుమార్తెల పేర్లతో తల్లిదండ్రులను కూడా పిలువవచ్చు. ఉదాహరణకు, 'అబూ అబ్దుల్లాహ్' అంటే 'అబ్దుల్లాహ్ యొక్క తండ్రి' అని అర్థం. 'ఉమ్మె అయ్‌మన్' అంటే 'అయ్‌మన్ యొక్క తల్లి' అని అర్థం. ఈ విధంగా **అబూ, ఉమ్మె, ఇబ్నె** పదాలతో చెప్పే పేర్లను 'కున్యా' అంటారు. దీనిని ఆ వ్యక్తికి ఉన్న మరో పేరుగా భావించాలి.

అంతేకాకుండా ఈ కున్యా ఒక వ్యక్తిని గుర్తు పట్టడానికి (ఐడెంటిఫికేషన్‌గా) ఉపయోగపడుతుంది.

సహ్లొ బిన్ సాద్ ఉల్లేఖనం. అలీ(రజి)వారికి బాగా ఇష్టమైన పేరు **అబూ తురాబ్** మరియు ఆయన సంతోషించేవారు మేము ఆయనను దానితో పిలిచినప్పుడు, ఎందుకంటే ఆయనకు అబూ తురాబ్ అని పేరు పెట్టింది మరెవరో కాదు స్వయంగా ప్రవక్త(స)వారే. ఒకసారి అలీ(రజి)వారు ఫాతిమా(రజి)వారిపై కోపగించారు మరియు బయటకి వెళ్ళారు (ఇంటి నుండి) మరియు మస్జిద్ గోడదగ్గరగా నిద్రపోయారు. ప్రవక్త(స)వారు ఆయనను వెతుకుతూ వచ్చారు మరియు ఎవరో చెప్పారు **"ఆయన అక్కడ ఉన్నారు, గోడ దగ్గరగా పడుకుని."** ప్రవక్త(స)వారు ఆయన దగ్గరకి వచ్చారు, ఆయన(అలీ) వీపుకు మట్టి అంటుకుని ఉండగా. ప్రవక్త(స)వారు ఆయన వీపుపై నుండి మట్టి తొలగించడం ప్రారంభించారు. ఇలా చెబుతూ, "కూర్చో, ఓ అబూ తురాబ్!" **(సహీహ్ బుఖారీ 6204, పుస్తకం 78, అధ్యా. 113, సంపుటి 8)**

ఒక అబ్బాయికి 'అల్-ఖాసిమ్' అనే పేరు ఉంటే, అతని తండ్రిని అబుల్-ఖాసిమ్ అనే కున్యాతో పిలుస్తారు. అయితే అబుల్ ఖాసిమ్ అనే కున్యా అల్లాహ్ పంపిన ప్రవక్త ముహమ్మద్(స)వారికి ఉంది. ప్రవక్తల పేర్లు పెట్టుకోమని ముహమ్మద్(స)వారు తన అనుచరులకు చెప్పారు. అయితే తన కున్యా పెట్టుకోవద్దని చెప్పారు. ఆయన(స) తన జీవిత కాలంలోనే తన కున్యా పెట్టుకోవద్దన్నారు. ఆయన(స) ఈ లోకం వీడిన తరువాత ఆయన కున్యాతో పిలుచుకోవచ్చు అని చెప్పారు.

ముహమ్మద్ బిన్ సీరీన్ ఉల్లేఖనం. అబూహురైరా(రజి)వారు చెప్పారు: రసూలుల్లాహ్(స)వారు చెప్పారు : **పేరు పెట్టండి నా పేరుతో. మరియు కున్యా పెట్టకండి నా కున్యాతో.** (అబూదావూద్, సహీహ్, 4965, పుస్తకం 40, అధ్యా. 66, సంపుటి 5)

అనస్(రజి)వారి ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు బఖీలో ఉన్నారు మరియు ఓ వ్యక్తి ఇంకెవరినో పిలిచాడు. **"ఓ అబుల్ ఖాసిమ్!"**. రసూలుల్లాహ్(స)వారు అతనివైపు తిరిగారు మరియు అతను అన్నాడు: **'నేను మిమ్మల్ని ఉద్దేశించి కాదు'**. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అన్నారు : "పెట్టుకోండి నా పేరు. కాని (పేర్లు) పెట్టుకోకండి నా కున్యాతో. **(ఇబ్నెమాజా, సహీహ్, 3737, పుస్తకం 33, అధ్యా. 33, సంపుటి 5)**

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: "మీరు స్వయంగా నా పేరు పెట్టుకోండి కాని పెట్టకోవద్దు నా కున్యా. ఎందుకంటే నేను ఖాసిమ్ మరియు నేను పంచుతాను మీ మధ్య (అల్లాహ్ అనుగ్రహాలను.)" ఈ ఉల్లేఖనం అనస్(రజి)ద్వారా వచ్చింది ప్రవక్త(స) చెప్పారని ఆ విధంగా." **(సహీహ్ బుఖారీ, 6196, పుస్తకం 78 అధ్యా. 109, సంపుటి 8)**

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. మాలోని ఒక వ్యక్తికి కుమారుడు జన్మించాడు. అతనికి అతడు ఖాసిమ్ అని పేరు పెట్టాడు. ప్రజలు అన్నారు : మేము అతనిని పిలవము ఆ కున్యాతో మేము ప్రవక్త(స)వారిని దాని గురించి అడిగే వరకూ." ప్రవక్త(స)వారు చెప్పారు, "స్వయంగా మీరు నాపేరు పెట్టుకోండి, కాని పెట్టుకోకండి (స్వయంగా) నా కున్యా" **(కున్యా అంటే తండ్రిని 'ఓ ఫలానా తండ్రి'అని లేదా తల్లిని 'ఓ ఫలానా తల్లి' అని పిలవడం)** (సహీహ్ బుఖారీ, 6187, పుస్తకం 78 అధ్యా. 106, సంపుటి 8)

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. మాలో ఒక వ్యక్తికి అబ్బాయి పుట్టాడు మరియు ఆ వ్యక్తి అతనికి అల్-ఖాసిమ్ అని పేరుపెట్టాడు. మేము అతనికి చెప్పాము, **"మేము నిన్ను అబుల్-ఖాసిమ్ అనే కున్యాతో పిలవమూ, దాని కొరకు నీకు గౌరవమూ ఇవ్వము."** ప్రవక్త(స)వారికి దాని గురించి తెలియజేయబడింది మరియు ఆయన అన్నారు, **"పేరు పెట్టు నీ కుమారునికి అబ్దుర్-రహ్మాన్"** అని. (సహీహ్ బుఖారీ, 6186, పుస్తకం 78, అధ్యా. 105, సంపుటి 8)

ముహమ్మద్ బిన్ హనఫియ్యాహ్ ఉల్లేఖనం. అలీ(ర) చెప్పారు : "నేను అడిగాను ఓ రసూలల్లాహ్(స)! మీరు వెళ్ళిన తరువాత (అంటే లోకాన్ని వీడిన తరువాత) నేను ఓ కుమారుడిని కలిగి ఉంటే, నేను అతనికి మీ పేరు పెడతాను మరియు **మీ కున్యా పెడతాను. ఆయన అన్నారు : 'ఔను'.** (అబూదావూద్, హసన్, 4967, పుస్తకం 40, అధ్యా. 68, సంపుటి 5)

## ఇస్లామ్ స్వీకరించిన తరువాత కొందరి పేర్లు మార్చబడ్డాయి

అబూహురైరా(రజి)వారు ముహమ్మద్(స)వారి ముఖ్య అనుచరులలో ఒకరు. ఈయన ద్వారా అందరికంటే ఎక్కువ హదీస్‌లు ఉల్లేఖించబడ్డాయి. ఈయన పుట్టిన తరువాత తల్లిదండ్రులు పెట్టిన పేరు అబ్దుష్-షమ్స్ (సూర్యుని దాసుడు). అతని దగ్గర ఎల్లప్పుడూ ఓ చిన్న పిల్లి ఉండేది. అరబీలో పిల్లిని హురైరా అంటారు. ఆ విధంగా అతనికి 'అబూహురైరా' అనే పేరు వచ్చింది. ఈయన తన తెగ నాయకుడైన తుఫైల్ బిన్ అమ్ర్(రజి) ద్వారా ఇస్లామ్ స్వీకరించారు. మరియు తుఫైల్(రజి)వారితో కలిసి మక్కా వచ్చారు ముహమ్మద్(స)వారిని కలవడానికి. **ముహమ్మద్ (స)వారు అతని పేరును 'అబ్దుర్ రహ్మాన్'** (*అనంత కరుణామయుని దాసుడు*)**గా మార్చారు. ఈ విధంగా అబ్దుష్-షమ్స్ అనే అబూహురైరాగారి పేరును అబ్దుర్ రహ్మాన్‌గా ప్రవక్త(స)వారు మార్చారు.**

**'ఆసియహ్'** అనే పేరును **'జమీలహ్'**గా మార్చడమైనది

ఇబ్నె ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు **'ఆసియహ్'** (*అవిధేయురాలు*) పేరును మార్చారు మరియు చెప్పారు : నీవు **జమీలహ్** (*సౌందర్యవతి*) **(అబూదావూద్, సహీహ్, 4952, పుస్తకం 40, సంపుటి 5)**

**'బర్రహ్'** అనే పేరును **'జైనబ్'**గా మార్చడమైనది

ముహమ్మద్ బిన్ 'అమ్ర్ బిన్ 'అతా నుండి ఉల్లేఖించబడింది. జైనబ్ బిన్త్ అబీ సలమహ్ ఆయనని అడిగారు : "నీ కుమార్తెకు ఏమి పేరు పెట్టారు?" ఆయన చెప్పారు : "నేను ఆమెకు బర్రహ్ (సద్వర్తని)" ఆమె చెప్పారు : రసూలుల్లాహ్(స)వారు ఆ పేరును నిరోధించారు. నేను బర్రహ్ అని పిలువబడ్డాను మరియు ప్రవక్త(స)వారు చెప్పారు : **"ప్రశంసించుకోకు నిన్ను నీవే స్వయంగా. అల్లాహ్‌కే బాగా తెలుసు మీలో సద్వర్తనులు ఎవరో"**. అతను అడిగారు:"ఏమని ఆమెను మేము పిలవాలి?"ఆయన(స) చెప్పారు: **' పిలవండి ఆమెను జైనబ్ '** (అబూదావూద్, సహీహ్, 4953, పుస్తకం 40, అధ్యా.62, సంపుటి 5)

**'అస్రమ్'** అనే పేరును **'జుర్అహ్'**గా మార్చడమైనది

బషీర్ బిన్ మైమూన్ తన తండ్రివైపు సోదరుడు ఉసామా బిన్ అఖ్‌దరీ నుండి ఉల్లేఖించారు. అస్రమ్ అని పిలువబడే వ్యక్తి రసూలుల్లాహ్(స) వారి వద్దకు వచ్చిన సమూహంలో ఉన్నాడు. రసూలుల్లాహ్(స)వారు అడిగారు : 'నీ పేరు ఏమిటి?' అతను చెప్పారు : "నేను అస్రమ్ (అర్థం: మొక్కలు కోయబడినది)." ఆయన(స) చెప్పారు : "లేదు, నీవు జుర్అహ్ (వ్యవసాయం చేయదగిన భూమి)" **(అబూదావూద్, హసన్, 4954, పుస్తకం 40, అధ్యా. 62, సంపుటి 5)**

**ఇదే విధంగా ప్రవక్త(స)వారిచే మార్చబడిన మరికొన్ని పేర్లు :**

**అల్-'ఆస్** (*అవిధేయుడు*), **అజీజ్** (*సర్వశక్తివంతుడు*), **'అతలహ్** (*కఠినమైన*), **సైతాన్**, **అల్-హకమ్** (*జడ్జి*), **ఘురాబ్** (*కాకి*), **హుబాబ్** (షైతాన్ యొక్క పేరు లేక ఒకరకమైన పాము) మరియు **షిహాబ్.**

**షిహాబ్** (*క్రిందికి పడుతున్న అగ్ని కీల*) ఇతనికి **హిషామ్** (*దయ గలవాడు*) అని పిలిచారు.

**హర్బ్** (*యుద్ధం*) అనే పేరుగలవానికి **సిల్మ్** (*శాంతి*) అని పేరు మార్చారు. మరియు **ముద్‌తజి** (*పడుకునేవాడు*) అనే పేరు **మున్‌బైస్** (*మేల్కొనేవాడు*)గా మార్చారు.

**ప్రాంతాల పేర్లలో మార్పు :**

ప్రవక్త(స)వారు **ఒక నేల పేరును** ఇలా మార్చారు : **అఫిరహ్** (*బీడుబారిన*) అని పిలువబడే నేలను **ఖదిరహ్** (*పచ్చనిది*)గా మరియు ఓ **పర్వత మార్గం** పేరుని **అద్-దలాలహ్** (*అపమార్గం*) నుండి **అల్-హుద** (*మార్గదర్శి*)గా మార్చారు.

**తెగల పేర్లలో మార్పు :**

ఆయన **'బనూ అజ్-జిన్యహ్'** (*వ్యభిచార సంతతి*) అనే పేరుని **బనూ అర్-రిష్‌దహ్** (*సన్మార్గ సంతతి*)గానూ మరియు **బనూ ముఘ్‌వియహ్** (పాపకార్యాలను ప్రేరేపించే సంతతి) పేరుని **బనూ రిష్‌దహ్**గా మార్చారు.

**బానిసలకు నిషేధించబడిన పేర్లు**

సమురహ్ చెప్పారు : రసూలుల్లాహ్(స) బానిసలకు నాలుగు పేర్లను పెట్టడాన్ని నిరోధించారు : అఫ్‌లహ్, యసార్ (సులభం), నాఫి'అ మరియు రబాహ్ (లాభం) **(అబూదావూద్, సహీహ్, 4959, పుస్తకం 40, సంపుటి 5)**

**హోదాలకు సంబంధించి పిలిచే పిలుపులను కూడా మార్చారు**

ముహమ్మద్ నుండి ఉల్లేఖనం. అబూహురైరా(రజి)వారు చెప్పారు. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు : "మీలో ఎవ్వరూ చెప్పకూడదు **'అబ్దీ** లేక **అమతీ** (అంటే **నా మగ బానిస, నా ఆడబానిస**) మరియు బానిస చెప్పకూడదు (తన యజమాని నుద్దేశించి) **రబ్బీ** లేక **రబ్బతీ** (**నా ప్రభువు, నా లేడీ**). యజమాని చెప్పాలి **ఫతాయ** మరియు **ఫతాతి** (మై యంగ్ మాన్, మై యంగ్ ఉమన్) మరియు బానిస చెప్పాలి **సయ్యిదీ** మరియు **సయ్యిదతీ** (మై మాస్టర్, మై మిస్ట్రెస్), ఎందుకంటే మీరందరూ బానిసలు మరియు మీ ప్రభువు (అర్-రబ్బ్) అల్లాహుతాలా. **(అబూదావూద్, సహీహ్, 4975, పుస్తకం 40, అధ్యా.75, సంపుటి 5)**

## నిక్ నేమ్స్

ఒకరిని ఎగతాళి చేసే ఉద్దేశ్యంతో పేర్లు పెట్టడాన్ని ప్రవక్త(స)వారు నిరోధించారు. ఈ సందర్భంగా మేము ఒక విషయాన్ని ఇక్కడ ప్రస్తావించ వలసి ఉంది. సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన ముహమ్మద్(స) వారిపై - దురుద్దేశ్యంతో ఓ మునాఫిక్ మరియు మతదురభిమానంతో విషాన్ని కక్కిన ఓ అన్యమతస్థుడి భాగోతాన్ని వివరిస్తూ జోకర్ మరియు పిట్టలదొరతో వారిని పోల్చడం జరిగింది. అయితే ఖుర్ఆన్ మరియు హదీస్‌లను తిరస్కరిస్తూ ఉండే వారి సానుభూతిపరులు, నిక్‌నేమ్స్‌తో ఎవరినీ పిలవకూడదని హదీస్‌లలో చెప్పబడిందని చెప్పడం ద్వారా వారి కపటత్వాన్ని బయటపెట్టారు. వాస్తవమేమిటంటే జోకర్ మరియు పిట్టలదొర అనేవి వృత్తుల పేర్లు మాత్రమే, అవి నిక్ నేమ్స్ కాదు. ఆ విధంగా నటించి కొందరు పొట్ట నింపుకుంటారు.

ఆమిర్ ఉల్లేఖనం. జుబైరహ్ బిన్ అద్-దహ్హాక్ చెప్పారు : ఈ ఆయత్ - "... మీలో ఎవరూ ఇతరులెవరినీ ఎగతాళి చేయరాదు. విశ్వసించిన తరువాత ఒకనిని చెడ్డ పేరుతో పిలవడం ఎంతో నీచమైన విషయం'' (49:11) - అవతరించింది మాకు సంబంధించి, **బనూ సలమహ్**. అల్లాహ్ యొక్క సందేశహరులు మా దగ్గరకి వచ్చారు. మరియు మాలో ఎవరూ లేరు రెండు లేక మూడు పేర్లు లేకుండా. ప్రతీ సారి రసూలుల్లాహ్(స)వారు ప్రారంభించేవారు ఇలా చెబుతూ : 'ఓ ఫలానా!'. వారు అనేవారు: 'అది చెప్పకండి ఓ రసూలల్లాహ్! ఎందుకంటే అతనికి ఈ పేరుతో కోపం వస్తుంది.' తరువాత ఈ ఆయత్ అవతరించింది (వలా తనాబజూ బిల్ అల్ ఖాబి) **(అబూదావూద్, సహీహ్, 4962, సంపుటి 5)**

'శాంతిబాట టీమ్'లోని కొందరు సభ్యులు చాలా సంవత్సరాల క్రితమే ఇస్లామ్ స్వీకరించారు. మరియు స్వీకరించిన తరువాత వారు తమ పేర్లు మార్చుకున్నారు.

## పేర్లు మరియు సైకాలజీ

మనకున్న పేర్లు మన సైకాలజీపై ప్రభావాన్ని చూపుతాయనే విషయాన్ని పరిశోధనల ద్వారా ఎందరో మానసిక తత్వవేత్తలు తెలిపారు. ఈ విషయంపై చాలా పరిశోధన జరిగింది. ఇంకా యాక్టివ్‌గా ప్రస్తుతం జరుగుతూనే ఉంది.

ప్రవక్త(స)వారి కాలంలో ప్రజలకు ఇటువంటి పరిశోధనల గురించి అవగాహన కూడా లేదు. నేడు సైంటిఫిక్ విషయాల గురించి ఎక్కువగా చెబితే, కొందరు వాటినే పట్టుకుని వేలాడుతూ వాదనలకు పోవడం వలన, ఈ అంశంపై ఎక్కువ వివరాలు మేము ఇక్కడ అందించడం లేదు. **ఖుర్'ఆన్ మరియు హదీస్‌లలో ఉన్నదంతా విజ్ఞానమే.** ఆ విషయం స్పష్టంగా వాటిని అధ్యయనం చేసేవారికి అర్థమౌతుంది.

కొందరికి ఒక సందేహం రావచ్చు, ఫలానా పేరు పెడితే డాక్టర్ అవుతాడని, ఫలానా పేరుపెడితే ఇంజినీర్ అవుతాడని ప్రత్యేకంగా ఏమైనా చెప్పబడిందా అని. అటువంటిదేమీ లేదు. కాని మంచి పేర్లు పెట్టుకోవడం మరియు ఏ పేరు పెట్టినా అది సత్యధర్మ బోధనలకు అనుగుణంగా ఉండే పేర్లు పెట్టుకోవడం ఉత్తమమని తెలుసుకోవాలి. క్రింది హదీస్ చూడండి :

> అల్-ముసయ్యబ్ ఉల్లేఖించారు. అతని తండ్రి (హజ్న్ బిన్ వహ్బ్) ప్రవక్త(స)వారి వద్దకు వెళ్ళారు. మరియు ప్రవక్త(స)వారు (అతనిని) అడిగారు, "నీ పేరు ఏమిటి?" అతను సమాధానమిచ్చారు, "నా పేరు హజ్న్' **(మొరటు)**. ప్రవక్త(స)వారు చెప్పారు, "నీవు సహ్ల్ **(మృదువు)**" హజ్న్ అన్నారు, "నేను మార్చుకోను పేరును దేనితో నా తండ్రి పేరు పెట్టారో." ఇబ్నె అల్-ముసయ్యబ్ అదనంగా చెప్పారు, **"మేము మొరటుతనాన్ని కలిగి ఉన్నాము అప్పటి నుండి."**
>
> అల్-ముసయ్యబ్ తన తండ్రి ద్వారా పై విధంగానే ఉల్లేఖించారు. **(సహీహ్ బుఖారీ, 6190, పుస్తకం 78, అధ్యా. 107, సంపుటి 8)**

మన కంటే వయసులో బాగా చిన్నవారిని **"ఓ నా కుమరా!"** అని సంభోధించి మాట్లాడవచ్చు.

> అనస్ బిన్ మాలిక్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు ఆయనతో అనేవారు : "ఓ నా కుమారా!" **(అబూదావూద్, సహీహ్, 4964, పుస్తకం 40, అధ్యా.65, సంపుటి 5)**

**కాబట్టి ఉత్తమ సమాజంలోని సభ్యులు ఉత్తమమైన పేర్లు పెట్టుకోవడమే ఉత్తమం. మరొక ఉత్తమ లక్షణం గురించి ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో చెప్పుకుందాం ...**

**మీ బంధువులు మరియు స్నేహితులను శాంతిబాట చందా దారులుగా చేర్చి సత్యాన్ని వ్యాపింప చేయడంలో సహకరించమని కోరుతున్నాము.**

**డి.టి.డి.సి. కొరియర్ ద్వారా కాపీని పొందగోరువారు సంవత్సర చందా రూ. 200/- కు అదనంగా మరో రూ. 100/- చెల్లిస్తే, మీకు కొరియర్ ద్వారా పంపిన వెంటనే కన్‌సైన్‌మెంట్ నంబర్ మీకు ఎస్.ఎమ్.ఎస్. చేస్తాము, ఇన్షా అల్లాహ్**

### కొత్తగా చేరిన పాఠకులకు మా విన్నపం

మాకు ఉన్న పోస్టల్ లైసెన్స్ ప్రకారం ప్రతీ నెల 15వ తారీఖున శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది. ఒకొక్కసారి కొన్ని వ్యాసాల పరిశోధన కొరకు ఎక్కువ సమయం అవసరమౌతుంది. సాంకేతిక సమస్యల వలన కూడా పత్రిక ఆలస్యం కావచ్చు.

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి
తెలియజేయవలసిందిగా కోరుతున్నాము

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**
SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)
**మరియు 2వ సంవత్సరం సంచికలు కావలిసిన వారు**
**రూ. 365/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే**
**మా వెబ్‌సైట్ www.saanthibaata.net నుండి**
**ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.

# తిరిగి గూటికి

దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం వంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో అల్లాహ్ ధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా 'ఇస్లామ్'లోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా వారికి కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవన విధానంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి వారిలో కొందరికి మరికొంత సమయం పట్టవచ్చు. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకమైన అవస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్'ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

## నవ ముస్లిమ్? | New Muslim?

*అబూబక్ర్ సిద్దీఖ్(రజి), ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి), అలీ బిన్ అబీ తాలిబ్(రజి) మొదలైన విశ్వాసులంతా ఇస్లామ్ స్వీకరించిన వారే! వీరిని నవముస్లిములుగా ఎవరూ పరిచయం చేయలేదు. నమాజ్ చేయడం నేర్చుకునే వరకో లేక మస్జిద్ అలవాటు అయ్యే కొన్ని రోజుల వరకో తోటి ముస్లిములకు తెలియడానికై 'నవముస్లిమ్' అనే పదాన్ని వారి కొరకు ఉపయోగించవచ్చు. కాని వారికి ఇస్లామ్ ధర్మంపై పూర్తి అవగాహన ఏర్పడి ఇస్లామ్ ప్రకారం వారి ఆచరణ ఉన్నప్పుడు, ఎన్ని సంవత్సరాలైనా సరే వారిని 'నవ ముస్లిములు'గా పరిగణించడం సరికాదు.*

## ఏ భాష అయినా ఒక్కటే! | అంతా సమానమే!

ఖుర్'ఆన్ అరబీ భాషలో అవతరించింది. అరబీ భాష ముస్లిములకు అతి ముఖ్యమైన మరియు నేర్చుకోవలసిన భాష. 'ఉర్దూ' భాష భారతీయ భాషలలో ఒక భాష మాత్రమే. 'ఉర్దూ' అంటే మార్కెట్ అని అర్థం. ఇది అరబ్బులు మరియు భారతీయుల మధ్య వ్యాపార లావాదేవీల కొరకు తయారైన భాష. అరబీ భాష కాకుండా, ఇతర ఏ భాష అయినా ముస్లిములకు ఒక్కటే! ఇస్లామ్‌లో రంగు, తెగ, లేమి, కలిమి, భాష, ప్రాంతం మొ॥న వాటిని బట్టి ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. అందరూ సమానమే! కేవలం ధర్మ పరాయణత మాత్రమే ముస్లిముల స్థాయిని నిర్దేశించే కొలమానం. తెలుగు మాట్లాడేవారి కొరకు ఒక మస్జిద్, వేరే భాష మాట్లాడేవారికి మరొక మస్జిద్ ఏర్పాటు చేయాలని చేసే ఏ ప్రయత్నమైనా సున్నత్‌కి వ్యతిరేకమైనదే! అందరినీ కలిపి ఉంచే ధర్మమే ఇస్లామ్ (శాంతి).

**నవ ముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం – 12**

*శాంతిబాట మొదటి సంవత్సరంలో విదేశాలలో ఇస్లామ్ స్వీకరించిన ఏడుగురు సోదరీమణుల గురించి తెలియజేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరం తొలి సంచికయైన ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్'ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. వాస్తవ సంఘటనల ద్వారా సమస్యల పరిష్కారాన్ని తెలియజేసే ఉద్దేశ్యంతో ముహమ్మద్(స)వారి అనుచరులైన బిలాల్(రజి), అబుజర్(రజి), సల్మాన్ ఫార్సీ (రజి), అబూ ఉబైదా(రజి), సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి), అమ్ర్ బిన్ ఆస్(రజి)వారి జీవితచరిత్రలను క్లుప్తంగా అందించడం జరిగింది. ఇవన్నీ చదివితే ఎవరికైనా తమ సమస్యలు, పైన వివరించిన విశ్వాసుల సమస్యల కంటే చాలా చిన్నవిగా కనిపిస్తాయి. సులువుగా తమ సమస్యలను పరిష్కరించుకో గలమనే మనో ధైర్యం వారిలో ఏర్పడుతుంది. గత మూడు సంచికల నుండి విశ్వాస స్త్రీల జీవితచరిత్రలను ఓ ఆరు నెలల పాటు అందించాలని అల్లాహ్ పేరుతో సంకల్పించడం జరిగింది. **క్రిందటి సంచికలో ఉమ్మె సులైమ్ (రజి) వారి గురించి, ఆమె విశిష్ఠత గురించి క్లుప్తంగా తెలియజేశాము.**

# ఉమ్మెఅమ్మారహ్ అన్సారియా (రజి)

**ఇస్లామీయ చరిత్రలోనే ధీరవనితగా, The Lady of the Battle of Uhud గా పేరు పొందిన విశ్వాసురాలు. ఆమె కుటుంబం స్వర్గంలో తన సహచర్యంలో ఉండేలా చేయమని ప్రవక్త(స)వారు అల్లాహ్‌ను వేడుకున్నారు**

**త్యాగం మరియు సహనం కలిగిన ధీరవనిత. అల్లాహ్‌ను మరియు ఆయన సందేశహరుడిని అమితంగా ప్రేమించిన అన్సార్ మహిళ. ఒక స్త్రీ ధర్మపరాయణురాలైతే, బిడ్డల విశ్వాసం ఏ స్థాయిలో ఉంటుందో చెప్పడానికి ఓ ఉదాహరణ.**

ఆమె బనూ నజ్జార్ తెగకు చెందినవారు. బనూ నజ్జార్ తెగ ఖజ్‌రజ్ తెగ యొక్క ఒక శాఖ. ప్రవక్త(స)వారి తాతయ్యగారి తల్లిగారు ఈ తెగకు చెందినవారు. ఉమ్మె అమ్మారహ్(రజి) ఇద్దరు కుమారులు షహీద్ లయ్యారు. మరియు ఆమె సోదరుడు అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బద్ర్ యుద్ధంలో ముహమ్మద్(స)వారి సహచరుడు. **ఆమె మోమినా** (విశ్వాసురాలు) **మరియు విధేయురాలైన భార్య మరియు ప్రేమించే తల్లి.** ఆమె సహనం మరియు ఓర్పు గమనార్హం. ఆమెకు ఖుర్'ఆన్ మరియు హదీస్ గ్రంథాలలో జ్ఞానం ఉంది. విశ్వాసం గల ఎందరో మహిళలకు ఈమె ఒక ఉదాహరణ.

ముస్'అబ్ బిన్ ఉమైర్(రజి) రెండవసారి ఓ పర్వత మార్గంలో అల్లాహ్ మరియు ఆయన సందేశహరునికి విధేయత చూపడానికి కొందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. వారిలో 72 మంది పురుషులు మరియు ఇద్దరు స్త్రీలు ఉన్నారు. ఆ ఇద్దరిలో ఒకరు **ఉమ్మె అమ్మారహ్(రజి).** ప్రవక్త(స)వారు కూడా అక్కడికి చేరుకున్నారు. రెండవ మహిళ ఉమ్మె మునీ అస్మా బిన్త్ అమ్ర్ బిన్ అదీ. ఇద్దరు మహిళలు కూడా ఆయన చేతిపై ప్రమాణం చేయాలనుకుంటున్నట్లు ప్రవక్త(స)వారికి తెలియజేయ బడింది.

నిబంధనలు పురుషులకు మరియు స్త్రీలకు ఒకటే. కాని ఒకటే తేడా - ప్రవక్త(స)వారు తన చేతిపై పురుషుల చేతనే ప్రమాణం తీసుకుంటారుగాని, స్త్రీలతో చేతులు కలపరు. ఈ విధేయతా ప్రమాణం తీసుకున్న సంఘటననే ఇస్లామీయ చరిత్రలో బైతుల్ అఖబహ్ తానియహ్ (రెండవ ప్రమాణం) అంటారు.

ఉమ్మె అమ్మారహ్ మదీనాకు తిరిగి వచ్చారు విధేయతా ప్రతిజ్ఞ పూర్తి చేసి. ఆమె ఇస్లామీయ బోధనల ప్రకారం మహిళలకు శిక్షణ ఇస్తుండేవారు. ఈమె అసలు పేరు నసీబహ్. ఉమ్మె అమ్మారహ్ (రజి)వారికి మొదటి భర్త జైద్ బిన్ ఆసిమ్(రజి)ద్వారా ఇద్దరు కుమారులు కలిగారు - అబ్దుల్లాహ్ మరియు హబీబ్(రజి). వీరిద్దరూ ప్రవక్త(స)వారికి సహచరులయ్యారు. జైద్(రజి)వారు మరణించిన తరువాత ఆమె రెండవ వివాహం చేసుకున్నారు. ఆ వివాహం ద్వారా ఆమెకు తమీమ్ అనే కుమారుడు మరియు ఖౌలహ్ అనే కుమార్తె కలిగారు.

**ఈమె ఉహుద్, హునైన్, యమామహ్ యుద్ధాలలోనూ మరియు హుదైబియా ఒప్పందంలోనూ పాల్గొన్నారు. ఉహుద్ యుద్ధంలో ఖడ్గంతో ఆమె చూపిన నైపుణ్యాన్ని చూసినవారు ఆశ్చర్యచకితు లయ్యారు.**

వాస్తవానికి ఉహుద్ యుద్ధం ప్రారంభంలో ఇతర స్త్రీలతో పాటు గాయపడిన సైనికులకు సపర్యలు చేయడం మరియు నీరు అందించడం చేశారు. కాని ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. కొద్దిమంది ధైర్య వంతులు మాత్రమే ప్రవక్త(స)వారి చుట్టూ ఉన్నారు. అటువంటి పరిస్థితిలో ప్రవక్త(స)వారి రక్షణ కోసం ఆమె కత్తి మరియు డాలు చేపట్టారు. ప్రవక్త(స)వారు చెప్పారు, యుద్ధరంగంలో ఆయన

ఏ దిశవైపు చూస్తే అటు ఆయనకు రక్షణగా ఆమె ఉండి పోరాడటాన్ని ఆయన(స) చూసేవారు.

ఉహుద్ యుద్ధం క్లిష్ట దశను ఆమెయే స్వయంగా వర్ణించారు. ముజాహిదీన్‌లు ఓటమికి చేరువలో ఉన్నారు మరియు వారు చెల్లా చెదురైపోయారు. ఆమె తన ఇద్దరు కుమారులతో మరియు భర్తతో కలిసి ప్రవక్త(స)వారి చుట్టూరా ఉండటానికే ప్రయత్నించారు ఆయనపై ఎవరైనా దాడి చేస్తే తిప్పికొట్టడానికి. ఆమె ఒక చేతిలో కత్తి మరియు మరో చేతిలో డాలు ఉంది. శతృవులలో ఒకడు ఆమెపై దాడి చేశాడు. ఆమె తన డాలుతో ఆ దాడిని ఎదర్కోవడమే కాకుండా అతడి గుఱ్ఱం యొక్క కళ్ళాన్ని లాగడంతో అది తిరిగిపోయింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గుఱ్ఱాన్ని కత్తితో పొడిచారు. గాయపడిన గుఱ్ఱం రౌతుతో సహా క్రిందికి పడిపోయింది. అది చూసి ప్రవక్త(స)వారు అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె అమ్మారహ్(రజి)వారిని పిలిచారు అతని తల్లికి సహాయపడమని. మరియు ఆ తల్లీ కొడుకులిద్దరూ శతృసైనికుడిని తుదముట్టించారు.

అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె అమ్మారహ్(రజి) చెప్పారు, ఉహుద్ యుద్ధంలో శతృవులు వారికి వ్యతిరేకంగా ఎంత బలంగా ముందుకు చొచ్చుకు వచ్చారో! వారి ముందే ముజాహిదీన్‌లు చెల్లాచెదురయ్యారు. ఆయన మరియు అతని తల్లి ప్రవక్త(స)వారి దగ్గరగా కదిలారు. ఆయనకు అన్నివైపులా రక్షణ వలయంలా. శతృవుపై దాడి చేయుమని ప్రవక్త(స)వారు అతనికి పిలుపు నిచ్చారు. అతడు అవిశ్వాసి వైపు రాయి విసిరాడు. అది శతృవు స్వారీ చేస్తున్న గుఱ్ఱం కంటికి తగిలింది. ఆ గుఱ్ఱం పల్టీలు కొట్టి నేలపై పడిపోయింది. అతడు మరొక బరువైన రాయి విసిరాడు మరియు శతృవు చనిపోయాడు. ప్రవక్త(స)వారు సంతోషించారు. మరియు తరువాత ఉమ్మె అమ్మారహ్(రజి) భుజం నుండి రక్తం కారడం గమనించారు. ఆయన(స) అబ్దుల్లాహ్(రజి)వారితో గాయానికి కట్టు కట్టమని చెప్పారు మరియు ఆ కుటుంబాన్ని ఆయన(స) ప్రశంసించారు.

వారిపై అల్లాహ్ అనుగ్రహాలకై ప్రవక్త(స)వారు దు'ఆ చేశారు. మరియు వేడుకున్నారు స్వర్గంలో కూడా వారు తనకు స్నేహితులుగా ఉండాలని.

ప్రవక్త(స)వారి పెదవుల నుండి అటువంటి పదాలు వినగానే ఉమ్మె అమ్మారహ్(రజి) మరియు ఆమె కుమారుని సంతోషానికి హద్దులు లేకుండా పోయింది. ఇక వారు రెట్టించిన ఉత్సాహంతో సాహసోపేతంగా పోరాడారు.

అబ్దుల్లాహ్(రజి)వారి ఎడమ చేతిపై గాయమైంది. రక్తం విపరీతంగా కారుతుంది. ప్రవక్త(స)వారు వెంటనే ఆ గాయానికి కట్టు కట్టమన్నారు. కుమారుడు చేయినుండి రక్తం కారుతుండటం చూసి కట్టుకట్టిన ఆమె, ధైర్యాన్ని కోల్పోవద్దని చివరి వరకూ శతృవుపై యుద్ధం చేయమన్నారు. ప్రవక్త(స)వారు చిరునవ్వు నవ్వారు ఆ తల్లీకొడుకుల సాహసాన్ని చూసి మరియు అన్నారు: **"ఎక్కడి నుండి ఎవరైనా ధైర్యాన్ని పొందగలరు నీ వలే, ఓ ఉమ్మె అమ్మారహ్?"**

ఉమ్మె అమ్మారహ్(రజి)వారు ప్రవక్త(స)వారి ముందు నిలుచున్నారు ఖడ్గంతో, అప్పుడు అదే వ్యక్తి వారి ముందుకు వచ్చాడు. ప్రవక్త(స)వారు ఆమెకు చూపారు, ఆ వ్యక్తే ఆమె కుమారుడిని గాయపరిచాడు. ఆమె అతనిపై బలమైన దెబ్బ వేశారు. దానితో వాడి కాలు తెగిపోయింది. వాడు బోర్లా పడిపోయాడు, కొందరు ముజాహిదీన్‌లు వాడిపై పడి వాడిని చంపారు. ఉమ్మె అమ్మారహ్(రజి)వారు చూపిన బలానికి మరియు ధైర్యానికి ప్రవక్త(స)వారు చాలా ప్రభావితం అయ్యారు. ఆయన(స) చిరునవ్వు నవ్వారు మరియు ఆమె దు:ఖాన్ని తగ్గించి నందుకు మరియు ఆమె కళ్ళముందే శతృవు మరణంచే బదులు తీర్చుకునేలా చేసిన అల్లాహ్‌కు కృతజ్ఞత తెలుపుకున్నారు.

ప్రవక్త(స)వారు ఒకసారి తనతో చెప్పారని ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)వారు చెప్పారు : ఉహుద్ యుద్ధంలో ఎటువైపు ఆయన తిరిగినా, కుడివైపుగాని లేదా ఎడమవైపు, ఆయన చూసారు ఉమ్మె అమ్మారహ్ (రజి)వారిని ఆయనకు రక్షణగా నిలబడి యుద్ధం చేస్తూ.

ఈ యుద్ధంలో ఆమెకు కనీసం 12 పెద్ద గాయాలయ్యాయి. ఇబ్నె ఖుమిఅహ్ అనే అవిశ్వాసి ఆమెపై దాడిచేసాడు. ఆమె భుజంలో చాలా లోతుగా గాయమైంది. వాడు రెండు కవచాలు ధరించాడు. అయినా సరే ఆమె ధాటికి నిలవలేక పారిపోయాడు. ప్రవక్త(స)వారు కట్టు కట్టారు. అది చాలా లోతుగా దిగడంతో ఆమె స్పృహ తప్పారు మరియు అది నయం కావడానికి దాదాపు సంవత్సరం పట్టింది. స్పృహ నుండి మరలా తేరుకోగానే ఆమె అడిగిన మొదటి ప్రశ్న ప్రవక్త(స)వారి క్షేమం గురించే. తన కుమారులు మరియు తన భర్త క్షేమం కంటే ప్రాధాన్యత ప్రవక్త(స) వారికి ఇచ్చారామె.

ఆయన(స) క్షేమంగా ఉన్నారని తెలుసుకుని అల్లాహ్‌కు కృతజ్ఞత తెలుపుకున్నారు. **"అల్లాహ్ సాక్షి! ఈ రోజు ఉమ్మె అమ్మారహ్(రజి) అసమాన ధైర్యాన్ని చూపారు"** అని ప్రవక్త(స)వారు ప్రశంసించారు. ''ఓ రసూలల్లాహ్(స)! మా కోసం ప్రార్థించండి స్వర్గంలో కూడా మీ సహచర్యంలో ఉండేందుకు''. హునైన్ మరియు మక్కా విజయం తరువాత, ఉమ్మె అమ్మారహ్ మార్గభ్రష్టుడైన ముసైలమహ్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో కూడా వీరోచితంగా పోరాడారు.

ఉహుద్ యుద్ధం తరువాత ముస్లిములు ప్రవక్త(స)వారి నేతృత్వంలో మదీనా చేరుకున్నాక, ఆయన ప్రకటించారు వారంతా హమ్‌రా అల్-అసద్ అనే చోటుకి కవాతు చేయడానికి సిద్ధంగా ఉండమని ముష్రిక్‌లను తరమడానికి. ముజాహిదీన్‌లు మదీనాలో ఒక్క రాత్రే గడిపారు. ఉమ్మె అమ్మారహ్(రజి)వారు కూడా లేచారు వారితో కలిసి వెళ్ళడానికి. శతృవులతో తరమడానికి సిద్ధపడ్డారు కాని తీవ్రమైన గాయాలతో ఆమె నీరసించి పోయారు. ఆమె వెళ్ళలేకపోయారు.

ప్రవక్త(స)వారు తిరిగిరాగానే ఆయన ఆమె సోదరునితో ఉమ్మె అమ్మారహ్ (రజి) క్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె గాయాల నుండి తేరుకుంటున్నారని తెలుసుకుని ఊరట చెందారు. మరియు అల్లాహ్ చూపిన కారుణ్యానికి ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

ఉమ్మె అమ్మారహ్ మరియు మరికొందరు మహిళలు బనూ ఖురైజహ్ తెగతో జరిగిన యుద్ధంలో పాల్గొన్నారు. ప్రవక్త(స)వారు యుద్ధప్రాప్తినుండి వారికి కూడా భాగాన్ని ఇచ్చారు.

హుదైబియా ఒప్పంద సమయంలో కూడా ఆమె చాలా ఉత్సాహంగా ఉన్నారు. ముస్లిములు మక్కా చేరకుండా ఖురైషలచే హుదైబియా అనే ప్రాంతంలో ఆపివేయబడ్డారు. ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి)వారిని రాయబారిగా నియమించి మక్కాకు పంపారు సంప్రదింపుల కోసం. ఆయన తిరిగి రావడం ఆలస్యం కావడంతో, ఆయన హత్యకు గురి అయ్యారనే వదంతులు వ్యాపించాయి. ప్రవక్త(స)వారి ఆదేశంతో చెట్టు క్రింద ముస్లిములందరూ అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరునికి ప్రమాణం చేయడం ప్రారంభించారు.

ఆయుధాలు కలవారు వాటిని తీసుకున్నారు. ఉమ్రహ్ కోసం బయలు దేరడంతో చాలామంది ఆయుధాలు తీసుకురాలేదు. ఉమ్మె అమ్మారహ్ (రజి) వారు చెప్పారు ఆమె దగ్గర ఒక కర్ర ఉందని మరియు ఆమె బెల్ట్‌లో కత్తి నుంచారు, ఒకవేళ శతృవు దాడిచేస్తే ఎదుర్కోవడానికి. ఉస్మాన్(రజి)వారి హత్య అనేది పుకారు అని తేలిపోవడంతో హుదైబియా ఒప్పందం జరిగింది.

**వాస్తవానికి విశ్వాసులు చెట్టు క్రింద నీతో చేసిన శపథం చూసి అల్లాహ్ సంతోషించాడు మరియు వారి హృదయాల స్థితి ఆయనకు తెలిసిందే కావున ఆయన వారి మీద శాంతిని అవతరింప జేశాడు మరియు బహుమానంగా వారికి సమీప విజయాన్ని ప్రసాదించాడు. మరియు అందులో వారు చాలా విజయ ధనాన్ని కూడా పొందుతారు. మరియు అల్లాహ్ సర్వశక్తివంతుడు, మహా వివేచనాపరుడు.**(ఖుర్ఆన్ 48:18-19)

ఇరవైమంది మహిళలు ఖైబర్ యుద్ధంలో పాల్గొన్నారు. వారిలో ఒకరు - ఉమ్మె అమ్మారహ్(రజి). ముస్లిములకు విజయం లభించగానే, స్త్రీలకు కూడా యుద్ధప్రాప్తిలో వాటా ఇవ్వబడింది. ఉమ్మె అమ్మారహ్ (రజి)వారి వాటాలో ఖరీదైన దుస్తులు మరియు ఆభరణాలు మరియు రెండు దీనార్లు ఉన్నాయి.

హునైన్ యుద్ధంలో కూడా ఆమె చాలా వీరోచితంగా పోరాడారు మరియు యుద్ధప్రాప్తిలో కొంత పొందారు. బనూ హువాజిన్ తెగ వ్యక్తి పతాకాన్ని ఊపుతూ యుద్ధరంగంలో అడుగుపెట్టాడు. ఆమె ఒంటె వెనుక నుండి చాలా గట్టిగా కొట్టారు అది తొట్రుపడి మరియు క్రింద పడిపోయింది. రౌతు కూడా పడిపోయాడు. ఆమె అతనిపై దాడి చేశారు, అతడు తిరిగి ఎన్నడూ కోలుకోలేనంతగా.

**ప్రవక్త(స)వారు ఉమ్మె అమ్మారహ్ కుమారుడైన హబీబ్ బిన్ జైద్ (రజి)వారిని తన ప్రతినిధిగా మార్గభ్రష్టుడైన ముసైలమహ్ దగ్గరకు పంపారు వాడిని సన్మార్గంలోకి తీసుకురావడానికి. రాయబార నీతి నిబంధనలను కూడా ఉల్లంఘించి, ఆ హీనుడు హబీబ్(రజి)వారిని పట్టుకుని ఓ స్తంభానికి కట్టివేసి అడిగాడు, "నీవు ముహమ్మద్(స)ని అల్లాహ్ యొక్క సందేశహరునిగా సాక్ష్యమిస్తున్నావా?" ఆయన ఔనని సమాధానమిచ్చారు. అతడు అడిగాడు తనను కూడా అల్లాహ్ యొక్క సందేశహరునిగా సాక్ష్యమిస్తున్నావా? అని. ఆయన తనకు వినబడటం లేదని చెప్పారు. వాడు ఆ ప్రశ్నను పదే పదే అడిగాడు. హబీబ్(రజి)వారు కూడా అదే సమాధానం పదే పదే చెప్పారు. ఆ క్రూరుడు ఆయన శరీరం నుండి ఒక్కొక్క భాగాన్ని ఒకదాని తరువాత ఒకటిగా ఖండించాడు మరియు హబీబ్(రజి)వారు ఆ విధంగా షహీద్ అయ్యారు. ఖండించే ప్రతిసారీ ప్రశ్నిస్తూనే ఉన్నాడు.**

ఉమ్మె అమ్మారహ్(రజి)వారికి ఈ విషయం తెలిసింది. ఆమె చూపిన సహనం ఆదర్శప్రాయం. **విశ్వాసంలో తన కుమారుడు చూపిన స్థిరత్వం పట్ల ఆమె అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.** చూపారు. ప్రవక్త(స)వారు ఆ కుటుంబాన్ని ఓదార్చారు మరియు వారికొరకు ప్రార్థించారు. **ముసైలమహ్‌పై బదులు తీర్చుకుంటానని ఆమె శపథం చేశారు.**

అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు ఖలీఫా అయిన తరువాత మార్గభ్రష్టుడైన ముసైలమహ్ సైన్యం చేసిన సవాల్‌ను ఎదుర్కోవడానికి సైన్యాన్ని పంపారు. ఉమ్మె అమ్మారహ్(రజి)వారు కూడా ఆ సైన్యంలో ఉన్నారు. ఆ సమయానికి ఆమెకు 60 సంవత్సరాలు మరియు ఆమె కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ జైద్(రజి) కూడా ఆమెతో ఉన్నారు. ఆ యుద్ధంలో ఆమె చేయి తెగిపోయింది. 11 గాయాలు అయ్యాయి ఆమెకు. ముస్లిముల సైన్యాధిపతియైన ఖాలిద్ బిన్ వలీద్, నూనెను మరిగించి అందులో ఆమె చేతినుంచారు నయం కావడానికి.

ముసైలమహ్ 40వేల మంది సైన్యంతో ముస్లిములపై యుద్ధానికి దిగాడు. వాడి కుమారుడు వెనుకంజ వేస్తున్న తన తెగను రెచ్చగొట్టాడు. అతని ప్రసంగంతో వారు మరలా బలం పుంజుకున్నారు. ముస్లిములకు అంత పెద్ద సైన్యంతో యుద్ధం చేయడం అదే మొదటిసారి.

పరిస్థితి క్లిష్టంగా ఉంది. ముస్లిముల సైన్యాధిపతియైన ఖాలిద్ బిన్ వలీద్(రజి), ముస్లిముల లోని ప్రతీ తెగ నాయకుడిని పిలిచి వారి వారి పతాకాలతో పోరాడమని చెప్పారు. ఏ తెగవారు ఎక్కువ ధైర్యంతో పోరాడుతున్నారో తెలుస్తుంది అని చెప్పారు. సైన్యాధిపతి వ్యూహం ఫలించింది. పోరాటంలో పోటీ పెరిగింది.

ముసైలమహ్ సైన్యం పారిపోయి ద్వారం మూసేసి లోపల గడియ పెట్టుకున్నారు. బరా బిన్ మాలిక్(రజి) గోడ ఎక్కి అవతలివైపు దూకి వీరోచితంగా పోరాడి లోపలి నుండి ద్వారాలు తెరిచారు.

ఉమ్మె అమ్మారహ్(రజి)వారు ముసైలమహ్‌ని చంపడానికి ముందుకు చొచ్చుకుపోయారు. ఆమె చేసిన ఆ ప్రయత్నంలో ఆమె తన చేతిని పోగొట్టుకున్నారు. ముసైలమహ్ క్రిందపడి ముక్కలు ముక్కలు కావడం చూసారు. ముసైలమహ్‌ను చంపిన వారిలో తన కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ జైద్(రజి) కూడా ఉన్నారు. ఆమె చుట్టూ చూసారు, తన కుమారుడు తన ప్రక్కనే ఉన్నాడు. ***తన చేయి కోల్పోయిన బాధ కంటే ముసైలమహ్ చనిపోయాడనే సంతోషం ఆమెకు ఎక్కువైంది. ఆమె సలాత్ చేసి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.***

ఆమె చేతి గాయం నయం కావడానికి ఖాలిద్ బిన్ వలీద్(రజి)వారు చూపిన శ్రద్ధను గుర్తు చేసుకుని ఎప్పుడూ ప్రశంసించేవారు.

ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు ఖలీఫాగా ఉన్న కాలంలో కొన్ని అందమైన మరియు అరుదైన వస్త్రాలు ఆయనకు పంపబడ్డాయి. వాటిలోని ఒకటి చాలా బాగుంది మరియు పెద్దగా కూడా ఉంది. కొందరు సహచరులు దానిని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)వారి భార్యకు బహుమతిగా పంపమని సూచించారు.

కాని ఉమర్(రజి)వారు అన్నారు ఆయనకు ఒకరు తెలుసునని, ఆమె ఈమె కంటే కూడా ఉత్తమురాలని మరియు ప్రశంసించబడ్డారామె మరెవరి చేతో కాదు స్వయంగా ప్రవక్త(స)వారిచే. ఆయన దానిని ఉమ్మె అమ్మారహ్ (రజి)వారికి పంపారు. ఉమర్(రజి)వారు బహుమతి పంపే సమయానికి ఆమె మదీనాలో ఓ చిన్న ఇంట్లో నివశించేవారు. ఆమె చాలా కాలం బ్రతికారు.

ప్రవక్త(స)వారితో ఒకసారి ఆమె, ఖుర్‌ఆన్‌లో కేవలం పురుషులే ప్రస్తావించబడుతున్నారని మరియు స్త్రీలు తరచుగా ప్రాముఖ్యతను కోల్పోతున్నారని చెప్పారు. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది.

**నిశ్చయంగా ముస్లిమ్ పురుషులు మరియు ముస్లిమ్ స్త్రీలు, విశ్వాసులైన పురుషులు మరియు విశ్వాసులైన స్త్రీలు, భక్తిపరులైన పురుషులు మరియు భక్తిపరులైన స్త్రీలు, సత్యవంతులైన పురుషులు మరియు సత్యవంతులైన స్త్రీలు, ఓర్పుగల పురుషులు మరియు ఓర్పుగల స్త్రీలు, వినమ్రత గల పురుషులు మరియు వినమ్రత గల స్త్రీలు, దాన శీలురైన పురుషులు మరియు దాన శీలురైన స్త్రీలు, ఉపవాసాలు ఉండే పురుషులు మరియు ఉపవాసాలు ఉండే స్త్రీలు, తమ మర్మాంగాలను కాపాడుకునే పురుషులు మరియు కాపాడుకునే స్త్రీలు మరియు అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే పురుషులు మరియు అత్యధికంగా స్మరించే స్త్రీలు, ఇలాంటి వారి కొరకు అల్లాహ్ క్షమాభిక్ష మరియు గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు.** (ఖుర్‌ఆన్ 33:35)

**ప్రవక్త(స)వారి మహిళా అనుచరులలో ఆమెకున్న స్థానం ప్రత్యేకమైనది.**

భార్య, భర్త మరియు బిడ్డలు - మొత్తం కుటుంబమే వీరోచితంగా పోరాడింది. అందుకే వారిని స్వర్గంలో కూడా తనకు స్నేహితులుగా చేయమని వేడుకున్నారు ప్రవక్త(స).

ప్రవక్త(స)వారు తరచుగా ఆమె ఇంటికి వెళ్ళి ఆమె క్షేమం గురించి తెలుసుకునేవారు. ప్రవక్త(స)వారి మరణం తరువాత అబూబక్ర్ సిద్దీఖ్ (రజి)వారు ఆమె ఇంటికి వెళ్ళి ఆమె క్షేమం గురించి తెలుసుకునేవారు.

ఆమె కొన్ని హదీస్‌లను ఉల్లేఖించారు.

**ఈ శీర్షికలో వివరిస్తున్న తొలి ముస్లిమ్ మహిళల ఆచరణలు అల్లాహ్‌చే అనుగ్రహించబడ్డాయి. వారు శీలవంతులు. గొప్ప విశ్వాసాన్ని కలిగినవారు. భర్తలకు ఎంతో విధేయత చూపిన మహిళామణులు. కాస్తంత విశ్వాసమైనా ఉన్నవారికి, వారు చేసిన పనులలో ఉత్తమ సంకల్పమే కనిపిస్తుంది. కాని ఎవరికైనా అవి వేరే విధంగా అనిపిస్తే, అటువంటివారు తమ విశ్వాసంపై సందేహపడాలి.**

స్వర్గమనేది ఉచితంగా లభించేది కాదు. నోటితో కలిమా పఠించేసినంతమాత్రాన లభ్యం కాదు. మనస్సులో విశ్వాసం ఉండాలి. **ఈ ధీరవనిత ఎలా పోరాడారో చూసారు కదా!** మనకు సమస్యలు ఎదురైనప్పుడు, ఇటువంటి ఉత్తమ అనుచరుల గురించి ఓసారి జ్ఞాపకం చేసుకుంటే మనకున్న సమస్యలు చాలా చిన్నవిగా, అల్పంగా కనిపిస్తాయి. క్రిందటి సంచికలో వివరించిన ఉమ్మె సులైమ్(రజి)వారు విశ్వాసియైన తన భర్తపట్ల చూపిన విధేయత, శ్రద్ధ నేటి ముస్లిమ్ మహిళలకు ఆదర్శప్రాయం.

## ఉమ్మె అమ్మారహ్(రజి)వారి జీవితం నుండి నేటి ముస్లిమ్ సమాజం నేర్చుకోవలసిన పాఠాలు

యుద్ధంలో పాల్గొనడానికో మరియు శత్రువులను చీల్చి చెండాడాలనో ఆమె రాలేదు. గాయపడినవారికి సపర్యలు చేయడం కోసం మరియు ముస్లిమ్ సైనికులకు నీరు అందించడం కోసమే యుద్ధ రంగంలో అడుగు పెట్టారు. కాని పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. **ఏం చేయాలి?** ఆ సమయంలో ఒక స్త్రీ ఆలోచన ఎలా ఉంటుందో ఊహించండి.

**"ఓహ్! నేను ఒక మహిళనే! నేను ఎలా ప్రవక్త(స)వారిని కాపాడ గలను? నేను ఆయనకు ఏ విధంగా ఉపయోగపడ గలను?" అని బాధపడుతూ ఉండిపోలేదామె.**

తీవ్ర ఆందోళనకు గురి అయ్యారు. చేతిలోని నీటి పాత్రను పారవేశారు. **ప్రవక్త(స)వారి క్షేమమే ముఖ్యం.** యుద్ధ రంగం నుండి చెల్లాచెదురవుతున్న సైనికుల నుండి ఓ కత్తి లాక్కున్నారు మరియు ఓ విల్లు మరియు ఓ బాణం మరొకరి నుండి. **మగవాళ్ళు తమపై విధిగా ఉన్న బాధ్యత వదిలి పారిపోతుంటే, ఒక సాధారణ స్త్రీ తనపై విధిగా లేని బాధ్యతను తీసుకుని ముందుకెళ్లారు.**

**అంత తక్కువ సమయంలో, అటువంటి క్లిష్టపరిస్థితిలో, తీవ్ర ఆందోళన నడుమ వెంటనే ఓ నిర్ణయానికి రావడం సున్నితమైన ఓ స్త్రీకి సాధ్యమా? అవును. దానికి కారణం అల్లాహ్ యొక్క సందేశహరుని (స)పై ఉన్న ప్రేమ. ఆ ప్రేమే అంత శీఘ్రంగా ఆ నిర్ణయానికి వచ్చేలా చేసింది. ఎందుకంటే ఆమె విశ్వాసురాలు (మోమినా) కాబట్టి.**

ప్రవక్త(స)వారిపై ఉన్న ప్రేమే విశ్వాసానికి కొలమానం అవుతుంది.

వేదికలెక్కి అనర్గళంగా ప్రసంగించేవారు మరియు నాయకులు, విద్వాంసులు ఒక్కసారి తమ విశ్వాసాన్ని ఆమె(రజి) విశ్వాసంతో పోల్చుకుని చూడాలి.

అసమాన ధైర్యాన్ని చూపారామె. ఆమె బిడ్డలు కూడా తల్లిలాగే ధీరులని నిరూపించుకున్నారు. తన కుమారుడిని గాయపరచిన వాడిని ఉహుద్ యుద్ధంలో బలంగా కొట్టి బదులు తీర్చుకున్నారు. మరో కుమారుడిని మార్గభ్రష్టుడు ముసైలమహ్ ముక్కలు ముక్కలుగా ఖండిస్తే, దానికి బదులు తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేసారు.

ఉహుద్ యుద్ధంలో ఆమెకు తగిలిన గాయం వంటిది యోధుడైన పురుషునికే చాలా కష్టంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో కూడా తమ కుటుంబం కోసం దు'ఆ చేయమని ప్రవక్త(స)వారిని కోరారు గాని, **తన గాయం వలన కలిగే బాధను తగ్గించమని కోరలేదు.** అప్పటికి ఉన్న సమస్య నివారణ కాదు కావలిసింది తనకు. పరలోకం కావాలి. తన ఒక్కరికే పరలోకం కోరారా? కాదు, తన కుటుంబం అంతా పరలోకంలో స్వర్గాన్ని పొందాలనేది ఆమె కోరిక. గాయాలతో ఉన్న కొడుకును

చివరివరకూ అంటే ప్రాణం ఉన్నంత వరకూ పోరాడమని చెప్పిన వీరమాత ఆమె.

ఆమె చేసిన ఈ పని నేటి మహిళలకు కనువిప్పు కలిగించాలి. తాను మాత్రమే కాదు, తన కుటుంబం అంతా విశ్వాసం కలిగి ఉండేలా ప్రయత్నం చేయాలి. అందరికీ పరలోకంలో మేలు కలగాలని ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడాలి. భర్త మరియు బిడ్డలపై ఉండే నిజమైన ప్రేమ అంటే అదే. అంతేగాని కేవలం వారికి ఇష్టమైన కూరలు వండిపెట్టి, వారిని షాపింగ్‌లకు, పిక్‌నిక్‌లకు తీసుకెళ్లడమే ప్రేమ కాదు.

**మరి సమస్యల సంగతి!**

**సమస్యలు అంటూ బాధపడటమా?**

**శాశ్వతమైన పరలోకం కోసం ఆలోచించడమా?**

ఈ ప్రశ్నలకు ఉమ్మె అమ్మారహ్(రజి)వారి జీవితమే ఓ పరిష్కారాన్ని చూపింది. స్వర్గం మాత్రమే కాదు, ప్రవక్త(స)వారి సహచర్యం కూడా కావాలి. స్వర్గ శుభవార్త విన్నారు, భుజంలో అతి పెద్ద గాయమైనా ఇంకా రెట్టించిన ఉత్సాహంతో యుద్ధం చేశారామె. తన శరీరం ఏమైపోయినా ఫర్వాలేదనుకున్నారు.

ప్రియమైన కుమారుడు హబీబ్‌ను ముసైలమహ్ చంపిన తరువాత, రసూలుల్లాహ్(స)వారు అబూబక్ర్ మరియు ఉమర్(రజి)వారితో కలిసి ఆమెను ఓదార్చడానికి వెళ్ళారు. అది మామూలు కష్టం కాదు ఆమెకు. భుజంలో గాయం తిరిగి రేగింది. ఆ బాధ కూడా చాలా తీవ్రమైంది. **నిజానికి ఆమెపై కష్టాల మీద కష్టాలు పడుతున్నాయి. అయితే అసాధారణమైన సహనంతో భరించారు.**

### తన కుమారుడి మరణానికి బదులు తీసుకోవడానికి 60 సంవత్సరాల వయస్సులో యుద్ధంలో పాల్గొనడానికి ఖలీఫా అనుమతితో వెళ్ళారు.

తిరిగి ఆ ముసలి వయస్సులో ఆమెకు గాయాలు అయినప్పటికీ, ఇంతకు పూర్వం గాయపడిన భుజం వైపే చేయి ఖండించబడినా, ముసైలమహ్ చావును కళ్ళారా చూశారు. వహ్షీ వాడిలోకి ఈటెను గుచ్చారు. ఆమె వాడి దగ్గరికి వెళ్ళారు. గాయాలను లెక్క చేయకుండా బల్లెంతో కొట్టడం ప్రారంభించారు వాడు చచ్చేవరకూ.

ప్రవక్త(స)వారిచే ప్రశంసించబడ్డారు.

**ప్రవక్త(స)వారి క్షేమమే ఆమెకు ముఖ్యం.**

ఈ ధీర వనిత యొక్క కుమారుడు తన శరీరంలోని భాగాలను కోస్తున్నప్పుడు కూడా **విశ్వాసంలోనే స్థిరంగా ఉన్నాడు**. ఇది తెలుసుకుని నేడు విశ్వాసాన్ని తుచ్ఛమైన డబ్బుకోసం అమ్ముకుని కపట విశ్వాసులుగా మారిపోతున్న కొందరు ముస్లిములు సిగ్గుతో తలబాదుకోవాలి.

### ప్రవక్త(స)వారిపై దాడి - అప్పుడు మరియు ఇప్పుడు

ఆనాడు ఆమె ప్రవక్త(స)వారిపై ఎవరూ దాడి చేయకుండా తన ప్రాణాన్ని అడ్డుగా ఉంచారు. ఈ రోజు ప్రవక్త(స)వారు సజీవంగా లేరు. కాని ఆయన సున్నత్‌లున్నాయి. వాటిపై ఎందరో దాడి చేస్తున్నారు. ప్రవక్త(స)వారి కారక్టర్ (శీలం)పై దాడి చేస్తున్నారు.

### వివిధ జమాత్‌ల నాయకులు వాటిని ఆపకుండా పారిపోతున్నారు.

***కేవలం ఇంటి పనులు మాత్రమే చేసుకునే నేనేం చేయగలను అని నేటి ముస్లిమ్ మహిళ భావించాలా? లేక సున్నత్‌ను కాపాడుకోవాలా?***

ముసైలమహ్ వంటి దుర్మార్గులు ఆనాడే కాదు, నేడు కూడా ఉన్నారు. **ముహమ్మదుర్ రసూలుల్లాహ్** అని అనవద్దని చెబుతున్నారు. కొందరు యువతీ యువకులు, మరి కొందరు పెద్దవాళ్లు కూడా అటువంటి దుర్మార్గుల మాటలు విని కపట విశ్వాసులుగా మారిపోతున్నారు. అయితే హబీబ్(రజి)వారి శరీరభాగాలను కోసినా ఆయన విశ్వాసంలోనే స్థిరంగా ఉన్నట్లు, కొందరు యువకులు కపట విశ్వాసులను చీకొడుతున్నారు.

- మరి మహిళలుగా మీ బాధ్యత ఏమిటి?
- ఉమ్మె అమ్మారహ్(రజి)వారి వలే పోరాడుతారా? లేక
- అశక్తులమని కూర్చుంటారా?
- నేటి పోరాటం కత్తులతో కాదు.
- జ్ఞానంతో చెయ్యాలి.
- ఆ జ్ఞానాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా చేయాలి.

సున్నత్‌పై దాడిచేసేవారికి, మనం సున్నత్‌ను పాటిస్తూ కనిపించాలి. ప్రవక్త(స)వారు బోధించిన సంస్కారాన్ని ప్రతీ స్త్రీ తన కుటుంబం అంతా అమలు పరిచేలా చేసి, తన కుటుంబాన్ని ఇన్షాఅల్లాహ్ స్వర్గం వైపు నడిపించాలి.

**మీ ఆచరణ చూసి, మీరు నిలదీస్తారేమోనని కపట ప్రసంగీకులు భయపడాలి.**

- నిజమే మాట్లాడేవారికి సమస్యలు వస్తాయి.
- నిజాయితీగా బాధ్యతలు నిర్వహించేవారికి సమస్యలు వస్తాయి.
- విశ్వాసంతో గుండెను నింపుకున్నవారికి, పరీక్షలు మొదలవుతాయి.

**ఈ సమస్యల పట్ల సహనం వహించాలి.**

ఇస్లామ్‌ని అర్థం చేసుకుంటే - ఒక స్త్రీ

| | |
|---|---|
| **• మంచి కుమార్తె కాగలదు** | **• మంచి భార్య కాగలదు** |
| **• మంచి కోడలు కాగలదు** | **• మంచి తల్లి కాగలదు** |

సంపాదించిన మేడలు, ఐశ్వర్యం నిజమైన గౌరవాన్ని తెచ్చిపెట్టవు. అవి ఇతరులలో అసూయను మాత్రమే పెంచుతాయి.

**ఇస్లామీయ సంస్కారం మనం ఎక్కడున్నా, ఏ పరిస్థితులలో ఉన్నా, పేదవారిగా ఉన్నా, మనకు ఎనలేని గౌరవాన్ని తెచ్చి పెడుతుంది.**

సోదరీమణులారా ఆలోచించండి!

Science of Hadith

# హదీస్ విజ్ఞానం

( గత సంచిక తరువాయి )

13

## బుఖారీ (ర)

**( ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ )**

(194 - 256 హి.)

### బుఖారీ(ర)వారు ఓ యువకునికి ఇచ్చిన సలహా

అల్-వలీద్ బిన్ ఇబ్రాహీమ్‌గారు ఇమామ్ బుఖారీ(ర)వారి శిష్యులలోని ఒకరు. ఆ తరువాత ఆయన అర్రయ్య్ జిల్లాకు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. బాల్యం పూర్తయ్యాక హదీస్ విజ్ఞానాన్ని పొందాలనే ఆసక్తి ఆయనలో పెరిగింది. ఆయన ఆ కాలంలోని ఓ ప్రముఖ విద్వాంసుని దగ్గరకు వెళ్ళారు. ఆయనకు శిష్యుడు కావాలనే కోరికను తెలియజేశారు. ఆ విద్వాంసుడు మరెవరో కాదు ఇమామ్ బుఖారీ(ర).

**"ఓ నా కుమారా! ప్రయాణాన్ని మొదలుపెట్టడానికి ప్రయత్నించకు దాని హద్దులు నీవు తెలుసుకునేంత వరకూ** (*అంటే నీవు ఏదైతే నేర్చుకోవాలని మరియు తద్వారా ఆ కృషిలో లేదా నీవు ప్రయాణించే విద్యా పురోగమనంలో నైపుణ్యం సాధించాలని అనుకుంటున్నావో, దానికి అవసరమైనవి తెలుసుకోవాలని*) మరియు దానిని నీవు సాధించడానికి అవసరమైన ప్రతిభల గురించి నీవు తెలుసుకునేంత వరకూ.

మరియు తెలుసుకో ఒక వ్యక్తి వాస్తవంగా మరియు పరిపూర్ణంగా హదీస్ విద్వాంసుడు కాలేడు, అతడు నాలుగింటిని నాలుగింటితో వ్రాసేవరకూ మరియు ఆ నాలుగింటి ఉదాహరణ:

- అతడు వ్రాసే వరకూ 4 **దశలలో**
- అతడు వ్రాసే వరకూ 4 **స్థితులలో**
- అతడు వ్రాసే వరకూ 4 **ప్రదేశాలలో**
- అతడు వ్రాసే వరకూ 4 **విషయాలపై** మరియు
- అతడు వ్రాసుకునే వరకూ **4 రకాల వ్యక్తుల నుండి.**

**అతడు ఇవన్నీ చేసినప్పుడు,**

- 4 విషయాలు అతనికి సులభం అవుతాయి.
- మరియు అతడు పరీక్షింపబడతాడు 4 విషయాలలో.

**మరియు అతడు ఈ పరీక్షలన్నింటిలో సహనంతో ఉంటే, అల్లాహ్ అతనికి గౌరవం కలిగిస్తారు**

- ఈ లోకంలో 4 విషయాలతో. మరియు
- అతనికి నాలుగింటిని అనుగ్రహిస్తారు పరలోకంలో.

అల్-ఖాదీ అల్-వలీద్ అడిగారు, **"అల్లాహ్ మీపై కారుణ్యం కలిగించు గాక! నాకు వివరించండి మీరు నాతో ప్రస్తావించిన నాలుగు విషయాల సముదాయాలను"**

ఇమామ్ బుఖారీ(ర) చెప్పారు, "ఔను, **వ్రాసుకోవడానికి ఒకరికి అవసరమైన నాలుగు విషయాలు:**

- రసూలుల్లాహ్(స)వారి శాసనాలు మరియు ఒకరు సేకరించ గలిగేటంత సమాచారం ఆయన గురించి,
- ఆయన సహాబాలు(రజి) మరియు వారి ప్రతిభలు (మరియు వారి ఆచరణలు మరియు సాధించినవి),
- తాబి'ఈన్‌లు మరియు వారి ఆచరణలు మరియు
- మిగిలిన (ఇస్లామీయ) విద్వాంసులు - వారి జీవితచరిత్రలు, వారి పేర్లు, వారి కున్యాలు, వారు వెళ్ళిన ప్రదేశాలు మరియు వారు జీవనం సాగించిన చారిత్రక కాలాలు.

**తప్పనిసరిగా ఒకరు తెలుసుకోవలసిన ఉల్లేఖనాల ఉదాహరణలు -**

- సంపూర్ణంగా ఉండి మరియు తెగిపోని ఉల్లేఖకుల గొలుసు కలిగిన ఉల్లేఖనం
- ఉల్లేఖించే సహాబా పేరును కోల్పోయిన ఉల్లేఖనం
- మౌఖూఫ్ అయినది మరియు
- సంబంధాలు తెగిపోయిన ఉల్లేఖకుల పరంపర కలది.

**ఒకరు తప్పనిసరిగా ఉల్లేఖనాలు వ్రాసుకోవాలి -**

- అతడు చిన్న వయస్సులో ఉన్నప్పుడు
- అతడు అర్థం చేసుకునే వయస్సుకు చేరుకున్నప్పుడు
- ఒకరి యవ్వన ప్రారంభ సంవత్సరాలలో మరియు
- ఒకరి మధ్య వయస్సులో

**ఒకరు తప్పకుండా వ్రాసుకోవాలి (4 స్థితులలో) -**

- విరామం లేకుండా పనిచేసుకునేటప్పుడు
- ఖాళీగా ఉన్నప్పుడు
- పేదవానిగా ఉన్నప్పుడు మరియు
- ధనవంతునిగా ఉన్నప్పుడు

**మరియు (తప్పనిసరిగా వ్రాసుకోవాలి ఉల్లేఖనాలను మరియు జ్ఞానాన్ని నాలుగు ప్రదేశాలలో) -**

- పర్వతాల పై భాగాన
- సముద్ర ప్రయాణం చేస్తుండగా
- నగరాలలో మరియు
- ఎడారిలో

**మరియు తప్పనిసరిగా వ్రాసుకోవాలి (నాలుగు వస్తువులపై) -**

- రాళ్ళపై
- పెంకులపై
- చర్మంపై మరియు
- (జంతువుల) భుజ ఎముకలపై

ఆ సమయం వరకూ, ఒకరు వ్రాయబడిన సమాచారాన్ని కాగితంపైకి కాపీ చేసేవరకూ.

**మరియు ఒకరు తప్పనిసరిగా వ్రాసుకోవాలి (నాలుగు రకాల) వ్యక్తుల నుండి -**

- తన కంటే పై స్థాయిలో ఉన్నవారి నుండి
- తన స్థాయిలో ఉన్నవారి నుండి
- తన కంటే క్రింది స్థాయిలో ఉన్నవారి నుండి
- తన తండ్రి పుస్తకం నుండి కూడా - కాని అతడు నిర్ధారణ చేసుకోవాలి అతడు వ్రాసుకునేది తన తండ్రి యొక్క వాస్తవ చేతిరాత నుండి అని మరియు ఇతరులెవరి చేతిరాత కాదని.

**అంతేకాకుండా ఇంకనూ నాలుగు పనులు చేయడానికి కష్టపడాలి.**

- జ్ఞానాన్ని అన్వేషించడానికి
- కేవలం అల్లాహ్ కోసమే
- అల్లాహ్ గ్రంథం ప్రకారంగా ఆచరించడానికి
- తన శిష్యుల మధ్య జ్ఞానాన్ని వ్యాపింప జేయడానికి మరియు పుస్తకాలు వ్రాయడం అతని జ్ఞాపకం సజీవంగా ఉండటానికి మరణం తరువాత కూడా.''

ఇమామ్ బుఖారీ చెప్పడం కొనసాగించారు :

**"మరియు ఒకరు వీటిని సాధించలేరు నాలుగు విషయాలు లేకుండా -**

- అతడు **అల్లాహ్ దాసుడిగా**
- స్వయంగా సంపాదించుకోవాలి - **గ్రంథ జ్ఞానాన్ని**
- భాషా జానాన్ని - **అస్-సర్ఫ్** (అంటే పదాల అధ్యయనం అవి వాక్యాలుగా మారడానికి ముందుగా) మరియు
- **అన్-నహ్వు** (వాక్య నిర్మాణం అయ్యాక పదాల అధ్యయనం లేక వాక్యాలుగా వ్రాయబడినప్పుడు పదాలలో చోటు చేసుకున్న మార్పులు)

**మరియు ఒకరికి నాలుగు విషయాలు అవసరం అవి అల్లాహ్ అనుగ్రహాల నుండి (అవి అల్లాహ్ తాను కోరిన దాసులకు అనుగ్రహిస్తారు) :**

- సామర్థ్యం (మరియు ప్రతిభ)
- ఆరోగ్యం
- గుఱ్ఱం (బలమైన వాహనం-జ్ఞానాన్వేషణకై) మరియు
- జ్ఞాపకశక్తి

**వీటన్నింటితో ఒకరు అనుగ్రహించబడితే, 4 విషయాలు అతనికి సులభమౌతాయి -**

- కుటుంబం
- సంతానం
- ఐశ్వర్యం మరియు
- స్వంత ఊరు (హోమ్ లాండ్)

**మరియు 4 విషయాలలో ఒకరు పరీక్షించబడతారు :**

- అతని వైఫల్యాలు మరియు పొరపాట్లలో తృప్తిని పొందే శతృవులు
- దోషాలను వెతికే స్నేహితులు
- అతనిపై నిందలు వేసే అజ్ఞానులు మరియు
- అతడు సాధించినవాటి పట్ల అసూయ చెందే (తన కాలంలోని తోటి) విద్వాంసులు

**అతడు ఈ పరీక్షలన్నింటిలో సహనంతో ఉంటే, అల్లాహ్ అతనిని నాలుగు విషయాలతో ఈ లోకంలో గౌరవం కలిగిస్తారు.**

- జీవితంలో సంతృప్తి చెందే స్థితితో
- (అల్లాహ్ పట్ల) మిక్కిలి లోతైన విశ్వాసం ద్వారా ఇతరులలో తఖ్వా యొక్క కాంతిని అనుభూతి పొందేటట్లు చేయడంతో
- జ్ఞానం కలిగి ఉండటం వలన మధురమైన సంతృప్తితో
- నిత్య జీవితంతో (అంటే మరణించిన తరువాత కూడా అతని పుస్తకాలు మరియు అతడు వదిలి వెళ్ళిన జ్ఞానం ద్వారా)

**మరియు అల్లాహ్ అతనిని నాలుగింటితో అనుగ్రహిస్తారు పరలోకంలో -**

- తన సోదరులలో తాను కోరిన వారెవరి కొరకైనా సిఫారసుకు ఎంపిక చేసుకోగలిగే అవకాశంతో
- అర్ష్ నీడను అనుగ్రహించడంతో పునరుత్థాన దినమున ఆ నీడ తప్ప ఏ నీడా ఉండదు.
- ప్రవక్త(స)వారి కొలను నుండి నీరు త్రాగిస్తారు (పునరుత్థాన దినమున ఆ నీరు తప్ప ఏదీ దాహన్నుండి రక్షించలేదు)
- స్వర్గంలోని ఉన్నత స్థాయిలో ఉండే ప్రవక్తల సాన్నిహిత్యంలో ఉండేలా చేయడంతో''

**మరియు ఎవరు అల్లాహ్‌కు మరియు ప్రవక్తకు విధేయులై**

**ఉంటారో, అలాంటివారు అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్యవంతులతోనూ, (అల్లాహ్) ధర్మం కొరకు ప్రాణాలు కోల్పోయిన షహీద్‌లతోనూ, సద్వర్తనులతోనూ చేరి ఉంటారు. మరియు అలాంటి వారి సాంగత్యం ఎంతో మేలైనది.** (ఖుర్'ఆన్ 4:69)

"ఓ నా కుమారా! సాధారణ పదాలతో నీకు తెలియజేశాను చాలా విషయాల గురించి, నేను నా గురువుల ద్వారా ఈ విషయంపై విన్నవి. కాబట్టి ఇప్పుడు రా ఏ ఉద్దేశ్యంతో నీవు నా దగ్గరకు వచ్చావో దానిని నెరవేర్చడానికి లేదా ఆ కృషిని వదిలివేయి."

హదీస్ విద్వాంసుడు కావడం సామాన్యమైన విషయమేమీ కాదు.

హదీస్ విజ్ఞానంలో ప్రావీణ్యత సంపాదించడానికి ఎన్నో కష్టనష్టాలను భరించవలసి ఉంది.

బుఖారీ(ర)వారు హదీస్ ఉల్లేఖనాల అన్వేషణలో సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేశారు - పర్వతాల శిఖరాలకు, సముద్రాలు దాటి, ఎడారులలోకి మరియు పెద్ద నగరాల నడిబొడ్డుకి.

విద్య కోసం చేసే ప్రయాణాలలో పెంకులపై, చర్మాలపై మరియు ఎముకల భాగాలపై వ్రాయవలసి ఉంటుంది. మరియు తిరిగి నగరానికి వచ్చినప్పుడు మాత్రమే కాగితాన్ని కొని, దానిపై వ్రాయడానికి వీలవుతుంది.

ప్రవక్త(స)వారు మరియు ఆయన అనుచరుల జీవితాలను అధ్యయనం చేస్తే సరిపోదు, పెద్ద సంఖ్యలోనున్న హదీస్ ఉల్లేఖకుల జీవితాలు కూడా అధ్యయనం చేయండి. హదీస్ విద్వాంసుడు కావాలంటే తన జీవితాన్ని ఈ సబ్జక్టుకి అంకితం చేయవలసి ఉంటుంది.

అల్-వలద్ మౌనం వహించి చాలా లోతుగా ఆలోచనలో పడి, గౌరవంతో తలవంచుకుని నిలబడ్డారు. బుఖారీ(ర) వారు ప్రస్తావించిన వాటికి ఆయన తట్టుకోలేరు.

ఆ కష్టాలను తట్టుకోలేకపోతే 'ఫిఖ్' (ఇస్లామీయ న్యాయశాస్త్రం)ను అధ్యయనం చేయమని సలహా ఇచ్చారు. ఎందుకంటే అది నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఇంట్లోనే ఉండి నేర్చుకునే విషయం. ఈ విషయంలో ప్రావీణ్యం సంపాదించడానికి సుదూర ప్రాంతాలకు పయనం చేయవలసిన అవసరం లేదు.

అయినప్పటికీ ఈ అధ్యయనం కూడా తక్కువదేమీ కాదు.

బుఖారీ(ర)వారి మరణం గురించి వివరించడానికి ముందుగానే ఈ వ్యాసంలోని విషయాలు పాఠకులకు చెప్పి ఉండవలసి ఉంది. అయితే ఈ విషయాలు మరణానంతర వ్యాసంలో చెబితే హదీస్ విజ్ఞానంలో ఆయన చేసిన కృషి ఎంత ఉన్నతమైనదో అర్థమౌతుందని మా భావన.

ప్రళయం సమీపించినప్పుడు అజ్ఞానులు వేదికలెక్కి ప్రసంగిస్తారనే విషయం పాఠకులకు తెలిసినదే. ప్రస్తుతం అదే జరుగుతుంది. హదీస్‌ల విషయంలో అజ్ఞానంతో ఎవరికి తోచిన అభిప్రాయాలు వారు చెప్పేస్తున్నారు. ప్రస్తుతం ముస్లిమ్ సమాజంలో అటువంటి దౌర్భాగ్య పరిస్థితి నెలకొని ఉంది.

ఎవరైనా ఒక హదీస్ వినిపిస్తే, **అది తప్పని, అది లేదని** బాహాటంగా చెప్పేస్తున్నారు. అటువంటివారికి ముహద్దిస్‌ల గురించి, వారు వ్రాసిన పుస్తకాల గురించి అవగాహన ఉండదు. ఎన్నో వేల హదీస్‌లున్నాయి. అవి అన్నీ చదివినవారు ఎందరున్నారు? ఒకవేళ చదివినా వాటిని అధ్యయనం చేసిన వారెందరు?

**స్పష్టంగా తెలిసిన హదీస్‌ను మనం ఆచరణలో పెట్టాలి. మనం చేసే ఆచరణలు ప్రవక్త(స)వారి బోధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో ధృవీకరించు కోవాలి.**

మోమిన్‌కు మాత్రమే స్వర్గముంది. అందరికంటే, అన్నిటికంటే ముహమ్మద్(స)వారిని ప్రేమించే వాడే మోమిన్. ప్రేమించడం అంటే ముహమ్మద్(స)వారి ఆచరణలను స్వీకరించి, వాటిని అమలు పరిచేవాడు. ఆయన(స) ఆచరణలను తెలిపేవే హదీస్‌లు.

కాబట్టి హదీస్ జ్ఞానంపై కనీస అవగాహన ప్రతీ ముస్లిమ్ కలిగి ఉండాలి.

**వచ్చే సంచికలో మరో ముహద్దిస్ - ఇమామ్ ముస్లిమ్(ర)వారి బయోగ్రఫీని ప్రారంభిస్తాము, ఇన్షా అల్లాహ్.**

## ఖుర్'ఆన్ మరియు సున్నత్

అల్ మిఖ్‌దామ్ బిన్ మ'ది యక్రిబ్ వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు :

"జాగ్రత్త! **నిస్సందేహంగా నాకు గ్రంథం ఇవ్వబడింది మరియు అటువంటిదే దానితోపాటు**, జాగ్రత్త త్వరలోనే ఓ అవివేకి దిండుపై (వాలి) చెబుతాడు, "మీరు ఖుర్'ఆన్‌కు అంటిపెట్టుకుని ఉండండి. ఏదైతే మీరు దానిలో హలాల్ అని తెలుసు కుంటారో దానిని హలాల్‌గా తీసుకోండి మరియు ఏదైతే దానిలో హరామ్ అని తెలుసు కుంటారో, తీసుకోండి దానిని హరామ్‌గా".

జాగ్రత్త! పెంపుడు గాడిద హలాల్ కాదు (మీరు తినడానికి) మరియు ప్రతీ క్రూర జంతువు కోరలు కలిగినది. ము'ఆహిద్ (అంటే ముస్లిములతో ఒడంబడికలో ఉన్న ముస్లిమేతరుడు) పోగొట్టుకున్న సొమ్ము హలాల్ కాదు, దాని యజమాని దానిని వదులుకుంటే తప్ప.

ఎవరైతే ప్రజల మధ్య ఆగుతాడో, వారు అతనికి విధిగా ఆతిథ్యమివ్వాలి మరియు వారు అతనికి ఆతిథ్యమివ్వకపోతే, అతనికి హక్కు ఉంది వారి నుండి తీసుకోవడానికి, సమానమైన దానిని దేనితో అయితే వారు అతనికి ఆతిథ్యమివ్వాలో దానికి."

**(అబూదావూద్, సహీహ్, 4604, పుస్తకం 39, అధ్యా.5, సంపుటి 5)**

حَدَّثنا عَبْدُ الوَهَّابِ بنُ نَجْدَةَ : حَدَّثنا أبو عَمْرِو بنُ كَثِيرِ بنِ دِينَارٍ عنْ حَرِيز ابنِ عُثْمانَ، عنْ عَبْدِ الرَّحْمٰنِ بنِ أبي عَوْفٍ، عنِ المِقْدَامِ بنِ مَعْدِ يكرِبَ عنْ رَسُولِ الله ﷺ أنَّهُ قَالَ : ((ألا، إنِّي أُوتِيتُ الْكِتَابَ وَمِثْلَهُ مَعَهُ، الا يُوشِكُ رَجُلٌ شَبْعَانُ عَلَى أرِيكتِهِ يَقُولُ : عَلَيْكُم بِهٰذَا الْقُرْآنِ فَمَا وَجَدْتُمْ فِيهِ مِنْ حَلالٍ فَأَحِلُوهُ وَمَا وَجَدْتُمْ فِيهِ مِنْ حَرَامٍ فَحَرِّمُوهُ. ألا، لا يَحِلُّ لَكُم الْحِمَارُ الأهْلِيُّ وَلا كُلُّ ذِي نَابٍ مِنَ السَّبُعِ وَلا لُقَطَةُ مُعَاهِدٍ الا أنْ يَسْتَغْنِيَ عَنْهَا صَاحِبُهَا، وَمَنْ نَزَلَ بِقَوْمٍ فَعَلَيْهِمْ أنْ يَقْرُوهُ فَإنْ لَمْ يَقْرُوهُ فَلَهُ أنْ يُعْقِبَهُمْ بِمِثْلِ قِرَاهُ)).

ఖుర్ఆన్ అల్లాహ్ యొక్క ప్రసంగం. దాని ప్రకారంగా ఆచరించి చూపారు ముహమ్మద్(స)వారు. 'ముహమ్మద్(స)వారిలో మనకు ఆదర్శముంది' అని ఖుర్ఆన్‌లో అల్లాహుతాలాయే చెబుతున్నారు. అంతేకాకుండా తన ఇష్ట ప్రకారం ఏదీ చెప్పరని అల్లాహ్‌యే చెబుతున్నారు.

మరియు అతను మనోవాంఛలను అనుసరించి కూడా మాట్లాడడు. ఇది అతనిపై అవతరింప జేయబడిన వహీ మాత్రమే. (ఖుర్ఆన్ 53:4)

ముహమ్మద్(స)వారు మనకు నమూనా. కాబట్టి మనం ఆయన విధానాన్నే అనుసరించాలి. ఖుర్ఆన్‌తో పాటు మరొకటి ఇవ్వబడిందని ప్రవక్త(స) చెప్పారు. అది కూడా అటువంటిదే అన్నారు.

సున్నత్‌ను వ్యతిరేకించే వారున్నారా? ప్రపంచంలో మెజారిటీ ముస్లిములు సున్నత్‌ను అనుసరిస్తున్నారు. మస్జిద్ ఏ జమాత్‌కి సంబంధించినది అయినా కానివ్వండి. రోజుకు 5 సార్లు ఒకే విధమైన 'అజాన్' వినబడుతుంది.

కపట విశ్వాసులు తిరస్కరిస్తారు. వారు ఖుర్ఆన్ వాక్యాలను వక్రీకరించి ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నాలు చేస్తుంటారు.

ముహమ్మద్(స)వారు నిరోధించినా, నిషేధించినా అది అల్లాహ్ ఆదేశం ప్రకారమే జరుగుతుంది. ఆనాడు ప్రతీ సున్నత్‌ని పాటించాలని తహతహలాడేవారు.

కొన్ని సున్నత్‌లను మగవారు మాత్రమే పాటించడానికి వీలయ్యేవి. స్త్రీలకు ఆ సున్నత్ కోల్పోతున్నామనే బాధ ఉండేది. అప్పుడు వారు ప్రవక్త(స)వారికి తమ భావాలను తెలిపేవారు. దానికి సమానమైన స్త్రీలు ఆచరించగలిగే మరో సున్నత్‌ను వారికి తెలిపేవారు ఆయన(స).

సున్నత్‌ను ఆచరించడంలో ఆనాడు పోటీ పడితే, నేడు కొన్ని జమాత్‌లుగా మారిపోయి కొన్ని సున్నత్‌లను మాత్రమే ఎంపిక చేసుకుని వారి చుట్టూ గిరిగీసుకున్నారు.

ఏ జమాత్‌కి చెందినవారైనా సరే ప్రతీ సున్నత్‌ని గౌరవించవలసిందే.

ధనవంతులైన ముస్లిములు అందరూ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) వారు చేసినట్లు ధర్మం కోసం సంపదను అధికంగా ఖర్చుపెట్ట లేకపోవచ్చు. ఆ ధనవంతులు కొద్దిగానే ఖర్చు పెడుతుండవచ్చు.

దానర్థం వారు సున్నత్‌ను వ్యతిరేకిస్తున్నట్లు కాదు. అది వారి దురదృష్టంగా భావించాలి.

**అత్యధికంగా సున్నత్‌లను ఆచరణలో పెట్టి అందరూ అదృష్టవంతులు కావాలనేదే మా కోరిక, ఇన్షా అల్లాహ్!**

### గాడిద పాలు

అల్-లైస్ చెప్పారు : యూనుస్ ఉల్లేఖించారు. నేను ఇబ్నె షిహాబ్‌ను అడిగాను, "మేము గాడిద పాలతో శుభ్రం చేసుకోవచ్చా లేక దానిని త్రాగవచ్చా, అడవి జంతువుల bileను త్రాగవచ్చా లేక ఒంటె మూత్రాన్ని త్రాగవచ్చా? ఆయన సమాధాన మిచ్చారు, "ముస్లిములు స్వయంగా నయం చేసుకునేవారు వాటితో మరియు అందులో ఎటువంటి హాని చూడలేదు. గాడిద పాలుకి సంబంధించి, మేము నేర్చుకున్నదేమిటంటే, అల్లాహ్ యొక్క సందేశహరులు(స) నిరోధించారు వాటి మాంసాన్ని తినడాన్ని. కాని మేము ఎటువంటి సమాచారాన్ని తీసుకోలేదు వాటి పాలు త్రాగడం సమ్మతమా లేక నిషేధమా అనేది."

ఇబ్నె షిహాబ్ చెప్పారు, "అబూ ఇద్రిస్ ఖౌలానీ నాకు చెప్పారు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) నిరోధించారని కోరలు కలిగిన ప్రతీ అడవి జంతువు మాంసాన్ని తినడాన్ని." **(సహీహ్ బుఖారీ, 5781, పుస్తకం 76, అధ్యా. 57, సంపుటి 7)**

وَزَادَ اللَّيْثُ : حَدَّثَنِي يُونُسُ، عَنِ ابنِ شِهَابٍ قَالَ : وسَأَلْتُهُ : هَلْ نَتَوَضَّأُ أوْ نَشْرَبُ ألْبَانَ الأُتُنِ، أوْ مَرَارَةَ السَّبُعِ، أوْ أبْوَالَ الإبِلِ؟ قَالَ : قَدْ كَانَ الْمُسْلِمُونَ يَتَدَاوَوْنَ بِهَا فَلا يَرَوْنَ بذٰلكَ بأساً. فأمَّا ألْبَانُ الأُتُنِ فَقَدْ بَلَغَنَا أن رَسُولَ اللهِ ﷺ نَهَى عَنْ لُحُومِهَا، وَلَمْ يَبْلُغْنَا عَنْ ألْبَانِهَا أمْرٌ وَلا نَهْيٌ. وأمَّا مَرَارَةُ السَّبُعِ قَالَ ابنُ شِهَابٍ : حَدَّثَنِي أبُو إدْرِيسَ الخَوْلانِيُّ : أن أبا ثَعْلَبَةَ الخُشَنِيَّ أخْبَرَهُ : أن رَسُولَ اللهِ ﷺ نَهَى عَنْ أكْلِ كُلِّ ذي نابٍ مِنَ السِّبَاعِ.

ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు తప్పనిసరిగా తెలుసుకోవలిసిన ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుని జీవితచరిత్ర

ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించిన ధర్మం - ఇస్లామ్

రెండవ ఖలీఫా

# ఉమర్ బిన్ ఖత్తాబ్

రజి అల్లాహుతాలా అన్హూ

11

● అతి నిరాడంబరుడు

● ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు

అవినీతి అధికారులకు సింహస్వప్నం ●

ఓ దశాబ్దంపాటు నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ప్రజలకే కాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

(జూలై సంచిక తరువాయి ...)

## తబూక్ దండయాత్ర ...

తబూక్ దండయాత్ర గురించి ఇది వరకూ చాలా సందర్భాలలో చెప్పుకోవడం జరిగింది. అబూజర్(రజి)వారి గురించి, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)వారి గురించి 'తిరిగి గూటికి' శీర్షికలో వ్యాసాలు అందించబడ్డాయి. ఆ వ్యాసాలలో తబూక్ యాత్రలో ఎదురైన కష్టాల గురించి చెప్పడం జరిగింది. పిడికెడు ఖర్జూరాల నుండి వేల దీనార్ల వరకూ సహాబాలు ఈ తబూక్ దండయాత్ర కోసం విరాళంగా ఇవ్వడం జరిగింది.

ఉమర్(రజి)వారు తన సంపదలోని సగభాగాన్ని ఇచ్చారు. తబూక్ దండయాత్రలో ప్రజలు ఆకలి బాధకు లోనయ్యారు. "ఓ రసూలల్లాహ్(స)! మా ఒంటెలను కోయడానికి మీరు అనుమతి నిచ్చినట్లయితే, మేము వాటిని తింటాము. మరియు దాని కొవ్వు నుండి నూనె తీసుకుంటాము."

రసూలుల్లాహ్(స)వారు వారికి అనుమతినిచ్చారు. ఉమర్(రజి)వారు రసూలుల్లాహ్(స)వారి దగ్గరకి వచ్చి, ఆ అనుమతి వలన ఒంటెలు తగ్గిపోతాయని, దానికి బదులు వారి దగ్గరున్న మిగిలిన ఆహార పదార్థాలను రప్పించి, వాటిలో శుభాలు ప్రసాదించమని అల్లాహ్‌ను ప్రార్థించమని కోరారు.

రసూలుల్లాహ్(స) ఓ చర్మపు చాపను తెమ్మని చెప్పారు. దానిని నేలపై పరిచి, ప్రజల దగ్గర మిగిలి ఉన్న ఆహార పదార్థాలను తీసుకు రమ్మని చెప్పారు. ఒక వ్యక్తి పిడికెడు మొక్కజొన్న గింజలు తెచ్చాడు. మరొకాయన కూడా అదే తెచ్చాడు. ఇంకొకరు ఓ రొట్టె ముక్క తెచ్చారు. ఆ విధంగా కొద్ది పరిమాణంలో చాపపై ఆహారం సేకరించబడింది. తరువాత ప్రవక్త(స)వారు తన అనుచరులతో తమ పాత్రలను తీసుకు వచ్చి వాటిలో అక్కడ ఉన్న ఆహారాన్ని నింపమన్నారు. అద్భుతం ఆ ఆహారం పెరిగింది. ఎంతగా పెరిగింది అంటే వారందరి నిల్వపాత్రలు నిండిపోయాయి. వాటిలో నిల్వ చేయబడటమే కాకుండా ఆ ఆహారం ప్రతీ సైనికుడి ఆకలిని తీర్చింది. మరియు ఇంకా కొంత ఆహారం చాపపై మిగిలిపోయింది.

అప్పుడు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు :

**"నేను సాక్ష్యమిస్తున్నాను, లేడు ఆరాధ్యుడు అల్లాహ్ తప్ప మరియు నేను వాస్తవంగా అల్లాహ్ యొక్క సందేశహరుడను. ఆ రెండింటిపై ఎటువంటి సందేహం లేకుండా అల్లాహ్‌ను కలిసిన దాసుడు స్వర్గానికి దూరంగా ఉంచబడడు."**

❋❋❋

**ఉమర్(రజి)వారి జీవిత చరిత్రతో పాటు, ఆయన జీవితానికి సంబంధించి ఓ ముఖ్య సంఘటననుగాని, ఓ ముఖ్య విషయాన్ని గాని ప్రత్యేక కాలమ్‌గా అందిస్తూ వచ్చాము. ఆయన వ్యక్తిత్వం గురించి ఓ అవగాహన ఏర్పడుతుందనే సంకల్పంతో వాటిని అందించడం జరిగింది.**

ప్రవక్త(స)వారి ద్వారా ప్రాక్టికల్‌గా ఉమర్(రజి)వారు పొందిన శిక్షణ గురించి సందర్భాన్ని బట్టి విశ్లేషిస్తూ ఇది వరకూ కొన్ని చోట్ల చెప్పుకున్నాం. ప్రాక్టికల్‌గానే కాకుండా ముహమ్మద్(స)వారి దగ్గర కూర్చుని, ఆయన(స) చెప్పే బోధనలను చాలా శ్రద్ధగా వినేవారు. ధర్మంపై అవగాహన పెంచుకోవడానికై ఆయనను కొన్ని విషయాలపై వివరణను అడిగేవారు. ఏదైనా ప్రసంగం గాని, బోధనగాని ప్రవక్త(స)వారు చేసినప్పుడు, ముహమ్మద్(స)వారు లేచిన తరువాతనే ఉమర్(రజి)వారు లేచేవారు. ప్రవక్త(స)వారికి ఎంతో అంకితభావం గలిగిన విద్యార్థి - ఉమర్(రజి). ఉమర్(రజి)వారి ధర్మావగాహన ఎంత గొప్ప స్థాయిలో ఉండిందో, ప్రవక్త(స)వారు స్వయంగా తనకు వచ్చిన కల ద్వారా ప్రజలకు వివరించారు. శాంతిబాటలో ఇది వరకే తెలియజేశాము.

ప్రవక్త(స)వారి దగ్గర నేర్చుకున్న జ్ఞానాన్ని ఉమర్(రజి)వారు ముస్లిమ్ సమాజానికి తెలియజేశారు. ముహమ్మద్(స)వారి నుండి ఈయన 539 హదీస్‌లను (లేదా 537 హదీస్‌లను) ఉల్లేఖించారు. సహీహ్ బుఖారీ మరియు సహీహ్ ముస్లిమ్ గ్రంథాల రెండింటిలోనూ ఉమ్మడిగా 29 ఉల్లేఖనాలున్నాయి. అంతేకాకుండా అదనంగా 21 హదీస్‌లు సహీహ్ ముస్లిమ్ గ్రంథంలో ఉన్నాయి. కాని అవి సహీహ్ బుఖారీలో లేవు. సహీహ్ బుఖారీలో గ్రంథస్థం చేయబడిన మరో 34 హదీస్‌లు సహీహ్

ముస్లిమ్ గ్రంథంలో లేవు. అంటే ఈ రెండు గ్రంథాలలో 84 హదీస్‌లు ఉమర్(రజి)వారి ద్వారా అందినవే. మిగిలినవి ఇతర హదీస్ గ్రంథాలలో గ్రంథస్థం చేయబడ్డాయి.

ఆయిషా(రజి)వారు మరియు అబూహురైరా(రజి)వారితో పోలిస్తే, ఈ ఉల్లేఖనాల సంఖ్య తక్కువే. అయితే రోజురోజుకీ విస్తరిస్తున్న ముస్లిమ్ సామ్రాజ్య పరిపాలనా వ్యవహారాలలో విరామం లేకుండా ఉండటం కూడా తక్కువ హదీస్ ఉల్లేఖనాలకు కారణం కావచ్చు. ఉమర్(రజి) ద్వారా ఉల్లేఖించబడిన హదీస్‌లు అతి ముఖ్యమైన విషయాలకు సంబంధించినవే.

## ప్రవక్త(స)వారి మరణం

రసూలుల్లాహ్(స)వారి అస్వస్థత తీవ్రమైనప్పుడు, సలాత్ కొరకు పిలవడానికి బిలాల్(రజి)వారు వచ్చారు. ప్రజలకు ఇమామత్ చేయడానికి ఆ సమయంలో ఆయన అనారోగ్యం అడ్డంకి అయింది. 'ఆదేశించు ఎవరినైనా సలాత్ చేయించమని' అని అన్నారు. ఆయన దగ్గర అబ్దుల్లాహ్ బిన్ జుమ్'అహ్(రజి) ఉన్నారు. అతను బయటికి వెళ్ళారు. అక్కడ ఆయనకు అబూబక్ర్(రజి)వారు కనిపించలేదు. అక్కడున్న ప్రజలలో ఉమర్(రజి)వారు కనిపించారు. ఆయన దగ్గరికి వెళ్ళి, లేచి సలాత్ చేయించమని చెప్పారు. ఉమర్(రజి)వారు ముందుకు వెళ్ళి తక్బీర్ చెప్పారు. ఆయన స్వరం బిగ్గరగా వినిపిస్తుంది కాబట్టి ప్రవక్త(స)వారు ఆ స్వరం వినగానే, "అబూ బక్ర్ ఎక్కడ? అల్లాహ్ మరియు ముస్లిములు ఆమోదించరు ఇది" అన్నారు. అబూబక్ర్ కోసం పంపారు. మరియు ఆయన వచ్చేటప్పటికి ఆ సలాత్‌ని ఉమర్(రజి)వారు పూర్తి చేశారు మరియు అబూబక్ర్(రజి)వారు వారికి సలాత్ చేయించారు.

రసూలుల్లాహ్(స)వారు అలా చేయమని ఆదేశించారేమోనని భావించి ఉమర్(రజి)వారు సలాత్ చేయించారు. లేకపోతే చేయించి ఉండేవారు కాదు. అదే విషయాన్ని అబ్దుల్లాహ్ బిన్ జుమ్'అహ్‌తో చెప్పారు. అబ్దుల్లాహ్ గారికి కూడా ఆ విధంగా ఉమర్(రజి)కి చెప్పమని ప్రవక్త(స)వారు ఆదేశించలేదు. అయితే అబూబక్ర్(రజి)వారు కనిపించక పోయేసరికి, ఆ తరువాత అక్కడి ప్రజలలో ఉన్న యోగ్యుడు ఆయనే కనుక, ఉమర్(రజి)వారికి చెప్పడం జరిగిందని అతను వివరణ ఇచ్చారు.

ప్రవక్త(స)వారు రబీ'ఉల్ అవ్వల్ 12వ తేదీన హిజ్రీ శకం 11లో ఈ లోకాన్ని వీడారు.

### పెద్ద ఆపద

లతాఇఫ్ అల్-మ'ఆరిఫ్‌లో ఇబ్నె రజబ్ గారు ఇలా చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మరణించినప్పుడు, ముస్లిములు షాక్‌కు గురయ్యారు. గాబరా పడ్డారు. వారిలో కొందరు నిశ్చేష్టులయ్యారు. మరియు అయోమయానికి గురయ్యారు. ఇతరులు కూర్చుండిపోయారు. మరియు వారిది లేవలేని పరిస్థితి. కొందరు మాట్లాడే శక్తిని కోల్పోయారు. ఇంకనూ కొందరు (మరణించారనడాన్ని) పూర్తిగా తిరస్కరించారు. అంటే ప్రవక్త(స)వారు నిజంగా చనిపోయారనే విషయం నమ్మడానికి ఒప్పుకోలేదు. వారిలో ఉమర్(రజి)వారు కూడా ఉన్నారు.

ఇమామ్ ఖుర్తుబీ(ర)వారు చెప్పారు, "ఒక వ్యక్తి బాధపడ గలిగే పెద్ద కష్టాలలో ఒక కష్టం - **ధర్మానికి చెందిన వ్యవహారాలలో కలిగే కష్టం.** రసూలుల్లాహ్(స)వారు చెప్పారు : "మీలో ఒకరు ఒక ఉపద్రవంచే కష్టానికి గురై బాధపడినప్పుడు, అతడు జ్ఞాపకం చేసుకోవాలి నా మరణంతో అతడు ఎంత బాధపడ్డాడో, నిజంగా అది అన్ని ఉపద్రవాల కంటే చాలా పెద్దది"

ప్రవక్త(స)వారు చెప్పినది వాస్తవం. పునరుత్థాన దినం వరకూ ఏ ముస్లిమ్ కూడా ప్రవక్త(స)వారి మరణం యొక్క ఉపద్రవం కంటే ఎక్కువైన ఉపద్రవంతో బాధపడడు. భూమిపై అవతరించే వహీ (దివ్య సందేశం) ఆగిపోయింది. మరియు ప్రవక్తిత్వం గతించిన కాలానిది అయిపోయింది (ఎందుకంటే మరో ప్రవక్త రావడం అనేది జరగదు).

ప్రవక్త(స)వారి మరణం తరువాత మొట్టమొదట కనిపించిన కీడు ఏమిటంటే చాలా మంది అరబ్బులు మార్గభ్రష్టులు కావడం - ముస్లిమ్ జాతి యొక్క తొలి క్షీణతను తెలియజేసిన సంఘటన. ఆ క్షీణత ఉమర్(రజి)వారు చెప్పిన దానిని వివరిస్తుంది, "ఎప్పుడైతే ఏదైనా పరిపూర్ణ స్థాయికి చేరుకుంటుందో దానికి ఏ ప్రదేశము లేదు వెళ్లడానికి క్రిందికి తప్ప" (తఫ్సీర్ అల్-ఖుర్తుబీ నుండి)

ఇస్లామ్ ధర్మం పరిపూర్ణం చేయబడింది. ఒక విషయం పరిపూర్ణం (perfect) అయిందంటే దాని అర్థం దానిలో నుండి ఒకటి తీయడానికి కుదరదు. వేరొకటి దానితో కలపలేము. సృష్టికర్తయైన అల్లాహ్ యొక్క ధర్మం అది చేరవలసిన ఉన్నత స్థానానికి చేర్చబడింది. ధర్మం పరిపూర్ణం కావడం అంటే ప్రవక్త(స)వారి బాధ్యత పూర్తి అయిపోయిందని మరియు ఆయన ఈ లోకాన్ని వీడే సమయం ఆసన్నమైందని పరోక్షంగా తెలియ జేస్తుంది. ఇదే విషయాన్ని క్రింది సంఘటన తెలియజేస్తుంది.

ఉమర్(రజి) వారు క్రింది ఈ సూరహ్ గురించి ఇబ్నె అబ్బాస్(రజి)వారితో **"నీవేమి చెబుతావు, ఓ ఇబ్నె అబ్బాస్!"** అని అడిగారు (అడిగిన సందర్భానికై శాంతిబాట జనవరి 2012 సంచిక పేజీ చూడండి.)

> **"ఎప్పుడైతే అల్లాహ్ సహాయం వస్తుందో మరియు విజయం. మరియు నీవు ప్రజలను గుంపులు గుంపులుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించడం చూస్తావో. అప్పుడు నీవు నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనియాడు మరియు ఆయన క్షమాభిక్షను అర్థించు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు.** (110:1-3)"

"... ఆయన(అల్లాహ్) ప్రవక్త(స)వారికి మరణం సమీపిస్తున్న విషయాన్ని తెలియజేశారు. మరియు ఆయన చెప్పిన '**ఎప్పుడైతే అల్లాహ్ సహాయం వస్తుందో మరియు విజయం**' అంటే మక్కా

*విజయం*. '**మరియు నీవు ప్రజలను గుంపులు గుంపులుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించడం చూస్తావో**' అంటే ఆ సమయంలో *రాబోవు నీ మరణాన్ని ప్రకటించడం*. కాబట్టి "**అప్పుడు నీవు నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనియాడు మరియు ఆయన క్షమాభిక్షను అర్థించు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు.**"

ప్రవక్త(స)వారి మరణం విషయంలో ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారి కంటే ఎక్కువ నిరాకరించిన వ్యక్తి బహుశా మరొకరు లేరు. ఆయన హెచ్చరించారు ప్రవక్త(స)వారు మరణించారనేవారిని. ఆయన అన్నారు:

> **"ఆయన చనిపోలేదు, కాని బదులుగా ఆయన తన ప్రభువు దగ్గరకు వెళ్ళారు, మూసా బిన్ ఇమ్రాన్(అ) వెళ్ళినట్లు, తన ప్రజల నుండి దూరంగా నలభై రాత్రులు ఉన్నట్లు, దాని తరువాత వారి దగ్గరకు వచ్చారు. అల్లాహ్ సాక్షి! రసూలుల్లాహ్(స) నిజంగా తిరిగి వస్తారు** (మన దగ్గరకు) **మూసా(అ) తిరిగి వచ్చినట్లు** (తన ప్రజల దగ్గరికి) **మరియు ఆయన ఖండిస్తారు, ఆయన చనిపోయారని ప్రకటించిన వారి కాళ్ళూచేతులు."**

**ఉమర్(రజి)వారికి ప్రవక్త(స)వారిపై ఉండే అమితమైన ప్రేమ కారణంగా ఆయన ఓ విచిత్ర పరిస్థితికి లోనయ్యారు.**

అబూబక్ర్(రజి)వారు ప్రవక్త(స)వారి మరణవార్త విన్నారు. ఆయన తన గుర్రాన్ని ఎక్కి తన ఇంటి నుండి మస్జిద్ వరకూ వచ్చారు. మరియు ఒక్క మాట కూడా ఎవరితోనూ మాట్లాడకుండా, అబూ బక్ర్(రజి)వారు మస్జిద్‌లోకి ప్రవేశించారు మరియు తరువాత ఆయిషా(రజి) ఇంటిలోకి ప్రవేశించారు. ఆయన తిన్నగా వస్త్రంచే కప్పబడిన రసూలుల్లాహ్(స) వారివైపు వెళ్ళారు. ప్రవక్త(స)వారి ముఖాన్ని కప్పిన వస్త్రం కొంత తొలగించి, అబూ బక్ర్(రజి) క్రిందికి వంగి ప్రవక్త(స)వారిని చుంబించి ఏడ్వడం మొదలెట్టారు. ఆయన తరువాత చెప్పారు, నా తల్లిదండ్రులను మీకై అర్పింతుగాక. అల్లాహ్ సాక్షి! అల్లాహ్ మీపై రెండు మరణాలను కలపరు. మీ కొరకు ఆదేశించబడిన మరణం ప్రకారం, మీరు మరణించారంతే. "అల్లాహ్ మీపై రెండు మరణాలను కలపరు" అని అబూబక్ర్(రజి)వారు చెప్పడం ద్వారా ప్రవక్త(స)వారు తిరిగి బ్రతుకుతారని ప్రకటిస్తున్న ఉమర్(రజి)వారి మాటలను ఖండించడం జరిగింది.

అబూబక్ర్(రజి)వారికి తెలుసు, ఒకవేళ అదే విషయమైతే, ప్రవక్త(స) మరలా మరణించవలసి ఉంటుందని. అంటే దానర్థం ఆయన(స) మొత్తం మీద రెండు సార్లు మరణించాలి. మరియు అల్లాహ్ ఏర్పాటు చేసిన స్థాయిలలో పై స్థాయినే ప్రవక్త(స)వారు అనుభవించారు దాని కొరకు ఆయనకు అది సంభవించవలసి ఉందని అబూబక్ర్(రజి)వారు అర్థం చేసుకున్నారు.

అబూబక్ర్(రజి) మస్జిద్ నుండి బయటికి వచ్చేసరికి, ఉమర్(రజి) ప్రజలతో మాట్లాడుతున్నారు మరియు ఆయన ఇంకనూ ఆవేశోద్రేకంలోనే ఉన్నారు. అబూబక్ర్(రజి)వారు చెప్పారు, "కూర్చో ఓ ఉమర్!". తరువాత అబూబక్ర్(రజి) నిలుచుని ప్రజలతో ప్రసంగించారు. ఆయన అల్లాహ్‌ను కీర్తించారు, ఆయన ఘనతను కొనియాడారు మరియు తరువాత చెప్పారు:

> **"అమ్మాబాద్ : ఎవరైతే ముహమ్మద్(స)వారిని ఆరాధించేవారో, వారికి ముహమ్మద్(స)వారు నిజంగా మరణించారు. మరియు ఎవరైతే అల్లాహ్‌ను ఆరాధిస్తారో, అల్లాహ్ సజీవంగా ఉన్నారు మరియు మరణించరు."**

తరువాత ఆయన ఖుర్ఆన్‌లోని క్రింది ఆయత్ పఠించారు:

> **"మరియు ముహమ్మద్ కేవలం ఒక సందేశహరుడు మాత్రమే! వాస్తవానికి అతనికి పూర్వం అనేక సందేశహరులు గడచిపోయారు. ఏమీ? ఒకవేళ అతను మరణిస్తే, లేక హత్యచేయబడితే, మీరు వెనుకంజవేసి మరలి పోతారా? మరియు వెనుకంజవేసి మరలి పోయేవాడు అల్లాహ్‌కు ఏ మాత్రం నష్టం కలిగించ లేడు. మరియు కృతజ్ఞతాపరులైన వారికి అల్లాహ్ తగిన ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.** (ఖుర్ఆన్ 3:144)

ఉమర్(రజి)వారు ఆ తరువాత చెప్పారు, "అల్లాహ్ సాక్షి! అబూబక్ర్(రజి) ఆ ఆయత్ పఠించిన వెంటనే నేలపై పడిపోయాను ఎందుకంటే నా కాళ్ళు ఇక నన్ను మోయలేక పోయాయి. మరియు నేను తెలుసుకున్నాను రసూలుల్లాహ్(స)వారు నిజంగా మరణించారని."

## నిజమైన ధైర్యశాలి

ఇమామ్ అల్-ఖుర్తుబీ(ర) చెప్పారు :

> **"ధైర్యాన్ని గనుక కష్టాలలోనూ మరియు ఉపద్రవాలలోనూ ధృడమైన మరియు స్థిరమైన హృదయాన్ని కలిగి ఉండటమేనని నిర్వచిస్తే గనుక, ఈ ఆయత్** (మరియు ఆ సంఘటన) **అబూబక్ర్(రజి)వారి ధైర్యానికి ధృడమైన నిదర్శనం. మరియు అతి పెద్ద ఉపద్రవమేదీ లేదు ప్రవక్త(స)వారి మరణం కంటే ..."**

రసూలుల్లాహ్(స)వారు మరణించ లేదు అని ప్రకటించిన వారిలో ఉమర్(రజి)వారు కూడా ఉన్నారు. ఉస్మాన్(రజి)వారు మాట్లాడ గలిగే శక్తిని కోల్పోయారు. మరియు అలీ(రజి)వారు ఏకాంతంలోకి వెళ్ళిపోయారు. ఇక గందరగోళానికి చివరి హద్దు తెరుచుకోబోతుంది, కాని అబూబక్ర్(రజి) పరిస్థితిని ఈ ఖుర్ఆన్ ఆయత్‌తో చక్కదిద్దారు.

## తొలి ఖలీఫా ఎన్నిక

ప్రవక్త(స)వారు మరణించారు కాబట్టి ముస్లిమ్ సమాజంపై నున్న ముఖ్యమైన బాధ్యత ఖలీఫాను ఎన్నుకోవడం. ఖుర్ఆన్ మరియు

సున్నత్ ప్రకారంగా ఈ ఎంపిక జరగాలి. బనూ సా'ఇదహ్ పెరడులో అన్సారులు సమావేశమయ్యారు. వారిలో నుండి నాయకుడిని ఎన్నుకోవడానికి. కాని ముహమ్మద్(స)వారు చాలా స్పష్టంగా చెప్పియున్నారు - ముస్లిమ్ జాతికి ఖలీఫాను ఖురైష్‌ల నుండి ఎన్నుకోమని. అన్సారులు ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

అబూ ఉబైదా(రజి) మరియు ఇతర ముస్లిమ్ సోదరులకు ఒక వార్త అందింది, అన్సారులంతా వారిలో నుండి తరువాయి నాయకుడు ఎవరో నిర్ణయించు కోవడానికి ఒకచోట సమావేశమయ్యారని. దాని వలన ముస్లిముల మధ్య ఎటువంటి బేధాలొస్తాయోనని నాయకులు ఆందోళన చెందారు.

అబూబకర్, ఉమర్ బిన్ ఖత్తాబ్ మరియు అబూ ఉబైదా (రజి అల్లాహు అన్‌హుమ్) ముగ్గురూ ఈ సమస్యను ఎదుర్కోవడానికి మరియు పరిష్కారాన్ని కనుగొనడానికి సిద్ధపడ్డారు. వారు అన్సారులతో కలిసి ఆ విషయంపై చర్చించారు. అన్సారులు తమవారి నుండే 'ఖలీఫా'ను ఎన్నుకోవాలని మొదట పట్టుబట్టారు. గొడవ బయటపడే సూచనలు కనిపిస్తున్నాయి.

అబూబక్ర్(రజి)వారు అన్సారులతో చెప్పారు : "మేము నాయకులం మరియు మీరు మంత్రులు." అన్సార్ సభ్యులలో ఒకరైన 'హుబాబ్ బిన్ అల్-ముంజిర్ అన్నారు: **"లేదు, అల్లాహ్ సాక్షి! మేము అలా చేయము. బదులుగా మా మధ్య ఒక నాయకుడు ఉండాలి మరియు మీ మధ్య ఒక నాయకుడు."**

అబూ బక్ర్(రజి)వారు స్థిరంగానే ఉన్నారు. సమాధానమిచ్చారు "లేదు మేము నాయకులం మరియు మీరు మంత్రులు". తరువాత ఆయన ప్రస్తావించారు అరేబియా తెగలలో ఖురైష్‌ల స్థానం గురించి.

ఉమర్(రజి)వారికి ఆందోళన కలిగింది, ఎన్నో సంవత్సరాల నుండి ఉన్న ఐక్యతకు ఈ 'ఖలీఫత్' వ్యవహారంలో భంగం కలుగుతుందని. అబూబక్ర్ (రజి)వారు ముస్లిమ్ జాతికి నాయకుడైతేనే ఐక్యత సాధ్యమౌతుందని ఉమర్(రజి)వారికి తెలుసు.

**ఎందుకంటే అరేబియా ద్వీపకల్పంలో ఖురైష్‌ల ఉన్నత స్థాయి అరబ్బుల మధ్య గుర్తింపబడింది. ఆ స్థాయిని ఏ ఇతర తెగ అనుభవించ లేదు. కాబట్టి ఖురైష్ తెగ నుండి కాకుండా ఇతర తెగ నుండి ఎవరినైనా ఖలీఫాగా ఎన్నుకుంటే - ఉదాహరణకు అన్సారులే అనుకుందాము - అప్పుడు అరేబియాలోని చాలా తెగలు ఒకరితో ఒకరు ఖలీఫా కావడానికి పోటీపడతారు. ప్రతీ తెగ అనుకుంటుంది వారే నాయకత్వానికి ఆ ప్రాంతంలోని ఇతర తెగలకంటే యోగ్యులని.**

అంతేకాకుండా, ముహాజిరూన్ మరియు అన్సార్‌లలో సైతం, చాలా యోగ్యుడైన వ్యక్తిని ఖలీఫా కోసం ఎన్నుకోవడం ముఖ్యం. ప్రవక్త(స)వారు తొలి ఖలీఫా ఎవరనేది పేరు చెప్పి ఉండకపోవచ్చుగాని ఎవరు కావాలనేది ఆయన బోధనలను బట్టి ఎప్పుడో స్పష్టమైంది.

ఆయన ఉమర్ మరియు ఉబైదా (రజి. అ) ఇద్దరి చేతులను పట్టుకుని అక్కడ సమావేశమైన వారికి సూచించారు వారిలో ఒకరిని ఖలీఫాగా ఎన్నుకోగలరని. ఉమర్(రజి)వారు ఈ మాటలు వినగానే, ఆయన తన చేతిని అబూబకర్ గారి చేతినుండి లాక్కొని చెప్పారు :

> 'ఓ అన్సారులారా! అబూబక్ర్(రజి)వారిని సలాత్ చేయించమని రసూలుల్లాహ్(స)వారు ఆదేశించారని మీకు తెలియదా. అప్పుడు మీలోని ఎవరితో మీరు సంతోషంగా ఉంటారు అబూబక్ర్ (రజి)వారి కంటే ముందు ఆ వ్యక్తిని ఉంచి?"

అన్సార్ ప్రజలు ఒకే శ్రుతిలో సమాధానమిచ్చారు: 'అబూబక్ర్ (రజి)వారికి ముందు మమ్మల్ని ఉంచడం నుండి మేము అల్లాహ్ రక్షణ అర్థిస్తున్నాము.

అబూఉబైదా(రజి) రోదిస్తూ అబూబకర్(రజి)వారికి చెప్పారు, తొలి విశ్వాసి మరియు ప్రవక్త(స)వారికి అత్యంత సన్నిహితుని స్థానంలో తనను ఉంచడం సిగ్గుగా ఉందని అన్నారు.

ఓ క్షణం కూడా వృథా కాకుండా ఉమర్(రజి)వారు అబూబక్ర్(రజి)తో అన్నారు మీ చేయి చాపండి . అబూ బక్ర్ అలాగే చేశారు. మరియు ఉమర్ మరియు అబూ ఉబైదా(రజి) ఇద్దరూ అబూబకర్(రజి)వారి చేతిని పట్టుకుని, ఆయన ఏమి చెప్పినా మరియు ఏమి చేసినా విధేయత చూపుతామని ప్రతిజ్ఞ చేశారు. ఇది జరిగాక ఉత్తమ వ్యక్తినే ఖలీఫాగా ఎన్నుకోవాలని ముస్లిములందరూ (అన్సారులు మరియు ముహాజిరూన్‌లు) ఒప్పించబడ్డారు.

ఆ రోజే ఉమర్(రజి)వారు మరియు అబూ బక్ర్(రజి)వారు ప్రసంగించారు. **ఉమర్(రజి)వారి ప్రసంగం మునాఫిక్‌ల (కపట విశ్వాసులు) గుండెల్లో భయాన్ని కలిగించింది.** ఆయన ప్రసంగానికి ముందు, వారు ప్రవక్త(స)వారి మరణాన్ని అవకాశంగా తీసుకుని ముస్లిములలో విరోధాన్ని నాటుదామనుకున్నారు. ఉమర్(రజి)వారి ప్రసంగం విన్నాక వారు తమ ఆటలు సాగవని గ్రహించారు.

### రసూలుల్లాహ్(స)వారి యొక్క ఖలీఫాగా అబూబక్ర్(రజి)వారి తొలి బాధ్యత:

ప్రవక్త(స)వారు తన మరణానికి ముందు ఉసామా బిన్ జైద్(రజి)ని నాయకుడుగా నియమించి ఓ పెద్ద సైన్యాన్ని రోమన్ల దాడిని ఎదుర్కోవడానికి పంపారు. అయితే ప్రవక్త(స)వారి మరణవార్త విని వారు వెనక్కి తిరిగిరావడం జరిగింది.

ఖలీఫా అయిన తరువాత అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు ఆ సైన్యాన్ని తిరిగి పంపాలని నిర్ణయించుకున్నారు. ప్రవక్త(స)వారి మరణం తరువాత తమను స్వయంగా ప్రవక్తలుగా చెప్పుకుంటూ కొందరు బయలుదేరారు. వారి వలన చాలామంది మార్గభ్రష్టులు కావడం జరిగింది. కొందరు

జకాత్‌ను చెల్లించడానికి తిరస్కరించడం మొదలుపెట్టారు. కాబట్టి ఖలీఫా ముందు పెనుసవాళ్ళు ఉన్నాయి.

ఆయిషా(రజి)వారు అప్పటి పరిస్థితులను వర్ణించారు. అరబ్బులలో చాలామంది మార్గభ్రష్టత్వం వైపు వెళ్ళడం మరియు కపటత్వం అనేది అన్నిచోట్ల కనిపించింది. ఆ పరిస్థితిలో అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారిపై దింపబడింది ఎలా ఉందంటే, అదే గనుక స్థిరంగా మరియు చలించని పర్వతాలపై దింపితే, అది వాటిని పిండిచేస్తుందని. **అటువంటి క్లిష్ట పరిస్థితులలో సైన్యాన్ని మదీనా బయటకి పంపడం సమంజసం కాదేమోనని ఎక్కువమంది భావించారు.**

ప్రవక్త(స)వారు మరణించిన మూడు రోజుల తరువాత, అబూబక్ర్ (రజి)వారు ఒక ప్రకటన చేయించారు, ఉసామా(రజి) సైన్యం తిరిగి వెళ్ళాలి మరియు దాని యాత్ర పూర్తి చేయాలని. **"చూడండి! ఉసామా సైన్యంలోని ఏ సైనికుడూ ఈ రాత్రి మదీనాలో గడపకూడదు. బదులుగా వారిలోని ప్రతీ ఒక్కరూ వెంటనే బయలుదేరాలి. అల్-జుర్ఫ్‌లోని అతని సైనిక విడిదికి."**

మదీనాకు సమీపంలోనే సైన్యాన్ని ఉంచడం మంచిదని ప్రవక్త(స) వారి సహచరులలోని కొందరు సూచించారు. ముస్లిములలోని అత్యధికులు సైన్యంలోనే ఉన్నారు. ఖలీఫాను మరియు ఇతర ముస్లిములను నాశనం చేయడానికి అరబ్బులు ఏదైనా చేయవచ్చు. కాబట్టి అటువంటి పరిస్థితిలో సైన్యాన్ని పంపడం వివేకం కాదేమోనని కొందరు సూచించారు. ప్రవక్త(స)వారి అనుచరులలో ఈ విషయంలో ఏకాభిప్రాయమే ఉంది. ఎందుకంటే **వారి ఆందోళన అంతా అబూబక్ర్ (రజి)వారి క్షేమం మరియు మదీనాలో మిగిలి ఉండే ముస్లిముల గురించే.**

వారన్నది నిజమే. కాని ఉసామా(రజి)తో సైన్యాన్ని పంపడానికి నిర్ణయించింది స్వయంగా ప్రవక్త(స) వారే. ఒకవేళ ఆయన కాకుండా మరెవరైనా అది నిర్ణయించి వుంటే, సైన్యాన్ని ఆపి మార్గభ్రష్టులపై యుద్ధానికి ఉపయోగించి ఉండేవారేమో!

తన సైనిక విడిది అల్-జుర్ఫ్ నుండి సైనికులతో మదీనాకు తిరిగి రావడానికి ఉసామా(రజి)వారు తన తరఫున ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)వారిని అనుమతి అడగడం కోసం ఖలీఫా దగ్గరకు పంపారు.

> **"నాతో ఉన్నది ముస్లిములలో ఉత్తములు మాత్రమే కాదు, అధిక (సంఖ్యలో) ముస్లిములున్నారు. మరియు నేను ఆందోళన చెందుతున్నాను రసూలుల్లాహ్(స)వారి పవిత్ర నగరం యొక్క ఖలీఫా క్షేమం కొరకు మరియు ముస్లిములందరి కొరకు ..."**

అయితే అబూబక్ర్(రజి)వారు ఏం జరిగినా సరే అన్నింటినీ ఎదుర్కోవడానికి స్థిరంగా ఉన్నారు. సహాబాలందరితో సంప్రదించి వారి అభిప్రాయాలు తెలుసుకోవడం కోసం ముహాజిరూన్ మరియు అన్సారులతో సమావేశం ఏర్పాటు చేశారు. .

ఆయన అందరి అభిప్రాయాలు విన్నారు. అయితే తరువాత ఇలా ప్రసంగించారు :

> **"ఆయన సాక్షి! ఎవరి చేతిలో అబూబక్ర్ ఆత్మ ఉందో, క్రూర మృగాలు నన్ను ముట్టడిస్తాయని భావించినప్పటికీ, నేను ఉసామా సైన్యాన్ని పంపుతాను ఏదైతే రసూలుల్లాహ్(స)వారు ఉసామా(రజి)ని చేయమని ఆదేశించారో దాని ప్రకారంగా, మరియు ఆ నగరాలలో నేను చివరి వ్యక్తిగా ఉండవలసి వచ్చినా నేను అదే చేస్తాను."**

ఈయన నిర్ణయమే చెబుతుంది ఈయన స్థిరత్వం ఎటువంటిదో! ఇది మెజారిటీ సహాబాలను ఆయన వ్యతిరేకించినట్లు కాదు. **ప్రవక్త(స)వారి ఆదేశాన్ని నిర్వర్తించడమే ఆయనకు ముఖ్యం.**

ఈయన యొక్క విశిష్ఠత గురించి, తదుపరి ప్రారంభించబోయే అబూబక్ర్(రజి)వారి జీవితచరిత్రలో చెప్పుకుందాం!

**ముహమ్మద్(స)వారి ఆదేశాన్ని పాటించడమే మన తొలికర్తవ్యం!** ఈ విషయం పరిష్కారమైంది అనుకుంటే, మరొకటి మొదలైంది. అదేమిటంటే, అన్సారులలోని కొందరు ఉసామా(రజి)వారి నాయకత్వం పై భయసందేహాలు వ్యక్తం చేశారు. ఉసామా బిన్ జైద్(రజి) చాలా తక్కువ వయసున్నన్న యువకుడు. ఆయన స్థానంలో బాగా అనుభవమున్న అతని కంటే పెద్దవ్యక్తిని నియమిస్తే బావుంటుందని వారు కోరుతున్నారు.

ఈ విషయంలో కూడా తమ తరఫున అబూబక్ర్(రజి)వారితో మాట్లాడటానికి ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారిని ఆయన దగ్గరికి పంపారు. ఆయనకు వెళ్ళక తప్పలేదు. ఉమర్(రజి)వారు అబూబక్ర్(రజి)వారితో చెప్పారు, **"నిశ్చయంగా, అన్సార్ ప్రజలు ఉసామా బిన్ జైద్ కంటే పెద్ద వ్యక్తిని కోరుతున్నారు."** ఉమర్(రజి)వారు ఈ మాటలు పలికిన వెంటనే అబూబక్ర్(రజి)వారు ముందుకు ఉరికి ఉమర్(రజి)వారి గడ్డాన్ని పట్టుకున్నారు. ఆయన చాలా కోపంగా **"మీ తల్లి మీకోసం శోకించు గాక! ఓ ఖత్తాబ్ కుమారుడా! అతనిని నియమించింది అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మరియు ఇప్పుడు నీవు అతనిని మార్చమని ఆదేశిస్తున్నావా"**.

తాను అడిగిన దానికి ఉమర్(రజి)వారు చాలా సిగ్గుపడ్డారు. ఉమర్(రజి)వారు చాలా చిన్నబుచ్చుకుని బయటకు వెళ్ళారు. ఆయన రాక కోసం బయట వేచి చూస్తున్న సహచరులు "ఏమి చేశారు?" అని అడిగారు, ఆయన ప్రతిస్పందించారు, "పొండి, మీ తల్లులు మీకోసం శోకించు గాక! చూడండి మీ కారణంగా ఎటువంటి ట్రీట్‌మెంట్ నేను స్వీకరించానో రసూలుల్లాహ్(స)వారి ఖలీఫా నుండి."

**ఇన్షా అల్లాహ్ మరికొంత భాగం వచ్చే సంచికలో ...**

చరిత్రలో మత దురభిమానంతో వక్రీకరించి చెప్పబడిన

ప్రయోజనం పొందారే గాని
అణచివేయబడలేదు

# జిజ్యహ్ الجِزْيَة పన్ను గురించి వాస్తవాలు

*రెండవ ఖలీఫా - అమీరుల్ మోమినీన్*

**ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు చెప్పారు :**

> **“నిశ్చయంగా మేము వారికి స్థిరమైన వాగ్ధానాన్ని ఇచ్చాము వారికి అనుమతినిస్తూ -**
>
> **వారు స్వేచ్ఛగా తమ చర్చ్‌లకు వెళ్ళడానికి మరియు వారి చర్చ్‌లలో వారు కోరినది వారు చెప్పుకోవడానికి.**
>
> **మేము ఇంకనూ వారికిచ్చాము ఓ స్థిరమైన వాగ్ధానాన్ని వారిపై వారు మోయలేని భారాన్ని మోపము అని,**
>
> **వారిని రక్షిస్తామని వారి శతృవు వారికి కీడు కలిగించే ప్రయత్నం చేస్తే,**
>
> **వారికి అనుమతినిస్తూ వారి చట్టాలను వారు స్వయంగా ఉపయోగించుకునే స్వేచ్ఛను, వారు మన దగ్గరకు వచ్చి తమ గొడవలను మన చట్టాల ద్వారా పరిష్కరించుకోవడం వారికి మేలైనదిగా వారు సంకల్పించకపోతే. ఈ రెండవ విషయంలో, మేము వారి గొడవలలో న్యాయమూర్తులుగా ఉండటానికి సమ్మతిస్తున్నాము.**
>
> **మరియు వారు మన భూభాగాన్ని వదలాలని అనుకుంటే, వారిని మేము ఆపము ఆ విధంగా చేయడం నుండి.”**

**ముస్లిమ్ భూభాగాలలో ఒడంబడిక ఏర్పరచుకున్న ముస్లిమేతరులతో ఉమర్(రజి)వారు చాలా మృదువుగా వ్యవహరించేవారు.**

ఒక రోజు ఉమర్(రజి) వెళుతున్నప్పుడు ఓ ఇంటి గుమ్మం దగ్గర ధనరూపేణా సహాయాన్ని అర్థిస్తున్న ఓ భిక్షకుడిని చూశారు. అతడు ముసలివాడు మరియు ఆచరణ విషయానికొస్తే దాదాపు గుడ్డివానితో సమానం. ఉమర్(రజి)వారు ఆయనను వెనుకనుండి భుజంపై తట్టారు మరియు అడిగారు, “మీది గ్రంథప్రజల వర్గంలోని ఏ ఉపవర్గం?”. ఆయన సమాధానమిచ్చారు, **“నేను యూదుడను”**. ఉమర్(రజి)వారు అడిగారు, “ఏ పరిస్థితులు నిన్ను బలవంతం చేశాయి ఈ పనిని చేయడానికి దేనిని అయితే నీవు చేయడం నేను చూస్తున్నానో?”

అతను సమాధానమిచ్చారు, **“నేను సహాయం కొరకు అర్థించేది జిజ్యా పన్ను చెల్లించడానికి మరియు నా కనీస అవసరాలు తీర్చు కోవడానికి మరియు నేను సహాయాన్ని అడుగుతున్నాను ఎందుకంటే నేను ముసలివాడిని.”**

ఆ ముసలాయనను ఉమర్(రజి)వారు తన చేతితో పట్టుకుని తన ఇంటి వరకూ తీసుకెళ్ళారు మరియు ఆతిధ్యమిచ్చారు, అతని ఇంటిలో నుండి ఓ బహుమతిని కూడా ఇచ్చారు. ఉమర్(రజి)వారు క్రింది సందేశాన్ని ముస్లిమ్ కోశాధికారికి (ట్రెజరీ ప్రతినిధికి) పంపారు :

> **“ఈ వ్యక్తిని మరియు ఈయన వంటి ఇతరులను దృష్టిలో ఉంచుకోండి (అంటే వారి నుండి జిజ్‌యహ్ తీసుకోకండి). అల్లాహ్ సాక్షి! మనం వారితో న్యాయంగా ఉన్నట్లు కాదు వారి యవ్వనం నుండి తిని వారిని వారి ముసలితనంలో వదిలేస్తే** (*అంటే వారు యువకులుగా ఉన్నప్పుడు పన్ను కట్టించుకుని, ముసలి వయస్సులో వదిలి వేయకూడదని*).

ఈ ముసలాయన వంటి వారికి జిజ్‌యహ్ పన్ను నుండి మినహాయింపు నిచ్చారు. రెండవ ఖలీఫా అమీరుల్ మోమినీన్ ఉమర్(రజి)వారి కాలంలో ముస్లిమేతర ధర్మాల వారికి ఎంతో స్వేచ్ఛను కల్పించారు. ఇస్లామీయ చట్ట ప్రకారమే ఆయన ఇది చేశారు.

**ముస్లిమ్ భూభాగాలలో ఇస్లామీయ ప్రభుత్వ రక్షణలో జీవించే గ్రంథప్రజలపై జిజ్‌యహ్ పన్ను విధించబడింది.**

> అల్లాహ్‌ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించని, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త నిషేధించినవి, నిషిద్ధమని భావించని, సత్య ధర్మాన్ని తమ ధర్మంగా స్వీకరించని గ్రంథప్రజలతో - వారు స్వయంగా తమ చేతులతో జిజ్‌యహ్ ఇచ్చి లోబడి ఉండే వరకూ - పోరాడండి. (ఖుర్ఆన్ 9:29)
>
> Fight those who do not believe in ALLAH or in the Last day and who do not consider unlawful what ALLAH and His Messenger have made unlawful and who do not adopt the religion of truth (i.e. Islam) from those who were given the scripture - (fight) until they give the Jizyah willingly while there are humbled. (Qur'an 9:29)

**జిజ్‌యహ్ కేవలం గ్రంథప్రజలపై మాత్రమే కాదు**

జిజ్‌యహ్ పన్ను గ్రంథప్రజలు (యూదులు మరియు క్రైస్తవులు) నుండి మాత్రమే కాకుండా అగ్ని పూజారుల నుండి కూడా తీసుకోబడింది.

మొదట్లో అగ్ని పూజారుల నుండి జిజ్‌యహ్ తీసుకోవచ్చా లేదా అనే విషయంపై ఉమర్(రజి)వారికి సందేహం ఉండేది. అయితే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)వారు ఆ విషయాన్ని పరిష్కరించారు. హజ్ర్‌కు చెందిన అగ్ని పూజారుల దగ్గర నుండి జిజ్‌యహ్ పన్నును రసూలుల్లాహ్(స)వారు తీసుకున్నారని తెలియజేశారు.

> ఇబ్నె అబీ షైబహ్ మరియు ఇతరులు ఉల్లేఖించిన దాని ప్రకారం ఒకరోజు, ప్రవక్త(స)వారి సమాధి మరియు మింబర్‌కి మధ్యలో ఆయన ఉన్నప్పుడు, ఉమర్(రజి)వారు అన్నారు, ''నాకు తెలియడం లేదు ఏమి చేయాలో అగ్ని పూజారులతో. వారు గ్రంథప్రజలకు చెందినవారు కాదు.'' అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) చెప్పారు, ''నేను రసూలుల్లాహ్(స)వారు చెప్పగా విన్నాను. **"వ్యవహరించు వారితో అదే విధంగా నీవు గ్రంథ ప్రజలతో వ్యవహరించినట్లు"** (ముసన్నఫ్ బిన్ అబీ షైబహ్ 1/141)

స్వేచ్ఛ కలిగి ఉండి (అంటే బానిస కాదు) మరియు మానసిక ఆరోగ్యం బాగున్న ప్రతీ ఒక్కరిపై జిజ్‌యహ్ పన్ను తప్పనిసరిగా విధించ బడింది.

కాని స్త్రీలపై, పిల్లలపై, మతి స్థిమితం లేనివారిపై (మానసిక రోగులపై) లేక బానిసలపై జిజ్‌యహ్ తప్పనిసరి కాదు. **ఎందుకంటే వీరు ఒకరిపై ఆధారపడి జీవించేవారు గనుక.** ఇదే విధంగా వికలాంగులు మరియు తీవ్ర అనారోగ్యానికి గురైనవారు కూడా జిజ్‌యహ్ చెల్లించ నవసరం లేదు. దానాలు స్వీకరించే గ్రుడ్డివారు మరియు పేదవారు కూడా జిజ్‌యహ్ చెల్లించ నవసరం లేదు. మఠాలలో నివశించే సన్యాసుల దగ్గర ఐశ్వర్యముంటే వారి నుండి జిజ్‌యహ్ తీసుకో బడుతుంది. కాని వారు పేదవారై ఉండి, ఎవరైనా ఇచ్చిన దానంపై వారు ఆధారపడి బ్రతుకుతుంటే, వారు జిజ్‌యహ్ చెల్లించ నవసరం లేదు.

ఈ జిజ్‌యహ్ కూడా వారి జనాభాపై ఆధారపడి ఉంటుంది. ఇస్లామ్ స్వీకరించిన వారికి జిజ్‌యహ్ పన్ను వర్తించదు. **జిజ్‌యహ్ పన్ను సంవత్సరానికి ఒక్కసారే చెల్లించవలసి ఉంటుంది.** ముందరి పేజీలో అంధుడైన ఓ యూదుని గురించి చదివారు కదా!

అటువంటివారికి జిజ్‌యా పన్ను రద్దు చేయడమే కాకుండా, వారి కనీస అవసరాలు తీర్చుకోవడానికి ముస్లిమ్ ట్రెజరీ నుండి ఆర్థిక సహాయాన్ని కూడా అందజేసేవారు.

ముస్లిమ్‌లకు జిజ్‌యహ్ లేదు. **కాని ముస్లిమ్ పౌరులు జకాత్ చెల్లించాలి.** 200 దిర్హముల కంటే ఎక్కువ ఐశ్వర్యం కలిగిన ప్రతీ ముస్లిమ్ తప్పనిసరిగా నూటికి రెండున్నర చెల్లించాలి.

**ముస్లిమ్ ప్రభుత్వం ఒకవేళ రక్షణ కల్పించలేకపోతే ...**

జిజ్‌యహ్ పన్ను కట్టించుకుంటే, వారికి అన్ని రకాలుగా ముస్లిమ్ ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ముస్లిమ్ ప్రభుత్వం రక్షణ కల్పించ లేకపోతే, వారు జిజ్‌యహ్ పన్ను చెల్లించ నవసరం లేదు. సరిహద్దులలో నివశించే ప్రజలను శతృవుల నుండి కాపాడటం, ఆయా ప్రాంతాలను బట్టి మరియు శతృవుయొక్క వ్యూహంపై ఆధారపడి ఉంటుంది.

ఉదాహరణగా ఓ సంఘటన గురించి ఇక్కడ చెప్పాలి.

ముస్లిమ్ భూభాగానికి ఉత్తర దిశ పొడుగునా రోమన్ల బలగాలు మొహరించ బడుతున్నాయని తెలిసింది. ఆ సరిహద్దుకు సమీపంలో ఉండేవారు జిజ్‌యహ్ చెల్లిస్తున్నారు. **కాబట్టి వారి రక్షణ బాధ్యత ముస్లిమ్ ప్రభుత్వానిది.** అయితే ఆ ప్రాంతాలలోని ప్రజలకు రోమన్ల నుండి రక్షణ కల్పించడం సందేహంగా ఉంది. ఆ ప్రాంతానికి గవర్నర్‌లను అబూ ఉబైదా (రజి)వారు నియమించారు. ఆయన తన గవర్నర్‌లకు ఇలా సందేశాన్ని పంపారు.

> ''చెప్పండి ప్రజలకు : **'మేము మీ సొమ్ము తిరిగి ఇచ్చివేస్తున్నాము. ఎందుకంటే మాకు తెలిసింది ఏ విధంగా శతృవులు మాకు వ్యతిరేకంగా మొహరిస్తున్నారో. ఒప్పందంలోని షరుతు ప్రకారం మేము మిమ్మల్ని రక్షించాలి. మరియు మేము అది చేయడానికి అశక్తులుగా ఉన్నాము. కాబట్టి మేము తిరిగి ఇచ్చివేస్తున్నాము మీ దగ్గర నుండి ఒప్పందం ప్రకారం సేకరించిన సొమ్ము (పన్ను). మాకు అల్లాహ్ వారిపై విజయం ప్రసాదిస్తే, అప్పుడు మనం వ్రాసుకున్న ఒడంబడిక మరియు మీరు దాని అమలును కొనసాగించవచ్చు.'** ''

అక్కడి గవర్నర్‌లు ప్రజలకు అబూ ఉబైదా(రజి)వారి సందేశం అందజేశారు మరియు ప్రజలకు వారు ఇంతకు పూర్వం కట్టిన పన్ను మొత్తాన్ని తిరిగి ఇచ్చివేశారు.

ప్రజలు చెప్పారు :

**"మరలా మీరే మమ్మల్ని పాలించేలా అల్లాహ్ చేయుగాక! మరియు ఆయన మీకు వారిపై (రోమన్లపై) విజయాన్ని ప్రసాదించుగాక! ఎందుకంటే ఇదే వారు అయివుంటే, వారు మాకు ఏదీ తిరిగి ఇచ్చి ఉండేవారు కాదు, దానికి భిన్నంగా మా దగ్గరున్న ప్రతీది తీసుకుని మాకు ఏదీ లేకుండా మమ్మల్ని వదిలేసేవారు."**

**ధర్మ సందేశప్రచారం (దావా) అంటే ఇదే! నిజమైన దావా!**

ఇస్లామ్ యొక్క న్యాయ సూత్రాలు మరియు ముస్లిముల ఆచరణ ఇతరులపై మంచి ప్రభావం వేశాయి. ఇస్లామ్ ప్రకారం పాలించిన ముస్లిమ్ పాలకుల పరిపాలనను ఇతర ధర్మాలకు చెందిన ప్రజలు సంతోషంగా ఆమోదించారు. ఇస్లామ్ న్యాయమైన ధర్మం. **ఎవరికీ అన్యాయం కలిగించదు.**

ఒకవేళ జిజ్‌యహ్ చెల్లించేవారు రక్షణ బాధ్యత వహించి నట్లయితే, **అప్పుడు కూడా వారు జిజ్‌యహ్ పన్ను కట్టనవసరం లేదు.** అయితే దానిని ప్రభుత్వం ఆమోదించవలసి ఉంటుంది.

తబ్రిస్తాన్ ప్రజల విషయంలో సురాఖహ్ బిన్ అమ్ర్‌గారు అలాగే చేశారు. దానికి ఉమర్(రజి)వారి నుండి అనుమతి పొందారు.

అయితే జిజ్‌యహ్ పన్ను రేటు రాజ్యం అంతా ఒకే విధంగా విధించ లేదు. జిజ్‌యహ్ పన్ను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారింది. ఎంత మొత్తం చెల్లించాలనేది ప్రజల స్థితిగతులపై కూడా ఆధారపడి ఉంటుంది.

ఉదాహరణకు ఇరాఖ్‌లోని సవాద్ ప్రాంతంలో 48 దిర్హములు గాని లేదా 24 దిర్హములుగాని జిజ్‌యహ్ పన్నుగా చెల్లించాలి. ఐశ్వర్య వంతులు 48 దిర్హములు చెల్లిస్తే, సాధారణ వ్యక్తులు 24 దిర్హములు చెల్లించేవారు. మరియు ఈ చెల్లింపు సంవత్సరానికి ఒక్కసారే!

ఒకవేళ జిజ్‌యహ్ చెల్లించ వలసినవారు నగదు రూపంలో కాకుండా వస్తురూపంలో - ఉదాహరణకు పాడి పశువులు రూపంలో చెల్లించాలని అనుకుంటే జిజ్‌యహ్ విలువకు సరిపడా వారు చెల్లించవచ్చు.

సిరియాలో 4 దీనార్లు మరియు రెండు ముద్దులకు సరిపడా కొన్ని ఆహార పదార్థాలు. ఒక ముద్ద్ అంటే దాదాపు రెండు గుప్పిళ్ళలో పట్టేటంత. మరియు 3 యూనిట్ల నూనె. **ఇది సంవత్సరానికి ఒక్కసారే.**

ఒకవేళ ఎవరైనా వెండి రూపంలో చెల్లించాలనుకుంటే అతడు 40 దిర్హములతో పాటు 15 సా'ల (ఆహారపదార్థాలు) చెల్లించవలసి ఉంటుంది. 15 సా'లు అంటే దాదాపు 8 గుప్పిళ్ళు.

యుక్తవయస్సు చేరుకున్న ప్రతీ పురుషుడు సంవత్సరానికి 2 దీనార్లు ఈజిప్టులో చెల్లించాలి. **పేదవారికి ఈ పన్ను నుండి మినహాయింపు ఉంది.**

అంటే సిరియా కంటే ఈజిప్టులో జిజ్‌యా తక్కువ. కాబట్టి జిజ్‌యహ్ రేటు నిర్ణయం అక్కడ ఉండే పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అందుకే ఒకే రేటు నిర్ణయిస్తే చాలామందికి అది భారమై పోవచ్చు.

ఇక యెమన్ విషయానికొస్తే అక్కడ జిజ్‌యహ్ ఈజిప్టు కంటే తక్కువ. ఒక దీనార్ మాత్రమే. 1 దీనార్‌కి సరిపడా వస్త్రాన్ని అయినా జిజ్‌యహ్‌గా చెల్లించవచ్చు.

జిజ్‌యహ్ రేటును నిర్ణయించడంలో ఉమర్(రజి)వారు

1. ప్రజల స్థితిగతులను పరిగణించారు

2. ప్రవక్త(స)వారు నిర్ణయించిన వాటిని మార్చలేదు.

పై విషయాలను బట్టి ధనవంతుల నుండి నెలకు 4 దిర్హములు మధ్యతరగతి వారికి నెలకు 2 దిర్హమ్‌ల వరకూ వసూలు చేశారు. చెల్లింపు మాత్రం సంవత్సరానికి ఒక్కసారే. పన్ను కట్టే సమయాన్ని కూడా నిర్ణయించారు. **పంట చేతికొచ్చిన తరువాతే పన్ను చెల్లించాలి.**

## ఇస్లామీయ పరిపాలన ఇతర ధర్మాలవారికి అన్యాయం చేయలేదు. మేలు మాత్రమే చేసింది

**జిజ్‌యహ్ పన్ను వసూలు చేసేవారికి ఖలీఫా ఇచ్చిన ఆదేశం :**

ఉమర్(రజి)వారు ప్రజలకు సౌలభ్యాన్ని కలుగజేయమన్నారు.

ఒకసారి చాలా ఎక్కువ మొత్తంలో జిజ్‌యహ్ రెవెన్యూ ఉమర్(రజి) దగ్గరకు తెచ్చారు.

ఉమర్(రజి)వారు తన సిబ్బందిని అడిగారు :

**"నేను అనుకుంటున్నాను నిశ్చయంగా మీరు ప్రజలను నాశనం చేశారు** *(అంటే వారి దగ్గరి నుండి ఎక్కువ మొత్తంలో తీసుకున్నారు)*"

వారు సమాధానమిచ్చారు :

**"లేదు, అల్లాహ్ సాక్షి! మేము కేవలం సౌమ్యంగా, క్షమించే మరియు బలవంతంకాని విధానంలోనే తీసుకున్నాము"**

ఉమర్(రజి)వారు అడిగారు :

**"కొరడాతో బెదిరించకుండా మరియు బలవంతం చేయకుండా?"**

వారు అన్నారు :

**"ఔను"** అప్పుడు ఉమర్(రజి) వారు అన్నారు :

**"అల్-హమ్‌దులిల్లాహ్!** *(సకల పొగడ్తలు మరియు కృతజ్ఞతలు అల్లాహ్ కొరకే!)* **నా చేతుల మీద లేదా నా అధికార సంరక్షణలో అన్యాయం జరగకుండా చేసినది ఆయనే"**

ఇతర ధర్మాలవారి పట్ల ముస్లిమ్ సామ్రాజ్య నాయకుడు ఎంత న్యాయంగా వ్యవహరించారో గమనించండి. **ఆయన ఇస్లామ్‌ని సంపూర్ణంగా ఆచరణలో పెట్టారు.** కాని నేటి కాలంలో ఎవరైనా ముస్లిమ్ **నాయకుడు అన్యాయానికి పాల్పడితే, అతనికి బదులుగా ఇస్లామ్‌ని**

**నిందిస్తున్నారు. ఇస్లామ్‌ని నిందించేవారు ఎంత అన్యాయానికి ఒడిగడుతున్నారో తెలుసుకోవాలి.**

ఈ జిజ్‌యహ్‌కు సంబంధించి శాసనాలు ఖుర్‌ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల నుండి నిర్ణయించబడినవే. సన్మార్గం పొందిన ఖలీఫాలు వాటినే అనుసరించారు. **జిజ్‌యహ్ పన్నులో రాజకీయ అంశమే ఎక్కువ, ఆర్థిక అంశం కంటే.** ఎందుకంటే ముస్లిములు చెల్లించే జకాత్ పన్ను కంటే ఇతరులు చెల్లించే మొత్తం చాలా తక్కువ. ప్రక్క పేజీ చూడండి.

జిజ్‌యహ్ పన్ను మాత్రమే కాకుండా ముస్లిమ్ భూభాగాలలో నివశించే ముస్లిమేతరులపై కొన్ని తప్పనిసరి బాధ్యతలున్నాయి. ప్రభుత్వ రాయబారులుగాని, వార్తాహరులుగాని లేదా సామాన్యులుగాని వారి ప్రాంతాల గుండా వెళ్ళినప్పుడు వారికి ఆతిథ్యం ఇవ్వాలి.

అయితే అందుకోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు ఏమీ చేయనవసరం లేదు. ఉమర్(రజ)వారి కాలంలో ఆ ఆతిథ్యం మూడు రోజలకు మించ కూడదు. 3 రోజులు తరువాత ఆతిథ్యమివ్వవలసిన బాధ్యత వారిపై లేదు. అంతే కాకుండా, ప్రజలు ఏదైతే సాధారణంగా తింటారో అదే ఏర్పాటు చేయాలి. అంతేగాని తమ తాహతుకి మించి అతిథుల కోసం ప్రత్యేక వంటకాలు ఏమీ చేయించకూడదు. లేక వారికి ఏర్పాటు చేయడానికి కష్టమయ్యే వాటితో ఆతిథ్యం ఇవ్వవలసిన అవసరం లేదు.

**చరిత్ర పుస్తకాలు వ్రాసినవారంతా నిజమైన చరిత్రకారులు కాదు.** మత దురభిమానంతో ఇటువంటి పుస్తకాలు ఎందరో వ్రాశారు. నిజాయితీకి విలువ ఇచ్చి వ్రాసినవారు కూడా ఉన్నారు. ఎవరెన్ని కల్పితాలు సృష్టించినా, **ఇస్లామీయ చరిత్ర యొక్క ప్రామాణిక ఆధారాలు చెక్కు చెదరలేదు.** ఇస్లామీయ పరిపాలనను విమర్శించడం మానవత్వం గల ఏ మనిషికీ ఇన్షా అల్లాహ్ సాధ్యం కాదు.

## ముస్లిమ్ ప్రభుత్వానికి మరియు జెరూసలెం ప్రజలకు మధ్య శాంతి ఒప్పందం ఎలా జరిగిందో దిగువున ఇస్తున్నాము

(అత్-తబరి నుండి)

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

**ఇది అల్లాహ్ యొక్క దాసుడు, విశ్వాసుల నాయకుడు ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) జెరూసలెం ప్రజల భద్రతకై, వారికి, వారి ఐశ్వర్యానికి, వారి చర్చ్‌లకు, వారి సంతానానికి, వారి వినమ్రులకు, వారి అమాయకులకు మరియు ప్రజల యొక్క వారసత్వం రక్షించడానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తూ చేసిన ప్రకటన.**

**వారి చర్చ్‌లు తీసుకోబడవు మరియు అవి నాశనం చేయబడవు, అవి నీచపరచబడవు లేక చులకన చేయబడవు, వారి శిలువలుగాని లేక డబ్బుగాని. మరియు వారు బలవంతం చేయబడరు మతాన్ని మార్చుకోవడానికి, వారిలో ఎవ్వరికీ హాని చేయబడదు.**

**వారితో యూదులెవరూ జెరూసలెంలో నివశించరాదు మరియు జెరూసలెం ప్రజలు జిజ్‌యహ్ చెల్లించాలి పట్టణ ప్రజల వలే. వారు ఆదేశించబడ్డారు - రోమన్లను మరియు దోచుకునేవారిని వారి భూభాగం నుండి తొలగించాలని. వారే వెళ్ళేటట్లయితే, వారూ మరియు వారి ఐశ్వర్యం క్షేమంగా ఉంటుంది వారు రక్షిత గమ్యానికి చేరుకునేంత వరకూ.**

**మరియు వారిలో ఎవరైనా ఇక్కడే ఉండేటట్లయితే వారు క్షేమంగా ఉంటారు జిజ్‌యహ్ పన్ను చెల్లిస్తే, జెరూసలెం ప్రజలు చెల్లించినట్లు. జెరూసలెం ప్రజలలో ఎవరైతే వెళ్ళిపోవాలనుకుంటారో తమ ఐశ్వర్యంతో సహా రోమన్లతో కలిసి, వారి వ్యాపార సామాగ్రి మరియు సంతానాన్ని ఇక్కడ విడిచి, వారు, వారి వ్యాపార సామాగ్రి మరియు వారి సంతానం క్షేమంగా ఉంటారు వారు రక్షిత గమ్యానికి చేరుకునేంత వరకూ. ఎవరైతే ఫలానా చంపబడటానికి ముందు జెరూసలెంలో ఉంటే, అతడు జెరూసలెంలో ఉండవచ్చు అతడు జిజ్‌యహ్ చెల్లిస్తే జెరూసలెం ప్రజలు చెల్లించినట్లు లేదా రోమన్లతో వెళ్ళాలి లేదా తమ ప్రజల దగ్గరికి తిరిగి వెళ్ళిపోవాలి.**

పంట చేతికి వచ్చేవరకూ వారు ఏదీ చెల్లించ నవసరం లేదు.

**మేము ఆమోదిస్తున్నాము ఈ పత్రంలో ఉన్నదానిని అల్లాహ్ యొక్క ఒడంబడికతో, ఆయన సందేశహరుని యొక్క, ఖలీఫాల యొక్క మరియు విశ్వాసుల యొక్క ఒడంబడికతో, వారి నుండి రావలసిన జిజ్‌యహ్ వారు చెల్లిస్తే.**

**దీనిపై సాక్షులు - ఖాలిద్ బిన్ వలీద్, అమ్ర్ బిన్ ఆస్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ మరియు ము'ఆవియహ్ బిన్ అబీ సుఫ్యాన్ (రజి).**

**వ్రాయబడింది మరియు ఆమోదించబడింది హిజ్రీ శకం 15లో.**

### కొన్ని షరతులు కూడా ముస్లిమేతరులపై విధించబడ్డాయి

వారు ఖుర్‌ఆన్‌పై దాడి చేయడం గాని లేదా దాని అర్థాలను వక్రీకరించడంగాని చేయకూడదు. రసూలుల్లాహ్(స)వారిని అవమానించ కూడదు. ఇస్లామ్‌ను అవమానించకూడదు. ముస్లిమ్ స్త్రీలపై అపనిందలు వేయడం ద్వారా, వారి గౌరవానికి భంగం కలిగించడం వంటివి చేయకూడదు. ముస్లిములతో శతృత్వం వహించే వారికి సహాయపడ కూడదు. ముస్లిముల ఐశ్వర్యానికి హాని కలిగించకూడదు.

శాంతి ఒప్పందం ద్వారా ముస్లిములు ముస్లిమేతరులను అవమానించడం గాని, వారి ఆరాధనాలయాలను అవమాన పరచడం గాని, వారిని బలవంతంగా మత మార్పిడికి గురిచేయడం గాని, వారి ఐశ్వర్యానికి హాని కలగజేయడం గాని చేయమని హామీ ఇచ్చారు. కాబట్టి వారు కూడా తదనుగుణంగానే ప్రవర్తించాలి. అవే విషయాలు పై షరతులలో ఉన్నాయి.

**రెండవ ఖలీఫా ఉమర్(రజి)వారి కాలంలో అమలు పరచిన జిజ్‌యహ్ పన్నుకు సంబంధించిన వివరాలు**

| జిజ్‌యహ్ పన్ను ఎవరిపై తప్పనిసరి | జిజ్‌యహ్ పన్ను ఎవరిపై విధిగా లేదు | పన్ను కట్టడం వలన కలిగే ప్రయోజనాలు |
|---|---|---|
| ఐశ్వర్యం కలిగి స్వేచ్ఛగా జీవిస్తూ, మానసిక ఆరోగ్యం గలవారిపై | • స్త్రీలు<br>• పిల్లలు<br>• మతి స్థిమితం లేనివారు<br>• బానిసలు<br>• వికలాంగులు<br>• గ్రుడ్డివారు<br>• రోగులు<br>• ఒకరిచ్చే దానిపై జీవించే పేదవారు | వారి ఇండ్లు, ఐశ్వర్యం మరియు వారి ఆరాధనాలయాలకు రక్షణ బాధ్యత ముస్లిమ్ ప్రభుత్వానిదే<br>ఇతర పౌరులకున్న అన్ని సదుపాయాలు వారికి కూడా వర్తిస్తాయి |

**పేదవారి విషయంలో**

| | |
|---|---|
| జిజ్‌యహ్ పన్ను రద్దు | కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఇస్లామీయ ప్రభుత్వం నుండి ఆర్థిక సహకారం లభిస్తుంది |

**ఇరాఖ్ దేశంలో చెల్లించబడిన జిజ్‌యహ్**

ధనవంతులపై **48 దిర్హములు** ఇతరులపై **24 దిర్హములు**

(నగదు రూపంలోనే కాకుండా దానికి సమాన విలువ కలిగన పశువుల ద్వారా కూడా చెల్లించారు)

**సిరియా దేశంలో చెల్లించబడిన జిజ్‌యహ్**

**4 దీనార్లు** + 2 ముద్ద్ ల ఆహారపదార్థాలు (అంటే 4 పిడికెళ్ళలో పట్టేటంత) + 3 యూనిట్ల నూనె

లేదా

**40 దిర్హములు** + 15 సా'లు ఆహారపదార్థం (అంటే 8 పిడికెళ్ళలో పట్టేటంత)

| **ఈజిప్టు దేశంలో** | **యమన్‌లో** |
|---|---|
| **2 దీనార్లు** యుక్తవయస్సుకు వచ్చిన ప్రతీ పురుషునిపై | **1 దీనార్ లేదా దానికి సరిపడా వస్త్రం** |

| 10,000 దిర్హములు కలిగిన **ముస్లిమ్ పౌరుడు** సంవత్సరానికి ప్రభుత్వానికి చెల్లించ వలసిన | 10,000 దిర్హములు కలిగిన **ముస్లిమేతర పౌరుడు** సంవత్సరానికి ప్రభుత్వానికి చెల్లించ వలసిన |
|---|---|
| **జకాత్** | **జిజ్‌యహ్** |
| 250 దిర్హములు | 48 దిర్హములు |

**ఇదే విధంగా 1,00,000 దిర్హములు కలిగిన ముస్లిమ్ పౌరుడు 2500 దిర్హములు జకాత్‌గా చెల్లించాలి. అయితే ముస్లిమ్ భూభాగంలో నివశించే ఇతరులు మాత్రం అదే ఐశ్వర్యం కలిగి ఉన్నప్పటికీ వారు కేవలం 48 దిర్హములు మాత్రమే చెల్లిస్తారు.**

**కాబట్టి జిజ్‌యహ్ కంటే ముస్లిములు చెల్లించే జకాత్ సొమ్మే చాలా చాలా ఎక్కువ**

**కాబట్టి ఇస్లామీయ చట్టం ఇతర ధర్మాల వారికి అన్యాయం చేయలేదు.**

**కట్టే సొమ్ము తక్కువే అయినప్పటికీ వారు పొందిన ప్రయోజనాలే ఎక్కువ.**

**పేదవారైతే వారికి జిజ్‌యహ్ పన్ను రద్దు చేయడం మాత్రమే కాకుండా, వారికి అదనంగా ఆర్థికంగా సహకారం అందజేయడం జరిగింది.**

**మత దురభిమానంతో కొందరు ఇస్లామ్‌పై దుష్ప్రచారం చేశారు. వాస్తవాలను వక్రీకరించారు**

# ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువ్రుదాం - 28

فِعل ثلاثي مَزِيد فِيه
ఫి'లె సులాసీ మజీద్ ఫీహి
[క్రియ యొక్క నాల్గవ రూపం]

أَفْعَلَ

ప్రారంభంలో హమ్జా అదనంగా వచ్చినప్పుడు
(فعل ماضی میں پہلا حرف أ زیادہ ہو)

| Meaning | No. | إِفْعَال | مُفْعِل | أَفْعِلْ | يُفْعِلُ | أَفْعَلَ |
|---|---|---|---|---|---|---|
| విముఖమగుట<br>to turn away; to backslide<br>منہ پھیرنا | 1 | إِعْرَاض (ఇ'రాజ్) | مُعْرِض (ము'రిజ్) | أَعْرِضْ (అ'రిజ్) | يُعْرِضُ (యు'రిజు) | أَعْرَضَ (అ'రజ) |
| ముంచుట<br>to drown<br>غرق کرنا، ڈبونا | 2 | ముంచడం إِغْرَاق (ఇఘ్రాఖ్) | ముంచినవాడు مُغْرِق (ముఘ్రిఖ్) | ముంచు أَغْرِقْ (అఘ్రిఖ్) | ముంచుతాడు يُغْرِقُ (యుఘ్రిఖు) | ముంచాడు أَغْرَقَ (అఘ్రఖ) |
| అవినీతిని వ్యాపింపజేయుట<br>to spread corruption<br>خراب کرنا، فساد پھیلانا | 3 | إِفْسَاد (ఇఫ్సాద్) | مُفْسِد (ముఫ్సిద్) | أَفْسِدْ (అఫ్సిద్) | يُفْسِدُ (యుఫ్సిదు) | أَفْسَدَ (అఫ్సద) |
| సాఫల్యం పొందుట<br>to be successful<br>فلاح پانا | 4 | إِفْلَاح (ఇఫ్లాహ్) | مُفْلِح (ముఫ్లిహ్) | أَفْلِحْ (అఫ్లిహ్) | يُفْلِحُ (యుఫ్లిహు) | أَفْلَحَ (అఫ్లహ) |
| పెంచుట<br>to make grow; to cause to grow<br>اُگانا | 5 | إِنْبَات (ఇన్‌బాత్) | مُنْبِت (మున్‌బిత్) | أَنْبِتْ (అన్‌బిత్) | يُنْبِتُ (యున్‌బితు) | أَنْبَتَ (అన్‌బత) |
| హెచ్చరించుట<br>to warn<br>ڈرانا | 6 | إِنْذَار (ఇన్‌జార్) | مُنْذِر (మున్‌జిర్) | أَنْذِرْ (అన్‌జిర్) | يُنْذِرُ (యున్‌జిరు) | أَنْذَرَ (అన్‌జర) |
| క్రిందికి దింపుట, అవతరించుట<br>to send down; to reveal<br>نازل کرنا | 7 | إِنْزَال (ఇన్‌జాల్) | مُنْزِل (మున్‌జిల్) | أَنْزِلْ (అన్‌జిల్) | يُنْزِلُ (యున్‌జిలు) | أَنْزَلَ (అన్‌జల) |
| పుట్టించుట<br>to produce/create<br>پیدا کرنا، پرورش کرنا | 8 | إِنْشَاء (ఇన్‌షా) | مُنْشِئ (మున్‌షీ) | أَنْشِئْ (అన్‌షీ) | يُنْشِئُ (యున్‌షీ) | أَنْشَأَ (అన్‌షా) |
| అనుగ్రహించుట<br>to favor; to bestow grace<br>انعام کرنا، فضل کرنا | 9 | إِنْعَام (ఇన్'ఆమ్) | مُنْعِم (మున్'ఇమ్) | أَنْعِمْ (అన్'ఇమ్) | يُنْعِمُ (యున్'ఇము) | أَنْعَمَ (అన్'అమ) |
| ఖర్చు చేయుట<br>to spend<br>خرچ کرنا | 10 | إِنْفَاق (ఇన్‌ఫాఖ్) | مُنْفِق (మున్‌ఫిఖ్) | أَنْفِقْ (అన్‌ఫిఖ్) | يُنْفِقُ (యున్‌ఫిఖు) | أَنْفَقَ (అన్‌ఫఖ) |
| గుర్తించకపోవుట, ఖండించుట<br>to not recognize; to deny<br>انکار کرنا، نہ پہچاننا | 11 | إِنْكَار (ఇన్‌కార్) | مُنْكِر (మున్‌కిర్) | أَنْكِرْ (అన్‌కిర్) | يُنْكِرُ (యున్‌కిరు) | أَنْكَرَ (అన్‌కర) |
| నాశనం చేయుట<br>to destroy<br>ہلاک کرنا | 12 | إِهْلَاك (ఇహ్లాక్) | مُهْلِك (ముహ్లిక్) | أَهْلِكْ (అహ్లిక్) | يُهْلِكُ (యుహ్లికు) | أَهْلَكَ (అహ్లక) |

ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.

*ఈ 28నెలల్లో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 78.4*

ఈ నెల నేర్చుకున్న పదాలు 617 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 617 చోట్ల చూడవచ్చు)

source: www.emuslim.com

| 1 | **మూరిజూన** = విముఖులై పోయినవారు |
|---|---|

మరియు మేము ఇస్రాఈల్ సంతతివారి నుండి ఇలా తీసుకున్న వాగ్దానం (జ్ఞప్తికి తెచ్చుకోండి): "మీరు అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించ కూడదు. మరియు తల్లిదండ్రులను, బంధువులను, అనాథలను, యాచించని పేదవారిని ఆదరించాలి. మరియు ప్రజలను సహృదయంతో పలకరించాలి, సలాత్‌ను స్థాపించాలి మరియు జకాత్ ఇవ్వాలి." అటు పిమ్మట మీలో కొందరు తప్ప, మిగతా వారంతా తమ (వాగ్దానం నుండి) తిరిగిపోయారు. మీరంతా **విముఖులై పోయినవారే!**. (ఖుర్ఆన్ 2:83)

| 2 | **ముఘ్‌రిఖ్** = ముంచివేయబడినవాడు. దీనికి బహువచనం **ముఘ్‌రఖూన్** |
|---|---|

... ఆ నావలో ప్రతిరకపు జంతు జాతి నుండి ఒక్కొక్క జంటను మరియు నీ పరివారపు వారిని ఎక్కించుకో, ఎవరి గురించి అయితే ముందుగానే నిర్ణయం జరిగిందో వారు తప్ప! ఇక దుర్మార్గుల కొరకు నాతో మనవి చేయకు. నిశ్చయంగా వారు **ముంచి వేయబడతారు**. (ఖుర్ఆన్ 23:27)

| 3 | **ముఫ్‌సిద్** = కల్లోలం రేకెత్తించినవాడు. ముఫ్‌సిదూన్(బహు) |
|---|---|

జాగ్రత్త! నిశ్చయంగా, (భూమిలో) కల్లోలం రేకెత్తిస్తున్న వారు వీరే, కాని వారది గ్రహించడం లేదు (ఖుర్ఆన్ 2:12)

| 4 | **ముఫ్‌లిహ్** = సాఫల్యం పొందినవాడు, ముఫ్‌లిహూన (బహు) |
|---|---|

అలాంటి వారే తమ ప్రభువు (చూపిన) సన్మార్గంలో ఉన్నవారు, మరియు అలాంటివారే సాఫల్యం పొందేవారు. (ఖుర్ఆన్ 2:5)

| 5 | **యున్‌బితు** = పెంచుతాడు |
|---|---|

మరియు అప్పుడు మీరు : "ఓ మూసా! మేము ఒకే రకమైన ఆహారం తింటూ ఉండలేము. కావున భూమిలో ఉత్పత్తి అయ్యే ఆకుకూరలు, దోసకాయలు, వెల్లుల్లి, ఉల్లిగడ్డలు, పప్పు దినుసులు మొదలైనవి మా కొరకు పండించమని నీ ప్రభువును ప్రార్థించు." అని అన్నారు ..." (ఖుర్ఆన్ 2:61)

| 6 | **అన్‌జర్** = హెచ్చరించాడు |
|---|---|

నిశ్చయంగా, సత్య తిరస్కారులను నీవు హెచ్చరించినా, హెచ్చరించక పోయినా ఒకటే, వారు విశ్వసించేవారు కారు. (ఖుర్ఆన్ 2:6)

| 7 | **అన్‌జల** = క్రిందికి దింపుట, అవతరించుట |
|---|---|

ఆయనే మీ కొరకు భూమిని పరుపుగాను మరియు ఆకాశాన్ని కప్పుగాను చేశాడు. మరియు ఆకాశం నుండి వర్షాన్ని కురిపించి, తద్వారా మీకు జీవనోపాధిగా ఫలాలను ఉత్పత్తి చేశాడు! కావున ఇది తెలుసుకుని కూడా, మీరు ఇతరులను అల్లాహ్‌కు సాటిగా నిలబెట్టకండి. (ఖుర్ఆన్ 2:22)

పై ఆయత్‌లో వర్షాన్ని క్రిందికి దింపడం మరియు క్రింది ఆయత్‌లో శాసనం అవతరింపజేయడం చూడవచ్చు.

మరియు నీవు అల్లాహ్ **అవతరింపజేసిన** శాసనం ప్రకారం వారి మధ్య తీర్పు చెయ్యి మరియు వారి వ్యర్థ కోరికలను అనుసరించకు. అల్లాహ్ నీపై అవతరింపజేసిన కొన్ని శాసనాల నుండి వారు నిన్ను తప్పించకుండా జాగ్రత్తగా ఉండు. ఒకవేళ వారు వెనుదిరిగిపోతే, అల్లాహ్ వారిని, వారి కొన్ని పాపాలను శిక్షించదలచాడని తెలుసుకో. మరియు నిశ్చయంగా, ప్రజలలో అనేకులు అవిధేయతకు పాల్పడేవారున్నారు. (ఖుర్ఆన్ 5:49)

| 9 | **అన్‌'అమ్** = అనుగ్రహించాడు |
|---|---|

మరియు వాస్తవానికి మీలో వెనుక ఉండి పోయేవాడు ఉన్నాడు. ఒకవేళ మీకు ఏమైనా ఆపద వస్తే అప్పుడు వాడు : "వాస్తవానికి అల్లాహ్ నన్ను **అనుగ్రహించాడు,** అందుకే నేను కూడా వారితో పాటు లేను!" అని అంటాడు. (ఖుర్ఆన్ 4:72)

| 10 | **యున్‌ఫిఖ్** = ఖర్చు చేసినవాడు, యున్‌ఫిఖూన్ (బహు) |
|---|---|

ఎవరైతే అగోచర యదార్థాన్ని విశ్వసిస్తారో, సలాత్‌ను స్థాపిస్తారో మరియు మేము ప్రసాదించిన జీవనోపాధి నుండి ఖర్చు చేస్తారో (ఖుర్ఆన్ 2:3)

| 11 | **మున్‌కిర్** = తిరస్కరించినవాడు |
|---|---|

లేక వారు తమ సందేశహరుణ్ణి ఎరుగరా? అందుకే అతన్ని తిరస్కరిస్తున్నారా? (ఖుర్ఆన్ 23:69)

| 12 | **అహ్‌లక** = నాశనం చేయుట |
|---|---|

... ఆమె అన్నది : "నీ భార్యను **నాశనం చేయాలని** తలచిన వానికి చెరసాలలో ఉంచడం లేదా బాధాకరమైన శిక్ష విధించడం తప్ప మరొక శిక్ష ఏముంటుంది?" (ఖుర్ఆన్ 12:25)

28వ పాఠంలోని పదాలు కలిగిన ఖుర్ఆన్ ఆయత్‌లను పాఠకుల ప్రయోజనార్థం ఉదాహరణలుగా పైన అందించడం జరిగింది.

ఖుర్ఆన్ ప్రతీ రోజూ చదవండి అరబీతోపాటుగా మీకు అర్థమయ్యే భాషలోని అనువాదాన్ని కలిపి. ఈ పాఠంలో ఇవ్వబడిన పదాలు వివిధ రూపాలలో ఖుర్ఆన్‌లో మీకు ఎన్నో చోట్ల కనిపిస్తాయి. ఈ పదాలలో 'అన్‌జల' అత్యధికంగా అంటే దాదాపు 190 సార్లు పునరావృతమయింది. పఠిస్తున్నప్పుడు అర్థమౌతూ ఉంటే ఖుర్ఆన్ శైలి అమోఘంగా అనిపించి మీ మనస్సులో ఆనందం కలుగజేస్తుంది.

భార్యాభర్తల నుద్దేశించి ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నారు :


వారు మీకు వస్త్రాలు, మీరు వారికి వస్త్రాలు (2:187) | They are clothing for you and you are clothing for them | هُنَّ لِبَاسٌ لَّكُمْ وَأَنتُمْ لِبَاسٌ لَّهُنَّ




అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : (సహీహ్ ముస్లిమ్, 3649, పుస్తకం 17, అధ్యా.19, సంపుటి 4)

**"ఈ ప్రపంచం తాత్కాలిక సుఖం. ప్రపంచంలోని తాత్కాలిక సుఖాలన్నింటికంటే ఉత్తమమైనది ధర్మపరాయణురాలైన స్త్రీ (భార్య)"**

*వస్త్రాలు నగ్నత్వం నుండి కాపాడుతూ మనకు గౌరవాన్నిస్తాయి. అదే విధంగా భార్య గౌరవాన్ని భర్త మరియు భర్త గౌరవాన్ని భార్య కాపాడాలి. కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేరు బాధ్యతలున్నాయి. వారి మధ్య హెచ్చుతగ్గుల గురించి ఆలోచించ వలసిన అవసరం లేదు. ఇద్దరిలో ఎవరికీ ఎక్కువ తఖ్వా ఉంటుందో, ఎవరు తమ బాధ్యతను అల్లాహ్ ఆదేశించిన దాని ప్రకారం నిర్వర్తిస్తారో వారికే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ విలువ ఉంటుంది. కాబట్టి భార్యాభర్తలు ధర్మ పరాయణతలో, బాధ్యతలను నిర్వహించడంలో, ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడటంలో పోటీపడాలి. భార్యాభర్తల సంబంధంలో > (ఎక్కువ), < (తక్కువ), = (సమానం) వంటి గుర్తులు ఉండవలసిన అవసరం లేదు. కొన్ని విషయాలలో భర్త అధికుడైతే, మరికొన్ని విషయాలలో భార్య ఆధిక్యత వహిస్తుంది. సంతోషంగా బ్రతకవలసిన ఎన్నో కుటుంబాలు చీలిపోయి విడాకుల కోసం పరితపించడమో, మానసిక క్షోభకు గురికావడమో జరుగుతుంది. సలాత్ (నమాజ్) ఎలా చేయాలీ, సౌమ్ (ఉపవాసం) ఎలా ఉండాలీ, ఖుర్‌ఆన్‌ను అరబీలో ఎలా చదవాలీ, ఈ విషయాలు తెలుసుకుంటే చాలు అని నేటి ముస్లిమ్ సమాజంలోని స్త్రీలు అనుకుంటున్నారు. వివాహం జరిగినప్పుడో లేక జరిగిన తరువాతైనా సరే ఒక ఇల్లాలిగా తాను నిర్వహించవలసిన బాధ్యతలేమిటో, వాటి గురించి అల్లాహ్ ఏమి ఆదేశించారో తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. తల్లి తన కుమార్తెకు బంగారు నగలు, బట్టలు, ఇతర సామాన్లు ఇవ్వడం గురించి ప్రాధాన్యత ఇస్తుంది గాని, తన కూతురు ఇహలోకంలోనూ పరలోకంలోనూ సంతోషంగా బ్రతకడం కోసం అవసరమైన శిక్షణ ఇవ్వడం లేదు. ఓ మాతృమూర్తి తన కుమార్తె వివాహ సమయాన ఎటువంటి విషయాలు చెప్పి, భర్తతో పంపారో ఈ శీర్షిక తొలి వ్యాసంలో చదవండి. మహిళ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తి స్తే ఓ గొప్ప సమాజం మన ముందుంటుంది.*




ఏయే వయస్సులలో స్త్రీ, పురుషులు వివాహం చేసుకోవచ్చో, ఏయే వ్యక్తులతో వివాహం ధర్మ సమ్మతమో మరియు ఏ ఇద్దరి మధ్య వివాహం నిషిద్ధమో, మరియు **మానసిక సౌందర్యం యొక్క విలువ ఏమిటో** గత సంచికలలో చెప్పుకున్నాము. అంతేకాకుండా ఇతర ధర్మాల వారికి ముస్లిముల వివాహాలపై ఉన్న అపోహలను దూరం చేస్తూ, ఇస్లామీయ వివాహ వ్యవస్థలో ఉన్న వివేకాన్ని స్పష్టంగా ఉదాహరణ పూర్వకంగా వివరించడం జరిగింది.

ఈ విషయాలు ముస్లిమేతరులకే కాకుండా, ముస్లిములలో కూడా చాలా మందికి తెలియవు. కాబట్టి సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అంశాలను చర్చించడం జరిగింది. ఇవి ప్రతీ ముస్లిమ్ తెలుసు కోవలసిన విషయాలు. కాబట్టి కొత్తగా చేరిన పాఠకులు, గత సంచికల లోని వివరాలు మా వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొని చదవగలరని ఆశిస్తున్నాము.

క్రిందటి సంచికలో వివాహం జరగడం మరియు వివాహం తరువాత ఇచ్చే విందు గురించి చెప్పుకున్నాము. ఆ క్రమంలో 'వధువు' తరఫువారు విందు ఇస్తే భోజనం చేయవచ్చా? లేక చేయకూడదా? మొదలైన విషయాలపై చర్చించడం జరిగింది. 'వధువు' తరఫువారు విందు ఏర్పాటు చేయవలసిన అవసరమైతే లేదు. కాని ఒకవేళ ఏర్పాటు చేయాలని తలిస్తే అది వారి ఇష్టం. హదీస్‌ల వెలుగులో ఈ విషయాలన్నీ చర్చించడం జరిగింది. వరుడు ఇచ్చే విందుకు సంబంధించి కొన్ని వివరాలు:

## వలీమా

పెళ్ళి తరువాత వరుడు ఇచ్చే విందును వలీమా అంటారు.

వలీమా ఇవ్వండి అని ముహమ్మద్(స)వారు చెప్పారు. మరియు స్వయంగా ఆయనే 'వలీమా' ఇచ్చారు. వలీమా ద్వారా తనకు జరిగిన వివాహం గురించి తన వారికి తెలియజేయడం జరుగుతుంది. **వలీమా కొరకు ఎంత ఖర్చు చేయాలి?** ఈ ప్రశ్నకే కాదు, అటువంటి ఏ ప్రశ్నకైనా ఇస్లామ్ మధ్యస్థ మార్గాన్నే ఎల్లప్పుడూ సూచిస్తుంది. అతికి తావు లేదు.

అనస్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరుడు(స) పసుపు రంగు అత్తరు ఆనవాళ్ళను చూసారు అబ్దుర్-రహ్మాన్‌పై మరియు అడిగారు : **'ఇదేమిటి?'**. అతను చెప్పారు: "నేను ఒక స్త్రీని వివాహం చేసుకున్నాను ఖర్జూరపు పిక్కంత బంగారంతో (మహ్రాతో)." ఆయన(స) చెప్పారు: "అల్లాహ్ నిన్ను అనుగ్రహించు గాక! **వలీమా ఇవ్వు అది ఒక మేక అయినప్పటికీ.**" **(నసాయీ, సహీహ్, 3374, పుస్తకం 26, అధ్యా. 74, సంపుటి 4)**

---

అనస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు జైనబ్(రజి)వారిని వివాహం చేసుకున్న సందర్భంగా ఇచ్చిన వలీమా (పెళ్ళి విందు) కంటే గొప్పది ఆయన భార్యలలో ఎవరి వివాహ సందర్భాలలోనూ ఇవ్వలేదు. మరియు **ఆయన(స) వలీమా ఇచ్చారు ఒక మేకతో** **(సహీహ్ బుఖారీ, 5168, పుస్తకం 67, అధ్యా. 69, సంపుటి 7)**

---

సఫియ్యహ్ బిన్త్ షైబహ్ ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు వలీమా ఇచ్చారు **రెండు ముద్దుల** (పరిమాణంలో ఉన్న) **బార్లీతో** తన భార్యలలో కొందరిని వివాహం చేసుకున్నప్పుడు. **(సహీహ్ బుఖారీ, 5172, పుస్తకం 67, అధ్యా. 71, సంపుటి 7)**

(1 ముద్ద్ = 750 గ్రాములు. అంటే దాదాపు కేజీన్నర బార్లీతో వలీమా ఇవ్వడం జరిగింది)

ముహమ్మద్(స)వారు ఒక మేకతో విందు ఏర్పాటు చేశారు. కేజీన్నర (1500 గ్రాముల) బార్లీతో కూడా వలీమా ఇచ్చారు. సఫియ్యా(రజి)వారిని వివాహం చేసుకున్నప్పుడు, ప్రయాణంలోనున్న వారందరి దగ్గర ఉన్న ఆహార పదార్థాలను తీసుకురమ్మని చెప్పి, ఓ వంటకం తయారు చేయించారు, ఆ విధంగా విందు ఇచ్చారు.

వలీమా(విందు) ఇవ్వడం సున్నత్. వరుడి స్థోమతను బట్టి దానిని ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రవక్త(స)వారి ముఖ్య అనుచరుడైన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)వారు వివాహం చేసుకున్న తరువాత ముహమ్మద్(స)వారికి కనిపించారు. అంటే పెళ్ళికి ప్రవక్త(స)వారు వెళ్ళలేదు. కాబట్టి **వీటన్నింటి బట్టి వధూవరులు పెళ్లి విషయంలో, విందుల విషయంలో శక్తికి మించి ఆడంబరాలకు పోనవసరం లేదని స్పష్టమౌతుంది.** పై హదీస్‌లను బట్టి వివాహం తరువాత వలీమా ఇచ్చారని అర్థమౌతుంది.

### వలీమాకు ఆహ్వానిస్తే తిరస్కరించ కూడదు.

ఇబ్నె ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు: మీలోని ఒకరు వలీమాకు ఆహ్వానించ బడినప్పుడు దానికి రావాలి. **(సహీహ్ ముస్లిమ్, 3509, పుస్తకం 16, అధ్యా.16, సం.4)**

---

అబూహురైరా(రజి)వారు చెప్పారు: చెడ్డ ఆహారం ఆ వలీమా ఆహారం ఏ వలీమాలో అయితే ధనవంతులను పిలిచి మరియు పేదవారిని వదిలేస్తారో మరియు ఎవరైతే (వలీమా) ఆహ్వానాన్ని తిరస్కరించాడో అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు (స)పట్ల అవిధేయత చూపాడు. **(సహీహ్ బుఖారీ, 5177, పుస్తకం 67, అధ్యా. 73, సంపుటి 7)**

ధనవంతులను ఆహ్వానించి వారికి విందు ఇచ్చి, పేదవారిని విందుకు పిలవకపోతే, ఆ విందులో ఎంత ఖరీదైన ఐటమ్స్ ఏర్పాటు చేసినప్పటికీ, ఆ ఆహారం అన్నిటికంటే చెడ్డ ఆహారం అవుతుంది, ప్రవక్త(స)వారు వివరించినట్లు.

నేటి కాలంలో ఈ విందులలో కొత్త అంశాలు చేరిపోయాయి. విఐపి (VIP)లకు ప్రత్యేకంగా ఘనంగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవి సున్నత్‌కి వ్యతిరేకం. **సున్నత్ అంటే ఇష్టపడేవారు మరియు గౌరవించేవారు మాత్రమే ఇచ్చే విందే - వలీమా.** ఎందుకంటే వలీమా సున్నత్ గనుక. మరి సున్నత్‌కు వ్యతిరేకంగా 'వలీమా' చేద్దామనుకునే వారికి **'వలీమా' ఇవ్వవలసిన అవసరం ఏమిటి?** ఆలోచించాలి! వలీమా ప్రవక్త(స)వారు చెప్పినట్లు చేయడంలోనే శుభం ఉంటుంది.

విందు ఇవ్వడం సున్నత్. విందును తిరస్కరించడం అవిధేయత. విందులో పేద, ధనిక బేధం చూపకూడదు. విందులో ఏర్పాటు చేసే ఆహార పదార్థాలు వరుడి స్థోమతపై ఆధారపడి ఉంటాయి.

### నికాహ్ మరియు వలీమాకు మధ్యకాలంలో ...

వీటి మధ్య కాలంలో జరిగే విషయాలు క్లుప్తంగా ఇక్కడ వివరిస్తున్నాము. నికాహ్ పూర్తయ్యాక, వధువు వరుడితో కలిసి వరుని ఇంటికి వస్తుంది. అరేబియాలో జాహిలియ్యాహ్ ( కాలంలో) వివాహం అయిన తరువాత కుమార్తెను ఆమె భర్త ఇంటికి సాగనంపేటప్పుడు ఓ మాతృమూర్తి ఏం చెప్పారో ఈ శీర్షిక తొలి వ్యాసంలో చెప్పడం జరిగింది. అయితే ఇక్కడ సందర్భానికి అవి అవసరం కనుక మరలా అందించవలసి వచ్చింది.

భర్తపట్ల గౌరవమర్యాదలు కలిగి ఉండడం ఈ ఉమ్మత్ యొక్క ఒక ప్రధాన లక్షణం. అది మంచి నడవడికలో ఒక భాగం కూడా. అజ్ఞానకాలంలో కూడా ఇది ఆచరణలో ఉండేది. ఇస్లామ్ దీనిని ధృవపరిచింది. మరియు ఇస్లామ్ స్వీకరించాక అరబ్బులు పూర్వపు ఆచరణను శాశ్వతం చేసుకున్నారు.

**అరబ్ సంస్కృతి అంతా వాక్పటిమతో కూడిన పదాలతో నిండి ఉంది. తల్లులు తమ కుమార్తెల వివాహ సమయంలో భర్త పట్ల ఉండ వలసిన గౌరవమర్యాదల గురించి మరియు అతనిపై చూపవలసిన శ్రద్ధ గురించి సలహాలిచ్చేవారు. అవి అమూల్యమైనవి.**

అటువంటి వాటిలో బాగా ప్రఖ్యాతి చెందిన ఓ ఉల్లేఖనం అబ్దుల్ మాలిక్ బిన్ ఉమైర్ బిన్ అల్-ఖురేషి గ్రంథస్థం చేశారు. ఈయన హిజ్రీ శకం 2వ శతాబ్దానికి చెందిన ప్రముఖ విద్వాంసుడు. ఈయన గ్రంథస్థం చేసిన మాటలు ఉమామా బిన్త్ హారిస్‌గారివి.

**ఆమె మంచి వాక్పటిమ మరియు జ్ఞానం కలిగిన మహిళ. ఆమె గొప్ప వివేకం మరియు మానసిక పరిపక్వతతో తన కుమార్తె వివాహ సమయాన వివాహం విజయవంతం కావడానికి సలహా ఇచ్చారు.**

ఆ మాతృమూర్తి మాటలు నిజంగా ఆణిముత్యాలే! ఆమె భర్తపేరు ఔఫ్ బిన్ ముహల్లమ్ అష్-షైబాని, ఈయన అజ్ఞాన కాలంలో అరబ్ ఉన్నత వంశానికి చెందిన గౌరవ ప్రతిష్టలు కలిగిన నాయకులలో ఒకరు. ఆయన తన కుమార్తె ఉమ్మె ల్యాస్‌ను హారిస్ బిన్ అమ్ర్ అల్-కిందీకి ఇచ్చి వివాహం చేసారు. ఆమెను అల్లుడితో పంపడానికి సిద్ధం చేశారు.

**సరిగ్గా ఆ సమయంలో పెళ్ళి కుమార్తెకు సలహా ఇవ్వడానికి ఆమె తల్లిగారు దగ్గరికి వచ్చి ఇలా చెప్పారు:**

## ఉత్తమ సలహా

**ఓ నా పుత్రీ! నీవు ఓ ఉన్నత వంశానికి వారసురాలివి మరియు మంచి నడవడిక కలదానివి కాబట్టి ఈ సలహా నీకు అనవసరమా అని తలిస్తే ఇది నీకు అనవసరమే అవుతుంది. ఎందుకంటే ఈ గుణాలను నీవు కలిగి ఉన్నావు. కాని ఇది మరచిపోయిన వారికి జ్ఞాపకంగానూ మరియు తెలివైన వారికి సహాయంగానూ ఉంటుంది.**

**ఓ నా పుత్రీ! తన తండ్రి ఐశ్వర్యం ఉందన్న స్థైర్యంతో భర్త లేకుండా ఓ స్త్రీ అన్నీ చేసుకోగలిగితే మీరంతా భర్త లేకుండానే అన్నీ చేసుకోగలుగు తారు. కాని స్త్రీలు పురుషులకోసం సృష్టించబడ్డారు, పురుషులు వారి కొరకు సృష్టించబడ్డారు. (భార్యాభర్తలు ఒకరికోసం మరొకరు సృష్టించ బడ్డారు).**

**ఓ నా పుత్రీ! నీవు ఏ ఇంటిలో పెరిగావో, ఎక్కడ నడక నేర్చుకున్నావో ఆ ఇంటిని వదలబోతున్నావు నీకు తెలియని చోటుకి, నీకు సుపరిచితం కాని ఓ సహచరుని దగ్గరకు వెళ్ళడానికి.**

**నిన్ను వివాహం చేసుకోవడం ద్వారా, అతడు నీకు యజమాని అయ్యాడు కాబట్టి అతనికి సేవకురాలివలే ఉండు, మరియు అతడు నీకు సేవకుని వలే మారతాడు.**

**నా నుండి పది లక్షణాలను తీసుకో. అవి నీకు ఇచ్చే వస్తుసామాగ్రి మరియు నీ కోసం జ్ఞాపికగా.**

### వాటిలోని మొదటిది మరియు రెండవది

**అతని సహచర్యంలో తృప్తిగా ఉండు మరియు అతని మాటవిని అతనికి విధేయురాలిగా ఉండు. సంతృప్తి మనశ్శాంతినిస్తుంది మరియు భార్య తన భర్త మాట విని విధేయత చూపడం అల్లాహ్‌ను సంతోష పెడుతుంది.**

### 3 & 4

**నీవు సువాసనతో మరియు బాగా కనిపించేలా ఉండు, అతడు నీలో ఏ విధమైన వికారాన్ని చూడకూడదు. మరియు నీ నుండి ఆహ్లాదకరమైన వాసన తప్ప మరేదీ రాకూడదు. కాజల్ (కాటుక) అలంకరణకి ఉత్తమ రకమని తెలుసుకో మరియు నీటిని అరుదైన వాటిలో కెల్లా అరుదైన పరిమళద్రవ్యమని తెలుసుకో!**

### 5 & 6

**అతనికి భోజనం సమయానికి సిద్ధపరచు. మరియు అతడు నిద్రలో ఉండగా చప్పుడు చేయకు. ఆకలి తీవ్రత మండుతున్న జ్వాల వంటిది మరియు నిద్రాభంగం అతనికి కోపం తీసుకురావచ్చు.**

### 7 & 8

**అతని నౌకర్ల పట్ల మరియు పిల్లల పట్ల శ్రద్ధ వహించు మరియు అతని ఐశ్వర్యాన్ని జాగ్రత్తగా చూడు. అతని ఐశ్వర్యం విషయంలో తీసుకునే జాగ్రత్త అతనిని మెచ్చుకున్నట్లు అవుతుంది. మరియు అతని పిల్లలు మరియు నౌకర్ల పట్ల చూపే శ్రద్ధ మంచి నిర్వహణను తెలియ జేస్తుంది.**

### 9 & 10

**భర్త రహస్యాలలో దేనినీ ఎన్నటికీ బయట పెట్టకు మరియు అతని ఆదేశాలకు అవిధేయత ఎన్నటికీ చూపకు. నీవు అతని రహస్యాలను బహిర్గతం చేస్తే అతనికి చేసిన ద్రోహభావం నుండి నీవెన్నటికీ క్షేమాన్ని అనుభూతి చెందవు. మరియు నీవు అతనికి అవిధేయత చూపితే అతని హృదయం నీపట్ల ద్వేషంతో నిండి పోతుంది.**

**జాగ్రత్త! ఓ నా పుత్రీ! అతడు విచారంలో ఉన్నప్పుడు అతని ముందు సంతోషాన్ని చూపకు మరియు అతడు సంతోషంగా ఉన్నప్పుడు అతని ముందు విచారాన్ని చూపకు. ఎందుకంటే మొదటిది యుక్తాయుక్త పరిజ్ఞానం లేకపోవడాన్ని చూపిస్తే, తరువాతది బాధ కలిగిస్తుంది.**

**నీకు సాధ్యమైనంత స్థాయిలో అతని పట్ల గౌరవమర్యాదలు చూపు మరియు వీలైనంత ఎక్కువగా నీవు అతనికి అనుకూలంగా ఉండు. అప్పుడు నీ సహచర్యం నీతో సంభాషణ అతనిని ఆనందింప జేస్తుంది.**

**తెలుసుకో, ఓ నా పుత్రీ! నీవు ఇష్టపడింది నీవెప్పుడూ సాధించలేవు అతని సంతోషాన్ని నీ సంతోషానికంటే ముందుగా మరియు అతని కోరికలను నీ కోరికలకంటే ముందుగా ఉంచేవరకూ, అది ఏదైనా సరే నీకు నచ్చినా నచ్చకపోయినా.**

**నీకేది ఉత్తమమో మరియు నీకేది రక్షణో అల్లాహ్ ఎంచుగాక!**

***ఆ నవ వధువు తన భర్త దగ్గరకు తీసుకెళ్ళబడింది మరియు ఆ వివాహం విజయవంతం అయింది. ఆమెకు జన్మించినవారు తరువాత రాజులై (kings) పరిపాలించారు.***

## అత్తమామల జోక్యం ...

తల్లిదండ్రులు తెలుసుకోవలసిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే తమ పిల్లలు - 'వరుడైనా', 'వధువైనా' - వారి బంధాలు విజయ వంతం కావాలని కోరుకోవాలి గాని, వారి జీవితాలలోని ప్రతీ అంశంలోనూ జోక్యం చేసుకుని, తమ అహాన్ని తృప్తిపరచు కోవడానికి, **వారి బంధాన్ని బలహీనం చేయకూడదు**. అయితే ఖుర్'ఆన్ మరియు సున్నత్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించేటప్పుడు వారు హెచ్చరించవచ్చు.

ఈ మాతృమూర్తి తన కూతురు మెట్టినింట శాశ్వతంగా సంతోషంగా బ్రతకడానికి అమూల్యమైన సలహాలు ఇచ్చారు. ఇంతకంటే విలువైన కానుకలు ఏ తల్లిదండ్రులూ తమ కుమార్తెకు ఇచ్చి పంపలేరు. కాని నేడు మన సమాజంలో దీనికి భిన్నంగా జరుగుతుంది. భర్త ఇంటికి చేరకముందు సరియైన హితబోధ చెప్పడానికి బదులు, **భార్యాభర్తల కాపురం సజావుగా సాగేటప్పుడు**, కుమార్తె ద్వారా విషయాలు తెలుసుకుని, ప్రతీ విషయంలోనూ జోక్యం చేసుకుంటున్నారు. ఆ జోక్యం వారి కాపురంలో సంతోషాన్ని దూరం చేస్తుందని భావించడం లేదు. గట్టిగా ఏమైనా అడిగితే నా కూతురు సంతోషం కొరకే చేశానని అంటారు. వరుని వైపు వారు కూడా ఇదే విధంగా జోక్యం చేసుకోవడంతో **భార్యాభర్తలు స్పర్థలకు గురౌవుతున్నారు**. అసలు సమస్య ఏమిటంటే వారు అనుసరించే **కొన్ని విధానాలు ఇస్లామ్‌కి సంబంధించినవి. మరికొన్ని ఇతర ధర్మాలకు చెందినవి.** ఇవన్నీ కలిసిపోయి సమస్యలకు కారణం అవుతున్నాయి. పూర్తిగా సున్నత్‌నే అనుసరించి ఎవరి హక్కులను వారు తెలుసుకుంటే ఈ సమస్యలు, ఇన్షా అల్లాహ్, ఉత్పన్నం కావు.

**భార్యకు భర్తపై ఉన్న హక్కులు** మరియు **భర్తకు భార్యపై ఉన్న హక్కుల** గురించి ముహమ్మద్(స)వారు చాలా స్పష్టంగా వివరించారు. కాబట్టి **విశ్వాస స్త్రీ** భర్త ఇంటిలో అడుగుపెట్టనప్పటి నుండి ఈ లోకాన్ని వీడేవరకూ ఏయే సందర్భాలలో ఎలా ప్రవర్తించాలో, కేవలం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల ద్వారా తెలుసుకుని ఆచరిస్తే, ఆమె జీవితం సంతోష మయం అవుతుంది. మరియు **ఆమె కుటుంబం సంతోషంగా ఉంటుంది, ఇన్షా అల్లాహ్!**

అంతేకాకుండా ఆనాటి ఎందరో విశ్వాస స్త్రీల యొక్క జీవితచరిత్రలు మనకు అందుబాటులో ఉన్నాయి. అవి జీవితంపై మనకు చక్కటి అవగాహన కలిగిస్తాయి. వాటిలో ముఖ్యమైన విషయాలన్నింటినీ ప్రామాణిక హదీస్‌ల ద్వారా ఈ శీర్షికలో, ఇన్షా అల్లాహ్ అందిస్తాము.

## భర్త ఇంటికి వెళ్ళేటప్పుడు భార్య ఏమేమి తీసుకువెళ్ళాలి?

ప్రవక్త(స)వారు తన కుమార్తెను సాగనంపేటప్పుడు ఇచ్చిన కానుకలు:

అలీ(రజి)వారు ఉల్లేఖించారు : అల్లాహ్ యొక్క సందేశహరులు (స) సాగనంపారు ఫాతిమాను మృదువైన వస్త్రం (velvet dress), నీటితిత్తి మరియు ఇజ్ఖర్‌తో నింపబడిన దిండుతో (నసాయీ, సహీహ్, 3386, పుస్తకం 26, అధ్యా.74, సంపుటి 4)

ఫాతిమా(రజి)వారిని వివాహం చేసుకునే సమయానికి మహ్రగా ఇవ్వడానికి అలీ(రజి)వారి దగ్గర **ఒక కవచం తప్ప ఏదీ లేదు.**
(ఇజ్ఖర్ అంటే సౌదీఅరేబియాలో లభించే సువాసన ఇచ్చే ఒకరకమైన గడ్డి)

ఆమె తల్లిదండ్రులు ఇస్తే తీసుకురావచ్చు. కాని ఖచ్చితంగా తీసుకు రావలిసిన ఆదేశమైతే ఇస్లామ్ ఇవ్వలేదు. **వివాహం ద్వారా స్త్రీపై ఎటువంటి భారాన్ని ఇస్లామ్ మోపలేదు.** కాబట్టి ఆమె ఖాళీ చేతులతోనే భర్త ఇంటికి రాగలదు.

## భార్యకు భర్తపైనున్న హక్కులు

హకీమ్ బిన్ ము'ఆవియహ్ అల్-ఖుషైరీ - తన తండ్రి నుండి - ఉల్లేఖించారు. అతను అడిగారు: **'ఓ రసూలల్లాహ్(స)! మాపై మా భార్యలకు ఉన్న హక్కులేమిటి?'** ఆయన(స) సమాధానమిచ్చారు: 'నీవు ఆమెకు తినిపించు నీవు తిన్నప్పుడు. మరియు ఆమెను ధరింపజేయి నీవు వస్త్రాలను ధరించినప్పుడు మరియు ఆమె ముఖంపై కొట్టకు. ఆమెను ఇంటి దగ్గర తప్ప అవమానించకు మరియు మందలించకు (అబూదావూద్, సహీహ్, 2142, పుస్తకం 12, అధ్యా.40/41, సంపుటి 2)

భర్త తాను ఏదైతే తింటున్నాడో దానిని తన భార్య చేత తినిపించాలి. అంటే తాను శ్రేష్ఠమైనది తిని, తన భార్యకు నాసిరకం పెట్టకూడదు. అదే విధంగా ధరించే దుస్తుల విషయంలో కూడా ఒకే విధంగా ఉండాలి. అల్లాహుతాలా ఖుర్'ఆన్‌లో చెప్పారు, వారు (భార్యలు) వీరికి (భర్తలకు) వస్త్రాలు మరియు వీరికి (భర్తలకు) వారు(భార్యలు) వస్త్రాలని. ఈ ఆయత్‌పై వివరణకు చాల పేజీలు అవసరమౌతాయి.

మరొక విధంగా చెప్పాలంటే, పోషించ వలసిన పూర్తి బాధ్యత భర్తపైనే ఉంది. ఆమెపైగాని ఆమె తరఫువారిపై గాని ఆ పోషణా భారం లేదు.

**భర్త దగ్గర నుండి మహ్ర తీసుకుని వివాహాన్ని ధర్మసమ్మతం చేసుకుని, ఖాళీ చేతులతో భర్త ఇంటికి వచ్చి, భర్తచేత పోషించబడటం అన్ని విధాలా కేవలం మహిళకే మేలుగా కనిపించినా, ఆ ఇల్లాలుకి హక్కులతో పాటు కొన్ని బాధ్యతలు కూడా ఉన్నాయి. ఆ బాధ్యతలను ఆమె సరిగ్గా నిర్వహించగలిగితే, ఇన్షా అల్లాహ్, స్వర్గంలో ప్రవేశించ గలుగుతుంది.**

అయితే ఆ బాధ్యతల గురించి చెప్పుకునే ముందు, భార్యాభర్తలు శారీరకంగా మరియు మానసికంగా ఒకటి కావాలనే విషయం గురించి చెప్పుకోవాలి.

## భార్యాభర్తల కలయిక

### *మనస్సులు ఒకటి కావడం*

నిజాయితీగల ఓ ముస్లిమ్ స్త్రీ తన భర్తకు ఇష్టమైనవి మరియు ఇష్టం కానివి మరియు అతని అలవాట్లను గుర్తిస్తుంది. వాటి ప్రకారంగా తనకు సాధ్యమైనంత స్థాయిలో భర్తకు అనుకూలంగా ఉండటానికి ప్రయత్నిస్తుంది. ఆ ప్రవర్తన **వారిద్దరి మధ్య అన్యోన్యాన్ని పెంచుతుంది.** మరియు పరస్పరం అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తుంది.

వివేకవంతమైన స్త్రీ ఆ విధంగా చేస్తుంది.

ఖాజీ మరియు ఫఖీహ్ (jurist)యైన సురైహ్, బనీ హన్‌జలహ్ తెగకు చెందిన స్త్రీని వివాహం చేసుకున్నారు. వివాహం జరిగిన రోజు రాత్రి, **ఇద్దరూ కలిసి రెండు రకాత్‌లు సలాత్ చేసి అల్లాహ్‌ను వేడుకున్నారు తమను అనుగ్రహించమని.**

తరువాత వధువు సురైహ్ వారి వైపు తిరిగి అడిగారు, **"నేను కొత్త వ్యక్తిని మరియు మీ గురించి నాకు ఎక్కువ తెలియదు. చెప్పండి మీకు ఏది ఇష్టమో మరియు నేను దానిని చేస్తాను మరియు మీకు ఏది ఇష్టం కాదో చెప్పండి ఎందుకంటే నేను దానిని దూరంగా ఉంచుతాను."** సురైహ్ చెప్పారు, "ఆమె నాతో 20 సంవత్సరాలు కాపురం చేసింది. నేనెన్నడూ ఏ విషయంలోనూ ఆమెను తప్పు పట్టవలసిన అవసరం రాలేదు ఒక సందర్భంలో తప్ప, కాని అప్పుడు తప్పు నాదే"

ఈ విధంగా ఒక స్త్రీ భర్త నుండి ప్రేమను మరియు గౌరవాన్ని కూడా పొందగలుగుతుంది.నీ విషయాన్ని ఇది వరకూ శాంతిబాటలో చాలాసార్లు చెప్పుకున్నాం, విశ్వాసుల తొలి మాతృమూర్తియైన 'ఖదీజా'(రజి)వారి గురించి. ఆమెను ప్రవక్త(స) వారు ఎంతగానో ప్రేమించారు మరియు గౌరవించారు. **భర్త గౌరవాన్ని మరియు ప్రేమను పొందే భార్యకంటే అదృష్టవంతులు ఎవరుంటారు?** హంబల్ బిన్ అల్-జౌజి తన 'అహ్‌కామున్నిసా'లో తెలియజేసిన ఓ ఉదాహరణ :

హిజ్రీ శకం 2లో షు'ఐబ్ బిన్ హర్బ్ అనే ధర్మపరాయణుడు ఉండేవారు, ఉపవాసాలుంటూ మరియు రాత్రిళ్ళు ప్రార్థనలో గడుపుతూ. ఆయన ఒక స్త్రీని వివాహమాడ దలిచారు మరియు ఆమెతో ఆయన చాలా అణుకువగా చెప్పారు, "నేను కోపిష్ఠిని" యుక్తితో మరియు వివేకంతో ఆమె సమాధానమిచ్చారు, "మీ నిగ్రహాన్ని పోగొట్టేవారు మీ కంటే చెడ్డవారు". ఆయన అర్థం చేసుకున్నారు **తన ముందున్న స్త్రీ తెలివైనదని, వివేకంతో మానసిక పరిపక్వత గలిగిన స్త్రీ అని.** ఆయన వెంటనే ఆమెతో చెప్పారు, "నీవు నా భార్యవు అవుతావు."

భర్త సైకాలజీని భార్య అర్థం చేసుకుని, అతనికి ఏది కోపాన్ని కలిగిస్తుందో మరియు ఏది సంతోషం కలిగిస్తుందో తెలుసుకుని, తదనుగుణంగా వ్యవహరిస్తే, ఆమె అతని హృదయాన్ని జయిస్తుంది. కుటుంబ కలహాలకు మూలమైనదానిని తొలగించ గలుగుతుంది.

### భార్యాభర్తలు శారీరకంగా ఒకటి కావడం

ఇక్కడ చెప్పబోయే విషయాలు శృంగారానికి సంబంధించిన విషయాలు కావు. భార్యాభర్తలిరువురిపై విధిగా ఉమ్మడిగా ఉన్న ఓ బాధ్యత గురించి వివరించేవి మాత్రమే. ఇవి హదీస్ గ్రంథాలలోనే ఉండి పోవడానికి కాదు. ప్రతీ జంట తెలుసుకోవలసిన విషయాలు.

**ముందుగా క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌ల ద్వారా ఓ ముఖ్యమైన విషయాన్ని అర్థం చేసుకోవాలి.**

మరియు అల్లాహ్ మీవంటి వారి నుండియే మీ సహవాసులను పుట్టించాడు. మరియు **మీ సహవాసుల నుండి మీకు పిల్లలను మరియు మనమళ్ళను ప్రసాదించి** మీకు ఉత్తమమైన జీవనో పాధులను కూడా సమకూర్చాడు ... (ఖుర్'ఆన్ 16:72)

కావున మానవుడు తాను దేనితో సృష్టించబడ్డాడో గమనించాలి. **అతడు విసర్జించబడే ద్రవపదార్థంతో సృష్టించబడ్డాడు.** అది వెన్ను మరియు రొమ్ము ఎముకల మధ్య భాగం నుండి బయటికి వస్తుంది. (ఖుర్'ఆన్ 86:5-7)

**ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి సృష్టించాడు. తరువాత అతని నుండి అతని జంటను పుట్టించాడు.** మరియు మీ కొరకు ఎనిమిది జతల పశువులను పుట్టించాడు. ఆయన **మిమ్మల్ని మీ తల్లుల గర్భాలలో మూడు చీకటి తెరలలో ఒక రూపం తరువాత మరొక రూపాన్ని ఇచ్చాడు.** ఆయనే అల్లాహ్! మీ ప్రభువు. విశ్వాధిపత్యం ఆయనదే. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. అలాంటప్పుడు మీరు ఎలా తప్పించ బడుతున్నారు. (ఖుర్'ఆన్ 39:6)

"... నిశ్చయంగా, మేము మిమ్మల్ని **మట్టితో** సృష్టించాము. తరువాత **వీర్య బిందువుతో,** ఆ తరువాత **నెత్తురు గడ్డతో,** ఆపైన **మాంసపు కండతో,** అది పూర్తిగా రూపం పొందవచ్చు లేక పూర్తిగా రూపం పొందకపోవచ్చు. ఇదంతా మేము మీకు స్పష్టం చేస్తున్నాము. ఆ తరువాత మేము కోరిన వారిని **ఒక నిర్ణీతకాలం వరకు గర్భకోశాలలో** ఉంచుతాము. పిదప **మిమ్మల్ని శిశువుల రూపంలో బయటకి తీస్తాము.** ఆ తరువాత మిమ్మల్ని యవ్వన దశకు చేరనిస్తాము. మీలో ఒకడు చనిపోతాడు. మరొకడు నికృష్టమైన వృద్ధాప్యం వరకూ చేర్చబడతాడు. అప్పుడతడు మొదట అంతా తెలిసినవాడైనా ఏమీ తెలియని వాడుగా అయిపోతాడు ..." (ఖుర్'ఆన్ 22:5)

ఆదమ్(అ) మరియు హవ్వా(అ)వారి నుండి మానవజాతి మొదలైంది. వారి సంతానం నుండి సంతానం. మరలా ఆ సంతానం నుండి సంతానం ... ఈ విధంగా ప్రపంచంలో ఏ జాతికి చెందిన వారైనా

సరే, మానవులందరికీ మూలం ఒకే ఒక జంట. ఆదమ్(అ)వారు మట్టితో సృష్టించబడ్డారు. ఆయనలో ఆత్మను ఊదారు. తరువాత ఆయన నుండే హవ్వా(అ)వారిని అల్లాహ్ పుట్టించాడు. ఆ తరువాత వీరి కలయిక ద్వారా సంతానం కలిగింది. అల్లాహ్ ఖుర్ఆన్‌లో చెప్పిన వీర్యబిందువుతో అంటే పురుషుని నుండి విడుదలయ్యే బిందువు స్త్రీ గర్భాశయంలో ప్రవేశించి, ఆ గర్భాశయంలో అల్లాహ్ ఆదేశం మేరకు శిశువుగా రూపు దిద్దుకోవడం జరుగుతుంది.

సంతానోత్పత్తి అనేది జరగకపోతే ఈ రోజు మనం ఉండేవారము కాదు. భార్యాభర్తలు శారీరకంగా కలవాలి. **ఇది తప్పనిసరి మరియు ధర్మసమ్మతమైన వ్యవహారం.** అయితే ఏ ఇద్దరు స్త్రీ, పురుషులు శారీరకంగా కలిసినా, అది ధర్మసమ్మతం కాదు. **కేవలం భార్యాభర్తల కలయిక మాత్రమే ధర్మ సమ్మతం.** ఇదే సంచికలో పాఠకుల అభిప్రాయాలలో కొన్ని ముఖ్య విషయాలు తెలిపాము. ముందుగా వాటిని కూడా చదవండి.

శుభ్రత సగం విశ్వాసంతో సమానం. మలమూత్ర విసర్జన కొరకు మరియు శుద్ధి కొరకు వెళ్ళేటప్పుడు, అల్లాహుతాలా తన సందేశహరుని చేత మనకు ఒక దు'ఆ నేర్పించారు. ఆ దు'ఆ మనల్ని కొన్నిటి నుండి కాపాడుతుంది. అదే విధంగా ఏ దిక్కువైపు మలమూత్ర విసర్జన కావించాలి మరియు ఏ విధంగా శుభ్రం చేసుకోవాలో కూడా అల్లాహుతాలా నేర్పించారు.

మనల్ని సృష్టించింది అల్లాహ్‌యే! మనకు జీవనోపాధి కల్పించేది ఆయనే! మనకు అన్నీ నేర్పించేది ఆయనే! భార్యాభర్తలు శారీరకంగా కలిసే విషయంలో కూడా **చేయదగినవి** మరియు **చేయకూడనివి** కూడా తెలియజేశారు. ఇది అశ్లీలమైన పనికాదు. ధర్మ సమ్మతమైన వివాహం ద్వారా భార్యాభర్తలైనవారు, ఏకాంతంలో చేసే ఈ పని ధర్మ సమ్మతమైనది. భార్యాభర్తలు ఈ విధంగా కలవడానికి ముందు ఈ క్రింది హదీస్‌లో చెప్పబడిన విధంగా అల్లాహ్‌ను వేడుకోవాలి :

> ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : మీలో ఎవరైనా తన భార్యతో కలిసేటప్పుడు **"బిస్మిల్లాహ్! అల్లాహుమ్మ జన్నిబ్‌నిష్ షైతాన వ జన్నిబిష్ షైతాన మా రజఖ్‌తన"** (అల్లాహ్ పేరుతో! ఓ అల్లాహ్! షైతాన్‌ను మాకు దూరంగా ఉంచు మరియు దూరంగా ఉంచు షైతాన్‌ను ఏదైతే మాపై అనుగ్రహించావో దాని నుండి" మరియు ఈ కలయిక వలన **వారికి బిడ్డ కలగాలని వ్రాసి ఉంటే, షైతాన్ ఎన్నడూ ఆ బిడ్డకు హాని చేయలేడు.** (సహీహ్ బుఖారీ, 5165, పుస్తకం 67, అధ్యా. 67, సం. 1)

మనం చేతితో ఆహారం తింటాము. దాని కొరకు కుడిచేతినే ఉపయోగిస్తాము. ఎడమ చేతిని ఉపయోగించము. మర్మాంగాలను (private parts) ఎడమ చేతితో మాత్రమే ముట్టుకుంటాము. ఈ విధంగా ప్రతీ శరీర భాగానికి కొన్ని ప్రత్యేక విధులున్నాయి.

ఇక 'శారీరక కలయిక'కు సంబంధించి నిషేధించబడినవి కూడా కొన్ని ఉన్నాయి. ఏ విశ్వాస పురుషుడైనా లేక ఏ విశ్వాస స్త్రీయైనా సరే తాను చేసేపని **హలాల్**(ధర్మ సమ్మతమా?) లేక **హరామ్** (నిషేధించబడినదా?) అని తప్పనిసరిగా తెలుసుకోవాలి. ధర్మ సమ్మతమైనది చేస్తే అది వారికి ఆనందాన్ని కలిగించేదైనా సరే, దాని ద్వారా వారికి పుణ్యం లభిస్తుంది. నిషేధించబడిన పని చేస్తే అది వారి పట్ల పాపకార్యం అవుతుంది. అది చేయకూడదు.

తల్లి గర్భంలోకి తండ్రి నుండి వీర్య బిందువు చేరినప్పుడు, ఇన్షా అల్లాహ్, గర్భంలో శిశువు తయారై ఆ తరువాత నెలలు నిండాక బిడ్డ బయటకు తీసుకు రాబడతాడు.

బిడ్డ పుట్టుకకు కారణం తల్లిదండ్రుల జననేంద్రియాలు. అయితే ఆ జననేంద్రియాల కలయికకు బదులు, ఇతర భాగాల కలయిక వలన గర్భస్థ శిశువు తయారుకాడు. మానసిక ఆరోగ్యం గలవారికి ఆ జననేంద్రియాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**సత్యాన్ని తెలపడానికి అల్లాహ్ సిగ్గుపడడు.** గర్భాశయానికి చేరే ద్వారంలో కాకుండా, మలద్వారంలో కలయిక జరగకూడదు. అది నీచమైన పాపకార్యం. ఆ విధంగా కలిసిన పురుషునిపై అల్లాహ్ శాపం ఉంటుంది. క్రింది హదీస్‌లు చూడండి.

> ఖుజైమహ్ బిన్ సాబిత్ ఉల్లేఖించారు. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: **'నిస్సందేహంగా అల్లాహ్ సిగ్గుపడరు నిజం చెప్పడానికి'** మూడుసార్లు (చెప్పారు). సంభోగం జరపకండి స్త్రీలతో వారి వెనుక భాగంలో. **(ఇబ్నెమాజా, సహీహ్, 1924, పుస్తకం 9, అధ్యా.29, సంపుటి 3)**

---

> అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు: '**అల్లాహ్ ఒకని వంక చూడడు** తన భార్యతో వెనుక (మలద్వారంలో) కలిసిన వాడిని. **(ఇబ్నెమాజా, సహీహ్, 1923, పుస్తకం 9, అధ్యా.29, సం.3)**

చూడడు అంటే అల్లాహ్ కారుణ్యం ఆ వ్యక్తిపై పడదు అని అర్థం చేసుకోవాలి.

> అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. "తన భార్యను వెనుక (మలద్వారంలో) సమీపించినవాడు **శపించబడ్డాడు.**" (అబూ దావూద్, హసన్, 2162, పుస్తకం 12, అధ్యా.44/45, సంపుటి 2)

ఆ విధంగా **చేయవద్దన్నారు.** చేస్తే అల్లాహ్ యొక్క **కారుణ్యాన్ని** ఆ **వ్యక్తి కోల్పోతాడు.** అంతేకాకుండా **శాపాన్ని అదనంగా పొందుతాడు.**

పొలంలో పంట పండించడానికి ముందుగా రైతు విత్తనాలను అందులో జల్లుతాడు. అంతేగాని మొలకెత్తడానికి వీలుకాని చోట వాటిని చల్లడు. పొలంలోకి రైతు కుడిప్రక్కనుండి విత్తనాలు చల్లినా, ఎడమ ప్రక్కనుండి విత్తనాలు చల్లినా, ఆ విత్తనాలు పొలంలోనే పడతాయి. ఫలితంగా విత్తనాలు మొలకెత్తి, పంట పండుతుంది.

అదే విధంగా పొలం ముందు నుండి అయినా లేక పొలం వెనుక

నుండి అయినా పొలం లోకి విత్తనాలు చల్లవచ్చు. ఇదే విధంగా భార్య జననేంద్రియాన్ని భర్త ముందు నుండి కలిసినా లేక వెనుక నుండి కలిసినా అది ధర్మసమ్మతమే! ఎందుకంటే ఈ కలయికలో అవయవం మారలేదు. శిశువు తయారవ్వడానికి అల్లాహ్ సృష్టించిన అంగం స్త్రీ యొక్క గర్భాశయం. క్రింది హదీస్ చూడండి :

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. ''యూదులు చెబుతుండేవారు, ఒక వ్యక్తి తన భార్యతో వెనుక నుండి ముందుభాగంలో (జన నేంద్రియంలో) కలిస్తే, (ఫలితంగా పుట్టిన) బిడ్డ మెల్లకన్ను కలిగి ఉంటాడని. తరువాత క్రింది ఆయత్ అవతరించింది. ***"మీ భార్యలు మీకు పంట పొలాల వంటి వారు. కావున మీ పొలాలకు మీరు కోరిన విధంగా పోవచ్చు (ఖుర్ఆన్ 2:223)"***. (సహీహ్ ముస్లిమ్, 3535, పుస్తకం 16, అధ్యా.19, సంపుటి 4)

భార్యా భర్తల శారీరక కలయిక వలన సంతానం మాత్రమే కాదు, భార్యా భర్తలిరువురికి సుఖం కూడా కలుగుతుంది. **ఇది సృష్టిధర్మం.** జీవులలో ఇది సహజంగా జరిగే ప్రక్రియ.

అయితే భార్యాభర్తల మధ్య జరగవలసిన ఈ వ్యవహారం ఇతరులతో జరిగితే, అప్పుడు అది 'వ్యభిచారం (జిన)' అవుతుంది. అది ఘోర పాపం. **షైతాన్ ఎల్లప్పుడూ మానవుల చేత పాపకార్యాలను చేయించడానికే ప్రయత్నం చేస్తూ ఉంటాడు. మనం షైతాన్ చేసే ప్రతీ ప్రయత్నానికి భంగం కలిగించాలి, అల్లాహ్ పేరుతో.**

ఈ వ్యభిచారం అనేది ఇహలోక జీవితాన్ని సర్వనాశనం చేస్తుంది. సమాజాన్ని నాశనం చేస్తుంది. సమాజంలో ఎన్నో కల్లోలాలకు ఈ వ్యభిచారం ఒక కారణమే! ఈ విషయంలో ముందు జాగ్రత్తలు అవసరం. ప్రవక్త(స)వారు చెప్పినట్లు ముందుగానే జాగ్రత్త పడితే, ఈ నీచకార్యం బారిన పడకుండా తప్పించుకోగలుగుతారు, ఇన్షా అల్లాహ్!

## భర్త వేరే స్త్రీ వలన ఆకర్షణకు లోనయినప్పుడు :

ఇక్కడ ఒక ముఖ్య విషయం చెప్పాలి. **ఎందుకు ఆకర్షింపబడాలి?** చలికాలంలో చలి ఎందుకు వెయ్యాలి? వేసవి కాలంలో ఎందుకు చెమట పట్టాలి? తుఫాన్లు ఎందుకు రావాలి? అగ్ని పర్వతాలు ఎందుకు ప్రేలాలి? ఇవన్నీ మనకు సమస్యలే. ఆ సమస్యలలో చిన్నవీ ఉన్నాయి మరియు పెద్దవీ ఉన్నాయి. ముందు ముందు ఉంటాయి కూడా. కాబట్టి వాటిని రాకుండా మనం ఆపలేం. కాని మనకు **కావలిసింది పరిష్కారం.** ముహమ్మద్(స)వారు పరిష్కారాన్ని సూచించారు. ముహమ్మద్(స)వారు ఒక పరిష్కారం తెలిపారంటే, ఆయనకు ఆ పరిష్కారాలను తెలిపినది మన సృష్టికర్తయైన అల్లాహ్‌యే అని తెలుసుకోవాలి.

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు ఓ మహిళను చూశారు. తరువాత ఆయన(స) (తన భార్యయైన) జైనబ్(రజి)వారి దగ్గరికి వెళ్ళి తన అవసరాన్ని తీర్చుకుని వెళ్ళారు. ఆయ(స) చెప్పారు: 'వాస్తవానికి స్త్రీ ప్రవేశించినప్పుడు, ఆమె ప్రవేశిస్తుంది షైతాన్ రూపంలో. కాబట్టి మీలో ఒకరు స్త్రీని చూసినప్పుడు అతడు (ఆమెతో) ఆకర్షించబడితే, అతడు తన భార్య దగ్గరికి వెళ్ళాలి. ఎందుకంటే వాస్తవానికి ఆమెతో (అంతే అతని భార్యతో) ఉన్నటువంటిదే ఆమెతో (అంటే ఆకర్షించిన ఆ స్త్రీతో) ఉంది.'' (తిర్మిజీ, సహీహ్, 1158, 10వ పుస్తకం అబ్‌వాబుర్ రజా'ఇ, సంపుటి 2)

ఆకర్షణ కూడా ఒక పరీక్షే!

## భర్త పిలిచిన వెంటనే భర్త దగ్గరకు భార్య వెళ్ళాలి

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, ''ఒక వ్యక్తి తన భార్యను తనతో పడుకోవడానికి పిలిస్తే మరియు అతని దగ్గరకి రావడానికి ఆమె తిరస్కరిస్తే, ఫరిష్తాలు పంపుతారు ఆమెపై తమ శాపాలను ఉదయం వరకూ. **(సహీహ్ బుఖారీ, 5193, పుస్తకం 67, అధ్యా. 86, సంపుటి 7)**

---

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, ''ఒక స్త్రీ రాత్రి గడిపితే భర్త పక్కను వదిలి, ఫరిష్తాలు ఆమెపై పంపుతారు తమ శాపాలను ఆమె తిరిగి వచ్చేవరకూ.'' **(సహీహ్ బుఖారీ, 5194, పుస్తకం 67, అధ్యా.86, సం.7)**

---

తల్ఖ్ బిన్ అలీ(రజి)వారి ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు : ఒకరు తన భార్యను తన అవసరాన్ని తీర్చడానికి పిలిస్తే, ఆమె రావాలి ఆమె పొయ్యి దగ్గర (వంట చేయడంలో) ఉన్నప్పటికీ (తిర్మిజీ, సహీహ్, 1160, పుస్తకం 9, అధ్యా.10, సంపుటి 2)

ఫరిష్తాలు శాపాలు పంపుతారు అంటే అల్లాహ్ అనుమతితోనే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. **ఇది ధర్మానికి సంబంధించిన ఆదేశమే! ఒక ఆదేశాన్ని పాటించడం పుణ్యకార్యమే.** అంతేగాని భర్త పిలవగానే పరుగెట్టుకు రావడానికి ఆమె ఏమైనా నౌకరా? అని నేటి కుహనా సంస్కర్తలు ప్రశ్నించవచ్చు. **ఆమె తన భర్తకు సహాయపడుతుంది** ఒక ఆలోచనను పోగొట్టడానికి. అతనిని ఓ పాపకార్యం నుండి ఆపుతుంది. భర్త ఓ సున్నత్ పాటించేందుకు అవకాశం కల్పిస్తుంది. మరియు భర్తతో ఆమె అన్యోన్యం మరింత పెరుగుతుంది. చెడు తలంపు రాకూడదు. వస్తే దానిని వెంటనే తుదముట్టించాలి. కొందరికి దీనిలో ఉన్న సైకాలజీ బాగా అర్థం అవుతుంది. అర్థం కానివారు తలలు పట్టుకోనవసరం లేదు. ప్రవక్త(స)వారు చెప్పినట్లు చేశామని సంతోషపడితే చాలు.

## భర్త ఇంటిలో ఉన్నప్పుడు

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొుక్క సందేశహరులు (స) చెప్పారు, ''ఇది ధర్మ సమ్మతం కాదు ఒక స్త్రీకి (నఫిల్) ఉపవాసం ఉండటం అతడు ఇంటి వద్దనే ఉన్నప్పుడు, కాని ఆమె భర్త అనుమతిస్తే తప్ప. మరియు ఆమె ఎవరినీ రానివ్వకూడదు అతని ఇంటిలోనికి, అతడు అనుమతిస్తే తప్ప. మరియు ఏదైతే ఆమె ఖర్చు చేస్తుందో అతని సంపాదన

నుండి (అల్లాహ్ మార్గంలో) అతడు ఆదేశించకుండా, అతడు పొందుతాడు పుణ్యఫలంలో సగం. (సహీహ్ బుఖారీ, 5195, పుస్తకం 67, అధ్యా.87, సంపుటి 7)

రమదాన్ నెలలో భర్త ఇంటి దగ్గర ఉన్నా లేకపోయినా సరే, భార్య ఉపవాసం ఉన్నప్పుడు, ఆమెను ఉపవాసం ఉండవద్దని భర్త చెప్పలేడు. ఎందుకంటే ఆమె అల్లాహ్ ఆదేశాన్ని పాటిస్తుంది గనుక. అయితే నఫిల్ ఉపవాసం విషయంలో అల్లాహుతాలా స్త్రీలకు ఒక ఆదేశాన్నిచ్చారు. అదేమిటంటే, భర్త ఇంటి దగ్గర ఉన్నప్పుడు, ఉపవాసం ఉండదలిస్తే తన భర్త అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. నఫిల్ ఉపవాసం అల్లాహ్ అనుగ్రహం కోసమే కదా! అదే విధంగా భర్త అనుమతి తీసుకోవడం కూడా అల్లాహ్ ఆదేశాన్ని పాటించినట్లే. రెండు విధాలుగా కూడా ఆమెకు మేలు జరుగుతుంది. భర్తకు ఆ అవసరం ఉండవచ్చు.

వీటిని బట్టి అర్థమయ్యే మరొక ముఖ్య విషయం ఏమిటంటే, భార్యాభర్తలు తమ కోరిక మేరకు ఏ సమయంలోనైనా కలవడం ధర్మ సమ్మతమే. అది రాత్రి కావచ్చు లేదా పగలు కావచ్చు. ఎందుకంటే ఉపవాసం అనేది పగలు మాత్రమే ఉంటారు. పగలు భార్యాభర్తలు కలవకూడదని షరతు ఏదీ లేదు. అయితే సలాత్ (నమాజ్) కోల్పోకుండా గుస్ల్ చేసుకుని సమయానికి సలాత్ (నమాజ్) చేసుకునే విధంగా జాగ్రత్త పడాలి.

సృష్టిలో ప్రతీ దానికి ఓ నియమం ఏర్పాటు చేశారు అల్లాహుతాలా. భూమి ఎంత వేగంగా తిరగాలో, అంతకంటే ఎక్కువగా తిరిగినా, లేక తక్కువగా తిరిగినా మనకు కల్లోలం తప్పదు. సూర్యుని నుండి రావలిసిన వేడి బాగా పెరిగినా లేక బాగా తగ్గినా భూమిపై జీవరాశులు నాశనమౌతాయి.

దేశంలో ఎంత పెద్ద మంత్రి అయినా చట్టాన్ని స్వయంగా అమలు పరచలేడు. దానిని అధికారులే చేయగలరు. కాని అధికారులు స్వయంగా దానిని చేయలేరు, దానికి మంత్రిగారి ఆమోదం ఉండాలి. ఓ ఆఫీస్‌లో పై అధికారి అనుమతి లేకుండా క్రింది వ్యక్తి ఆదేశాలు జారీ చేయలేడు. ఇవన్నీ చెప్పడానికి కారణం - **వీరందరూ ఒకరికొకరు బానిసలు కాదు.** వీరందరూ ఒక వ్యవస్థలో తమ తమ విధులను నిర్వహిస్తున్నారు. పై అధికారిని అనుమతి నడగడం అంటే అది అవమానకరమైన పని కాదు కదా! అది వారు నిర్వహించవలసిన విధులలో ఒకటి.

అదే విధంగా కుటుంబ వ్యవస్థ బాగుండాలంటే, అందులోని వారికి కూడా క్రమశిక్షణ అవసరం. పై విషయాలన్నింటి బట్టి, భార్య భర్త అవసరాన్ని తీర్చడం భార్యకు చాలా ముఖ్యమైన విధిగా తెలుసుకోవాలి. **ఇది భార్యాభర్తల అన్యోన్యానికి, వ్యభిచారం నుండి రక్షించుకునేందుకు, వారిద్దరి మధ్య అసంతృప్తి రాకుండా ఉండేందుకు దోహదపడుతుంది.**

క్రింది హదీస్‌లు కూడా ఆ వ్యవహారం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయి.

ఉమ్మె సలమహ్(రజి)వారి ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: **ఏ స్త్రీయైనా, ఆమెతో భర్త సంతోషించి ఉండగా, మరణం సంభవిస్తే, ఆమె స్వర్గంలో ప్రవేశిస్తుంది.** (తిర్మిజీ, హసన్, 1161, పుస్తకం 9, అధ్యా.10, సంపుటి 2)

మరియొక హదీస్ ద్వారా భర్త పిలిచినప్పుడు రాని భార్య, తిరిగి అతనిని సంతోషపెట్టే వరకూ ఆమె ఆచరణలు, ప్రార్ధనలు స్వీకరించబడవని తెలుస్తుంది. కాబట్టి స్త్రీ జాగ్రత్త పడాలి!

ఇస్లామ్ స్త్రీని కేవలం బిడ్డలను ప్రసవించే యంత్రంగా మరియు భర్త కోరికను తీర్చే విలాస వస్తువుగా చేయలేదు. **ఇస్లామ్ ఆమెపై ఉన్నతమైన బాధ్యతలు ఉంచింది.** ఉత్తమ సమాజ నిర్మాణంలో ఆమెది చాలా ముఖ్యమైన పాత్ర.

## భార్యపై భర్తకు ఉన్న బాధ్యత

ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : "మీలో ప్రతీ ఒక్కరూ ఓ కాపరి మరియు మీలో ప్రతీ ఒక్కరూ తన గుంపు గురించి అడగబడతాడు. ప్రజల నాయకుడు ఓ కాపరి మరియు తన గుంపు కొరకు అడగబడతాడు. ఓ పురుషుడు తన కుటుంబానికి కాపరి మరియు తన వారి కొరకు అడగబడతాడు. **<u>ఓ మహిళ తన భర్త ఇంటికి మరియు సంతానానికి కాపరి మరియు ఆమె తన వారి కొరకు అడగబడుతుంది</u>.** ఓ బానిస తన యజమాని ఐశ్వర్యానికి కాపరి మరియు దాని కొరకు అడగబడతాడు. మీలో ప్రతీ ఒక్కరూ ఓ కాపరి మరియు మీలో ప్రతీ ఒక్కరూ తన గుంపు కొరకు అడగబడతారు. **(సహీహ్ ముస్లిమ్, 4724, పుస్తకం 33, అధ్యా.5, సంపుటి 5)**

తన భర్త ఇంటికి, సంతానానికి మరియు ఐశ్వర్యానికి భార్య ఇన్‌ఛార్జ్. వాటిని భర్త ఆదేశం మేరకు పర్యవేక్షిస్తుంది. **పెద్ద పెద్ద సంస్థలలో 5 అంకెల జీతాన్ని తీసుకునే మహిళా సుపీరియర్స్ కూడా ఆ సంస్థ నియమాల ప్రకారమే పనిచేస్తారు.** భర్త అనుమతి లేకుండా మరొకరిని ఇంటిలోనికి అనుమతించ కూడదు. భర్త ఇష్టం కానివారిని ఇంటిలోనికి అనుమతించ కూడదు. భర్త ఆదేశించకుండా అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం అంటే, ఇంటి ఖర్చుల నిమిత్తం భర్త ఖర్చుచేయమని భార్యకు అనుమతి నిచ్చినప్పుడు, అందులో కొంత ఆమె అల్లాహ్ మార్గంలో ఖర్చుచేయడం కావచ్చు లేదా ఇంటిలోని ఆహారపదార్థాలలో కొంత దానం చేయడం కావచ్చు. ఇటువంటివి చేసినప్పుడు వచ్చే పుణ్యఫలంలో సగం భర్తకు కూడా లభిస్తుంది.

ప్రళయం తరువాత, తీర్పుదినాన మన ఆచరణల పట్ల తీర్పు నిచ్చే యజమాని అల్లాహ్. ఆయన ఏయే విధులు చేయమని ఎవరెవరిపై ఆయన బాధ్యత నుంచారో, వాటి విషయంలో ఆయన ముందు సమాధానం చెప్పుకోవాలి. **<u>ఓ మహిళ తన భర్త ఇంటికి మరియు సంతానానికి కాపరి మరియు ఆమె తన వారి కొరకు అడగబడుతుంది</u>.**

*(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)*

# జిన్నులు మరియు చేతబడి

7

సీరియల్

## మనిషికుండే బలహీనతలే కొందరికి జీవనాధారం

*శారీరక లేదా మానసిక సమస్యలతో బాధపడేవారు సంబంధిత డాక్టర్‌ని సంప్రదించండి.*

### కీడు కలిగించే కన్ను (Evil Eye)

జిన్నులు ఆవహించాయని చెప్పి రకరకాలుగా మోసం చేస్తూ వందల నుండి వేల రూపాయల వరకూ రోగుల నుండి కొందరు స్వార్థపరులు వసూలు చేయడమే కాకుండా, ప్రజలను ఈ విషయంలో **తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.** ప్రవక్త(స)వారు ప్రళయం గురించి మరియు నరక శిక్షల గురించి తప్ప, ఇహలోకంలో సంభవించే కీడుకు సంబంధించి ఏ విషయాలలోనైనా ప్రజలను జాగ్రత్త పరిచారేగాని ఆందోళనలకు గురిచేయలేదు.

**ఆయన(స) ప్రతీ విషయాన్ని ఎంత చక్కగా చెప్పారో!** ఎటువంటి భయం కలుగ కుండా మిక్కిలి ధైర్యంతో జీవించేలా ముస్లిములకు శిక్షణ ఇచ్చారు. అయితే ఈ వాస్తవ విషయాలను సామాన్యప్రజలకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నదెవరో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రతీ కష్టాన్ని పరిష్కరించుకోవడంలో ప్రజలు తమపై ఆధారపడేలా వారు చేసుకున్నారు. అందుకే మస్జిద్‌లలో హదీస్ గ్రంథాలన్నీ ఉండాలని మేము మొదటి నుండి చెబుతూనే ఉన్నాము. మనం ఆధారపడ వలసింది అల్లాహ్‌పై మరియు ముహమ్మద్(స)వారి బోధనలపై.

**జిన్న్ అంటే ఏమిటి? షైతాన్ అంటే ఏమిటి?** ఇవే కాకుండా ఎన్నో పదాలకు సవివరమైన అర్థాలతో ఈ శీర్షిక ప్రారంభించాము. ఈ శీర్షికలో ఇది 7వ వ్యాసం.

ఏ విధమైన ఆందోళనలకు లోనుకాకుండా అతి సులభమైన జాగ్రత్తలు మన దైనందిన జీవితంలో ఎలా తీసుకోవాలో, పూర్వం అందించిన వ్యాసాలలో వివరించడం జరిగింది. నేటి సమాజంలో ప్రతీ ఒక్కరిపై ఎన్నో రకాల మానసిక ఒత్తిడులు ఉన్నాయి. అవి కొందరిలో మానసిక రుగ్మతలకు దారితీస్తున్నాయి.

శరీరానికి జబ్బు చేసినట్లే మనస్సుకు కూడా జబ్బు చేస్తుంది. శరీరానికి సాధారణ జలుబు నుండి ప్రాణాంతకమైన కాన్సర్ వరకూ ఏ విధంగా జబ్బులు వస్తాయో, మనస్సుకు కూడా అంతే. మనస్సుకు వచ్చే జబ్బులను నయం చేసేది ఖుర్ఆన్ పఠనం. అంతేకాకుండా మానసిక వైద్యులు కూడా మనకు అందుబాటులోనే ఉన్నారు. 'షిజోఫ్రినియా' అనే ఓ మానసిక రుగ్మత గురించి మరియు ఆ వ్యాధి లక్షణాల గురించి ఇంతకు పూర్వం వివరించాము. అటువంటి రుగ్మతను చూసి దయ్యం పట్టిందని అపోహ పడేవారెందరో ఉన్నారు.

స్వార్థపరుల చేతుల్లో ప్రజలు మోసపోకుండా ఉండాలనే సంకల్పంతో ఈ శీర్షిక ప్రారంభించి ప్రామాణిక హదీస్‌ల ద్వారా వాస్తవాలను అందిస్తున్నాము. కొత్తగా చేరిన పాఠకులు శాంతిబాట పూర్వపు సంచికలను www.saanthibaata.net నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని చదువు కోవచ్చు. ప్రస్తుత వ్యాసం కీడు కలిగించే చూపు గురించి.

---

విశ్వాసి ఎల్లప్పుడూ తనకు మేలు చేసిన వానికి, అంతకంటే ఎక్కువ మేలు జరగాలని కోరుకుంటాడు. తన తోటివారికి కష్టం కలగకూడదని మార్గమధ్యంలోని ముళ్ళ కంపను తీసివేసిన వ్యక్తి ఎటువంటి ఊహించని ప్రతిఫలాన్ని పొందాడో మీకు తెలుసు.

**మన తోటివారి దగ్గర మనకు బాగా ఇష్టమైనవి కనిపించినప్పుడు, వాటిలో శుభాలు కలగాలని అల్లాహ్‌ను ప్రార్థించాలి. అటువంటి వాటిని మనకూ అనుగ్రహించమని అల్లాహ్‌ను వేడుకోవాలి.**

అల్లాహ్ నుండి అనుగ్రహాలను పొందిన మర్యమ్(అ)వారిని చూసినప్పుడు, తనకు కూడా మంచి సంతానాన్ని ప్రసాదించమని జకరియ్యా (అ) వేడుకున్నారు. క్రింది ఆయత్‌లు చూడండి:

**"ఆ తరువాత ఆ బాలికను, ఆమె ప్రభువు ఆదరంతో స్వీకరించి, ఆమెను ఒక మంచి స్త్రీగా పెంచాడు మరియు ఆమెను జకరియ్యా సంరక్షణలో ఉంచాడు. జకరియ్యా ఆమె గదికి పోయినప్పుడల్లా ఆమె వద్ద భోజన పదార్థాలను చూసి, ఆమెను ఇలా అడిగేవారు:**

**"ఓ మర్యమ్, ఇది నీ వద్దకు ఎక్కడి నుండి వచ్చింది?" ఆమె ఇలా జవాబిచ్చేది : "ఇది అల్లాహ్ వద్ద నుండి వచ్చింది." నిశ్చయంగా, అల్లాహ్ తాను కోరిన వారికి లెక్కలేనంత జీవనోపాధిని ప్రసాదిస్తాడు.**

**అప్పుడు జకరియ్యా తన ప్రభువును ప్రార్థించాడు. అతను ఇలా విన్నవించుకున్నాడు : "ఓ నా ప్రభూ! నీ కనికరంతో నాకు కూడా ఒక మంచి సంతానాన్ని ప్రసాదించు. నిశ్చయంగా నీవే ప్రార్థనలను వినేవాడవు."** (ఖుర్ఆన్ 3:37-38)

ఈ సందర్భంగా అల్-బిదాయహ్ వన్-నిహాయహ్‌లో ప్రస్తావించిన ఓ సంఘటనను ఇక్కడ చెప్పుకుందాం. ముహమ్మద్(స)వారికి అత్యంత ప్రియమైన కుమార్తె ఫాతిమా(రజి). ఒకరోజు ఓ మహిళ వేపిన కొంత మాంసాన్ని మరియు రెండు రొట్టె ముక్కలను ఫాతిమా(రజి)వారికి పంపారు. ఆమె(రజి) దానిని ఒక పెద్ద పళ్ళెంలో ఉంచి, దానిని వస్త్రంతో కప్పారు. తరువాత ఆమె తన తండ్రిగారికి కబురు పంపారు ఆయనని రమ్మని మరియు తన ఇంటి దగ్గర భోజనం చేయమని. ఆయన(స) వచ్చినప్పుడు ఆమె వస్త్రాన్ని తొలగించారు. ఆశ్చర్యం! పళ్ళెం నిండా రొట్టెలు మరియు అమితంగా మాంసం ఉంది. ఆమె అర్థం చేసుకున్నారు - పుష్కలంగా ఉన్న ఈ ఆహారం అల్లాహ్ నుండి వచ్చిందని. ఆమె అల్లాహ్ ఘనతను కీర్తించారు. కృతజ్ఞతలు తెలిపారు మరియు ఆయన ప్రవక్తను అనుగ్రహించమని వేడుకున్నారు. అల్లాహుతాలా పేరుతో ప్రారంభించి ఆయన(స)కు భోజనాన్ని వడ్డించారు. అంత ఎక్కువ పరిమాణంలో ఉన్న ఆహారాన్ని చూసి, ఆయన చిరునవ్వు నవ్వారు మరియు అడిగారు ఇదంతా ఎవరు పంపారని.

ఆమె తడుముకోకుండా చెప్పారు దానిని అల్లాహ్‌యే ఆమెకు ఇచ్చారని మరియు జీవనోపాధిని ఆయన కోరిన వారికి లెక్కలేనంత ప్రసాదిస్తాడని. ఆయన చిరునవ్వు నవ్వారు మరియు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కారణం మరేమిటో కాదు, **మర్యమ్(అ) మాట్లాడినట్లే మాట్లాడిన కుమార్తెను తాను కలిగి ఉన్నందుకు.** ప్రవక్త(స)వారు భోజనాన్ని తన కుమార్తెతో, అల్లుడితో మరియు ఇద్దరు మనవళ్ళతో కలిసి తిన్నారు. ఇంకనూ చాలా ఆహారం మిగిలిపోయింది. అది విశ్వాసుల మాతృమూర్తులకు పంపబడింది. వారు కూడా కడుపారా భుజించారు మరియు మిగిలినదానిని పొరుగువారి మధ్య పంచారు.

పైన తెలిపిన విషయాలు **ఒక పెద్ద కీడు నుండి తప్పిస్తాయని** ఈ వ్యాసం పూర్తి చేశాక, **ఇన్షా అల్లాహ్, మీకు అర్థమౌతుంది.** అల్లాహ్ తాను కోరిన వారికి లెక్కలేనంత జీవనోపాధిని ఇస్తారు. మరికొందరికి మితంగా ఇస్తారు. దీనిలో పరీక్ష ఉంది. ప్రజలు ఆ విషయం తెలుసుకోవడం లేదు. ఈ విషయం ఖుర్ఆన్‌లో చెప్పబడింది.

తమ విలువైన సంపదగాని, ఇతరత్రాగాని అకస్మాత్తుగా కోల్పోవడం లేక నాశనమై పోవడం కొందరి విషయంలో జరగవచ్చు. ఆ విధంగా జరగడం వారి తిరస్కారానికి శిక్ష కావచ్చు. లేదా పరీక్ష కావచ్చు. అయితే అది కీడు కలిగించే చూపు వలన కూడా సంభవించవచ్చు. ఈ కీడు కలిగించే చూపు అనేది చెడు ప్రవర్తన కలవారిదే కావాలని లేదు, మంచివారి నుండి కూడా సంభవించవచ్చు. అయితే దీని గురించి ఎక్కువ ఆలోచించ నవసరం లేకుండా, అటువంటి చూపు నుండి రక్షణ కొరకు ప్రవక్త(స)వారు సులభమైన నివారణా మార్గాన్ని చాలా స్పష్టంగా బోధించారు. కాబట్టి ఈ అపాయం నుండి, ఇన్షా అల్లాహ్, మనం సునాయాసంగా రక్షణ పొందవచ్చు. సూరహ్ కహఫ్‌లోని అల్లాహుతాలా తెలిపిన ఓ ఉదాహరణకు సంబంధించి కొన్ని ఆయత్‌లను ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం.

**మరియు వారికి ఆ ఇద్దరు మనుష్యుల ఉదాహరణ తెలుపు : వారిద్దరిలో ఒకనికి మేము రెండు ద్రాక్షతోటలను ప్రసాదించి, వాటి చుట్టూ ఖర్జూరపు చెట్లను మరియు వాటి మధ్య పంటపొలాన్ని ఏర్పరచాము.**

**ఆ రెండు తోటలు, ఏ కొరతా లేకుండా పంటలిచ్చేవి. మరియు వాటి మధ్య మేము ఒక సెలయేరును ప్రవహింపజేశాము. మరియు అతనికి పుష్కలమైన ఫలాలు పండేవి మరియు అతడు తన పొరుగువాడితో మాట్లాడుతూ అన్నాడు : "నేను నీ కంటే ఎక్కువ ధనవంతుణ్ణి మరియు నా వద్ద బలవంతులైన మనుషులు కూడా ఉన్నారు." మరియు ఈ విధంగా అతడు తనకు తాను అన్యాయం చేసుకునే వాడవుతూ, తనతోటలో ప్రవేశించి ఇలా అన్నాడు : "ఇది ఎన్నటికైనా నాశనమవు తుందని నేను భావించను. మరియు అంతిమ ఘడియ కూడా వస్తుందని నేను భావించను. ఒకవేళ నా ప్రభువు వద్దకు నేను తిరిగి మరలింప బడినా, అచ్చట నేను దీనికంటే మేలైన స్థానాన్నే పొందగలను.**

**అతని పొరుగువాడు అతనితో మాట్లాడుతూ అన్నాడు : "నిన్ను మట్టితో, తరువాత ఇంద్రియ బిందువుతో సృష్టించి, ఆ తరువాత నిన్ను (సంపూర్ణ) మానవునిగా తీర్చిదిద్దిన ఆయనను (అల్లాహ్‌ను) నీవు తిరస్కరిస్తున్నావా? కాని నిశ్చయంగా, నా మట్టుకు మాత్రం, ఆయన! అల్లాహ్‌యే నా ప్రభువు మరియు నేను ఎవ్వడినీ నా ప్రభువుకు భాగస్వామిగా కల్పించను.**

**మరియు ఒకవేళ నీవు, నన్ను సంపదలో మరియు సంతానంలో నీ కంటే తక్కువగా తలచినప్పటికీ, నీవు నీ తోటలో ప్రవేశించినప్పుడు : "మాషా అల్లాహ్ లా ఖువ్వత ఇల్లా బిల్లాహ్!" (అల్లాహ్ కోరిందే అవుతుంది. సర్వశక్తికి ఆధారభూతుడు కేవలం అల్లాహ్‌యే) అని పలికితే ఎంత బాగుండేది.**

**"వాస్తవానికి నా ప్రభువు, నీ తోటకంటే ఉత్తమమైన దానిని నాకు ప్రసాదించి, దాని పైకి (నీ తోటపైకి) ఆకాశం నుండి ఒక పెద్ద ఆపదను పంపి, దానిని చదునైన మైదానంగా చేయవచ్చు! లేదా దాని నీటిని భూమిలో ఇంకిపోయినట్లు చేస్తే, నీవు దానిని ఏ విధంగానూ, తిరిగిపొందలేవు!"**

**మరియు అతని పంటను చుట్టుముట్టింది. అతడు తాను ఖర్చు చేసినదంతా నాశనమైందని చేతులు నలుపుకుంటూ ఉండిపోయాడు మరియు అది దాని పందిరితో సహా నాశనమై పోయింది మరియు అతడు ఇలా వాపోయాడు : 'అయ్యో నా దౌర్భాగ్యం! నేను నా ప్రభువుకు భాగస్వాములను కల్పించకుండా ఉంటే ఎంత బాగుండేది!"**

**మరియు అల్లాహ్‌కు విరుద్ధంగా అతనికి సహాయపడే వారెవ్వరూ లేకపోయారు మరియు అతడు కూడా తనకు తాను సహాయం చేసుకోలేక పోయాడు.** (ఖుర్ఆన్ 18:32-43)

ఒక ధనవంతుని యొక్క కలిమి మరియు ఒక పేదవాని లేమి అల్లాహ్ నిర్ణయం ప్రకారమే జరిగినప్పుడు, **ధనవంతుడు గర్వపడకుండా, అది అంతా అల్లాహ్ అనుగ్రహమే అని అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపు కోవాలి.**

**మాషా అల్లాహ్ లా ఖువ్వత ఇల్లా బిల్లాహ్!**

**(అల్లాహ్ కోరిందే అవుతుంది. సర్వశక్తికి ఆధారభూతుడు కేవలం అల్లాహ్‌యే)**

**అల్ ఐను హఖ్ఖున్** - కీడు కలిగించే కన్ను వాస్తవం.

ఒకరి చూపు వలన కలిగే కీడు నిజమేనని క్రింది హదీస్ ద్వారా స్పష్టంగా అర్థమౌతుంది.

అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ బిన్ రబి'అహ్ తన తండ్రి నుండి ఉల్లేఖించారు. ప్రవక్త(స)వారు చెప్పారు : ''అల్ ఐన్ నిజం'' **(ఇబ్నెమాజా, సహీహ్, 3506, పుస్తకం 31, అధ్యా.32, సంపుటి 4)**

ఈ కీడు ఎన్నో రకాలుగా జరుగుతుంది. వాటిలో ఒకటి క్రింది హదీస్ ద్వారా తెలుసుకోవచ్చు.

అబూ ఉమామా బిన్ సహ్ల్ బిన్ హునైఫ్ ఉల్లేఖనం. ''సహ్ల్ బిన్ హునైఫ్ స్నానం చేస్తుండగా ఆమిర్ బిన్ రబి'అహ్ అతని ప్రక్కగా వెళుతున్నారు. మరియు అన్నారు : **'నేను ఎన్నడూ చూడలేదు ఈ రోజులా మరియు (ఇంత) అందమైన చర్మాన్ని.'** వెంటనే అతడు నేలపై పడిపోయాడు. అతడు ప్రవక్త(స)వారి వద్దకు తీసుకు రాబడ్డాడు మరియు ఇది చెప్పబడింది : 'సహ్ల్ మూర్ఛ పోయాడు'. ఆయన(స) అడిగారు : ''మీరు ఎవరిని ఆరోపిస్తున్నారు అతని విషయంలో?'' వారు చెప్పారు : 'ఆమిర్ బిన్ రబిఅహ్'. ఆయన(స) అన్నారు : **మీలో ఎవరైనా ఎందుకు మీ సోదరుడిని చంపుతారు? అతడు తనకు నచ్చింది చూస్తే, అప్పుడు అతడు అల్లాహ్‌ను ప్రార్థించాలి దానిపై అల్లాహ్ అనుగ్రహం కొరకు'** తరువాత ఆయన(స) నీటిని తెమ్మన్నారు మరియు ఆయన చెప్పారు ఆమిర్‌తో గుసుల్ చేయమని, మరియు అతడు తన ముఖాన్ని కడిగాడు మరియు తన చేతులను మోచేయి వరకూ, తన మోకాళ్ళను మరియు లోదుస్తులలో. తరువాత ఆయన(స) అతనికి చెప్పారు ఆ నీటిని అతనిపై (అంటే సహ్ల్‌పై) పోయమని. **(ఇబ్నెమాజా, సహీహ్, 3509 పుస్తకం 31, అధ్యా.32, సంపుటి 4)** (ఉల్లేఖకులలో ఒకరైన) సుఫ్యాన్ చెప్పారు : మ'మర్ జుహ్రి నుండి ఉల్లేఖించారు : 'మరియు ఆయన(స) అతనిని ఆదేశించారు ఆ నీటిని వెనుక నుండి అతనిపై పోయమని.'

పై హదీస్‌ను బట్టి కీడు కలిగించే కన్ను కేవలం దుర్మార్గులదే కానవసరం లేదు. ధర్మపరాయణుడైన తోటి సోదరుని వలన కూడా అది సంభవించవచ్చు. కావాలని అతను చేయకపోవచ్చు. కాబట్టి మనకు ఒకరి అందం నచ్చినప్పుడు, ఆ అందంలో అల్లాహ్ అనుగ్రహానికై వేడుకోవాలి. అదే విధంగా నచ్చిన ప్రతీదానిలోనూ అల్లాహ్ అనుగ్రహాన్ని వేడుకోవాలి. అలా అల్లాహ్‌ను వేడుకోవడం ద్వారా, వేడుకోలు వలన లభించే పుణ్యం లభిస్తుంది మరియు మన తోటి సోదరునికి కీడు కలుగకుండా సున్నత్‌ను పాటించి నందుకు కూడా పుణ్యం లభిస్తుంది. తోటి సోదరుని మేలు ఆ విధంగా కూడా ఆకాంక్షించవచ్చు. అల్-ఐనున్ ఎంతటి ప్రభావాన్ని కలిగిఉందో క్రింది హదీస్‌ల ద్వారా కూడా స్పష్టమౌతుంది.

ఉబైద్ బిన్ రిఫా'అజ్జురఖి చెప్పారు: అస్మా చెప్పారు : ''ఓ రసూలల్లాహ్(స)! జాఫర్(రజి) యొక్క పిల్లలు 'అల్-ఐన్' చే ఆపదకు లోనయ్యారు. **నేను రుఖ్యా పఠించవచ్చునా వారి కొరకు?** ఆయన(స) చెప్పారు : 'ఔను. **ఏదైనా అల్-ఖద్ర్‌ని దాటిపోయేది ఉండి ఉంటే, అది అల్-ఐన్ అయివుండేది'.** **(ఇబ్నెమాజా, సహీహ్, 3510, అధ్యా.33, పుస్తకం 31, సంపుటి 4)**

---

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్-'ఐన్ (కీడు కలిగించే చూపు) యొక్క ప్రభావం నిజమే. మరియు ఆయన నిరోధించారు పచ్చబొట్లు వేయించుకోవడాన్ని. **(సహీహ్ బుఖారీ, 5740, పుస్తకం 76, అధ్యా. 36, సంపుటి 7)**

---

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: ''ఖద్ర్‌ని దాటగలిగేది ఏదైనా ఉండి ఉంటే అది అల్-'ఐన్ అయివుండేది మరియు (దాని వలన) మీరు గుస్ల్ చేయాలని కోరబడినప్పుడు, గుస్ల్ చేయండి. **(తిర్మిజీ, సహీహ్, 2062, పుస్తకం 26, అధ్యా.19, సంపుటి 4)**

**పై హదీస్‌లను బట్టి అల్-ఐన్ చాలా తీవ్రమైనదని స్పష్టంగా తెలుస్తుంది.**

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు ఆమెను ఆదేశించారు రుఖ్యా పఠించి **'అల్-ఐన్'**కి నయం చేయమన్నారు. **(ఇబ్నెమాజా, సహీహ్, 3512, పుస్తకం 31, అధ్యా.33, సంపుటి 4)**

పై హదీస్‌ల ద్వారా అల్-ఐన్ వలన జరగబోయే కీడు గురించి ముందుగా గాని, లేదా కీడు జరిగిన తరువాతగాని రుఖ్యా పఠించ వచ్చని తెలుస్తుంది.

## రుఖ్యా అంటే ఏమిటి?

క్రింది హదీస్‌లు చదివితే రుఖ్యా అంటే ఏమిటో అర్థమౌతుంది.

అబూ స'ఈద్(రజి)వారి ఉల్లేఖనం. జిబ్రీల్(అ)వారు ప్రవక్త(స)వారి వద్దకు వచ్చారు మరియు అన్నారు : ''ఓ ముహమ్మద్! మీరు జబ్బు పడ్డారా'' ఆయన(స) అన్నారు : 'ఔను'' ఆయన చెప్పారు: **''బిస్మిల్లాహి అర్‌ఖీక. మిన్ కుల్లి షైఇన్ యు'జీక. మిన్ షర్రి కుల్లి నఫ్‌సిన్ అవ్ అయ్‌నిన్ అవ్ హాసిదిన్. అల్లాహు యష్‌ఫీక. బిస్మిల్లాహి అర్‌ఖీక.''** *(అల్లాహ్ పేరుతో నేను చేస్తున్నాను రుఖ్యా మీ కొరకు, మీకు కీడు చేసే ప్రతిదాని నుండి, ప్రతీ ఆత్మ యొక్క కీడు నుండి లేక అసూయ నుండి, అల్లాహ్ మీకు నయం చేయుగాక! అల్లాహ్ పేరుతో నేను చేస్తున్నాను రుఖ్యా మీ కొరకు.''*

**(ఇబ్నెమాజా, సహీహ్, 3523, అధ్యా.36, పుస్తకం 31, సంపుటి 4)**

ఉస్మాన్ బిన్ అబ్దుల్-ఆస్ తఖఫీ ఉల్లేఖనం. "నేను ప్రవక్త(స)వారి వద్దకు వచ్చాను మరియు నేను తీవ్రంగా బాధించే నొప్పితో బాధపడు తున్నాను. ప్రవక్త(స)వారు నాతో అన్నారు : **'ఉంచు నీ కుడిచేతిని దానిపై మరియు చెప్పు : "బిస్మిల్లాహ్. అఊజు బి'ఇజ్జతిల్లాహి వ ఖుద్‌రతిహి మిన్ షర్రి మా అజిదు వ ఉహాజిరు" ఏడు సార్లు.'** నేను చెప్పాను దానిని (రుఖ్యాను) మరియు అల్లాహ్ నాకు నయం చేశారు. **(ఇబ్నెమాజా, 3522, సహీహ్, పుస్తకం 31, అధ్యా. 36, సంపుటి 4)**

సహీహ్ ముస్లిమ్ 5737లో **బిస్మిల్లాహ్ 3 సార్లు**. తరువాత **దు'ఆ 7 సార్లు** అని ఉంది.

అబ్దుల్ అజీజ్ ఉల్లేఖనం. సాబిత్ మరియు నేను అనస్ బిన్ మాలిక్(రజి) వారి దగ్గరికి వెళ్ళాము. సాబిత్ అడిగారు, "ఓ అబూ హమ్జా! నేను జబ్బు పడ్డాను" ఆ విషయంపై అనస్ అన్నారు, **నేను నీ కొరకు పఠించనా రసూలుల్లాహ్(స)వారి రుఖ్యాతో?** సాబిత్ అన్నారు, "బలా (అలాగే)" అనస్ పఠించారు : **"అల్లాహుమ్మ రబ్బన్నాస్, ముజ్‌హిబల్-బాస్, ఇష్‌ఫి అన్‌తష్-షాఫీ లా షాఫియ ఇల్లా అన్‌త షిఫా అన్, లా యుఘాదిరు సఖమ"** *(ఓ అల్లాహ్! మానవుల ప్రభువా! కష్టాలను తొలగించేవాడా! రోగాన్ని నివారించు, నీవే నయం చేసేవాడివి. ఎవరూ నయం చేయలేరు నీవు తప్ప. ఆ రోగ నివారణ రోగం యొక్క ఆనవాలు మిగల్చనిది)* **(సహీహ్ బుఖారీ, 5742, పుస్తకం 76, అధ్యా. 38, సంపుటి 7)**

పై హదీస్‌ల ద్వారా రుఖ్యా అంటే ఏమిటో అర్థమై ఉంటుంది.

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. "ఆయన కుటుంబంలో ఎవరైనా జబ్బు పడితే, అల్లాహ్ యొక్క సందేశహరులు(స) **ము'అవ్విజాత్** పఠించి ఆ వ్యక్తిపై ఊదేవారు. ఆయన జబ్బు పడినప్పుడు చివరి అనారోగ్యంతో, నేను ఆయనపై ఊదడం ప్రారంభించాను మరియు ఆయనను తుడిచాను ఆయన స్వీయ హస్తంతో, ఎందుకంటే అది అమితంగా అనుగ్రహించబడింది నా చేతికంటే." **(సహీహ్ ముస్లిమ్, 5714, పుస్తకం 39, అధ్యా. 20, సంపుటి 6)**

ము'అవ్విజాత్ అంటే **"ఖుల్ హువల్లాహు అహద్ ..."** (సూరహ్ 112), **"ఖుల్ అవుజుబి రబ్బిల్ ఫలఖ్ ..."** (సూరహ్ 113) మరియు **"ఖుల్ అవుజుబి రబ్బిన్నాస్ ..."** (సూరహ్ 114). ఈ వ్యాసం చివర ఈ మూడు సూరహ్‌లు అందించాము.

## రుఖ్యా చదివి ఊదేవారు

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు రుఖ్యా చేసినప్పుడు ఊదేవారు. **(ఇబ్నెమాజా, సహీహ్, 3528, పుస్తకం 31, అధ్యా. 38, సం. 4)**

(పై హదీస్‌లో ఉన్న పదం 'నఫత్' అంటే నోటితో ఊదడం దానిలో అతి అల్ప పరిమాణంలో లాలాజలం కలిగి ఉంటుంది.)

## మూడు విషయాలలో రుఖ్యాకు అనుమతి ఉంది

అనస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు 'రుఖ్యా'కి అనుమతి నిచ్చారు, జ్వరానికి, కీడు కలిగించే చూపుకి మరియు నమ్‌లకు. **(ఇబ్నెమాజా, 3516, సహీహ్, పుస్తకం 31, అధ్యా. 34, సంపుటి 4)**

(నమ్‌ల అనేది ఒక రకమైన వ్యాధి, దానివలన వ్యక్తి ప్రక్కలపై చిన్న పొక్కులు వస్తాయి. తరువాత అవి కురుపులుగా మారతాయి.)

రుఖ్యా దీనిని నివారిస్తుంది.

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అనుమతి నిచ్చారు 'రుఖ్యా' చేయడానికి పాముకాట్లకు మరియు తేలు కుట్టిన వాటికి. **(ఇబ్నెమాజా, 3517, సహీహ్, పుస్తకం 31, అధ్యా. 35, సంపుటి 4)**

ఇమ్రాన్ బిన్ హుసైన్ ఉల్లేఖించారు. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : "లేదు రుఖ్యా, కన్ను మరియు జ్వరానికి తప్ప. **(తిర్మిజీ, సహీహ్, 2057)**

అనస్ బిన్ మాలిక్(రజి)వారు రుఖ్యాకు సంబంధించి చెప్పారు అది. అనుమతించబడింది విషకాట్లకు, కురుపులకు మరియు చెడు చూపు విషయంలో. **(సహీహ్ ముస్లిమ్, 5723, అధ్యా. 21)**

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. నాకు తల్లి తరపు నుండి బాబాయి ఉండేవారు ఆయన తేలుకాటుకి రుఖ్యా పఠిస్తుండేవారు. తరువాత రసూలుల్లాహ్(స) రుఖ్యా నిరోధించారు. అతడు ఆయన దగ్గరకు వచ్చి అడిగారు : 'ఓ రసూలల్లాహ్(స)! మీరు రుఖ్యా నిరోధించారు కాని నేను తేలు కాటు కొరకు రుఖ్యా పఠిస్తున్నాను.' ఆయన(స) చెప్పారు: "మీలో ఎవరైతే తన సోదరుడికి మేలు చేయగలరో, అతనిని అలా చేయనివ్వండి". **(సహీహ్ ముస్లిమ్, 5729, పుస్తకం 39, అధ్యా.21, సంపుటి 6)**

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) రుఖ్యా నిరోధించారు. అప్పుడు అమ్ర్ బిన్ హజ్మ్ కుటుంబం రసూలుల్లాహ్ (స)వారి వద్దకు వచ్చింది మరియు అడిగారు: 'ఓ రసూలల్లాహ్! మా దగ్గర రుఖ్యా ఉంది మేము తేలు కాటుకు దానిని పఠించేవారము. కాని మీరు రుఖ్యా నిరోధించారు." వారు దానిని ఆయన దగ్గర పఠించారు. మరియు ఆయన అన్నారు: 'దీనిలో ఏ తప్పు నాకు కనిపించ లేదు. మీలో ఎవరైనా తన సోదరునికి మేలు చేయగలరో, అతనిని మేలు చేయనివ్వండి." **(అంటే అందులో ఎటువంటి షిర్క్ లేదు)** **(సహీహ్ ముస్లిమ్, 5731, పుస్తకం 39, అధ్యా. 21, సంపుటి 6)**

తరువాయి ఉల్లేఖనంలో "షిర్క్ కలిగి ఉండని ఏ రుఖ్యాలోనూ దోషం లేదు" అని ఉంది.

బురైదహ్ ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు : లేదు రుఖ్యా కీడు కలిగించే చూపుకి లేక జ్వరానికి తప్ప. **(ఇబ్నెమాజా, సహీహ్, 3513, పుస్తకం 31, అధ్యా. 34, సంపుటి 4)**

**తేలుకుట్టిన వ్యక్తిపై చదివే రుఖ్యా**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. తేలు ఒక వ్యక్తిని కుట్టింది మరియు అతడు ఆ రాత్రి అంతా పడుకోలేదు. అది ప్రవక్త(స)వారికి చెప్పబడింది. "ఫలానా వ్యక్తి తేలుచే కుట్టబడ్డాడు మరియు అతడు రాత్రంతా నిద్రపోలేదు." ఆయన(స) చెప్పారు : 'అతడు క్రిందటి రాత్రి (ఇలా) చెప్పి ఉంటే : **"అఊదు బికలిమా తిల్లాహిత్-తామ్మాతి మిన్ షర్రి మా ఖలఖ్"** (నేను రక్షణ వేడుకుంటున్నాను అల్లాహ్ యొక్క పరిపూర్ణ పదాలతో ఆయన సృష్టించిన వాటి కీడునుండి), తేలుకాటు అతనిని బాధించి ఉండేది కాదు, ఉదయం వరకూ." (ఇబ్నెమాజా, 3518, అధ్యా.35, సంపుటి 4)

**ఇక్కడ "కలిమాతుల్లాహి" అంటే అల్లాహ్ యొక్క పదాలు. దాని అర్థం ఆయన ప్రసంగం, ఆయన నిర్ణయం మరియు ఆయన సామర్థ్యం. ఇది చాలా ముఖ్యమైన వేడుకోలు - మనుష్యులు, జిన్నులు, జంతువులు మరియు పురుగుల నుండి కలిగే కీడు నుండి రక్షించుకునేందుకు. ఈ వేడుకోలు (దు'ఆ) ఉదయం మరియు సాయంత్రం పఠించండి.**

**ఇబ్రాహీమ్(అ)వారు తన పిల్లలిద్దరి కొరకు రుఖ్యా పఠించారు. ముహమ్మద్(స)వారు తన ఇద్దరు మనవళ్ళ కొరకు పఠించారు**

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. ''ప్రవక్త(స)వారు రక్షణ వేడుకునేవారు **హసన్ మరియు హుస్సేన్**(రజి)వారి కొరకు మరియు అనేవారు: **అ'ఊజు బికలిమాతిల్లాహిత్-తామ్మతిన్, మిన్ కుల్లి షైతానిన్ వ హమ్మతిన్, వ మిన్ కుల్లి 'అయ్‌నిన్ లామ్మతిన్"** (*నేను వేడుకుంటున్నాను రక్షణను అల్లాహ్ యొక్క పరిపూర్ణ పదాలతో, ప్రతీ షైతాన్ నుండి మరియు ప్రతీ విష పురుగు నుండి మరియు కీడు కలిగించే ప్రతీ కంటి నుండి)* మరియు ఆయన(స) అనేవారు 'ఆ విధంగా మా తండ్రి ఇబ్రాహీమ్(అ) అల్లాహ్‌ను వేడుకునేవారు **ఇస్మా'ఈల్ మరియు ఇస్‌హాఖ్ రక్షణ కొరకు** లేక ఆయన అన్నారు: ఇస్మా'ఈల్ మరియు య'ఖూబ్ '' **(ఇబ్నెమాజా, సహీహ్, 3525, పుస్తకం 31, అధ్యా. 36, సంపుటి 4)**

**అల్లాహ్‌పై విశ్వాసం లేకుండా ఏదో ఓ మంత్రం పఠించినట్లు పఠించడం కాదు రుఖ్యా అంటే. క్రింది హదీస్ చూడండి.**

అఖ్బార్ బిన్ ముఘీరహ్ బిన్ షు'బహ్ తన తండ్రి నుండి ఉల్లేఖించారు. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు : ఎవరైతే అర్థిస్తారో రోగనివారణ కొరకు చురకతో గాని లేక రుఖ్యాతోగాని అప్పుడు అతడు స్వయంగా అల్లాహ్‌పై ఉండే విశ్వాసం నుండి బయటకి వచ్చేస్తాడు. **(తిర్మిజీ, హసన్, 2055, పుస్తకం 26, అధ్యా.14, సంపుటి 4)**

అంటే కేవలం వాటిపైనే ఆధారపడటం సరిపోదు, అల్లాహ్‌పై విశ్వాసం ఉండాలి. కొంతమంది అడుగుతుంటారు, ఏ సూరహ్ చదివితే ఉద్యోగం వస్తుందని మరియు ఐశ్వర్యం పెరుగుతుందని. మరికొందరు జిన్నుల మాంత్రికుల ఎడ్రస్‌ల కోసం హైరానా పడుతుంటారు.

వీరు ఇలా ప్రవర్తించడానికి గల కారణం - **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదవకపోవడం వల్లనే.**

పసిపిల్లలను మస్‌జిద్‌లకు తీసుకువస్తుంటారు రుఖ్యా పఠించమని. ఈ వ్యాసంలో ఇంతవరకూ తెలిపిన రుఖ్యాలు చాలా చిన్నవి. ఇవి సులభంగా కంఠస్థం చేయదగినవి. వయస్సుతో నిమిత్తం లేకుండా చాలామంది పాటలు, పద్యాలు కంఠస్థం చేసేస్తుంటారు. కాబట్టి మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తే చదువుకున్నవారికి మరియు నిరక్షరాస్యులకు కూడా ఇవి కంఠస్థం అవుతాయి, ఇన్షా అల్లాహ్.

అల్లాహ్‌పై విశ్వాసంతో వీటిని మనమే స్వయంగా పఠించడం వలన పైసా ఖర్చు లేకుండా అల్లాహ్ అనుగ్రహంతో రక్షణ పొందవచ్చు.

## బిస్మిల్లాహ్

అబూ అల్-మలీహ్ ఉల్లేఖనం. ఒక వ్యక్తి చెప్పాడు : నేను ప్రవక్త(స)వారి వెనుక ప్రయాణం చేస్తున్నాను. మరియు నా వాహనం (జంతువు) ముందుకు నడవడంలో తడబడింది. నేను అన్నాను : 'షైతాన్ నాశనమవుగాక!" ఆయన(స) అన్నారు : "చెప్పకు షైతాన్ నాశనమవుగాక అని. ఎందుకంటే నీవు అది చెప్పినప్పుడు, అతడు ఉబ్బుతాడు చాలా పెద్దగా అతడి సైజు ఇల్లు పరిమాణంలో మారేంతగా మరియు అంటాడు 'నా శక్తిచే'. బదులుగా చెప్పండి : **"బిస్మిల్లాహ్ (అల్లాహ్ పేరుతో)"** ఎందుకంటే మీరు అది చెబితే, అతడు (షైతాన్) కుచించుకు పోతాడు, అతడు 'ఈగ'లా అయ్యేంత వరకూ. (అబూదావూద్, సహీహ్, 4982,)

బిస్మిల్లాహ్ హిర్రహ్మా నిర్రహీమ్ యొక్క అర్థాన్ని శాంతిబాట డిశంబర్ 2009 సంచికలో 5 పేజీలలో అందించాము. ఆసక్తిగలవారు చదవండి. www.saanthibaata.net

## ప్రకటన

మా సొసైటీల పేర్లు చెప్పి మేము ప్రచురించిన పుస్తకాలు చూపి, సభ్యులమని చెప్పుకుని ఎవరైనా మస్‌జిద్‌ల కోసం గాని, మదరసాల కోసం గాని లేక ఇతరత్రా విరాళాల కోసం వస్తే, వారు మా సభ్యులు కాదని తెలుసుకోండి. మేము విరాళాల కోసం ఎవరినీ కోరలేదు. ఇన్షా అల్లాహ్ ఎవరినీ కోరము అల్లాహ్ నుండి తప్ప - **శాంతిబాట టీమ్**

اللّٰهُمَّ رَبَّ النَّاسِ، مُذْهِبَ البأسِ، اشْفِ أنتَ الشَّافِي، لا شافِيَ اِلَّا أنتَ، شِفاءً لا يُغادِرُ سَقَماً

"అల్లాహుమ్మ రబ్బన్నాస్, ముజ్హిబల్-బాస్, ఇష్ఫి అన్‌తష్-షాఫీ లా షాఫియ ఇల్లా అన్‌త షిఫా అన్, లా యుఘాదిరు సఖమ"

بِسْمِ اللهِ. أَعُوذُ بِعِزَّةِ اللهِ وَقُدْرَتِهِ مِنْ شَرِّ مَا أَجِدُ وَأُحَاذِرُ.

..... 7 సార్లు ..... | 3సార్లు

"బిస్మిల్లాహ్. అఊజు బి'ఇజ్జతిల్లాహి వ ఖుద్‌రతిహి మిన్ షర్రి మా అజిదు వ ఉహాజిరు"

بِسْمِ اللهِ أَرْقِيكَ. مِنْ كُلِّ شَيْءٍ يُؤْذِيكَ. مِنْ شَرِّ كُلِّ نَفْسٍ أَوْ عَيْنٍ أَوْ حَاسِدٍ اللهُ يَشْفِيكَ. بِسْمِ اللهِ أَرْقِيكَ.

"బిస్మిల్లాహి అర్ఖీక. మిన్ కుల్లి షైఇన్ యు'జీక. మిన్ షర్రి కుల్లి నఫ్‌సిన్ అవ్ అయ్‌నిన్ అవ్ హాసిదిన్. అల్లాహు యష్ఫీక. బిస్మిల్లాహి అర్ఖీక."

أَعُوذُ بِكَلِمَاتِ اللهِ التَّامَّاتِ مِنْ شَرِّ مَا خَلَقَ

"అఊదు బికలిమాతిల్లాహిత్-తామ్మాతి మిన్ షర్రి మా ఖలఖ్"

أَعُوذُ بِكَلِمَاتِ اللهِ التَّامَّةِ، مِنْ كُلِّ شَيْطَانٍ وَهَامَّةٍ، وَمِنْ كُلِّ عَيْنٍ لَامَّةٍ

అ'ఊజు బికలిమాతిల్లాహిత్-తామ్మతి, మిన్ కుల్లి షైతానిన్ వ హామ్మతిన్, వ మిన్ కుల్లి 'అయ్‌నిన్ లామ్మతిన్

## ముఅవ్విజాత్

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ ۝١ اَللّٰهُ الصَّمَدُ ۝٢ لَمْ يَلِدْ ۙ وَلَمْ يُوْلَدْ ۙ ۝٣ وَلَمْ يَكُنْ لَّهٗ كُفُوًا اَحَدٌ ۝٤

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

ఖుల్ హువల్లాహు అహద్. అల్లాహుస్సమద్. లమ్ యలిద్ వలమ్ యూలద్. వలమ్ యకుల్లహు కుఫువన్ అహద్.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
قُلْ اَعُوْذُ بِرَبِّ الْفَلَقِ ۙ ۝١ مِنْ شَرِّ مَا خَلَقَ ۙ ۝٢ وَمِنْ شَرِّ غَاسِقٍ اِذَا وَقَبَ ۙ ۝٣ وَمِنْ شَرِّ النَّفّٰثٰتِ فِي الْعُقَدِ ۙ ۝٤ وَمِنْ شَرِّ حَاسِدٍ اِذَا حَسَدَ ۝٥

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

ఖుల్ అవూజు బిరబ్బిల్-ఫలఖ్. మిన్ షర్రి మా ఖలఖ్. వమిన్ షర్రి ఘాసిఖిన్ ఇజా వఖబ్. వమిన్ షర్రిన్-నఫ్-ఫాసాతి ఫిల్ 'ఉఖద్. వమిన్ షర్రి హాసిదిన్ ఇజా హసద్.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
قُلْ اَعُوْذُ بِرَبِّ النَّاسِ ۙ ۝١ مَلِكِ النَّاسِ ۙ ۝٢ اِلٰهِ النَّاسِ ۙ ۝٣ مِنْ شَرِّ الْوَسْوَاسِ ۙ الْخَنَّاسِ ۝٤ الَّذِيْ يُوَسْوِسُ فِيْ صُدُوْرِ النَّاسِ ۙ ۝٥ مِنَ الْجِنَّةِ وَالنَّاسِ ۝٦

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

ఖుల్ అవూజు బిరబ్బిన్-నాస్. మలికిన్నాస్. ఇలాహిన్-నాస్. మిన్ షర్రిల్ వస్‌వాసిల్ ఖన్నాస్. అల్లజీ యువస్‌విసు ఫీసుదూరిన్-నాస్. మినల్ జిన్నతి వన్నాస్.

# మస్‌జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు | 3

మస్‌జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు అవ్వాలి. అయితే ఒక రకం మస్‌జిద్ ముస్లిములకు హాని కలిగిస్తుంది. ఆ మస్‌జిద్ నిర్మాణమే చెడు సంకల్పంతో ప్రారంభం అవుతుంది. అది తఖ్వా (అల్లాహ్ పట్ల భయం) పునాదిగా నిర్మించబడినది కాదు. **అదే కపట విశ్వాసుల మస్‌జిద్.** ఇహపర లోకాల్లో మనకు నష్టం కలిగించడానికి అన్ని ప్రయత్నాలు ఆ మస్‌జిద్‌లో జరుగుతాయి. అటువంటి మస్‌జిద్ మీ ఏరియాలో ఉంటే జాగ్రత్తగా ఉండండి. ఆ మస్‌జిద్ ఎటువంటిదో, దానిలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయో ఒక అవగాహన కలగడానికి వాటిలో కొన్నింటిని ఈ వ్యాసంలో వివరిస్తున్నాము.

## కపట విశ్వాసుల మస్‌జిద్
## (మస్‌జిదె దిరార్)

అల్లాహుతాలా ఖుర్‌ఆన్‌లో ఇలా చెబుతున్నారు :

**"మరియు (కపట విశ్వాసులలో) కొందరు (విశ్వాసులకు) హాని కలిగించ టానికి, సత్యతిరస్కార వైఖరిని (బలపరచడానికి) మరియు విశ్వాసు లను విడదీయటానికి, అల్లాహ్ మరియు ఆయన సందేశహరునితో ఇంతకు ముందు పోరాడినవారు పొంచి ఉండటానికి, ఒక మస్‌జిద్ నిర్మించారు. మరియు వారు : "మా ఉద్దేశ్యం మేలు చేయటం తప్ప మరేమీ కాదు!" అని గట్టి ప్రమాణాలు కూడా చేస్తున్నారు. కాని వారు వాస్తవంగా అసత్యవాదులని అల్లాహ్ సాక్ష్యమిస్తున్నాడు. నీవెన్నడూ దానిలో నిలబడకు. మొదటి రోజు నుండియే అల్లాహ్ పట్ల భీతి ఆధారంగా స్థాపించబడిన మస్‌జిదే నీకు నిలబడటానికి తగినది. అందులో పరిశుద్ధులు కాగోరే వారున్నారు. మరియు అల్లాహ్ పరిశుద్ధులు కాగోరే వారిని ప్రేమిస్తాడు.** (ఖుర్‌ఆన్ 9:107, 108)

ఈ ఆయత్‌లు అవతరణకు కారణం తెలుసుకోవాలంటే అబూ 'ఆమిర్ అర్-రాహిబ్ అనే వ్యక్తి గురించి తెలుసుకోవాలి. మదీనాలోని స్థానిక తెగలైన ఔస్, ఖజ్‌రజ్ తెగలలో ఇతడు ఖజ్‌రజ్ తెగకు చెందినవాడు. జాహిలియ్యహ్ (అజ్ఞాన కాలం)లో ఇతడు క్రైస్తవుడు. ఇతడు తన తెగకు గౌరవ నీయుడైన నాయకుడు, కాని శీఘ్రంగానే అతడు క్రైస్తవ విద్వాంసుడు అయ్యాడు. రాహిబ్ అంటే monk. అయితే ఇతని కుమారుడు హన్‌జలా (రజి) ప్రముఖ సహాబీ. హన్‌జలా (రజి) షహీద్ అయిన తరువాత, ఆయన శరీరానికి ఫరిష్తాలు స్నానం చేయించారు. కాని అతని తండ్రి అబూ ఆమిర్ మాత్రం ఇస్లామ్‌కి విరోధిగానే మరణించాడు.

ముహమ్మద్(స)వారు మదీనాకు వలస వచ్చిన తరువాత, ఔస్ మరియు ఖజ్‌రజ్ తెగల ప్రజలు ఇస్లామ్ స్వీకరించారు కాని అబూ ఆమిర్ ముహమ్మద్(స)వారి దగ్గరకు వచ్చి ఇస్లామ్‌ను విమర్శించాడు. ప్రవక్త(స)వారు ఇచ్చిన సమాధానాలు అతనికి తృప్తిని కలిగించలేదు. ప్రవక్త(స)వారితో విరోధం వహించిన వారికి తోడుగా ఉంటానని కూడా చెప్పాడు. అలాగే చేశాడు కూడా. ముస్లిమ్ కావడానికి తిరస్కరించాడు. అతనితో ఎంత దయగా ఉంటే, అంత లోతుగా అవిశ్వాసంలోకి కూరుకు పోయాడు. అతడు బహిష్కృతుడుగానే మరణించాలని రసూలుల్లాహ్(స) వారు అల్లాహ్‌ను వేడుకున్నారు. అతడు అలాగే మరణించాడు. అతడు బ్రతికినంత కాలం ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతూనే ఉన్నాడు.

రోజులు గడిచేకొద్దీ మదీనాలో ఇస్లామ్ చాలా ప్రబలం ఐపోయింది. అల్లాహ్ కారుణ్యంతో శీఘ్రంగానే ముస్లిములు బద్ర్ యుద్ధంలో ముష్రిక్‌లను ఓడించి బలమైన శక్తిగా నిరూపించు కున్నారు. ఇక **అప్పటి నుండి మదీనాలో ఇస్లామ్‌ను వ్యతిరేకించేవారు సైతం బాహ్యంగా ముస్లిములు అయ్యారుగాని వారి ఆంతర్యాలలో మాత్రం అవిశ్వాసమే ఉంది.** అంటే బయటకు వారు ముస్లిములమని చెప్పారు. కాని వారి మనస్సులలో అల్లాహ్ పట్ల మరియు ఆయన సందేశహరుని పట్ల విశ్వాసం లేదు.

కాబట్టి వీరు **మునాఫిక్‌లు (కపటవిశ్వాసులు)** అయ్యారు. అబూ ఆమిర్ వారిలో ఒకడుగా కాలేదు. కాని క్రైస్తవుడైన అతడు బయటకి ముష్రిక్ వలే కనిపించాలనుకున్నాడు. కాబట్టి మదీనా వదిలి ఖురైష్‌ల దగ్గరికి వెళ్ళిపోయాడు రసూలుల్లాహ్(స)వారికి వ్యతిరేకంగా వారికి సహాయ పడటానికి.

ఉహుద్ యుద్ధంలో మక్కా ఖురైష్‌ల వైపు ఉండటమే కాకుండా దానిలో ముఖ్య పాత్ర పోషించాడు మరియు యుద్ధ రంగంలో గోతులు తవ్వడానికి పూనుకున్నాడు. ప్రవక్త(స)వారు అటువంటి ఒకదానిలో పడటం వలన కొన్ని గాయాలయ్యాయి.

యుద్ధం ప్రారంభం కావడానికి ముందు అబూ ఆమిర్ అన్సారుల లోని తన వారి దగ్గరికి వెళ్లి ఒప్పించడానికి ప్రయత్నించాడు వారిని తమ వైపు తిప్పుకోవడానికి. కాని అతని నైజం తెలియగానే వారు సమాధాన మిచ్చారు, **"అల్లాహ్ నిన్ను అనుగ్రహించకుండా ఉండు గాక! ఓ దుర్మార్గుడా! ఓ అల్లాహ్ శత్రువా!"**

అతడు వారి సమాధానానికి ప్రతిస్పందించాడు. "అల్లాహ్ సాక్షి! చెడుకు లోనయ్యారు నా ప్రజలు నేను వారిని వదిలి వెళ్ళినప్పటి నుండి." ఉహుద్ యుద్ధం ముగిసాక, అబూ ఆమిర్ రోమ్ రాజు దగ్గరికి వెళ్ళాడు మరియు ముహమ్మద్(స)వారికి వ్యతిరేకంగా యుద్ధం చేయడంలో అతని సహాయం కోరాడు. అతని దర్బారులో కొన్నాళ్ళు ఉన్నాడు. కోరినప్పుడు తనకు సహాయాన్ని అందించే విధంగా రాజు నుండి అబూ ఆమిర్ వాగ్దానం తీసుకున్నాడు.

ఇదిలా ఉండగా మదీనాలోని తన మునాఫిక్ స్నేహితులకు అబూ

ఆమిర్ లేఖ వ్రాశాడు. వారు కూడా అతని తెగకు చెందినవారే, మరీ ముఖ్యంగా వారందరికీ ఉమ్మడి శత్రువు ఒకరే. వారికి అతడు వ్రాసిన లేఖలలో ప్రవక్త(స)వారిని మరియు ఆయన సహచరులను నాశనం చేయడానికి తొందరలోనే సైన్యాన్ని తీసుకు వచ్చి వారికి సహాయ పడతానని వాగ్దానం చేశాడు. మరియు ఓ స్థావరాన్ని నిర్మించమని అతడు వారిని ఆదేశించాడు దాని నుండి వారు తమ కార్యకలాపాలను నిర్వహించు కోవడానికి. అంటే తాము చేసే విద్రోహపూరితమైన కార్యకలాపాలకు ఓ స్థావరం కావాలి. ఆ స్థావరంలో అటువంటివి జరుగుతున్నట్లు ప్రజలకు అనుమానం రాకూడదు.

**ముస్లిములకు అనుమానం రాని స్థావరం అంటే అది మస్‌జిదే అవుతుంది.** అందులో ఇటువంటి దుర్మార్గులు సమావేశాలు జరుపు కోవడానికి మరియు ఆయుధాలు సమీకరించు కోవడానికి అప్పుడు వీలవుతుంది.

అతని విజ్ఞప్తికి స్పందిస్తూ, వారు మస్‌జిద్ ఖుబాకు దగ్గరలో మరో మస్‌జిద్‌ను నిర్మించడం ప్రారంభించారు. వారు 12 మంది మునాఫిక్‌లు. వారి గురించి ఇబ్నె ఇస్‌హాఖ్ మరియు ఇతర విద్వాంసులు వివరించారు. వా మునాఫిక్‌లు మస్‌జిద్ నిర్మాణాన్ని రసూలుల్లాహ్(స) తబూక్ దండయాత్రకి బయలుదేరడానికి ముందుగానే పూర్తి చేశారు. వారు ప్రవక్త(స)వారిని ఆహ్వానించారు ఆ మస్‌జిద్‌లో సలాత్ చేయమని.

ప్రవక్త(స)వారు గనుక వారి మస్‌జిద్‌లో సలాత్ (నమాజ్) చేస్తే, ఆ మస్‌జిద్‌కు చట్టబద్ధత వస్తుందని వారికి తెలుసు. మస్‌జిదె ఖుబా వరకూ వెళ్ళే దూరాన్ని బలహీనులు మరియు జబ్బుపడిన వారికొరకు తగ్గించడానికి ప్రత్యేకంగా చలికాలంలో ఆ దూరాన్ని తగ్గించడానికి దానిని నిర్మించామని వారు ఆయనతో చెప్పారు. మస్‌జిద్ ఖుబా అక్కడి ప్రజలకు సరిపోవడం లేదని కూడా అన్నారు.

కాని ప్రవక్త(స)వారిని అల్లాహ్ రక్షించారు. **ఆయన ఎన్నడూ ఆ మస్‌జిద్‌లో సలాత్ చేయలేదు.** ఆయన తబూక్‌కి బయలుదేర బోతున్నారు మరియు అందువలన వారితో చెప్పారు, "నిశ్చయంగా, మేము ఓ ప్రయాణానికి బయటకు బయలుదేర బోతున్నాము, అయితే మేము తిరిగివచ్చినప్పుడు, **ఇన్షా అల్లాహ్**."

కాని ప్రవక్త(స)వారు తబూక్ నుండి తిరిగి వస్తుండగా, మదీనా చేరడానికి ఓ రోజు లేదా అంతకంటే తక్కువ ప్రయాణం ఉండగా, జిబ్రీల్(అ)వారు వహీ తీసుకువచ్చారు ఆ మస్‌జిద్ గురించి (మస్‌జిదె దిరార్ - కపట విశ్వాసుల మస్‌జిద్, దిరార్ అంటే భాషాపరమైన అర్థం - హానికలిగించేది - ముస్లిముల మధ్య మనస్పర్థలను సృష్టించి). దానిని నిర్మించినవారి చెడు సంకల్పాన్ని గురించి ప్రవక్త(స)వారికి తెలియ జేయబడింది. మరియు మస్‌జిదె ఖుబాకు సంబంధించి అభిప్రాయ బేధాలను కలుగజేసి విశ్వాసులలో విరోధాన్ని నాటగలగడానికి దానిని వారు ఓ స్థావరంగా ఉపయోగించాలనే వారి కోరిక గురించి తెలియజేయబడింది.

ఆ సమాచారాన్ని తెలుసుకోగానే రసూలుల్లాహ్(స)వారు మస్‌జిద్ దిరార్‌కు మనుషులను పంపారు మరియు వారిని ఆదేశించారు ఆయన మదీనా చేరుకోవడానికి ముందే దానిని నాశనం చేయమని. దీనికి సంబంధించి పై ఆయత్‌లు అవతరించాయని ఇబ్నె కసీర్‌గారు వివరించారు.

**ఈ స్థలంలో ఆసిమ్ బిన్ అదియ్యి ఇల్లు కట్టుకోవడానికి ప్రవక్త(స)వారు అనుమతి నిచ్చారు. అతడు విన్నవించుకున్నాడు, "యా రసూలల్లాహ్! నాకు ఇల్లు నిర్మించు కోవడం ఇష్టం లేదు శపించబడిన ఆ స్థలంలో దేని గురించి అయితే ఖుర్‌ఆన్ వాక్యాలు అవతరించ బడ్డాయో.**

ఆ తరువాత ఆ ప్రదేశంలో సాబిత్ బిన్ అర్ఖామ్ ఇల్లు నిర్మించు కున్నారు. అందులో ఆయనకు శుభాలు కలగలేదు. చరిత్రకారులు చెప్పిన దానిని బట్టి ఆ ప్రదేశం మానవులకే కాదు, పశుపక్ష్యాదులకు కూడా శపించబడిన స్థలంగా అయిపోయింది.

ఈ మస్‌జిదె దిరార్ విషయంపై ఎందరో అధ్యయనం చేశారు. వారిని అల్లాహ్ అనుగ్రహించు గాక! పై ఆయత్‌లను బట్టి మస్‌జిదె దిరార్ నిర్మించడానికి గల 4 ఉద్దేశాలను డా. అలీ ముహమ్మద్ గారు ఇలా వివరించారు.

---

1. వారు తమ అవిశ్వాసంచే మోటివేట్ చేయబడ్డారు.
2. వారు ముస్లిములకు హాని కలిగించాలనుకున్నారు.
3. విశ్వాసులు సాధ్యమైనంతమేర మస్‌జిద్ ఖుబాని విడిచిపెట్టే విధంగా మరియు ఆ మస్‌జిద్‌కు బదులుగా తమ మస్‌జిద్‌లో సలాత్‌కు వచ్చేలా చేసి, విశ్వాసులను విడదీయాలనుకున్నారు.
4. వారి సంకల్పం ఆ మస్‌జిద్‌ను అల్లాహ్ మరియు ఆయన సందేశహరునికి వ్యతిరేకంగా యుద్ధం చేసే వారికొరకు రక్షణ స్థావరంగా చేద్దామని.

---

ముహమ్మద్(స)వారు తన అనుచరులలోని కొందరిని సమావేశపరిచి ఆ మస్‌జిద్‌ని కూల్చేయమని మరియు దానిని కాల్చివేయమని ఆదేశించారు. మస్‌జిదె దిరార్‌ను నిర్మించినవారు అవిశ్వాసులే - వారు ఏ ధర్మానికి చెందినవారైనా సరే, వారు మాత్రం ఒకరి నొకరు సహాయం చేసుకునేవారే. అబూ ఆమిర్ క్రైస్తవుడు. అయితే పైకి ముష్రిక్‌గా నటిస్తూ ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా కుట్రలు పన్నాడు. క్రైస్తవుడై ఉండి కూడా ఏకైక ఆరాధ్యుడిని ప్రార్థించేవారికి వ్యతిరేకంగా బహుదైవారాధకుల దగ్గరకు పోయాడు.

**మునాఫిక్‌లు ఎల్లప్పుడూ బలహీనంగా ఉండే ముస్లిములను ఆకర్షించి వారిని మోసం చేస్తారు. వారిని ధర్మం నుండి తప్పిస్తారు. కాబట్టి ముస్లిమ్ నాయకులను అప్రమత్తం చేయాలి. ప్రజలను ఎడ్యుకేట్ చేయాలి. మస్‌జిదె దిరార్ వంటి మస్‌జిద్‌ల విషయంలో కొందరు విద్వాంసులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను దిగువున క్లుప్తంగా తెలియ జేస్తున్నాము.**

కేవలం అల్లాహ్ కోసం కాకుండా, ప్రదర్శన కోసమో, మరో మస్జిద్ కంటే ఆధిక్యం కోసమో లేదా అధర్మ మార్గంలో సంపాదించిన సొమ్ముతో నిర్మించిన మస్జిద్ - మస్జిదె దిరార్ వంటిదేనని అజ్-జమక్షరీ అభిప్రాయపడ్డారు. అయితే డా. అబ్దుల్ కరీమ్ జైదాన్ మాత్రం అటువంటి మస్జిద్‌లను **తఖ్వా పునాదిగా నిర్మించబడలేదని** మాత్రమే చెప్పగలం అని అభిప్రాయ పడ్డారు.

**ఏ మస్జిద్ అయినా ప్రదర్శన కోసం లేదా హాని చేయడం కోసం నిర్మిస్తే దానిని మస్జిద్ దిరార్‌గా పరిగణించి అందులో సలాత్‌కు అనుమతి లేదని చెప్పిన విద్వాంసుల అభిప్రాయాలు తఫ్సీర్ ఖుర్తుబీలో ప్రస్తావించ బడ్డాయి.**

**సయ్యద్ ఖుతుబ్** తన తఫ్సీర్‌లో ఒక విషయాన్ని మన దృష్టికి తీసుకువచ్చారు. దాని సారాంశం:

**ఇస్లామ్ మరియు ముస్లిములకు హాని కలిగించే ఉద్దేశ్యంతో ప్రవక్త(స)వారి జీవితకాలంలో మస్జిదె దిరార్ నిర్మించారు. అటువంటి మస్జిద్ ఈనాడు వేర్వేరు రూపాలు పొందింది. ఇస్లామ్ సేవ కొరకు కార్యక్రమాలు బాహాటంగా నిర్వహించ బడుతున్నాయి కాని అవి నిజానికి ఇస్లామ్‌కు హానికలిగించే ఉద్దేశ్యంతో ఇస్లామ్ పట్ల హీనమైన భావం కలిగిస్తున్నాయి. ఇస్లామ్ బోధనలను స్పష్టపరిచేందుకే అన్నట్లు పుస్తకాలు వ్రాయబడుతున్నాయి. కాని అవి నిజానికి చదివేవారిని అయోమయానికి గురిచేయడానికి మరియు ఇస్లామ్ పట్ల హీనమైన ముద్రవడటానికే వ్రాయబడు తున్నాయి. ముస్లిములకు సహాయం చేయడానికే అన్నట్లు సంస్థలు స్థాపించ బడుతున్నాయి. కాని అవి నిజానికి విశ్వాసులపై పగబట్టి హింసించడానికే స్థాపించబడుతున్నాయి. మరియు ఇంకా చాలా పెద్ద జాబితాయే ఉంది.**

అబ్దుల్ కరీమ్ జైదాన్ అన్నారు : బాహ్యంగా శాసనం చేయబడినా అది శాసనం కాని లక్ష్యాన్ని సాధించడానికి ఉపయోగిస్తే అది మస్జిద్ దిరార్ వంటిదే అవుతుంది. ఎందుకంటే రెండింటి మధ్య ఉమ్మడిగా ఉన్నవి - అవే అంశాలు మరియు అదే గుణం లేక బాహ్యంగా శాసనం గావించబడి కొందరు వ్యక్తులచే ముస్లిములకు హానిచేయడానికి నిర్మించబడిన మస్జిద్.

కపట విశ్వాసుల మస్జిద్ ఆ కాలంతోనే ఆగిపోలేదు, సయ్యద్ ఖుతుబ్ గారు వివరించినట్లు, ముస్లిమేతరులలోని కొందరు దుర్మార్గులు ఇటువంటి నిర్మాణాలను మునాఫిక్‌ల ద్వారా నేడు కొనసాగిస్తూనే ఉన్నారు. మన రాష్ట్రంలోని వివిధ జమాత్‌ల నాయకులకు కోస్తా ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న అటువంటి మస్జిద్ గురించి బాగా తెలిసిన విషయమే. కాని **నాయకులు పట్టించుకోరు? ఎందుకని?**

ప్రదర్శన కోసం కొందరు మరియు ఇస్లామ్‌ను అవమానపరచడానికి కొందరు మస్జిద్‌లను నిర్మిస్తున్నారు. **వాటి నిర్మాణాల ద్వారా కమీషన్ల రూపంలో డబ్బు సంపాదించడానికి మస్జిద్‌లను నిర్మించేవారు మరికొందరున్నారు.** ఇస్లామ్‌కి, ముస్లిమ్‌లకూ ఎన్నో రకాలుగా కీడు చేయడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

కపట విశ్వాసుల మస్జిద్ గురించి తెలుసుకోవడం కష్టమైన పనేమీ కాదు. జాగ్రత్తగా ఉండండి. **మీ వివేకాన్ని ఉపయోగించండి.** అటువంటి మస్జిద్‌కి పోకండి. నేడు మన రాష్ట్రంలో వివిధ జమాత్‌లను చీల్చేవారు మరియు వారి మధ్య గొడవలను రెచ్చగొట్టేవారు కూడా ఈ కపట విశ్వాసులే. వారు రెండువైపులా జమాత్‌లలో చేరి ఇరువైపుల వారిని రెచ్చగొడతారు. **ముస్లిములు వీరిపట్ల చాలా అప్రమత్తంగా ఉండాలి.**

ఈ కపట విశ్వాసుల ప్రవర్తన రకరకాలుగా ఉంటుంది. వారు ఊసరవెల్లిలా సందర్భాలను బట్టి, ప్రాంతాలను బట్టి రంగులు మారుస్తుంటారు. అందులో ఒక రకం వారి వ్యవహారం ఎలా ఉంటుందంటే, అల్లాహ్ పేరును ఉపయోగించరు. ఒకవేళ ఉపయోగించ వలసి వస్తే, ఆ పదం యొక్క విలువను తగ్గించడానికి మరియు ఆ పదాన్ని అపహాస్యం చేయడానికే ఉపయోగిస్తారు.

వడ్డీ నిషేధమని ఖుర్ఆన్ ఆదేశించింది. అయితే వీరు ఆ వడ్డీని ప్రోత్సహిస్తారు, దాని కొరకు ఇస్లామీయ చరిత్రను, హదీస్‌లను వక్రీకరించి చెబుతారు. **అవగాహన లేనివారు అది నిజమని నమ్ముతున్నారు.** స్త్రీలను తన శరీరాన్ని కప్పుకోమని అల్లాహ్ ఆదేశించారు. అల్లాహ్ ఆదేశానుసారం బురఖా లేదా హిజాబ్ వేసుకునేవారికి వీరు తప్పుడు మాటలు చెప్పి అల్లాహ్ ఆదేశాన్ని పాటించకుండా వారిని ఆపుతున్నారు. సంగీతాలు, పాటలు, డ్రామాలు ప్రోత్సహిస్తుంటారు. విశ్వాసుల దగ్గరకు వచ్చినప్పుడు **"అల్లాహ్‌కు సమాధానం చెప్పుకోవాలి"** అని భయపడుతున్నట్లు అతి వినయాన్ని నటిస్తారు. అతి వినయం ధూర్త లక్షణం అనే తెలుగు సామెత వీరికి సరిగ్గా సరిపోతుంది.

కొత్తగా నిర్మించడమే కాకుండా, ఎప్పటి నుండో ఉన్న మస్జిద్‌లలో కూడా మునాఫిక్‌లు చేరిపోతున్నారు. సలాత్ (నమాజ్)లో నిలుచుని **మనస్సులో ఖుర్ఆన్ కాకుండా అన్యమతాల గ్రంథాలలోని వాక్యాలను చదువుతున్నారు.** అటువంటి వారిలో ఒకరిని శాంతిబాట టీమ్ సభ్యులు ప్రశ్నించారు. సదరు వ్యక్తి అంతవరకూ ఖుర్ఆన్ చదవలేదు. కాని రెండు సంవత్సరాలుగా ప్రతీ శుక్రవారం మస్జిద్‌కు వస్తున్నట్లు చెప్పాడు. అతని గురువు (boss) ఖుర్ఆన్ చదవవద్దని చెప్పాడని తెలిపాడు.

ఇటువంటి ఎందరినో మస్జిద్‌లలో మునాఫిక్‌లు చొప్పిస్తున్నారు. కొందరికి జీతాలు ఏర్పాటు చేశారు. వీరి గురించి తెలియక తోటి ముస్లిములు వీరిని ఇస్లామ్ స్వీకరించిన ముస్లిములుగా భావిస్తున్నారు. పేద ముస్లిములను మోసం చేసి వారి ఆడపిల్లలను ఈ మునాఫిక్‌ల కిచ్చి వివాహం జరిపిస్తున్నారు. ఆ విధంగా చేస్తున్నందుకు అన్యమతస్థుల దగ్గరి నుండి భారీగా డబ్బు తీసుకుంటున్నారు ఈ కార్యక్రమాల నిర్వహణ

కోసం మరియు ముస్లిములకు సహాయం చేస్తున్నట్లు వీడియోలు తీసి దేశ విదేశాల్లో ఉన్న ధనవంతులైన ముస్లిముల దగ్గర నుండి కూడా డబ్బు తీసుకుంటున్నారు. **జమాత్ నాయకుల సహకారం లేకుండా ఎన్నో సంవత్సరాలుగా వీరు ఈ పనులన్నీ ఎలా చేయగలుగుతున్నారు?**

ఇస్లామ్ వ్యతిరేక కలాపాలకు పాల్పడేవారందరూ ఉపయోగించేది 'దావా' ముసుగునే. వీరు ధర్మం కోసం బోధిస్తున్నారని ప్రజలు అపోహ పడుతున్నారు. అదే విధంగా వారి మస్జిద్‌ను అల్లాహ్ గృహమని ప్రజలు నమ్ముతున్నారు. రాష్ట్రంలో ఎన్నో సంవత్సరాలుగా వీరు మోసపూరిత కార్యక్రమాలు చేయగలుగు తున్నారంటే, జమాత్‌ల నాయకుల సహకారం వీరికి లేకుండా ఉంటుందా అని ఎందరికో అనుమానం కలిగింది.

**దీనిని తేల్చవలసింది ముస్లిమ్ సమాజమే.** మన దేశ చట్టాలు ఎన్నో హక్కులు కల్పించాయి. వాటిని మనం ఉపయోగించు కోవాలి. ఇంటర్‌నెట్‌లో ఎన్నో వెబ్‌సైట్స్ ఉన్నాయి. వాటిని ఇస్లామిక్ వెబ్‌సైట్స్‌గా నమ్మేలా చేస్తూ ముస్లిములను తప్పుదోవ పట్టించడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వీరి మోసాలు తెలియక **ముస్లిమ్ యువకులు** వారి వలలో పడి కంపేరేటివ్ స్టడీ వైపు ఆసక్తి చూపుతూ ఇతర ధర్మాల వారి గ్రంథాలపై కామెంట్ చేయడమే లక్ష్యంగా చేసుకున్నారు. ఈ కార్యక్రమాలు ఇస్లామ్ పట్ల ఇతరులలో ద్వేషభావాన్ని కలిగిస్తున్నాయి. కపట విశ్వాసులకు కావలిసినది అదే! యువకులు మునాఫిక్‌ల వలలో పడి ముహమ్మద్(స) వారి ఆదేశాలకు దూరంగా పోతున్నారు. దయచేసి ప్రవక్త(స)వారి క్రింది ఆదేశాన్ని తిరస్కరించ వద్దు.

> అబూహురైరాగారి ఉల్లేఖనం : గ్రంథప్రజలు 'తౌరాత్'ను హెబ్రూలో చదివి, దానిని అరబీ భాషలో ముస్లిములకు వివరిస్తుండేవారు. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : ''**గ్రంథప్రజలు చెప్పేది నిజమనిగాని, అబద్ధమని గాని చెప్పవద్దు.** కాని (బదులుగా) చెప్పండి, 'మేము అల్లాహ్‌ను మరియు ఏదైతే మాపై అవతరింపబడిందో దానిని మరియు ఏదైతే మీపై అవతరింప బడ్డాయో వాటిని విశ్వసిస్తున్నాము''.**(సహీహ్ బుఖారీ, 7362, పుస్తకం 96, అధ్యా. 25, సం.9)**

మీ విరామ సమయాన్ని కేవలం ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్ (స)వారి బోధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికే ఉపయోగించు కోండి. అర్థమైనంత వరకూ ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించండి. ఏదైనా సందేహం వచ్చి, దానికి పరిష్కారం దొరకకపోతే 2 రకాత్‌ల ఇస్తిఖారా నమాజ్ చేసుకుని అల్లాహ్‌ను వేడుకుంటే, ఆయనే సన్మార్గాన్ని చూపుతారు.

**అన్నింటికి పరిష్కార మార్గమొక్కటే - ఖుర్'ఆన్, హదీస్ గ్రంథాలు, తఫ్సీర్ గ్రంథాలు మరియు సీరత్ గ్రంథాలతో మస్జిద్‌లను విజ్ఞాన కేంద్రాలుగా చేసుకోవడం.**

**మన రాష్ట్రంలోగాని ఇతరచోట్లగాని శాంతిబాటకు అనుబంధ సంస్థలు ఏమీ లేవు.**

**ఏ జమాత్‌కూ ఇది అనుకూలం గాని లేదా వ్యతిరేకం గాని కాదు.**

**పత్రికకు ఆధారం : ఖుర్'ఆన్, సున్నత్ మరియు ఖులఫాయె రాషిదీన్**

**ఒకవేళ ఎవరైనా ఈ పత్రిక ఏదైనా ఓ జమాత్‌కి అనుకూలమని ప్రచారం చేస్తే, అటువంటి ప్రచారానికి మాకూ ఎటువంటి సంబంధం లేదు. కేవలం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌పైనే ఆధారపడి స్వచ్ఛందంగా కొందరు ముస్లిమ్ సోదరులు నడుపుతున్న పత్రిక ఇది మరియు ఇది ముస్లిమ్ ఉమ్మత్‌కి సంబంధించినది. సత్యాన్ని నిర్భయంగా ఏ ఒత్తిడి లేకుండా ప్రజలకు తెలియ జేయాలని సంకల్పించాము కాబట్టి మేము ఎవరి దగ్గర నుండి ఆర్థిక సహకారాన్ని కోరలేదు.**

**మేము గతంలో ఓ సంచికను గవర్నమెంట్ బుక్‌పోస్ట్‌లో పంపితే, కొన్ని ప్రాంతాలకు అది 40 రోజుల తరువాత చేరిందని తెలియజేయ బడింది. దయచేసి ఆలస్యానికి మమ్మల్ని నిందించవద్దు.**

**పత్రిక త్వరగా అందాలనుకునేవారు మరియు హైదరాబాద్ వంటి నగరాలలో ఉండేవారు 100 రు॥లు అదనంగా పంపితే వారికి డిటిడిసి కొరియర్‌లో పంపగలం, ఇన్షా అల్లాహ్.**

**శాంతిబాట టీమ్ సభ్యులందరూ వారి జీవనోపాధి చూసుకుంటూ, కొంత సమయాన్ని శాంతిబాట పత్రిక కోసం కేటాయించడం జరుగుతుంది. పత్రికను ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ లేకుండా నడపడం ఎంత కష్టమో మీకు తెలుసు. అయినప్పటికీ సకాలంలో అందించాలని అల్లాహ్ పేరుతో మా ప్రయత్నం మేము చేస్తూనే ఉన్నాము. సకాలంలో సంవత్సర చందా పంపమని కోరుతున్నాము. త్వరలో శాంతిబాటలోని ముఖ్య శీర్షికలలోని వ్యాసాలను ప్రత్యేక పుస్తకాలుగా ముద్రించడానికి ప్రయత్నం చేస్తున్నాము.**

**శాంతిబాటలో అరుదైన గ్రంథాల నుండి ఎంతో విలువైన ఇస్లామీయ సమాచారాన్ని ప్రామాణిక ఆధారాలతో అందిస్తున్నాము. శాంతిబాటలో ముద్రించిన విషయాలను ప్రజలకు చేరవేయమని మా పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాము. మీ దగ్గర ఉన్న శాంతిబాట కాపీని వారిచేత చదివింప జేయడంగాని, లేదా వారిని చందా దారులుగా చేర్చడం ద్వారాగాని సత్యాన్ని వ్యాపింప జేయండి.**

**- శాంతిబాట టీమ్**

# పరిపూర్ణమైన ధర్మం

**Perfect Deen**

*సత్యం కాంతి వంటిది. దానినే నమ్మండి. అర్థాలను వక్రీకరించి తప్పుదోవ పట్టించేవారికి దూరంగా ఉండండి.*

**"... ఈనాడు సత్య తిరస్కారులు, మీరు మీ ధర్మాన్ని (విడువరని) చూసి నిరాశులయ్యారు. కనుక మీరు వారికి భయపడకండి. నాకే భయపడండి. ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేసి, మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను మరియు మీ కొరకు ఇస్లామ్‌ను ధర్మంగా సమ్మతించాను ..."** (ఖుర్ఆన్ 5:3)

"... This day those who disbelieve have despaired of (defeating) your religion; so fear them not, but fear Me. This day **I have perfected for you your religion** and completed My favour upon you and approved for you Islam as religion ..."

ధర్మం అంటే జీవన విధానం. అల్లాహ్ మానవులను సృష్టించి మరియు వారి కొరకు ఓ పరిపూర్ణమైన జీవన విధానాన్ని తయారు చేశారు. ఏ క్షణంలోనైనా , ఏ కాలంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా, ఎటువంటి పరిస్థితులలోనైనా ధర్మంగా ఎలా జీవించాలో చాలా స్పష్టంగా ఆ విధానంలో తెలియజేశారు. తన సందేశహరుడు ముహమ్మద్(స)వారి ద్వారా మనకు ఈ విధానాన్ని అందజేశారు. పదే పదే చదివే ఖుర్ఆన్‌ను ఇచ్చారు. మరియు ఆ ఖుర్ఆన్‌లోని ఆదేశాలను ఆచరణ రూపంలో పెట్టడానికి ప్రవక్త(స)వారి ద్వారా సున్నత్‌ను తెలియజేశారు. ప్రవక్త(స)వారే స్వయంగా చెప్పారు : "**నిస్సందేహంగా నాకు గ్రంథం ఇవ్వబడింది మరియు అటువంటిదే దానితోపాటు**"

పైన తెలిపిన ఖుర్ఆన్ ఆయత్ సూరహ్ మా'ఇదహ్‌లోని 3వ ఆయత్‌లోని ఓ భాగం మాత్రమే.

హిజ్రీ శకం 10లో జిల్-హజ్జ్ నెల 9వ రోజున అరఫాత్ మైదానంలో **అల్లాహ్ ధర్మాన్ని పరిపూర్ణం చేశారనే** పై ఆయత్ అవతరించ బడింది. ఇది చాలా గొప్ప విషయం. అల్లాహ్ తన అనుగ్రహాన్ని పూర్తి చేశారు అంటే **అది అత్యున్నతమైన అనుగ్రహం.** అది ఏ విధంగా నంటే ధర్మాన్ని పరిపూర్ణం చేయడం ద్వారా.

ఇక కొత్త శాసనాలు రావు. అప్పటి వరకూ ఏ శాసనాలు అయితే ఫైనలైజ్ అయ్యి అమలులో ఉన్నాయో **అవే శాశ్వతం.** అవి రద్దు చేయబడవు. అంటే ఇక అందులో ఒక శాసనాన్ని కలపడం గాని, లేదా ఆ శాసనాల నుండి ఓ శాసనాన్ని తీసివేయడం గాని జరుగదు.

అంతేకాకుండా 'ఇస్లామ్' తప్ప మరోధర్మాన్ని (మరో జీవన విధానాన్ని) ఆయన సమ్మతించరు, ఆయత్‌లో వివరించినట్లు.

అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా చెబుతున్నారు :

**"నిశ్చయంగా మేమే ఈ ఖుర్ఆన్‌ను, అవతరింపజేసినవారము మరియు నిశ్చయంగా మేమే దీనిని కాపాడేవారము."**(ఖుర్ఆన్ 15:9)

అంటే ధర్మాన్ని పరిపూర్ణం చేయడమే కాకుండా, దాని రక్షణ బాధ్యతను ఖయామత్ వరకూ అల్లాహ్ తీసుకున్నారు. అంటే ఇది **పరిపూర్ణం** మరియు **ప్రామాణికం.**

మన కొరకు ఓ ధర్మాన్ని ఆయన ఎంపిక చేశారు. అది పరిపూర్ణ మైనది - ఇస్లామ్. కాబట్టి **దీని ఉన్నత స్థానాన్ని వేరే దేనితోనైనా పోల్చుకుని చెప్పనవసరం లేదు.**

ఇదే సంచికలో 'జిజ్‌యహ్' పై ఓ వ్యాసం అందించాము. దానిలో ఇస్లామ్ ప్రకారం పాలించే గవర్నర్లు ముస్లిమేతర పౌరులకు వారు తమకు చెల్లించిన మొత్తాన్ని వారికి తిరిగి ఇచ్చివేసినప్పుడు, ఆ ప్రజలు అన్నారు: **"మరలా మీరే మమ్మల్ని పాలించేలా అల్లాహ్ చేయుగాక! మరియు ఆయన మీకు వారిపై (రోమన్లపై) విజయాన్ని ప్రసాదించుగాక! ఎందుకంటే ఇదే వారు అయివుంటే, వారు మాకు ఏదీ తిరిగి ఇచ్చి ఉండేవారు కాదు, దానికి భిన్నంగా మా దగ్గరున్న ప్రతీది తీసుకుని మాకు ఏదీ లేకుండా మమ్మల్ని వదిలేసేవారు."**

దీనిని బట్టి ఇస్లామీయ పరిపాలన వారిపై ఎంత ప్రభావం చూపిందో అర్థమౌతుంది. అధికారం ఉంది కదా అని, **వేరే మతస్థులని బలవంతంగా ముస్లిములుగా మార్చలేదు ముస్లిమ్ పరిపాలకులు.** అల్లాహ్ తెలియజేయబడిన జీవన విధానం (ఇస్లామ్)లో బలవంతం లేదు.

**ఇస్లామ్ ఔన్నత్యాన్ని చాటి చెప్పడానికి, దాని ప్రకారం ఆచరించే మన జీవన విధానం చాలు.**

సూరహ్ బఖరహ్‌లో అల్లాహుతాలా ఇలా స్పష్టం చేసారు :

**"ఇది ఒక దివ్య గ్రంథం. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. అల్లాహ్ పట్ల భీతిగలవారికి ఇది మార్గదర్శకత్వం."** (ఖుర్ఆన్ 2:2)

అవును, ఇది సర్వమానవాళికి మార్గదర్శకత్వం చూపుతుంది అనడంలో విశ్వాసులకు ఎటువంటి సందేహం లేదు. సర్వ మానవాళికి వారు ఏ ధర్మానికి సంబంధించినవారైనా సరే, వారిలో మార్గదర్శకత్వం

పొందినవారు ఈ గ్రంథం ద్వారానే సన్మార్గాన్ని పొందారు.

మక్కా విగ్రహారాధకులు ఈ గ్రంథ పఠనాన్ని విని ఇస్లామ్ స్వీకరించారు. ఇస్లామ్ ప్రకారం ఆచరిస్తూ బోధించిన ముహమ్మద్(స)వారి ఆచరణ వారిని ఆకర్షించింది.

**గ్రంథప్రజలను కూడా ఖుర్'ఆన్ ఆకర్షించింది. దానికొక ఉదాహరణ.**

మక్కా ముష్రిక్‌ల తరఫున అమ్ర్ బిన్ ఆస్ గారు (అప్పటికి ఆయన ఇస్లామ్ స్వీకరించలేదు) అబిసీనియా రాజు నజాషీ దగ్గరకు వెళ్ళారు బహుమతులతో. ఆ రాజుతో ఆయనకు స్నేహం కూడా ఉంది. ముష్రిక్‌ల హింస ఎక్కువై పోవడంతో, కొందరు ముస్లిములు అబిసీనియా వలస వెళ్ళిపోయారు ప్రవక్త(స)వారి ఆదేశం మేరకు. ఆ విధంగా వలస వెళ్ళిన వాళ్ళను వెనక్కి బలవంతంగా తీసుకురావడానికి అమ్ర్ బిన్ ఆస్ గారు వెళ్లారు. అక్కడి దర్బారు నియమాల ప్రకారం క్రైస్తవ రాజైన నజాషీకి సజ్దా చేయాలి. అమ్ర్‌గారి ఫిర్యాదు విని నజాషీ తన దేశానికి వలస వచ్చిన ముస్లిములను తన దర్బారుకి పిలిపించారు. **ముస్లిములు మాత్రం రాజుకి సజ్దా చేయలేదు.**

తన ముందు గౌరవంతో ఎందుకు సజ్దా చేయలేదని జాఫర్(రజి) వారిని నజాషీ అడిగారు. సర్వ శక్తి వంతుడైన అల్లాహుతాలా తన ప్రవక్త ముహమ్మద్(స)వారిని పంపారని, ఆయన(స) ఆదేశించిన ప్రకారం కేవలం సృష్టికర్తకు తప్ప ఎవరి ముందూ వంగిగాని లేదా సజ్దాగాని చేయకూడదని జాఫర్(రజి)వారు సమాధానమిచ్చారు. ఇస్లామ్‌లో ఒకరికొకరు సోదరులుగా సలామ్‌తో అభివాదం చేసుకోమని ఆయన(స) బోధించారని మరియు ఇస్లామ్ బోధనలను వివరిస్తూ జాఫర్(రజి)వారు రాజుగారి దర్బారులో ప్రసంగించారు.

> "ఓ రాజా! మేము విగ్రహారాధకులుగా ఉండేవారము. మేము అపరాధాలు చేసేవారము. రక్త సంబంధీకులతో బంధుత్వాలు త్రెంచేవారము మరియు మా పొరుగువారిని అవమానించేవారము. మాలో శక్తి గలవాడు బలహీనుడి పట్ల చెడుగా ప్రవర్తించేవాడు. మా నుండే మాకు బాగా తెలిసిన వ్యక్తిని తన సందేశహరునిగా అల్లాహ్ మాకు పంపారు. ఆయన మంచి వంశస్థుడు, నిజాయితీ పరుడు మరియు నమ్మకస్తుడు. ఆయన మాతో అల్లాహ్ ఒక్కరినే ఆరాధించమని చెప్పారు. మరియు రాళ్ళతో చేసిన విగ్రహాలను ఆరాధించడం మానివేయమన్నారు. సత్యాన్నే పలకమని, నమ్మకంగా ఉండమని, బంధువులతో మరియు పొరుగువారితో మంచిగా ఉండమని, చెడు నుండి మరియు పరస్పరం చంపుకోవడం నుండి, అనాథల సొమ్ము ఆక్రమించుకోవడం నుండి దూరంగా ఉండమని ఆయన మాకు చెప్పారు.

మేము ఆయనని విశ్వసించి ఆయన బోధనలను అనుసరిస్తున్నాము. మేము అల్లాహ్ ఒక్కరినే ఆరాధించడం ప్రారంభించాము మరియు చెడుపనులు చేయడం నుండి దూరంగా ఉన్నాము. మా ప్రజలు మా మానాన మమ్మల్ని వదలడం లేదు. వారు మమ్మల్ని అణిచివేతకు గురిచేశారు. మరియు మేము పాత చెడుల వైపుకు వెళ్ళాలని వారు కోరుకుంటున్నారు. వారు మా పట్ల చాలా చెడ్డగా ప్రవర్తించారు మరియు మాకు మా ధర్మాన్ని ఆచరించే మార్గం లేకుండా చేసి మీ భూభాగానికి వలస వచ్చేలా చేశారు. ఇక్కడ మేము న్యాయంగా చూడబడతామని ఆశిస్తున్నాము." ఆ మంచి మాటలను రాజు శ్రద్ధగా విన్నారు మరియు వారి ప్రవక్త(స)పై అవతరించబడిన ఆయత్‌ల గురించి అడిగారు. **జాఫర్(రజి) వెంటనే కొన్ని ఖుర్'ఆన్ ఆయత్‌లను పఠించారు.**

**అవి వినగానే, రాజుగారి కళ్ళ నుండి అశ్రువులు రాలి ఆయన గడ్డం తడిసిపోయింది. మరియు క్రైస్తవ సన్యాసులు కూడా ఈ గొప్ప ఆధ్యాత్మిక క్షణాన్ని రాజుగారితో పంచుకున్నారు.**

జాఫర్(రజి)వారి ప్రసంగానికి నజాషీ చాలా ప్రభావితుడయ్యారు. ఆయనకు ఏ స్థాయిలో తృప్తి కలిగిందంటే, ఆయన తనకు అమ్ర్ బిన్ ఆస్ గారు ఇచ్చిన బహుమతులను వెనక్కి తిరిగి ఇచ్చేసేటంత తృప్తి కలిగింది. మరియు తన పరివారంలో ఉన్నవారిని మరియు మంత్రులను కూడా వారు తీసుకున్న బహుమతులను తిరిగి అమ్ర్ గారికి ఇచ్చి వేయమని ఆదేశించారు.

రాజుగారు ఖురైష్ బృందంతో ఇలా చెప్పారు :

**"ఈ మాటలు మరియు ఈసా(అ)వారిపై అవతరించబడిన మాటలు ఒకే మూలం నుండి వచ్చాయని తెలుసుకోండి. మీరు మీ వాళ్ళ దగ్గరికి వెళ్ళిపొండి. నేనెన్నటికీ వీరిని మీకు అప్పగించను"**

తరువాతి రోజు అమ్ర్ బిన్ ఆస్ గారు మరొక సలహాతో రాజు గారి దగ్గరికి వచ్చారు. మర్యమ్ కుమారుని(ఈసా - అ)పై ముస్లిములకున్న ఆలోచన ఏమిటో అడగమని. ముస్లిములు ఈసా(అ)ని దేవుని కుమారునిగా అంగీకరించరని మరియు వారికి ఆ విషయంలో కొత్త దృక్పథం ఉందని రాజుకు అమ్ర్‌గారు తెలిపారు.

కాబట్టి రాజుగారు ముస్లిములను మరలా పిలిపించి, ఈసా(అ)వారి విషయంలో వారి అభిప్రాయం ఏమిటో చెప్పమన్నారు.

సూరహ్ మర్యమ్‌లోని కొన్ని ఆయత్‌లను పఠించడం ద్వారా ఈసా(అ)వారిని మరియు ఆయన పుట్టుకను జాఫర్(రజి) వర్ణించారు. జాఫర్(రజి)వారు ఖుర్'ఆన్ పఠనం పూర్తిచేయగానే, రాజు చెప్పారు :

**"అల్లాహ్ సాక్షి! ఈసా(అ)వారి గురించి మేము ఏమి కలిగియున్నామో ఖచ్చితంగా దానినే వీరు కూడా కలిగి ఉన్నారు. ఈ విషయాలనే ఈసా(అ) స్వయంగా తన గురించి చెప్పారు."**

ఆయన ముస్లిముల నుద్దేశించి చెప్పారు :

**"నేను జీవించియున్నంత కాలం నా భూభాగంలో మీరు క్షేమంగా ఉంటారు. ఎవరైనా మీకు హాని కలిగిస్తే, అతడు నిశ్చయంగా నష్టపోయేవాడు. మీకు హాని కలిగించడానికి ఓ బంగారం కొండను ఇచ్చినా, నేను దానిని తిరస్కరించేవాడిని."**

నజాషీ ఇస్లామ్ స్వీకరించినది ఖుర్‌ఆన్ ఆయత్‌లను విని మరియు ఆ ఆయత్‌లను వినిపించినవారిలో అవి అలవరచిన సంస్కారాన్ని చూసి. **ఇక్కడ కూడా ఖుర్'ఆన్ గ్రంథమే ఉపయోగించ బడింది.** మరో గ్రంథం ప్రస్తావన ముస్లిములు తీసుకురాలేదు. 100 శాతం ఇతర ధర్మం వారు నివశించే దేశంలో కేవలం కొద్దిమంది ముస్లిములు ఖుర్‌ఆన్ పఠించి గౌరవం పొందగలిగారంటే, **దానికి ఇస్లామ్ కారణం**. ఇస్లామ్ వారిలో తీసుకువచ్చిన సంస్కారమే కారణం.

## మన ధక్షిణ భారతదేశంలో జరిగిన సంఘటన :

ముహమ్మద్(స) వారు అల్లాహ్ అనుగ్రహంతో చంద్రుడిని రెండుగా చీల్చిన సంఘటనను మన ధక్షిణ భారతదేశానికి చెందిన ఒక మహారాజు ఓ వెన్నెల రాత్రి చూశారు. చంద్రుడు రెండుగా చీల్చబడ్డాడని చెప్పడానికి ఉన్న సాక్షులలో ఈయన ఒకరు. (**ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం** పుస్తకంలో ఈ సంఘటన సవివరంగా మస్జిద్ ఫొటోలతో సహా వివరించాము. మా వెబ్‌సైట్‌లో చూడండి). ఆ మహారాజు పేరు చెరమన్ పెరుమాల్ (రామ వర్మ కులశేఖర).

ఈ చంద్రఖండన సంఘటన వెన్నెల రాత్రి మక్కాలో జరిగింది. ఇదే సమయంలో ప్రపంచంలోని చాలా దేశాలలో 'పగలు' అవుతుంది. అందువలన పగటి వెలుగులో చంద్రుడు రెండుగా చీలడం ఎవరికీ కనిపించకపోవచ్చు. అదే విధంగా కొన్ని దేశాలలో ఆ సంఘటన జరిగినప్పుడు అర్ధరాత్రి కావచ్చు లేదా రాత్రి చివరి భాగం కావచ్చు. ఆ సమయంలో సాధారణంగా ప్రజలు నిద్రపోతూ ఉంటారు.

విశేషమేమిటంటే, ఈ సంఘటన నమ్మదగిన మరియు సుప్రసిద్ధ భారతీయ చారిత్రక పుస్తకమైన **'తారిఖ్-ఎ-ఫరిష్తా'**లో వ్రాయబడింది. కేరళలోని మలబార్ ప్రాంత మహారాజు ఈ సంఘటనను స్వయంగా చూసి తన డైరీలో వ్రాసుకోవడం జరిగింది. **ఈ మహారాజు చంద్రఖండనను చూసిన విషయాన్ని తెలిపే ప్రాచీన వ్రాత ప్రతి ఒకటి లండన్‌లోని ఇండియా ఆఫీస్ లైబ్రరీలో ఉంది. ఆ వ్రాతప్రతి నెం. అరబిక్ 2807, 152-173.** ఈ విషయం ఎమ్. హమీదుల్లా గారు వ్రాసిన 'ముహమ్మద్ రసూలుల్లాహ్' పుస్తకంలో ప్రస్తావించబడింది.

మనదేశంలోని కోడంగళ్ళూర్ యొక్క మలబార్ ప్రాంతానికి (ప్రస్తుతం ఇది కేరళలో ఉంది) **చెరుమన్ పెరుమాల్** మహారాజు. తన మహారాణితో కలిసి మేడపై నిలుచుని ఉండగా, చంద్రుడు రెండుగా చీలిపోవడాన్ని చూశారు. ఈ సంఘటనపై తమ దేశంలోని విద్వాంసుల నుండి వివరణ కోరారు. ఆ సంఘటన అరేబియాలో ఉద్భవించే ప్రవక్త గురించి తెలిపే సంకేతంగా వారి నుండి తెలుసుకున్నారు.

తరువాత కొంత కాలానికి యమన్ నుండి అరబ్ వ్యాపార నౌక అక్కడికి చేరుకుంది. చారిత్రక విషయాలను బట్టి, 2200 సంవత్సరాల క్రితం నుండి అరబ్బు వర్తకులకు మలబార్ (ఇప్పటి కేరళ ప్రాంతం)తో వ్యాపార సంబంధాలున్నాయి. మొదట్లో వచ్చిన అరబ్ వ్యాపారులంటే మలబార్ ప్రజలు భయపడేవారు. అరబ్ నౌక తీరం చేరింది అని తెలిస్తే చాలు, అక్కడి పురుషులు, వారి స్త్రీలను దాచేసేవారు, వారి సంపాదనను పాతిపెట్టేవారు.

కాని చంద్ర ఖండన జరిగిన తరువాయి కాలంలో వచ్చిన అరబ్ వ్యాపారులు మాత్రం చాలా విభిన్నంగా అక్కడివారికి కనిపించారు. **ఈ అరబ్ వ్యాపారులు చాలా ధర్మపరాయణులుగా, నిరాడంబరులుగా ఉన్నారు. వీరు ప్రజలందరినీ గౌరవించడమే కాకుండా, స్త్రీల ఎదురుగా తమ చూపులను దించుకునేవారు. అన్ని వ్యాపార లావాదేవీలలో వారు చాలా నిజాయితీగానూ, మంచిగానూ మెలిగారు.**

**అంతటి గొప్ప మార్పును అరబ్బులలో చూసి మలబార్ ప్రజలు ఆశ్చర్యపోయారు.**

ఈ విషయం ఎలాగైతేనేం మహారాజు దర్బార్‌కి చేరింది. మహారాజు పెరుమాల్ గారి సమక్షంలో వారు హాజరుపరచబడ్డారు. ఓ కొత్తప్రవక్త కొత్తధర్మాన్ని తీసుకువచ్చారని ఆ అరబ్బుల ద్వారా తెలుసుకుని మహారాజు ఆశ్చర్యచకితులయ్యారు.

వారి యొక్క ఈ కొత్త జీవన విధానం గురించి మరియు ముహమ్మద్(స)వారి గురించి తెలుసుకున్నారు. **ఆయనే అల్లాహ్ యొక్క నిజమైన సందేశహరులని మీరెలా తెలుసుకున్నారు? మరియు ఆయన ఏమైనా అద్భుతాలు చేశారా?** అని అడిగినప్పుడు, వారు చంద్రున్ని రెండుగా చీల్చడం గురించి చెప్పడం జరిగింది. ఈ సత్యం గురించే ఎంతోకాలంగా పెరుమాల్ రాజుగారు అన్వేషిస్తున్నారు. ఆయన వెంటనే తన ప్రధానమంత్రితో సహా ముహమ్మద్(స)వారిని దర్శించాలని నిర్ణయించుకున్నారు. ఆయన తన రాజ్యాన్ని భాగాలుగా చేసి తన కుమారులు, అల్లుళ్ళ మధ్య పంచేశారు. అరేబియా వ్యాపారులతో కలిసి నౌకలో మక్కాకు పయనమయ్యారు.

కొందరు చెప్పిన దానిని బట్టి **ఈ మహారాజు, అబూబకర్ సిద్దీఖ్(రజి)వారి సమక్షంలో ముహమ్మద్(స)వారి చేతుల మీదుగా ఇస్లామ్ స్వీకరించారు.** ఆయన తన పేరును **'తాజుద్దీన్'**గా మార్చుకున్నారు. జెద్దా రాజు యొక్క సోదరిని (ఓ అరబ్ మహిళను) తాజుద్దీన్(రజి) వివాహం చేసుకున్నారు. ఆమె ద్వారా ఆయనకు సంతానం కలిగింది. అరేబియాలో ఆయన దాదాపు 11 సంవత్సరాలు ఉన్నారు. ఇస్లామ్ ప్రచారం చేయమని కోరుతూ కోడంగళ్లూరు పాలకునికి తాజుద్దీన్(రజి) చాలా లేఖలను వ్రాసి, వాటిని జెద్దా రాజుకి అందజేశారు.

ముహమ్మద్(స)వారి సూచన మేరకు ఆయన ఇండియాకు తిరిగి పయనమయ్యారు. ఆయన మలబార్ తిరిగి వస్తుండగా దారిలో జబ్బుపడ్డారు. యెమన్‌లో జఫర్ రేవు దగ్గర (ప్రస్తుతం ఒమన్‌లోని సలాలహ్) దగ్గర దిగిపోయారు. మలబార్‌లోని తన కుటుంబానికి మరియు అక్కడి ప్రజల నుద్దేశించి ఆయన ఒక లేఖను వ్రాసి తన ప్రధానమంత్రికి మరియు ప్రవక్త(స)వారి 13మంది అనుచరులలో ఒకరైన

మాలిక్ బిన్ దీనార్(రజి)కి ఇచ్చి పంపించారు.

**'సలాలహ్'**లో చెరమన్ పెరుమాల్ (తాజుద్దీన్ - రజి) మరణించారు. ఆయన సమాధి అల్లాహ్ ప్రవక్త అయ్యూబ్(అ) వారి సమాధి దగ్గరలోనే ఉంది. సలాలహ్ లోని ఈ పెరుమాల్ (తాజుద్దీన్ - రజి) కుటుంబం గురించి అక్కడ అందరికీ సుపరిచితమే! ఈయన సమాధి రాయిపై ఆయన యొక్క పాతపేరు మరియు అతని ముస్లిమ్ పేరు ఉన్నాయి. **ఈ మస్జిద్ భారత ఉపఖండంలోని తొలి మస్జిద్. అంతేకాకుండా ప్రపంచంలోనే 2వ 'జుమా మస్జిద్'.**

**ఈ మస్జిద్ క్రీ.శ. 629 (హిజ్రీ శకం 7వ సంవత్సరం)లో నిర్మించారు.** ఈ మస్జిద్‌లో ప్రారంభం నుండి జుమా నమాజ్‌లు జరుగుతూనే ఉన్నాయి. ఈ మస్జిద్ నిర్మించాక, మరో 3 సంవత్సరాల వరకూ ముహమ్మద్(స)వారు జీవించే ఉన్నారు. ప్రవక్త(స)వారు మదీనాలో నిర్మించిన మస్జిద్ ప్రపంచంలో మొదటి జుమా మస్జిద్ అయితే 2వ మస్జిద్ ఇండియాలోని **చెరమన్ పెరుమాల్ మస్జిద్**. ఆ సమయంలో జుమ్మా సలాత్ జరిగే మస్జిద్ మక్కాలో కూడా లేదు. ఎందుకంటే కాబా మస్జిద్ అప్పటికి ముష్రిక్‌ల స్వాధీనంలోనే ఉంది కనుక. ఈ మస్జిద్ హిజ్రీశకం 7లో నిర్మిస్తే, మక్కా విజయం హిజ్రీ 8లో జరిగింది. అంటే పెరుమాల్ మస్జిద్ నిర్మించిన సంవత్సరం తరువాత కాబా మస్జిద్ ముస్లిముల ఆధీనంలోకి వచ్చింది.

మన దేశంలో కూడా ఇస్లామ్ ద్వారా సంస్కరించబడిన అరబ్బులను చూసి, వారి నోటవిన్న పలుకులను బట్టి రాజు ప్రభావితం అయ్యారు. **కాబట్టి ముస్లిములు గ్రంథప్రజల దగ్గరకు వెళ్ళినా, ముష్రిక్‌ల దగ్గరకు వెళ్ళినా, ఖుర్'ఆన్‌ను వినిపించారు మరియు ఇస్లామ్ ద్వారా వారిలో అలవడిన సంస్కారాన్ని ప్రజలు గ్రహించేలా చేశారు.**

కాబట్టి అన్ని వర్గాల, ప్రాంతాల ప్రజలచే ప్రేమించబడిన ధర్మం - ఇస్లామ్. అల్లాహ్ మానవజాతి కొరకు ఎంపిక చేసిన పరిపూర్ణ ప్రామాణిక ధర్మం.

భారతదేశంలోనే కాదు, ఎన్నో సంస్కృతులతో ఉన్న నాటి ఈజిప్టు దేశంలోని ప్రజలు కూడా ముస్లిముల ఇస్లామీయ విధానం పట్ల ప్రభావితం అయ్యారు. ఫలితంగా వారంతా ఇస్లామ్ స్వీకరించడంతో వారి భిన్న సంస్కృతుల స్థానంలో ఇస్లామీయ సంస్కృతిని స్వీకరించారు.

**ఇస్లామ్‌ను అనుసరించేవారిని ప్రారంభంలో అవమానించారు, హింసించారు, వెలివేసారు. వేరే దేశాలకు వలస వెళ్లిన వారిని కూడా వదలకుండా బలంతో లొంగదీసుకోవాలనుకున్నారు. కాని అల్లాహ్ అనుగ్రహం వలన విజయం ముస్లిములనే వరించింది.**

ఆయత్‌లో చెప్పినట్లు శతృవులందరికీ నిరాశే మిగిలింది.

### కపటత్వం మరియు వక్రీకరణ :

ఇక ఎదుటబడి యుద్ధం చేసే ధైర్యం లేక ముస్లిములుగా మారినట్లు నటించి ముస్లిములను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేశారు. కొన్ని వందల సంవత్సరాలుగా ఈ మునాఫిక్‌లు ఆ ప్రయత్నంలోనే ఉన్నారు. కాని అల్లాహ్ రక్షణలో ఖుర్'ఆన్ ఉండటంతో, హదీస్ గ్రంథాలు కూడా ప్రామాణికంగా మిగిలి ఉండటంతో, వారు పూర్తిగా విజయం సాధించ లేకపోతున్నారు.

**ఈ వక్రీకరణలకు తోడు నేడు మరో రూపంలో జరుగుతున్న కార్యక్రమాలు:**

మూడు గ్రంథాలతో బోధన, ముస్లిమేతర ధర్మాలతో డిబేట్లు, వృత్తిగా మరియు వ్యాపారంగా మారిన 'దావా'. ఈ కార్యక్రమాలు ప్రజలను అయోమయానికి గురిచేసి వారిని తప్పు దారి పట్టించడానికి చేసే ప్రయత్నాలు. 62వ పేజీలో హదీస్ చూడండి.

మనకు ఇది ఓ పెద్ద ఉపద్రవం. కాబట్టి ఇస్లామ్ చేసిన శాసనాలను బాగా అర్థం చేసుకోకపోతే, మార్గభ్రష్టత్వం వైపు లాగేయడానికి వీరు వేసిన వలలో ఎందరో చిక్కుకుపోయే ప్రమాదముంది.

## శాసనాలు

ఒక శాసనం ఎటువంటి మినహాయింపులు లేకుండా అమలులోకి వచ్చిన తరువాత, దాని పుట్టుపూర్వోత్తరాలు ఎలా ఉన్నా సరే, దానిని తప్పక పాటించ వలసిందే. ఉదాహరణకు ఒక నగరంలో కొత్తగా 'వన్‌వే ట్రాఫిక్' అమలులోకి వచ్చిన ప్రాంతాలలో ఆ ఊరుకి వచ్చిన కొత్తవాడైనా సరే, ఆ విషయం తెలిసిన తరువాత ఆ రూల్‌ని పాటించవలసిందే.

- **ఖిబ్లా మార్పు** : ప్రారంభంలో ముస్లిముల ఖిబ్లా (ప్రార్థన చేసే దిక్కు) కాబా వైపు ఉండేది కాదు. తరువాత అది కాబా వైపు మార్చబడింది. ఈ విషయం తెలిసి, సలాత్ (నమాజ్)లో ఉన్నవారు సలాత్ చేస్తుండగానే తమ దిక్కు మార్చుకున్నారు. ఆదేశాన్ని వెంటనే అమలు పరిచేవారు.
- **మధ్యపాన నిషేధం :** సంపూర్ణ మధ్యపాన నిషేధం గురించి ఆయత్ అవతరించగానే నిల్వ ఉంచిన మద్యాన్ని వీధులలో పారబోసేసారు. ముందుగా నిషా స్థితిలో ఉన్నప్పుడు సలాత్ చేయవద్దని ఆదేశించి, ఆ తరువాత ఈ ఆదేశం వచ్చింది కనుక కొత్తగా ఇస్లామ్ స్వీకరించే వారితోనూ మరియు కొందరి ముస్లిములతోనూ త్రాగడానికి మినహాయింపు ఉందని చెప్పి **తప్పుడు అర్థాలు కొందరు చెబుతున్నారు.** కాని అల్లాహుతాలా నిషేధించిన తరువాత, ఆ శాసనం అమలులోకి వచ్చిన తరువాత అప్పటికే ముస్లిములైన వారైనా సరే లేదా కొత్తగా స్వీకరించిన వారైనా సరే ఆ ఆదేశాన్ని తప్పక పాటించాలి.

ఆదేశాన్ని పాటించనివాడు అల్లాహ్‌కు అవిధేయుడు అవుతాడు. ముస్లిమ్ అంటే అల్లాహ్‌కు విధేయత చూపేవాడు. ఈ మద్యపానంపై ఎటువంటి సందేహాలు ఉత్పన్నం కాకుండా ప్రవక్త(స)వారు క్రింది హదీస్‌ల ద్వారా చాలా స్పష్టంగా వివరించారు.

నూమాన్ బిన్ బషీర్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స)వారు చెప్పారు: "నిస్సందేహంగా మద్యం ద్రాక్షతో

తయారుచేస్తారు. మద్యం ఖర్జూరంతో తయారుచేస్తారు. మద్యం తేనెతో తయారుచేస్తారు. మద్యం గోధుమలతో తయారుచేస్తారు. మరియు మద్యం బార్లీతో తయారుచేస్తారు." **(అబూదావూద్, హసన్, 3676, పుస్తకం 25, అధ్యా.4, సం.4)**

---

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) బిత్(mead) గురించి అడగబడ్డారు. ఆయన(స) చెప్పారు, "మత్తు కలిగించే ప్రతీ పానీయం హరామ్(నిషేధం)" **(అబూదావూద్, సహీహ్, 3682, పుస్తకం 25, అధ్యా. 5, సంపుటి 4)**

---

ఇబ్నె ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : "***అల్లాహ్ శపించారు - ఖమ్ర్ (మద్యం)ని మరియు దానిని తాగిన వాడిని, దానిని పోసిన వాడిని, దానిని అమ్మినవాడిని, దానిని కొన్నవాడిని, దానిని పిండినవాడిని, ఎవని కొరకు అది పిండబడిందో వాడిని, దానిని మోసుకెళ్ళేవాడిని మరియు ఎవరి కోసమైతే తీసుకెళ్ళబడుతుందో వాడిని.***" (అబూదావూద్, హసన్, 3674, పుస్తకం 25, అధ్యా.2, సంపుటి 4)

పై హదీస్‌లను బట్టి మద్యం అది ఎటువంటిదైనా సరే అది నిషేధమేనని తెలుస్తుంది. బార్‌లో, బ్రాందీషాపులలో పనిచేయడం హరామ్ అవుతుందా? లేక చేయవచ్చా? ఇటువంటి ప్రశ్నలు వేసేవారున్నారు. ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను తెలుసుకుంటే ఏది నిషిద్ధమో మరియు ఏది ధర్మసమ్మతమో స్పష్టంగా అర్థమౌతుంది.

- **వడ్డీ :**

"ఎవరైతే వడ్డీ తింటారో, వారి స్థితి (పునరుత్థాన దినమున) షైతాన్ తాకడం వల్ల భ్రమపరచబడిన వ్యక్తి స్థితి వలె ఉంటుంది. ఇది ఎందుకంటే వారు : వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే అని చెప్పడం. కాని అల్లాహ్ వ్యాపారాన్ని హలాల్ (ధర్మ సమ్మతం) చేశాడు మరియు వడ్డీని హరామ్ (నిషిద్ధం) చేశాడు. **కనుక తన ప్రభువు చేసిన ఈ హితబోధ అందిన వ్యక్తి మున్ముందు వడ్డీ తినటం త్యజిస్తే,** అతను పూర్వం తిన్నదేదో తిన్నాడు. అతని వ్యవహారం చివరకు అల్లాహ్ వద్దకే పోతుంది. (ఈ ఆదేశం తరువాత ఈ చెడు వ్యవహారానికి) పాల్పడేవారు నరకవాసులవుతారు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు." **(ఖుర్'ఆన్ 2:275)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) వారు చెప్పారు: "ఏడు మహా వినాశనకరమైన పాపాలకు దూరంగా ఉండండి". ప్రజలు అడిగారు "ఓ రసూలల్లాహ్(స)! ఏమిటవి?" ఆయన చెప్పారు : "ఆరాధనలో అల్లాహ్‌కు సహవర్తుల్ని నిలబెట్టడం, చేతబడి చేయటం, ఏ ప్రాణిని అల్లాహ్ నిషిద్ధం చేసారో ఆ జీవిని అన్యాయంగా చంపడం, వడ్డీ తినటం, అనాథుని సొమ్ము తినడం, శత్రువులతో యుద్ధం జరిగినప్పుడు వెన్ను చూపి పారిపోవడం, అమాయకులూ, సౌశీల్యవతులూ అయిన విశ్వాస స్త్రీల మీద అభాండాలు వేయటం. (సహీహ్ బుఖారి, నెం. **2766**, *సంపుటి 4, వసాయా పుస్తకం, 23వ అధ్యాయం: 'అల్లాహ్ యొక్క ఆదేశం'* )

వడ్డీకి సంబంధించి, దైవప్రవక్త(స) వారి మరొక బోధనను బట్టి, వడ్డీలో 73 స్థాయిలున్నాయని, వాటిలోని అత్యంత హీనమైన స్థాయి యొక్క పాపం (గరిష్ఠ పాపం) ఏమిటంటే **ఒక వ్యక్తి తన కన్నతల్లిని పెళ్ళాడటం** వంటిదని అర్థమౌతుంది.(ఇబ్నెమాజా హసన్, 2274, పుస్తకం 12, అధ్యా.58, సంపుటి 3)

మరో హదీస్ (2277) ప్రకారం, (1) వడ్డీ తీసుకునే వారినీ (2) ఇచ్చేవారినీ, (3) ఈ లావాదేవీలను గురించి వ్రాసేవారినీ, (4) దీనికి సాక్షులుగా ఉండేవారినీ, ప్రవక్త(స) ధూత్కరించారని, వారంతా సమానులే అని చెప్పినట్లు తెలుస్తుంది.

కాబట్టి వడ్డీ సొమ్ము తినడం ఎంత మహాపాపమో తెలిసిన తరువాత, ముస్లిమ్ దానికి దూరంగా ఉంచాలి. అదే విధంగా ఖుర్'ఆన్ ఆయత్ ద్వారా ఈ హితబోధ అందిన వెంటనే వడ్డీని నిషేధించుకోవాలి. పై ఖుర్'ఆన్ ఆయత్ మరియు హదీస్‌లు చదివిన వారు, వడ్డీ లావాదేవీలు జరిపే వాటిల్లో ఉద్యోగం చేయవచ్చో, లేదో వివేకంతో స్వయంగా అర్థం చేసుకోగలరు. దాని కొరకు ఏ ఆలిమూ అవసరమూ లేదు.

- **జిజ్‌యహ్:**36వ పేజీ చూడండి. ఇస్లామీయ పరిపాలనలో జిజ్‌యహ్ ఎవరైతే చెల్లిస్తున్నారో, **వారి ఆరాధనాలయాలకు ముస్లిమ్ రక్షక భటులే రక్షణ కల్పించాలి.** వారు వారి ఆరాధన పద్ధతులను స్వేచ్ఛగా ఆచరించుకునేలా అవకాశం కల్పించాలి. వారి ఆరాధనాలయాలను ముస్లిమ్ సైనికుడు /పోలీస్ ఒడంబడిక ప్రకారం **రక్షిస్తే అది షిర్క్ చేయడం కాదు.** ఆ ఆరాధనాలయాలలో అతడు ప్రార్థన చేయడం లేదు కదా!

- **వ్యాపారం :** వ్యాపారాలకు సంబంధించి ఎన్నో హదీస్‌లున్నాయి. ఇదివరకు శాంతిబాటలో ముఖ్యమైనవి వివరించాము. ఇస్లామ్ పరిపూర్ణమైన తరువాత ఖుర్'ఆన్ ద్వారా దేని నిషేధం అయితే అమలులో ఉందో, అది ప్రళయం వరకూ నిషేధమే. అప్పటికి ఏది ధర్మసమ్మతం చేయబడిందో ప్రళయకాలం వరకూ అది ధర్మసమ్మతమే! 62 పేజీలోని హదీస్ మరోసారి చదవండి. ఖుర్'ఆన్ ప్రతీ రోజూ చదవండి. **ప్రవక్త(స)వారి బోధనలు చదివి ధృవీకరించుకోండి.** వాక్యాలు వక్రీకరించేవారి బారిన పడకండి.

- **హిజాబ్ (పరదా) :** పరదా గురించి ఆదేశం రాగానే వెంటనే స్త్రీలు దానిని అమలులో పెట్టారు.

**ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఏ ఆదేశమైతే ఇచ్చారో, దానికి విధేయత చూపాలి.**

**నేడు మన సమాజంలో ఖుర్'ఆన్ వాక్యాలు వక్రీకరించేవారు, సున్నత్‌లను తిరస్కరించేవారు ముస్లిములను మార్గభ్రష్టులుగా చేయడానికి రాత్రి, పగలూ చాలా కష్టపడుతున్నారు. వీరిని అనుసరించి అల్లాహ్ అనుగ్రహానికి, కారుణ్యానికి దూరం కావద్దని కోరుతున్నాము.**

## జాగ్రత్తగా ఉండాలి

### బిద్‘అత్‌కు పాల్పడే **జ్ఞాని** పట్ల మరియు **మునాఫిక్** పట్ల

حَدَّثَنا يَزِيدُ بنُ خَالِدِ بنِ يَزِيدَ بنِ عَبْدِ اللهِ بنِ مَوْهَبٍ الهَمْدَانِيُّ : حَدَّثَنا اللَّيْثُ عن عُقَيْلٍ، عن ابنِ شِهَابٍ أَنَّ أَبَا اِدْرِيسَ الْخَوْلانِيَّ عَائِذَ اللهِ أَخْبَرَهُ أَنَّ يَزِيدَ بنَ عَمِيرَةَ – وكَانَ مِنْ أَصْحَابِ مُعَاذِ بنِ جَبَلٍ – أَخْبَرَهُ قال : كَانَ لَا يَجْلِسُ مَجْلِسًا لِلذِّكْرِ حِينَ يَجْلِسُ اِلَّا قال : اللهُ حَكَمٌ قِسْطٌ هَلَكَ الْمُرْتَابُونَ، فقَالَ مُعَاذُ بنُ جَبَلٍ يَوْمًا : اِنَّ مِنْ وَرَائِكُم فِتَنًا يَكْثُرُ فيهَا الْمَالُ وَيُفْتَحُ فيهَا الْقُرْآنُ حَتَّى يَأْخُذَهُ الْمُؤْمِنُ وَالْمُنَافِقُ وَالرَّجُلُ وَالْمَرْأَةُ وَالصَّغِيرُ وَالْكَبِيرُ وَالْعَبْدُ وَالْحُرُّ، فَيُوشِكُ قَائِلٌ أَنْ يَقُولَ : مَالِلنَّاسِ لَا يَتَّبِعُونِي وَقَدْ قَرَأْتُ الْقُرْآنَ، مَاهُمْ بِمُتَّبِعِيَّ حَتَّى أَبْتَدِعَ لَهُمْ غَيْرَهُ، فَاِيَّاكُم وَمَا ابْتَدَعَ، فَاِنَّ مَا ابْتُدِعَ ضَلَالَةٌ، وَأُحَذِّرُكُم زَيْغَةَ الْحَكِيمِ فَاِنَّ الشَّيْطَانَ قَدْ يَقُولُ كَلِمَةَ الضَّلَالَةِ عَلَى لِسَانِ الْحَكِيمِ، وَقَدْ يَقُولُ الْمُنَافِقُ كَلِمَةَ الْحَقِّ. قالَ : قُلْتُ لِمُعَاذٍ : مَا يُدْرِينِي رَحِمَكَ اللهُ! أَنَّ الْحَكِيمَ قَدْ يَقُلُ كَلِمَةَ اضَّلَالَةِ وأَنَّ الْمُنَافِقَ قَدْ يَقُولُ كَلِمَةَ الْحَقِّ. قالَ : بَلَى اجْتَنِبْ مِنْ كَلَامِ الْحَكِيمِ الْمُشْتَهِرَاتِ الَّتِي يُقَالُ لَهَا : مَا هٰذِهِ وَلَا يَثْنِيَنَّكَ ذَلِكَ عَنْهُ فَاِنَّهُ لَعَلَّهُ أَنْ يُرَاجِعَ وَتَلَقَّ الْحَقَّ اِذَا سَمِعْتَهُ فَاِنَّ عَلَى الْحَقِّ نُورًا. قَالَ أَبُو دَاوُدَ : قَالَ مَعْمَرٌ عن الزُّهْرِيِّ في هٰذَا الحَدِيثِ : وَلَا يُنْئِيَنَّكَ ذَلِكَ عَنْهُ مَكَانَ يَثْنِيَنَّكَ. وقالَ صَالِحُ بنُ كَيْسَانَ عن الزُّهْرِيِّ في هٰذَا الحَدِيثِ : بِالْمُشْتَبِهَاتِ مَكَانَ ((الْمُشْتَهِرَاتِ))، وقال : ((لا يَثْنِيَنَّكَ)) كَمَا قالَ عُقَيْلٌ وقالَ ابنُ اِسْحَاقَ عن الزُّهْرِيِّ : قالَ : بَلَى مَا تَشَابَهَ عَلَيْكَ مِنْ قَوْلِ الْحَكِيمِ حَتَّى تَقُولَ ما أَرَادَ بِهَذِهِ الْكَلِمَةِ.

(అబూదావూద్, 4611, పుస్తకం 39, అధ్యా.6, సంపుటి 5)

**ఎవరి అభిప్రాయమైనా ముహమ్మద్(స)వారి బోధన కంటే విలువైనది కాదు.**

ఇబ్నె షిహాబ్ ఉల్లేఖనం. అబూ ఇద్రీస్ ఖౌలానీ ఆ‘ఇల్లాహ్ ఆయనకు తెలియజేశారు : యజీద్ బిన్ ‘అమీరహ్ - ఈయన ము‘ఆజ్ బిన్ జబల్ వారి సహచరులలో ఒకరు - ఆయనకు తెలియజేశారు. ఆయన ఎన్నడూ జిక్ర్ సమావేశంలో కూర్చోలేదు ఇలా చెప్పకుండా : **“అల్లాహ్ న్యాయంగా తీర్పుచేస్తాడు, (ఈ విషయంలో) సందేహించేవారు నాశనం అవుగాక!”** ము‘ఆజ్ బిన్ జబల్(రజి)వారు ఒక రోజు చెప్పారు: మీకు ముందు ఉపద్రవాలు ఉంటాయి వాటిలో గొప్ప ఐశ్వర్యం ఉంటుంది. మరియు ఖుర్‘ఆన్ చాలా సులభం అవుతుంది విశ్వాసులు మరియు మునాఫిక్‌లు, పురుషులు మరియు స్త్రీలు, యువజనులు మరియు ముసలివారు, బానిసలు మరియు స్వేచ్ఛ గలిగినవారు దానిని నేర్చుకునేటంతగా.

అప్పుడు చెప్పేవాడు చెబుతాడు : “**ఎందుకు ప్రజలు నన్ను అనుసరించడం లేదు నేను ఖుర్‘ఆన్‌నే చదువుతున్నాను కదా! నేను ఏదో ఒక విషయం వారి కొరకు కల్పించే వరకూ. కాబట్టి జాగ్రత్తగా ఉండండి బిద్‘అత్ (కల్పించబడిన దాని) పట్ల, ఎందుకంటే నిస్సందేహంగా కల్పించ బడినది మార్గభ్రష్టత్వం. మరియు నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను సత్యం నుండి పక్కకు పోయే జ్ఞాని పట్ల, ఎందుకంటే అప్పుడప్పుడు షైతాన్ తప్పుడు మార్గపు మాటలను అతని పెదవులచే పలికించవచ్చు. మరియు ఓ మునాఫిక్ (కపట విశ్వాసి) అప్పుడప్పుడూ సత్యాన్ని పలకవచ్చు.**”

ఆయన చెప్పారు : “నేను ము‘ఆజ్‌ని అడిగాను : **‘నేను ఎలా చెప్పగలను,** అల్లాహ్ మీపై కారుణ్యం అనుగ్రహించు గాక! **ఎప్పుడు జ్ఞాని దుర్మార్గపు మాటను పలుకుతాడో మరియు మునాఫిక్ సత్యం చెబుతాడో?”**

ఆయన అన్నారు : “ఎందుకు చెప్పలేరు దూరంగా ఉండండి జ్ఞాని మాటలకు - అవి బాగా తెలిసినవి - (అయినప్పటికీ) వాటి గురించి ఇలా చెప్పబడు తుంది: **‘ఇదేమిటి?’** మరియు బహుశా అది మిమ్మల్ని సత్యం నుండి మరలించవచ్చు. మరియు నీవు సత్యాన్ని పట్టుకో ఎప్పుడైతే నీవు ఆ మాటలను వింటావో. **ఎందుకంటే సత్యం అనేది కాంతి.**”

*(అబూదావూద్, 4611, పుస్తకం 39, అధ్యా.6, సంపుటి 5)*

**వడ్డీ నిషేధమని, మద్యపానం నిషేధమని, వ్యభిచారం నిషేధమని, స్త్రీలు హిజాబ్ ధరించాలని, సృష్టికర్త పేరు అల్లాహ్ అని, సలాత్ (నమాజ్) చేయాలని ప్రవక్త(స) వారి బోధనలను పాటించాలని మొదలైన ఎన్నో విషయాలు మనకు స్పష్టంగా తెలుసు. పై ఆదేశాలపై మనకు అనుమానం కలిగేలా, వాటిని మనం తప్పుగా భావించేలా మునాఫిక్‌లు, తప్పుదారి పట్టిన జ్ఞానులు చెబుతారు. కాని మనకు సత్యం తెలుసు కాబట్టి సత్యాన్నే స్థిరంగా పట్టుకోవాలి. అప్పుడప్పుడు మునాఫిక్ నిజం చెప్పవచ్చు. ఆరాధ్యుడు ఒక్కడే అనవచ్చు. అది విని వాడు విశ్వాసి అనుకుని మోసపోకూడదు. మనం ప్రస్తుతం అటువంటి ఉపద్రవంలోనే ఉన్నాము. ఖుర్‘ఆన్ మరియు సున్నత్‌ను గట్టిగా పట్టుకోవాలి.**

# పాఠకుల అభిప్రాయాలు

## ముస్లిం మహిళలు తప్పనిసరిగా తెలుసుకోవాలి

అల్లాహ్‌కు విధేయత చూపుతూ, అల్లాహ్ పట్ల భయం కలిగిన ఓ స్త్రీ మాటలను ఓ రోజు రాత్రి గస్తీలో ఉండగా రెండవ ఖలీఫా ఉమర్(రజి) విన్నారు. తనతో ఉన్న సేవకుని ద్వారా తరువాత రోజు ఆ స్త్రీ గురించి వివరాలు తెలుసుకున్నారు. ఆమె ఎలా ఉంటారో ఆయన చూడలేదు. కాని ఆమె ధర్మపరాయణత ఆయనకు స్పష్టమైంది. ఆమెకు ఇంకా వివాహం జరగలేదు. ఆమె ఉత్తమ ఇల్లాలు అవుతుందని బావించారు. తన కుమారులతో ఇలా అన్నారు "మీలో ఎవరైనా ఉన్నారా భార్య అవసరం గలవారు? ఎందుకంటే నాకు ఒక స్త్రీ తెలుసు మీలో ఒకరికి ఆమెతో వివాహం జరిపిస్తాను.' తనకు భార్య ఉందని ఒక కుమారుడు సమాధానం చెప్పారు. అదే సమాధానాన్ని మరో కుమారుడు కూడా చెప్పారు భార్య లేని మరో కుమారుడు ఆమెను వివాహం చేసుకున్నాడు.

ఉమర్(రజి)వారి అంచనా నిజమైంది. ఆమె సంతానం నుండే ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ అనే ధర్మపరాయణుడైన ఖలీఫా ముస్లిమ్ సమాజానికి సేవలు అందించారు. ధర్మపరాయణత కలిగిన ఎందరో ముస్లిమ్ మహిళల సంతానం ఎటువంటి ఉత్తమ స్థాయిని చేరుకున్నారో శాంతిబాటలో చాలా వ్యాసాలలో తెలియజేయడం జరిగింది.

కాబట్టి **మహిళలలో ధర్మపరాయణతపై అవగాహన పెంచడా**నికి వారికి సంబంధించిన ప్రతీ చిన్న అంశాన్ని ఖుర్‌ఆన్ మరియు సున్నత్ వెలుగులో వివరించే ప్రయత్నమే 'ముస్లిమ్ మహిళ' శీర్షిక. అంతేకాకుండా ధర్మం కోసం త్యాగాలు చేసిన తొలి ముస్లిమ్ మహిళల గురించి తిరిగి గూటికి శీర్షికలో ప్రత్యేక వ్యాసాలు అందిస్తున్నాము. **ఈ శీర్షికలను పాఠకులు ఆదరిస్తున్నారు.**

కొంత మందికి 'సున్నత్' అంటే ప్రవక్త(స)వారి సంప్రదాయంగా తెలిసినప్పటికీ, ప్రతీ రోజూ వారు చేసే నమాజ్‌లలోని 'సున్నత్' నమాజ్‌ని మాత్రమే సున్నత్‌గా భావిస్తున్నారు. వారి దృష్టిలో 'సున్నత్' అంటే అది కేవలం నమాజ్‌లకు, హజ్జ్ వ్యవహారాలకు, ఉపవాసాలకు మాత్రమే సంబంధించినది. 'సున్నత్' అంటే ప్రవక్త(స)వారు ఆచరించి చూపినవి మరియు ఆయన బోధించినవి అని వారికి **అర్థం కాకపోవడం విచారకరం.** పురుషుడైనా, స్త్రీయైనా ఊహ తెలిసినప్పటి నుండి మరణించే వరకూ ప్రతీ చిన్న విషయం కూడా ఈ సున్నత్ ప్రకారమే ఆచరించవలసి ఉంది. ముహమ్మద్ (స)వారిని అన్నిటి కంటే ఎక్కువగా ప్రేమించని వ్యక్తి మోమిన్(విశ్వాసి) కాడు. ప్రవక్త(స)వారిని ప్రేమించే వ్యక్తి ఈ సున్నత్‌ల పట్ల ప్రేమ కలిగి ఉంటాడు. శుభ్రత సగం విశ్వాసానికి సమానమని ప్రవక్త(స)వారు బోధించారు. ఆయన చెప్పిన ఆ శుభ్రత అంటే ఏమిటో కూడా ఆయనే వివరించారు. వుజూ ఎలా చేయాలి, గుస్ల్ ఎలా చేయాలి, ఏయే పరిస్థితులలో గుస్ల్ చేయాలి, ఏదైనా మలినాన్ని తొలగించాలంటే ఎలా తొలగించాలి మొదలైన ఎన్నో విషయాలు అత్యంత స్పష్టంగా చెప్పారు. క్రింది హదీస్ చూడండి :

అబ్దుర్ రహ్మాన్ యజీద్ ఉల్లేఖనం : "సల్మాన్ ఫార్సీతో ఎవరో అన్నారు. **"మీ ప్రవక్త మీకు ప్రతీ విషయం బోధించారు, మలశుద్ధి సైతం!"** ఆయన సమాధానమిచ్చారు "ఔను! ఆయన(స) మమ్మల్ని ఖిబ్లాకి అభిముఖంగా మలం శుద్ధి చేసుకోవడం లేదా మూత్రం పోయడం నుండి, మా కుడి చేతులతో శుభ్రం చేసుకోవడం నుండి మరియు మూడు కంటే తక్కువగా ఉన్న రాళ్ళతో లేదా పేడతో లేదా ఎముకలతో శుభ్రం చేసుకోవడం నుండి నిరోధించారు. **(అబూదావూద్, సహీహ్, 7, పుస్తకం 1, అధ్యా.4, సంపుటి 1)**

ముహమ్మద్(స)వారిని ఒక స్త్రీ ఇలా అడిగారు :

"**ఆయిషా(రజి) వారి ఉల్లేఖనం.** ఒక స్త్రీ ప్రవక్త(స)వారి వద్దకు వచ్చి బహిష్టు తరువాత చేసే గుస్ల్(స్నానం) గురించి అడిగారు. ప్రవక్త(స)వారు గుస్ల్ ఎలా చేయాలో ఆమెకు ఆదేశించారు. మరియు చెప్పారు 'కస్తూరీ వాసన గల గుడ్డ పీలికతో శుభ్రపరచుకో'. దానికి ఆమె (విషయం అర్థం గాక) అడిగారు "**దానితో** (అంటే సువాసన గల బట్టతో) **ఎలా శుభ్రపరచుకోవాలి?**" ఆయన అన్నారు, **"సుబహానల్లాహ్"**. 'శుభ్రపరచుకో'. నేను (ఆయిషా) ఆమెను దగ్గరకు లాక్కున్నాను మరియు చెప్పాను, "తుడుచుకో రక్తంతో మలినమైన ప్రదేశాన్ని దానితో" (ముస్లిం హదీస్‌లో ఇచ్చిన ఉల్లేఖనంలో సుబహానల్లాహ్! అంటూ ముహమ్మద్(స)వారు చేతులతో తన ముఖాన్ని ఎలా కప్పుకున్నారో సుఫ్యాన్ బిన్ ఉయైనా చూపారు.) అప్పుడు నేను ఆ స్త్రీని నా వైపు లాక్కుని - ఎందుకంటే ప్రవక్త(స)వారు చెప్పినది అర్థం చేసుకున్నాను కాబట్టి - మరియు చెప్పాను "తుడుచుకో రక్తంతో మలినమైన ప్రదేశాన్ని దానితో" (**సహీహ్ బుఖారీ**, 314, పుస్తకం 6, అధ్యా. 13, అధ్యా.1, **సహీహ్ ముస్లిం**, 748, పుస్తకం 3, అధ్యా. 13, సంపుటి 1)

ఇవి చెప్పుకోకూడ నటువంటి విషయాలేమీ కాదు. అంతేకాకుండా **అశ్లీల విషయాలు అంతకంటే కాదు.** ఇవి శుభ్రత (cleanliness)కు సంబంధించిన విషయాలు. మరియొక స్త్రీ ఏమని అడిగారో చూడండి:

విశ్వాసుల మాతృమూర్తి **ఉమ్మె సలమహ్(రజి)వారి** ఉల్లేఖనం: ఉమ్మె సులైమ్(రజి) ప్రవక్త(స)వారి వద్దకు వచ్చి అడిగారు : "ఓ రసూలల్లాహ్(స)! **సత్యాన్ని తెలుపడంలో అల్లాహ్ సిగ్గుపడడు.** స్త్రీకి

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా** velugubaata@gmail.com **కు పంపండి.**

స్వప్న స్ఖలనం అయితే ఆమె గుస్ల్ చేయాలా?'' అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ''ఔను, ఆమె నీటిని చూస్తే'' ఉమ్మె సలమహ్(రజి) అన్నారు : ''ఓ రసూలుల్లాహ్(స), స్త్రీకి కూడా స్వప్న స్ఖలనం అవుతుందా?'' ఆయన అన్నారు: ''నీ చేతికి మన్ను తగల, ఆమె బిడ్డకు ఆమె పోలికలు ఎలా వస్తాయి?'' **(సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 712, సంపుటి 1, పుస్తకం 3, అధ్యాయం 7)** మరో ఉల్లేఖనంలో **(సహీహ్ ముస్లిమ్ హదీస్ నెం. 710)**లో ఉమ్మె సలమహ్(రజి) చెప్పారు : ''నేను అందుగురించి సిగ్గుపడి అడిగాను: **'అది నిజంగా జరుగుతుందా?'**. అల్లాహ్ యొక్క ప్రవక్త(స) అన్నారు: ''**పోలిక ఎలా జరుగుతుందని అనుకున్నావు?**''. పురుషుని నీరు చిక్కగా మరియు తెల్లగా, మరియు స్త్రీ నీరు పలుచగా మరియు పసుపు రంగులో ఉంటుంది. వాటిలో ఏదైతే ప్రాబల్యం వహిస్తుందో లేదా ముందుగా వస్తుందో, పోలిక (దాని ప్రకారం) ఉంటుంది''. (అంటే స్త్రీ నీరు ముందుగా స్రవించబడితే, బిడ్డకు తల్లి పోలిక వస్తుంది, లేదంటే తండ్రి పోలిక వస్తుంది)

పై హదీస్‌లో ప్రవక్త(స)వారికి తన సందేహాన్ని తెలిపిన స్త్రీ - ఉమ్మె సులైమ్(రజి) - ఆమె గురించి క్రిందటి సంచికలో తిరిగిగూటికి శీర్షికలో తెలియజేశాము. ఆమె జీవించి ఉన్నప్పుడే ప్రవక్త(స)వారి ద్వారా ఆమెకు స్వర్గం లభిస్తుందనే శుభవార్త అందుకున్నారు. **ఇస్లామ్ స్వీకరణనే మహ్రిగా పొందిన స్త్రీ ఆమె.** ఆమె గురించి హదీస్ గ్రంథాలలో ఉన్న ఉల్లేఖనాలు ఆమె కుమారుడైన అనస్ బిన్ మాలిక్(రజి) ద్వారా అందాయి. తన తల్లి మరియు ఆమె భర్తయైన అబూతల్హా(రజి)వారి మధ్య జరిగిన విషయాన్ని ఆయనే ఉల్లేఖించారు. తన తల్లి మరియు ఆమె భర్త కలయిక గురించి వివరించవలసి వచ్చినప్పుడు ఆయన ఎంతో సభ్యతతో ఉల్లేఖించారు, 'పురుషులు సాధారణంగా భార్యతో చేసేటట్లు'. తన **భర్తకు తనపై ఉన్న ప్రతీహక్కును ఆయన పొందేలా చేసిన ఉత్తమ ముస్లిమ్ ఇల్లాలు ఆమె.**

ముస్లిమ్ మహిళకు సంబంధించి ప్రతీ అంశాన్ని ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో ఇన్షా అల్లాహ్ మీకు అందిస్తాము. ఏ హదీస్‌లో నైనా సరే ప్రవక్త(స)వారి మాటలలో **అశ్లీలత అనేది ఉండదు**. అశ్లీలత లేని పదాలలో కూడా ఒకవేళ ఎవరైనా అశ్లీలతను ఊహించుకుంటే, అది వేరే విషయం. అది వారి విజ్ఞతకి సంబంధించినది.

పై హదీస్‌లలో మహిళలకు వచ్చేటటువంటి ఎన్నో సందేహాలను నేటి స్త్రీలు ఎవరితోనైనా చెప్పడానికి ఇబ్బంది పడవచ్చు. ఆ ఇబ్బందిని తొలగించడానికి స్త్రీలకు సంబంధించి మాకు అందుబాటులో ఉన్న హదీస్‌లను అన్నింటిని సందర్భాన్ని బట్టి ఈ శీర్షికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.

శాంతిబాటలో ఇచ్చే హదీస్‌లు మా స్వంత రచనేమీ కాదు! అరబీ భాష అర్థం కానివారికి, హదీస్ గ్రంథాలు అందుబాటులో లేని వారికి మరియు తెలుగు తెలిసినవారికి అర్థం కావడానికి వీటిని తెలుగులో అందిస్తున్నాము. మేము ప్రచురించిన హదీస్‌ను సందేహించే వారెవరైనా, వారు ధృవీకరించు కునేందుకు వీలుగా ఆ హదీస్‌ను గ్రంథస్థం చేసిన ముహద్దిస్ పేరు, హదీస్ సంఖ్య మొదలైన వివరాలు కూడా హదీస్‌తో పాటు అందిస్తున్నాము.

దురదృష్టవశాత్తు నేటి ముస్లిమ్ సమాజంలో చాలామంది స్త్రీలు రోజు వారి కార్యాకలాపాలలో వ్యవహరించ వలసిన ఎన్నో ఆచరణలను తమ తోటి ముస్లిమేతర ధర్మాలవారి నుండి అలవాటు చేసుకున్నారు. వాస్తవానికి వారు ముస్లిమ్ పేరును మాత్రమే కలిగి ఉన్నారు. నమాజ్‌లు, ఉపవాసాలు తప్ప మిగిలినవి అన్నీ కూడా ముస్లిమేతరుల ఆచారాలనే అనుసరిస్తూ, వాటికి ఉర్దూ పేర్లను తగిలించేసారు.

అసత్యాన్ని, కపటత్వాన్ని, మోసాన్ని, అశ్లీలతను, ఛండాళాన్ని దూరంగా ఉంచే ఆచార వ్యవహారాలనే సున్నత్ తెలుపుతుంది. వ్యభిచారం అనేది పాపకార్యం అని ఇస్లామ్ స్పష్టం చేసింది. భార్యాభర్తల వైవాహిక బంధాన్ని ధర్మసమ్మతంగా పుణ్యకార్యంగా చేసింది. అల్లాహ్ పేరుతో చేసే ప్రతీ ధర్మసమ్మతమైన కార్యక్రమం ఆరాధనే అవుతుంది. ఆ విధంగా భార్యభర్తల కలయికకు కూడా పుణ్యమే లభిస్తుంది. 'ఆరాధన' అంటే ఏమిటో శాంతిబాటలో ఇంతకు పూర్వమే చాలా వివరంగా చెప్పడం జరిగింది. **'సున్నత్'లో శుభాలున్నాయి.**

ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లను మనకు మార్గదర్శకత్వంగా మన సృష్టికర్తయైన అల్లాహ్‌యే ఏర్పాటు చేశారు. ముహమ్మద్(స)వారు బోధించిన ప్రతీ విషయం అల్లాహ్ నుండి అందినదే. ఈ విషయం ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా తెలియజేస్తున్నారు :

**మరియు అతను మనోవాంఛలను అనుసరించి కూడా మాట్లాడడు. ఇది అతనిపై అవతరింప జేయబడిన వహీ మాత్రమే.** (ఖుర్'ఆన్ 53:4)


**ఇస్లామ్‌లో బలవంతం లేదు.** ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల ద్వారా తెలిపే ప్రతీ విషయం పాటించడం లేదా పాటించక పోవడమనేది ఆయా వ్యక్తుల ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. మానవులకి స్వేచ్ఛ అల్లాహ్‌యే ఇచ్చారు. సన్మార్గాన్ని అనుసరించవచ్చు లేదా దుర్మార్గాన్ని అనుసరించ వచ్చు. ఆ ఆచరణ బట్టి పరలోకంలో అల్లాహ్ తీర్పు ఇస్తారు.ఆచరించడం లేదా ఆచరించకపోవడం అల్లాహ్ వారికి ఇచ్చిన హిదాయత్‌పై ఆధారపడి ఉంటుంది. మన బాధ్యత సత్యాన్ని తెలపడం మరియు మనకు అల్లాహ్ ఇచ్చిన శక్తిమేర చెడును నిరోధించడానికి ప్రయత్నించడం వరకే.

## ఖుర్'ఆన్ తఫ్సీర్

ఖుర్'ఆన్ తఫ్సీర్ మరియు అరబీ పాఠాలపై ఎందరో పాఠకులు ఆసక్తి చూపుతున్నారు. అందువలన అవి వారికి ఇంకా సులువుగా అర్థమయ్యే విధంగానూ మరియు వాటి గురించి ఎక్కువ సమాచారాన్ని అందించాలని అల్లాహ్ పేరుతో ప్రయత్నం చేస్తున్నాము.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Printing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

## తొలి తెలుగు పరిశోధనాత్మక ఇస్లామీయ మాసపత్రిక




అల్లాహ్ అనుగ్రహంతో
4వ సంవత్సరం
విజయవంతంగా
నడపబడుతుంది.
అల్-హమ్దులిల్లాహ్!




సర్వమానవాళి సంతోషంగా
జీవించడానికి అల్లాహ్ చూపిన మార్గాన్ని
సులభమైన తెలుగులో అందరికీ
అందించాలనేది మా సంకల్పం


విదేశాలలో ఉండి తెలుగు చదవగలిగే వారి కోసం ప్రచురించబడిన వెంటనే పత్రికను
వెబ్‌సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి తెస్తున్న ఏకైక తెలుగు ఇస్లామీయ మాసపత్రిక




అల్లాహ్‌ను మరియు ముహమ్మద్(స)వారిని ప్రేమించే వారిచే
ఆదరించ బడుతూ, ప్రామాణిక ఇస్లామీయ సమాచారాన్ని అందించే పత్రిక




*For Free Download of
Our Magazine and Books
visit*
www. saanthibaata.net
www.saanthibaata.com




ధర్మం పేరుతో పేదప్రజలకు అందవలసిన
సొమ్మును దోచుకుంటున్న అవినీతి విద్వాంసుల
మరియు ప్రచారకుల గుట్టు బయట పెట్టిన పత్రిక

శాంతిబాట
ప్రారంభానికి
ముందు
ప్రచురించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం



శాంతిబాట
పాఠకులకు
తొలి సంవత్సరం
ఉచితంగా
అందించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం




సత్యాన్ని ప్రేమించేవారికి
మా మనవి :
మీ బంధువులను, స్నేహితులను
చందాదారులుగా చేర్చి సత్యాన్ని
వ్యాపింపజేయమని కోరుతున్నాము.

**SAANTHIBAATA MONTHLY** **December, 2012-January, 2013** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

Special Issue

### సృష్టికర్తయైన అల్లాహ్ పంపిన ప్రవక్త మరియు సందేశహరుడైన

# ముహమ్మద్(స)వారి బోధనల సారాంశం

ఏ ధర్మానికి చెందిన పొరుగువాడైనా సరే, ఆ పొరుగువానిని ప్రేమించడం మాత్రమే కాకుండా, అతడి అవసరాలను కూడా తెలుసుకోవాలి. అతడు ఆకలితో ఉంటే, అతనితో పాటు ఆహారాన్ని పంచుకోవాలి. అతడు పస్తులుండగా మనం కడుపు నిండా తింటే మనం విశ్వాసులం కాము.

కూలివాని చెమట బొట్టు ఆరకముందే అతని కూలి అతనికి ఇచ్చివెయ్యాలి.

బహుమతులుగాని మరేదైనా పంచవలసి వస్తే మన ఇంటికి ఏ పొరుగువాని గుమ్మం దగ్గరగా ఉందో వారికి ముందు ఇవ్వాలి, వారు ముస్లిములు కాకపోయినా సరే.

పొరుగువాని ప్రశాంతతకు భంగం కలిగించేవాడు విశ్వాసి కాడు.

భార్యను బాగా చూసుకునే వాడే ఉత్తముడు.

తల్లిదండ్రులను ప్రేమించాలి. వారికి సేవ చేయాలి. వారి కోసం అల్లాహ్‌ను ప్రార్థించాలి. వారు వృద్ధాప్యంలో ఉంటే, 'ఉఫ్' అని అసహనం కూడా వ్యక్తం చేయకూడదు.

పిల్లలను ప్రేమించాలి. వారు ఆడపిల్లలైనా మగపిల్లలైనా సరే వారిని విద్యావంతులుగా చేయాలి. ఉత్తమ లక్షణాలు వారికి అలవడేలా వారికి శిక్షణ నివ్వాలి.

వ్యభిచారానికి, మద్యపానానికి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

స్త్రీలను గౌరవించాలి.

పరమత సహనం కలిగి ఉండాలి.

కుమార్తెలను బాగా చూసుకునే విశ్వాసులకు స్వర్గ శుభవార్తనిచ్చారు. కుమార్తెలను కలిగి ఉండడం విశ్వాసులకెంతో అదృష్టం.

మానవులంతా సమానమే. వారి రంగు, రూపు, జాతి, స్థితి మొదలైన వాటివలన వారికి ఎలాంటి ఆధిక్యత లేదు. అల్లాహ్ పట్ల భీతి (తఖ్వా) కలిగి, మంచిగా ఆచరించేవారే అందరికంటే అధికులు.

తన స్వహస్తాలతో కష్టపడి తినేతిండి ఉత్తమమైన ఆహారం. శక్తిని బట్టి కష్టపడి పనిచేసి సంపాదించాలి.

**ఆధునిక సైన్స్‌కు పునాదులు వేయించి, సైన్స్‌లో వివిధ రంగాలకు పితామహులను తయారుచేసిన ఇస్లామ్ సర్వమానవులు ఆచరించదగిన ధర్మం. ఎవరో కొందరు ముస్లిములను చూసి ఇస్లామ్‌ను నిందించడం అనాగరికం మరియు హేయమైన పని. కత్తితో ఇస్లామ్ వ్యాపించలేదు. మానవత్వంతో, ఉత్తమ సంస్కారంతోనే వ్యాపించింది.**

Visit
**www.saanthibaata.net**
23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్